UNIVERSAL
LIBRARY
OU_206072
UNIVERSAL
LIBRARY

శ్రీ

కవిత్వతత్త్వవిచారము

నరసింహ. రావు

పింగళి సూరనార్యకృత కళాపూర్ణోదయ ప్రభావతీప్రద్యుమ్నములు

N. K. RAO.

కట్టమంచి - రామలింగారెడ్డి

ప్రణీతము

మొదటి కూర్పు

చెన్నపట్టణము

ఎచ్. వి. కృష్ణా అండు కంపెనివారిచే

ప్రకటితము

౧౯౧౪

ఈ గ్రంథము వలయువారు యీ క్రింది చిరునామాకు వ్రాసి తెప్పించుకొనవచ్చును.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

చదువరులకు విజ్ఞాపనము

[illegible]

[illegible] మారు [illegible] [illegible] విజ్ఞాపన [illegible]

[illegible] ఘటి[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]
[illegible] వేలు [illegible] [illegible] [illegible]

క. పరిపరి విధములఁ బరిపరి
చదువరులారాధింప, యానవమనశ్వరమై
పరగంగ నిత్యనవ్య
స్ఫురణమ్మునఁ జేర్చు గవిత సొం పేమందున్.

ఉ. కారణజన్ముఁడై, జన నికాయము మెచ్చఁగ భారతంబు నా
నా రుచిరార్థ యుక్తముగ, నవ్యత శాశ్వతిమై తనర్ప, వి
స్ఫార వచోగుణితఁ, బ్రశస్తగతిం దెనిఁగించె నన్నఁ డా
సూరిని నాంధ్రలోక పరిలబ్ధ తపఃపరిపాకు [illegible].

క. కవితా ప్రపంచ విభుఁ, డి
క్కృతికేణ్యుం గొలిచి, యతని కడిఁది యశః కాం
తిని [illegible]
ట్టి విశేషముల నెపుడు ప్రకటించెదఁ గొంతన్.

విషయసూచిక

ప్రథమ భాగము

మొదటి ప్రకరణము

పుట

ఆదికవులగుణదోషములు—గద్యపద్యతారతమ్యము—భావనాశక్తి—వేమన—పల్నాటివీరచరిత్రాదులు—నాటకరచనాశక్తి—భావనాశక్తి నుద్దీపింపఁజేయు ప్రకృతి భావతైక్ష్ణ్యము—భావనాశక్తికి కార్యోత్సాహమునకునుండు సామ్యము—భాషాచరిత్రమును దేశచరిత్రమును నిత్యసంయోగములు—పాండిత్యబలము—అలంకారములనావశ్యకములు—సాదృశ్యతత్త్వము—వస్తుస్వరూపములు భావములు పరస్పరనిర్ణీతములు—విపరీతాలంకారరచనకు ప్రేరేపకము। భావశూన్యత—భారతకవుల ప్రతిభ—విషయము శైలి రెండును ముఖ్యములు—పాత్రరచనాతత్త్వములు—పాత్రములు అనితరతుల్యములుగ నుండవలయు—జీవకళయొక్క లక్షణము—వికృతిలేని పాత్రములు జడసమానములు—శాస్త్రాదేశరచనలు విరసములు—మిశ్రచరిత్రములుగాని పాత్రములు ప్రకృతివిరుద్ధములు—వర్ణనములకన్న అంగాంగసాంగత్యము కావ్యముల శ్రేష్ఠము—స్వభావవర్ణన యనుటకు నిర్వచనము—సర్వలక్షణసమేతములుగా వస్తువుల నిర్దేశించుట తప్పు—భావనాశక్తియొక్క లీలలు. ౧—౭౦

రెండవ ప్రకరణము

పుట

ప్రబంధలక్షణవిమర్శనము — ప్రబంధముల కథాసారము - వసుచరిత్ర—ప్రబంధములు నాటకసరణి సామ్యము—ప్రబంధములకు దేశక్షయమునకు సంబంధము. . . ౬౧–౮౬

మూఁడవ ప్రకరణము

కళాపూర్ణోదయము—కవియొక్క ప్రతిష్ఠయు పరిష్కారములును. కవికృతశైలి విషయక విచారములు — ప్రభావతీప్రద్యుమ్నము కొన్ని సందర్భములఁ గళాపూర్ణోదయము ననుక్రమించెదును — శైలినిగూర్చి తర్కములు సూరన్న యొక్క చిత్రకవిత్వము—ప్రభావతీప్రద్యుమ్నపాత్రవిమర్శనము. భావలోపములు. పాత్రౌచిత్యతత్త్వము— ప్రాచీన మోహాతాపము—పాశ్చాత్యశృంగారవర్ణనము - మిశ్రరసములుగాఁ గావ్యము దీర్చుచుండవలెను—నైతిక కవిత ప్రత్యక్షసంబంధములేదు—కవిత గోష్ఠుల నడక సూచకము—ప్రభావతీదేవి వర్ణనము తుచ్ఛము — కావ్యములోని మంచిగుణములు — శుచిముఖీచరిత్రము — కన్యాస్వాతంత్ర్యములు — తుచ్ఛశృంగారములకు కారణములు మన యనాచారములు— శుద్ధాంతవాసప్రభావము — మోహప్రకృతి—వీరయుగము స్వాతంత్ర్యఖండనము ౮౭–౧౬౯

అంకితము

నా

చిన్నతనము

నుండియు, నన్ను

ఆంధ్రమున శక్తికొలఁది శిక్షితునిం

జేసిన గురుండును, "భారతసారరత్నావళి" "భాగవత

సారముక్తావళి" యను గ్రంథముల

విరచించిన సరసుం

డును అగు

నా

తండ్రి, కీర్తిశేషుఁడు

కట్టమంచి - సుబ్రహ్మణ్యరెడ్డియొక్క

దివ్యచరణమ్ములకు

భక్తిప్రీతులమై

నీ గ్రంథమును సమర్పించుచున్నాఁడను.

ద్వితీయ భాగము

పుట

కాలసరణి కథాసరణి—రామాయణ భారతముల విషయానుక్రమణిక—కళాపూర్ణోదయమునఁ గార్యక్రమము ముఖ్యపద్ధతి—కల్పనాదోషములు — మణిహారవృత్తాంతము — ప్రథమభాగములలోని పొరపాటులు—సద్గుణములు—ఐక్యమను లక్షణము—రంభానలకూబరాపహాస ఘట్టము — శృంగారవిశేషములు—శల్యాసురుని కథ—సుగాత్రీ శాలీనుల విచిత్రకథ—సరస్వతీచతుర్ముఖవిలాస ఘట్టము—ప్రకృతివర్ణన విధములు—భారతిమందలి స్వభావవర్ణనా విధానము — వ్యక్తివర్ణన ముత్కృష్టము—నన్నయభట్టు ప్రకృతివర్ణనము సేయురీతి—ఉత్ప్రేక్ష—సరస్వతీచతుర్ముఖశృంగార సంవాదము—కలభాషిణియొక్క మనోహర చరిత్రము — శోకాంతవర్ణన లనిషేధ్యములు — కల్పనాస్ఖాలిత్యములు ౧౭౦–౨౭౩

తృతీయ భాగము

మధురలాలస ప్రభావతియొక్క యక్క—అసహ్య శృంగారము—తుచ్ఛశృంగారములకు హేతువులు—భారతకవుల శృంగారవర్ణనము దివ్యము—నన్నయభట్టు—ఎఱ్ఱాప్రగ్గడ—తిక్కన్న—కళాపూర్ణోదయమునందలి మిగతకథ—కాలౌచిత్యము—విషయమున ననౌచిత్యము—ఉపసంహారము. ౨౭౪–౩౧౯

అవతారిక

ఈ గ్రంథముయొక్క చరిత్రము గొంతవఱకుఁ జిత్రము. తొలుత ౧౮౯౯ వ సంవత్సరములో, నేను చెన్నపురి క్రైస్తవ కళాశాలయందు విద్యార్థిగా నున్నపుడు, కళాపూర్ణోదయ పరనోత్సాహోత్కర్షంబునం జేసి సూరనార్యుని యెడఁ గృతజ్ఞతయు, ఋణమునుండి విముక్తియు, సాధ్యమైనంతవఱకుఁ బడయంగోరి యాత్మతృప్తికై యొక యుపన్యాసము వ్రాసితి. అది మొట్టమొదట బహిరంగపఱుపఁబడిన రంగము. ఆ కాలేజికిం జేరిన 'యాంధ్రభాషాభిరంజనీ' సమాజము. దీని నత్యంతముగాఁ బొగడినవారిలో నొకఁడు సహపాఠియుఁ బరమమిత్రుండు నగు మొంద్రేటి - బాపనయ్య. అతని వాసస్థలము రాజమహేంద్రము. ఆ సుకుమారబత్తుని ప్రోత్సాహము నాహ్వానముఁ గారణముగ రాజమహేంద్రమునకుఁ బోయి యచ్చట నప్పుడుప్రముఖముగానుండిన 'విద్యాభివర్ధనీ' సమాజమువారి యాశ్రయమున నడుపఁబడిన గొప్ప సభలో నా వ్యాసమును మిక్కిలి జంకుతోఁ జదివితి, అక్కడఁ దటస్థించిన వాదములం జర్చలంబట్టి చూడఁగా, నాకాలమునఁ గళాపూర్ణోదయము మంచి

ప్రసిద్ధికి వచ్చియుండలేదని తోఁచినది. తెనుఁగున నవలలనఁబడు కథలఁ గల్పించుటలో నద్భుత ప్రతిభులగు శ్రీ చిల్కమర్తి లక్ష్మీనృసింహముగారు ఉదారులగుటఁ గొంచెమును బెద్దగా గణించి యామోదసూచకముగఁ దమ కృతుల నాకు సమ్మానముగా నిచ్చిరి. బాలుండనగు నాకు నట్టివారి యంగీకార మెంతటి యౌత్సుక్యము నొసంగెనో మీరే యోజింపుఁడు. భాషాకృషికి ప్రోత్సాహకములలో వారి సంభావన ప్రథమగణ్యము. పిమ్మట నా వ్యాసము మఱి రెండు స్థలముల నివేదించితిని. అందొకదాన నగ్రాసనమలంకరించిన కవీశ్వరులు శ్రీ వేదము-వేంకటరాయ శాస్త్రులుగారు. నేను అత్యుక్తిదోషము పాలైతినని మృదువచనములతో మనము నొవ్వనివిధంబునఁ గొన్ని స్ఖాలిత్యములం జూపి నన్నుం గృతార్థునిం జేసి నాకు నెప్పటికన్న నెక్కువగ వందనీయులైరి నెల్లూరిలో నివసించు శ్రీ దుర్భా-సుబ్రహ్మణ్యముగారు నా వ్యాసముంగూర్చి ప్రశంసించుచుఁ బద్యము నొకండు వ్రాసిపంపిరి. తరువాత ౧౯౦౨-వ సంవత్సరమున విద్యార్థినై గవరన్మెంటు వారొసంగిన బహుమానవేతనము సహాయముగ నింగ్లాండునకుం బోయితిని. విదేశములయందును గళాపూర్ణోదయము మఱి మఱిం జూచుచుంటినిగాని వదలలేదు. వదలఁగాదుగాన, మఱల స్వదేశమునకు వచ్చుటకు సుమారు ౫ సంవత్సరములు పట్టెను. వచ్చియుండిన కొంచెము తెనుఁగన్ననో సగానికి సగము

అంతర్ధానమైనందునఁ జింతాక్రాంతుఁడనై, యే ప్రాచు ర్యములు నాకేలయని యుండఁగా, ప్రస్తావవశమున నా యుపన్యాససంగతి విని నస్మత్పితృసఖునిపుత్రుఁడు వావిళ్ల - వేంకటేశ్వరశాస్త్రి దానిం బ్రకటింపఁ గోరి తన కిమ్మని యడుగఁగా నెట్టకేలకు సమ్మతించితి. ఇంటికి వచ్చి యెక్కడ వెదకినను నా కా విమర్శనము లభించినదిగాదు. దానిగతి యేమాయెనో దేవునకే యెఱుక! నూతనప్రారంభ ములు నావంటి యనన్యకార్యమగ్నునకు దుర్ఘటములు. కాల ము నిలువదు పోవును తరుణము సులభముగాదు తనంతట రాదు. ఇట్లు కొన్ని యేండ్లు చెల్లఁగా నేది యెట్లున్నను వ్రాయకపోరాదని పునఃపఠనమునకుం దొడంగుతఱికి నా యభిప్రాయము లనేకములు నాకుఁ దెలియకయ యీ మధ్యమునఁ బలుదెఱంగుల మార్పులం గాంచియుండుట వ్యక్తమయ్యెను. దానిచే నుపన్యాసమునకు మాఱుగ నీ విపులగ్రంథమును వ్రాయుటయుఁ గ్రొత్తపేరిడుటయు ననివార్యములాయెను.

ఒంటిగానే సమర్థించియుండఁజాలను. నాకుం దోడుగ మైసూరు మహారాజుగారి కాలేజియం దాంధ్రపండితులగు రాళ్ళపల్లి - అనంతకృష్ణశర్మగారు నిలిచినందునఁ గార్యము నెఱవేఱెఁగాని లేకున్ననైయుండుట సందిగ్ధము. ఇంత త్వరలోనైయుండుట యసంభవము.

తొలుతటి యుపన్యాసమువాసన యిందు నింకను

ఉండుట చదువరు లెఱుంగుదురు. కళాపూర్ణోదయముతోడ ప్రభావతి ప్రద్యుమ్నమును ఆక్రమింపవలసివచ్చె. దృష్టి యొక కావ్యమునుండి యింకొకదానిపైఁ బ్రసరించియుండుట స్పష్టము. సహజవ్యాప్తి నేల నిరోధింపవలయునని దాని ప్రకృతి కనర్గళసంచార మొసంగతి. గ్రంథవైపుల్యముం గూర్చి మీ క్షమాపణ వేఁడెద

ఈ కార్యమునకుఁ దొలుత నత్యంత ప్రోత్సాహకుఁడైన మన్మిత్రుఁడు మొండ్రేటి-బాపనయ్య కీర్తిశేషుఁడగుటచే దీనింజూచి నాపైఁ బ్రేమచేనైన సంతసింప లేమికిఁ జింతిలుచున్నాఁడ! చిరసమీక్షచే గార్యములు నిష్ఫలములగును గదా! కావున నీ చింత దురదృష్టముగాదు. నా నేరమునకు నైన దండన.

ఇట్లు,

తమ విధేయుఁడు,

కట్టమంచి-రామలింగారెడ్డి.

శ్రీ

కవిత్వతత్త్వవిచారము

ప్రథమ భాగము

మొదటి ప్రకరణము

కళాపూర్ణోదయమును రచించిన మహాకవి పింగళి సూరన్న. ఇతని జీవితముంగూర్చి శ్రీ కందుకూరి వీరేశలింగముగారి సుప్రసిద్ధమైన కవులచరిత్రలో వ్రాయఁబడిన దానికన్న నాకెక్కువ దెలియదు. మఱి తెలిసికొనుటకు నుద్యమించినవాఁడనుగాను నా ప్రధానోద్దేశ్యము కృతివిమర్శనగాని చరిత్రశోధనంబుగాదు. నా యీ కార్యమునకుం బ్రయోజకంబులైన యీతని జీవితాంశములు రెండు. శ్రీ కృష్ణదేవరాయల కాలమునకుఁ దరువాతివాఁడనుటయు, ప్రాయశః రామరాజభూషణకవికిఁ బూర్వికుఁడనుటయు, మఱియు నింగ్లాండుదేశములోని కవులలో నగ్రగణ్యుండైన షేక్స్పియరునకు నితఁడు సమకాలీనుఁడై యునికియు సుసాధ్యము.

ఆదికవుల గుణదోషములు

ఆ కాలంబున నాంధ్రదేశమునఁ బ్రబలముగానుండిన కవితారీతి ప్రబంధరచన. ప్రబంధకవులకే మధ్యకవులని

యుఁ జేరుగలదు. ఆదికవులయు వీరియు జాడలు వేఱు. అనేక విషయముల విరుద్ధములును.

నన్నయాదులు సందర్భానుగుణములగు వర్ణనలం దక్క నితరవిధముల నూతనకల్పనలకుం దొడంగక సంస్కృత మునసుండు కథాదికవిషయములం దెనిఁగించుటలోఁ దమ శక్తిని ముఖ్యముగ వినియోగించిరి; అనఁగా, నీకవులు మొత్తముమీఁద భాషాంతరీకర్తలే కాని యపూర్వసృష్టిక్రియా నిపుణులుగారు. ఇట్లనుటచే వీరిపై దోషారోపణముఁ జేయుచున్నానని నాపైఁ గినియకుఁడు! వీరికి ప్రతిభయు భాషాశక్తియు నమేయములు. అవి ప్రకాశమునకు వచ్చిన మార్గము లెవ్వియనఁగా.

(౧) తాము వ్రాసిన కృతులు భాషాంతరీకరణములయ్యును స్వకపోలకల్పితములగు కావ్యములం బలె నెడ తెగని యేకధారగాఁ బ్రవహించునట్లు రచించుట.

(౨) మాతృకలలోనుండు నసమంజసములు నప్రయోజనములునైన భాగములను బ్రక్షిప్తములనో సంక్షిప్తములనో చేసి కవితారసము పలుచనగాకుండునట్లు సాంద్రంబుగ సమర్థించుట. ఇందుకుఁ బ్రశస్తమైన నిదర్శనము మన భారతము. సంస్కృతమున నానాజనులు నానావిధములఁ దూర్చియున్న వెఱ్ఱివెఱ్ఱి వేదాంతములు ధర్మాధర్మములు మొదలగు నసంబద్ధచర్చలతో నిండి చూచువారికి దిక్కులు తెలియనట్లు విపులముగఁ బెఱిగి చీఁకు పొదవలె

నుండు గ్రంథమును దెనుఁగున భగవద్గీతాద్యసంగతప్రక రణములను సంగ్రహముగ వ్రాసి చదువరులకు నమందా నందము నిచ్చునట్లు పరివర్తించిన కవిత్రయమువారి రసజ్ఞ తను అర్థత్రాలఁదిఁ బొగడ నెవరితరము! ఇంకను సంకోచిం పలేదేయని విచారముఁబూనఁదగుఁగాని యింత చేసిరి గదా యని దూషింపఁ జూచుట బుద్ధి పొరపాటు.

గద్య పద్య తారతమ్యము

ఆధునికులలో నొక్కరు తెనుఁగుభారతము సంస్కృ తమునకు సరియైన భాషాంతరీకరణము గాదనియు, నం దుచే విషయగ్రహణముం గూర్చిన బాధలు కొన్ని వాటిలె ననియు సెలవిచ్చుటయకాక, యదికారణంబుగఁ దాము నూతనాంధ్రీకరణంబునకుం బూననలసినవారై తమ విధిని కవిత్రయము వారి యుదాసీన్యమును నిందించుచున్నట్లు దోఁచెడిని. ఉత్తమగ్రంథముల నెంత తెన్నిరీతుల వ్రాసి నను దగదని చెప్పఁగూడదు గాఁబోలు! అయినను ఇట్టి వాదములలో నించుక మతిభ్రమణ మున్నదేమో! ఎట్లన: విషయము ప్రధానమైనది గద్యము. రసప్రధానము పద్య ము. అట్లగుట ప్రతిపదార్థానురూపంబగు రచన వచనము నం జేసిన నొప్పుఁగాని పద్యరూపముగ నొనరించిన వ్రా యువారికి సుఖము లేదు. చదువువారికంతకు మున్నులేదు! ఇఁక కావ్యమునఁ దెనిఁగింప నెంచిరివో! అపుడు సమ యోచితములైన సంక్షేప విక్షేపములఁ జేకూర్చినఁగాని

మనసు గరఁగించునట్టి రుచియు భావోద్రేకంబును గలుగ నేరవు. ఈ న్యాయం బెఱుంగని శుష్కపండితులు పద్య రూపముగ భాషాంతరీకరణముం జేసిరయేని క్లేశంబుఁ దక్క నింకొండు ఫలంబును బుట్టదు. కవీశ్వరుల కృతుల నన్య భాషలలోఁ బ్రాచుర్యముం దెచ్చుటకు నా కవీశ్వరులతో సమానమైన ప్రతిభ గలవారికేకాని యలఁతులగు లాఁతి వారి కేనాఁటికిం జెల్లదు.

(3) పాత్రోచితములైన మాటలం బ్రయోగించియు విషయమునకుం దగిన రీతిని సొగసైన వర్ణనములం జేసియుః వృత్తములు సాక్షాత్తుగ నెదుటఁగనులఁ గట్టినట్లు కల్పించుట. ఇదియే యన్నింటికిని మించిన కవితాలక్షణము "కన్నులఁ గట్టినట్లు, కలఁగాంచిన రూపము ముందు నిల్చిన"ట్లు, ఆ కృతులు మనసులకుం దట్టలేని యయ్యది నిక్కమైన కవిత గానేరదు. ఈ మహేంద్రజాలకౌశల్యమున కాధారమైన గుణము భావనాశక్తి.

భావనాశక్తి

భావనాశక్తి యనఁగా విషయముల మనసులోఁ బ్రతి బింబించునట్లు చేయు సామర్థ్యము. ఒక్క ప్రతిబింబిం చుట యననేల! ప్రత్యక్షముగ నవతారమెత్తునట్లు చేయుట. చూడుఁడు. సీత, ద్రౌపది, సావిత్రి, దమయంతి, శూర్ప ణఖ మొదలగు స్త్రీలు కవికల్పనములకుం జేరినవార య్యును మనకుఁ జరిత్రములలోని స్త్రీలకంటెను మఱియు

మనము నిత్యమును జూచుచు వాదాడుచునున్న యిరుగు పొరుగు భాగ్యశాలినులకన్నను నెన్నిరెట్లు మూడుంగులు సత్త్వముం దాల్చినవారై స్ఫురించుచున్నారుగదా? చూడం బోయిన పాండవులు, దుర్యోధనాదులు, రామభరతులు మొదలగు మనస్సృష్టిమానవులు మిథ్యలా? మనమె మిథ్యలా? ఈ తీరున కృత్రిమముల సయితము మూర్తిభవింపం జేయువారే మహాకవులు. అట్టివారు వ్యాకరణమునకు భంగము గలిగించిననేమి? వచనమున వ్రాసిననేమి? వారి కే కొదువయు రాఁబోదు. వ్యాకరణము యతిప్రాసములు అన్నియుఁదప్పక కుదిరినను భావనాశక్తి లేనియెడల నట్టి పాండిత్యము జీవములేని యాకారము బలె జడంబుగఁ గాన్పించును. ప్రతిమలు వ్రాయుటలో బహు సమర్థుఁడైన యొక శిల్పివర్యునియెడకు, చిల్లరశిల్పి యొకఁడు పోయి, తన లిఖించిన చిత్రపటముం జూపి, 'దీని యందేమైన దోషము లున్నవా?' యని ప్రార్థింపుడు నాతం డిట్లనియె. "అయ్యా! గీఁతలు వర్ణములు మొదలగు గుణము లన్నియుఁ జక్కఁగఁ గుదిరి యున్నవికాని, యీ సుందర విగ్రహమునకుఁ బ్రాణములే యున్నట్టుగానమె!" అది విని "యేరీతిని దిద్దిన దీనికిఁ జైతన్య మబ్బును దెలుపవే మహాత్మా!" యని యా విద్యార్థి దీనుఁడయి వేఁడుఁడు, "అయ్యా! నీ చింతఁ దీర్ప నావలనఁగాదు. నీ యడిగిన వరంబు సాజమైన భావనాశక్తిచే లభ్యము. ఇట్టిట్లు చిత్రిం

చుటచే ఘనుఁడవగుదువని చెప్పి చేయించుటలో ఫలము లేదు. వానివాని మనోబలముకొలఁదిఁ బరిపూర్ణత్వము సిద్ధించునేకాని యలంకారశాస్త్రముల ననుసరించుట నిష్ప్రయోజనము'" అని యా కళాకోవిదుఁడు వాక్రుచ్చెను. జన్మముచేత సుకవిగావలయుఁగాని పరనము అభ్యాసము నివియుండినమాత్రము చాలదు. తోడంబుట్టిన చాతుర్యముండినచో నివి సహాయభూతములై వృద్ధిని వికాసమును గల్పింపవచ్చును. స్వాధీనంబగు మనోగాంభీర్య మలవడియుండదేని కృషిఁజేయుట విత్తునాటక యెరువు నటిచినట్లు. కొన్ని పురుగులుమాత్రము సృష్టికి వచ్చునేమో?

వేమన

ఈ తత్త్వమునకుఁ బ్రమాణమైనవాఁడు వేమన. ఇతనికి పుస్తకజ్ఞానము ఇంచుమించు సున్న. వ్యాకరణము, ఛందస్సు, అలంకారశాస్త్రము మొదలగువానిలో నీతనికి సక్తి యెంత తక్కువో భక్తియు నంత తక్కువ. అట్లుండినను మహాకవులలోఁ జేరినవాఁడని చెప్పుటకై, సామాన్యముగ శుష్కపండితులు దప్ప నింకెవరును సందియంపడరు. కుటిల మతాచారములు, మూఢభక్తి, వేషధారితనము మొదలగు వానిని దూలనాడుటయం దీతం డద్వితీయుఁడు. గొప్ప రహస్యముల బోధించినవాఁడైనను తనకుం గల నైజమగు బుద్ధినేకాని, పలుపలుదెఱంగుల విపరీతవ్యాఖ్యానములకుం

బాలగు శాస్త్రముల నాశ్రయింపలేదు. అనేకులు సిద్ధాంతముల కాధారములు ప్రాచీనసూత్రములని నమ్మి వానిని వల్లించుటకై జ్ఞాపకశక్తిని వృద్ధిచేయుచు మనశ్శక్తిని గోలుపోయెదరు. ఇఁక వేమనయన్ననో కారణవిమర్శనశక్తికిఁ బట్టాభిషేకముం జేసిన మహాత్ముఁడు. ఇతని పద్యములన్నియు లోకోక్తులు. అనఁగాఁ బలికినవాఁడు అతఁడయ్యుఁ బలుకఁబడిన మాటలు లోకమువారి హృదయములలోఁ బూర్వమే యుండినట్టివియో, లేక అతనిచే నచలముగ నాటఁబడినట్టివియోయైననగునట. ఇతని పద్యములలోఁ బరిహాసరసము దట్టము. మఱుఁగుమర్యాదలు లేని మోటువిధముగాఁ దిట్టఁడు. నొప్పిఁ జెందువారు సైతము ఇతరులతోఁ గలిసి నవ్వునట్లు సేయ సమర్థుఁడు. గాయము కానుపింపకయు, రక్తము గారకయు నుండునట్లు శరీరమును ఛేదింపఁజాలినంత మిగుల వాఁడిగల కత్తి నొకదానిని పూర్వము విశ్వకర్మసన్నిభుఁడగు శిల్పి యొకండు నిర్మించెనని గాథ యొకండు గలదు. ఆ కత్తితో నుత్ప్రేక్ష్యములు నుపమేయములు నైనయవి యాంధ్రదేశమున నిమ్మహనీయుపద్యములే కాని వేఱెవ్వియు లేవు. "అరిదివిలుకాని యుజ్వలశరమునకును" అట్టి గుఱిపడును పాతమును రావు. నిదర్శనములం జూపుటలో నితఁ డద్వితీయుఁడు. మఱి యవి యెవ్వియు గూఢములు కావు. స్పష్టములు శ్లేషచే స్థాపింపఁబడిన సామ్యములట్లు దిక్కు నర్థమును లేనివిగావు. వైశద్యము అనుగుణ

మితనియందు ప్రబలము. మనము ప్రతిదినమందును జూచుచు నింతేకదాయని యాదరము నవధానము నుంపక పోవు విషయములనే యీతఁడు గ్రహించి భావనాశక్తిచేఁ గాంతి, రూపము, ప్రాణము నానహింపఁజేసి యెదుట నిలుపఁగా, నప్పుడు గుర్తుదెలియక పూర్వము మనచే గర్హింపఁబడిననయ్యును, నివి యేవో యమానుషవిగ్రహములని విస్మయముఁ జెంది గౌరవింతుము. ఈ గారడీవిద్యలోఁ దెనుఁగున నితఁడ ప్రథముఁడు. సామాన్య వస్తువుల కేదే నొక కామరూపము నిచ్చి వెలయించుట యీతని మహత్త్వములలో మొదలింటిది. ప్రకృతిస్వరూపములను ఎంత చక్కఁగాఁ దన సృష్టిభావములతోఁ జూచి, యొకటి రెండు మాటలతోనే యచ్చుటచ్చుట వానిని సాక్షాత్కరింపఁజేసి యున్నాఁడనుట వేఱ నేవొత్తిచెప్పవలయునా? ప్రకృతి యనఁగా మనవారిలో ననేకులకు నిఘంటువులలో నుండు ప్రకృతియేగాని, మూలింటికి బయటనున్న ప్రకృతి యెట్టిదో, తమ సొంతకన్నులతోఁ జూచిన పాపమునఁ బోరు! అట్టివారికి వేమన యను సరణీయమగు త్రోవఁ జూపించినాఁడనుటలో నించుకయు గుణాధిక్యస్తుతి లేదు.

పల్నాటి వీరచరిత్రాదులు

ఈ కవితో సర్వవిధముల సమానుఁడైనవాఁడో మించినవాఁడో యనం బేర్కొనఁదగిన యాతఁడు పల్నాటి వీర

చరిత్రమును వ్రాసిన వీరకవి.* ఈ వీరచరితము కొన్ని ముఖ్యాంశములలో రామాయణ భారతాదులకు నీడైనదని నా యభిప్రాయము. పాండిత్యప్రభావము మిక్కిలియుఁ దక్కువ. హృదయముల నల్లాడించు భావనాశక్తియో యెక్కువ.

ఈ తరగతికిం జేరినయవి 'బాలనాగమ్మకథ' 'బొబ్బిలి రాజుకథ' 'రాజాదేసింగుచరిత్రము' మొదలగు ప్రజాసమ్మతములైన కృతులు. వీని రామణీయకమునకు వేఱు తార్కాణములేల' సమస్త స్త్రీపురుషులయు మనసులలో స్థిరనివాస మేర్పఱుచుకొని యుంటయ చాలదా? వీని నొకతూరి విన్న మఱల మఱువనగునా? కావుననే పారంపర్యముగ జనులు వీనిని బాడుచుండుటయు, తన్మూలమున నవి శిథిలములు గాకుండుటయు

నాటకరచనాశక్తి

కేవల కల్పితములైనవానింగూడ సాక్షాత్కారముం దాల్చిన చేతనములం జేయంజూచినది కావున భావనాశక్తి నాటకకౌశలంబుతో ననుసంధించియుండును. అనఁగా నాటకరచనాశక్తి యున్నం గాని కావ్యములు సైతము యథార్థములుగఁ గన్పింపవు. విరాటోద్యోగపర్వంబు

* వీరభద్రారెడ్డి యాస్థానకవియైన శ్రీనాథుఁడు దీనిని వ్రాసిన వాఁడుకాఁడనుట నాకుం జూడ నిక్కువము. శ్రీనాథునిలో పాండిత్యమునకు సమమైన కవితాశక్తిలేదు. పల్నాటి వీరచరితములోఁ గవితాశక్తికి సమానమైన పాండిత్యము లేదు.

లం జదివిచూచినవారికి తిక్కనయెడ నీ కళాకౌశలం బెంత పరిపూర్ణముగ నుండెననుట నావంటివాఁడు చెప్పవలసిన పనియేమి? సంజయుఁడు, ధృతరాష్ట్రుఁడు, ధర్మరాజు, ద్రౌపది, కృష్ణుఁడు, దుర్యోధనుఁడు, కర్ణుఁడు మొదలగువారు మన యెదుటనే మాటాడు మాడ్కి నుండుట పండితపామరవిదితము. పాత్రల నడవడికిని, వారి చేష్టలకును మాటలకును గల సమ్మేళన మెంత ప్రథమ' భారతములోని యే పద్యమైనం జదివినయెడ, శైలింబట్టియే యది యెవరిదైనదియుఁ జెప్పవచ్చునని యొకానొకరి యభిప్రాయము

ఈ భావనాశక్తి యింత గొప్పగఁ గొందఱలో వృద్ధిగాంచుట కేమికారణము? ఈ ప్రశ్న కుత్తరము సెప్పుట బహు కష్టము. ఏలన. తొలుతనే యిది స్వభావదత్తములైన సిద్ధులలో నొకటియని విన్నవించితి. ఆదిమములైన తత్త్వములంగూర్చి వ్యాఖ్యానముసకుం బూనుట పిచ్చితలంపు. అట్లయినను ఒక లక్షణముమాత్రము నిరూపింప వచ్చునని తోఁచెడిని. ఎద్దియన:

భావనాశక్తి నుద్దీపింపఁ జేయు

ప్రకృతిభావతైక్ష్ణ్యము

మనుష్యుల మనంబులలో నిరంతరసంయోగముం దాల్చిన ప్రకృతులు మూఁడు గలవు. (౧) ఆలోచనములు. (కార్యకారణములంగూర్చి విచారణచేయుట, వస్తుస్వరూపము నిర్ణయించుట యిత్యాదులు) (౨) భావములు. అనఁగా

మనోవికారములు. ఉదా. కామక్రోధాదులు, ప్రేమ, పశ్చాత్తాపము, దయ, దాక్షిణ్యము మొదలగు మృదువులైన చిత్తసంచారములు. (3) సంకల్పములు. అనఁగా నేదైన నొకదానిం గోరి, దానిని సాధింపవలయునని ప్రతిజ్ఞఁ బూనుట. ఈ మూఁడు శక్తులలో భావనాశక్తి నధికంబుగ విజృంభింపఁ జేయునవి భావములు. కొయ్యలరీతినో, మహర్షుల చందంబుననో, నిర్వికారస్థితి నుండువారు పద్దములు వ్రాయ నేర్తురుగాని, కవులగుట యసంభవము. ఏ వృత్తాంతమునైనఁ జూచునట్లు వర్ణింపవలయునన్న దాని యొక్క స్థితిగతులను, నందలి పాత్రముల సుఖదుఃఖములను, రోమరోమమునకును దానే మనఃపూర్వకముగ ననుభవించినందప్పు,తద్రూపముగ నభినయింప నెవరికిని వశముగాదు. చిత్తచాంచల్యము గూడదనువారు ఇట్టి యనుభవములకు మనసిచ్చి సమ్మతింపరు గావున వారియందు శాస్త్రజ్ఞానమొకవేళఁ బ్రకాశమునకు వచ్చిన రావచ్చునుగాని, శిల్పకళ లేమాత్రమును మొలకెత్త నేరవు. ఈ విషయము పామరులు సైతము గొంతకుఁగొంత యెఱిఁగినదే. కావుననే కాళిదాసు తిక్కన మొదలగు మహాకవు లెల్లరు రసికులనియు స్త్రీలోలురనియు వారు గాథలు కట్టియుండుట! ఇంతే కాదు. భావములు కోరికలు రసములును మనసులో వెల్లివిరిసెనేని, జనులు మూగలట్లు పంచలమాడ్కి మూలఁబడి, నిశ్చేష్టితులై యచలతత్త్వముం బూనియుండుట

యరిది. అట్టివారు అనేకవిధములైన యుద్యమములకుం బూని కార్యనిపుణులగుదురు. కావున భావనాశక్తి, సంఘటనోత్సాహము ఇవి పరస్పరమిత్రములనుట విమర్శన శాస్త్రమునందలి యాదిమతత్త్వము. అట్లగుట నింకను వివరముగఁ దెల్పుట విధి.

భావనాశక్తికి కార్యోత్సాహమునకు నుండు సామ్యము

"ఘనములైన రాచకార్యములం దాసక్తిఁగొని ప్రవేశించినవారు గద్యపద్యాది నిర్మాణశిల్పమునకుం దొడంగువారైనచో వారు సులభముగను త్వరితముగను దత్కళాప్రవీణులౌట నైసర్గికము కార్యగంభీరుల రచనయందు సారము, వీర్యము, ఉద్వేగము, చుఱుకుఁదనము ఇత్యాది నానాపదంబులచేఁ బేర్కొనఁబడు సుగుణ మొకండు అఖండముగనుండును. కావున నట్టివారి కృతులు కేవలపండితుల గ్రంథములవలె రుచిలేనివిగను, చప్పిడిగను, మొద్దుపాఱినవిగను ఉండవు" అని విద్యాధురంధరులైన "మార్లీ" ప్రభువుగారు సుమారు ౨౫ సంవత్సరముల క్రిందనే వ్రాసిరి. దీనికి రాజకార్యవిచక్షణుఁడైన మన తిక్కన్నయే నిర్వికల్పుండైన సాక్షి. కాళిదాసుఁడును గార్యోత్సాహపరులలో మిన్నయైనవాఁడని యతనింగూర్చిన కథలచే నూహింపవచ్చును. మఱియు దేశచరిత్రములఁబట్టి చూచినచో యుద్ధాదివీరకృత్యంబులకుం జనులు గడంగుకాలం

బులలో మాత్రము కవిత్వమును విజృంభించుచుండెననుట నిర్వివాదముగ నెఱుఁగనగు. ఇందులకు హేతువును విశదము. అట్టికాలములో నెట్టి జడులును ఋషులును గొంతకుఁ గొంతయైన దేశభక్తియు శత్రుసంహారణసంరంభంబును దాల్పక మానరు ఇఁక సామాన్యమైనవారన్నో హృదయములు నగులునట్లు వీర్యాదిభావములం దాల్చుట ప్రశ్నయెవరోఘంబుగాదు భార్యను బిడ్డలను విడిచి యుద్ధమునకుఁ బోవువాని యాత్మలో నెన్ని భావములు తాండవమాడుచుండవు! కుటుంబమును విడిచిపోవలయుఁగదా యను దుఃఖము, మఱల నావారిని గన్నులారఁ జూతునో చూడనో యను దిగులు, ఇఁక యుద్ధమునకుఁ బోకున్నఁ బరులువచ్చి తనవారి ప్రాణములకుమాత్రమా, మానమునకును భంగపాటు దెత్తురో యను రోషము, తనవారికిని తన రాష్ట్రమునకునై వినియోగింపక యీ నా ప్రాణమును మూటఁ గట్టుకొనిపోయి యేగంగలోఁ బడవేయువాఁడనను దార్ఢ్యము! ఇత్యాదిగ లెక్కకు మీఱిన మనోవికారములను దలఁచుకొన్న నే మనకు నేమోయగునట్టు లుండును గదా! ఇఁక వారికిని వారి కాలమువారికిని గలుగు నుద్రేకమును వర్ణింపనవునా? ఉద్రేకమేకదా కవితాశక్తికి ప్రాణాధారమైన కారణము! ఈ దృష్టాంతములో "మనోవికారములు" అను పదమును విధిలేక వాడితిని. ఈ వికారములన్న పదము నాదిగాదు. మఱి

"తిండిపోత నీకు ఖండనం బేటికిఁ
గడుపుఁజేరి మనసు గాంక్షదీర
నోపుకొలఁది మ్రింగియూర
కనీవింటి కడనయుండు"

మని మగవారిచే గర్హింపఁబడు పేడివారి తెగకుఁజేరిన మన వేదాంతులు మొదలైన వారిచే సృష్టింపఁబడిన పదము! గొప్ప గొప్ప భావములు వికారములఁట! దుర్గంధ ప్రళయముగా మూలఁ గూలఁబడి ముక్కునుబట్టి కూర్చున్ననేమి సుందరాకారమో! అది యట్లుండె.

భాషాచరిత్రమును దేశచరిత్రమును నిత్యసంయోగములు

ఆంధ్ర దేశమువీర్యశౌర్యాదిగుణంబులచే రాగిల్లుకాలంబున నన్నెచోడుఁడు, నన్నయ, తిక్కన మొదలగు కవిగ్రామణులు ప్రాబల్యమునకు వచ్చిరి. కావునన వారి వ్రాఁతలలో రసము లమేయముగ మెఱయుచుంటయేగాదు ఉత్సాహమను గుణంబును వెల్లివిరియుచుండుటయు. మహమ్మదీయులచే నోడింపబడి యుక్కుతక్కువమై కుక్షింభరులమైయున్న కాలంబులోఁ బుట్టిపెరిగిన ప్రబంధకవులలో పాండిత్యబలము విశేషముగ నున్నను పందతన మొక్కటి యెక్కువగ నున్నదేకాని, ధైర్యముతోఁ దలయెత్తికొని మనుష్యులలో మనుష్యుఁడుగఁ దిరుగుటకుఁ దగిన యుత్సాహమంతగాఁ గాన్పింపదు. శ్రీ కృష్ణదేవరాయల కాలములో

పౌరుష మొకింత యుద్దీపించెఁగాని యయ్యది మెఱుఁగుఁదీఁగవలె నొక్క నిమిషమాత్ర మాంధ్రప్రపంచమును ధగద్ధగితముఁ జేసి యంతర్ధానమైనందున యధారీతిని మఱల గాఢమగు చీఁకటి యాక్రమించినది.

బ్రిటిష్ గవర్నమెంటువారు మనకు మనసార నిచ్చిన విద్యాప్రభావముచేత నిప్పుడు పరచింత నంతగా నుంచుకొనక, నైహికముల సాధించు నుద్యోగములను బునరాచరణమునకుం దెచ్చికొనుచున్నాము. కాన భాషాసంబంధములైన రచనలును బ్రకృతము తేజోవంతంబులై వ్యాప్తికి వచ్చుచున్నవి. హిందూదేశమును మహోన్నతదశకుం దేవలయునని దృఢప్రతిజ్ఞ గలుగు జనులుండు ప్రాంతములం దెల్ల దేశభాషలకుఁ బ్రకృతమున గౌరవమును విస్తారమును మెండు. మనకుఁ బట్టిన వేదాంతపిశాచిని అట్లట్లు పాఱఁదోలినందులకు నింగ్లీషువారు స్వభాషాభిమానులమగు మనకెల్లఁ బూజనీయులు.

పాండిత్యబలము

రేయుం బవలును వ్యాకరణములను నిఘంటువులను ప్రాచీన కావ్యములను వల్లించుచుండుటచేత నూనెకునష్టియేకాని కవితకుఁ బుష్టిలేదు. తన మనసున నెన్నియో భావములు ప్రభవిల్లకున్న నితరుల మనసులలో భావము లుప్పతిల్లఁజేయుట యెట్లు? కట్టెవాటిన కోవిదులకన్న లోకవాసనల ననుభవించి యానందించువారు మేలు.

అలంకారము లనావశ్యకములు

మన కావ్యములలో నుపమాద్యర్థాలంకారములును ననుప్రాసాదిశబ్దాలంకారములును దఱుచుగ నుపయోగింపఁబడియుండుట యెల్లరకుఁ దెలిసిన సంగతియె. అందు శబ్దాలంకారము లంతగా ముఖ్యములు గావనుట యందఱు నొప్పుకొందురుగాన వాని మాట ప్రస్తుత మటుండనిత్తము. అలంకారములలో ప్రధానమైనవి యుపమోత్ప్రేక్షాదులు. వీనికి మూలభూతమైన ధర్మ మేదనఁగా ప్రకృతవస్తువునకు మఱేదో యొక వస్తువునకును నామరూపస్వభావాదులంబట్టి సామ్యముఁ గల్పించెడుశక్తి. పోలికలను స్థాపించుట సొగసైనకార్యమేయైనను గవితకు ఖండితముగా నుండవలసిన లక్షణముగాదు. మనవారు అలంకారముల యెడ నమితాతురతఁ గొన్నవారు కాఁబట్టి యొకటి రెండు కారణములఁ జూపుట యావశ్యకము. శిల్పములకు వర్ణన ప్రధానము కాదనువా రెవరును లేరు. ప్రతిమలను జిత్రించువారును విగ్రహములఁ దీర్చువారును బరిస్ఫుటముగ నాకృతుల నెదుర నిల్పనేర్తురు గదా! అయిన నట్టిచో వీరు పోలికలం దెచ్చి చూపి పరిష్కరించుట కవకాశ మెక్కడిది? గద్యపద్యములును శిల్పమునకుం జేరినవే. కాన నిందును సాదృశ్యప్రతిపాదనము విడువరానిదిగాదనుట సరియె. మఱియు భావములు తీవ్రముగఁ జెలరేగునపుడు వానియుద్భవో

ద్రేకములకు హేతువులగు వస్తువులం దప్ప నితరములయెడ దృష్టి పాఱుట యసంభవము. మనసు రేగినప్పుడు ఆలోచ నకుంబూనుట యౌచిత్యభంగమునకు ముఖ్యకారణము. కావుననే మనవారు కోపము వచ్చినపుడు ౧, ౨, ౩, ౪౦ చుమని చెప్పుదురు. చూడుఁడు. భీమసేనుఁడు దుర్యోధనుని జూచినాఁడుపో! అపుడు, సింహము మదేభముపైఁ జెలఁగి నట్లు, డేఁగ పావురముమీఁద వ్రాలినమాడ్కి, ఇంద్రుఁడు వృత్రాసురుని మార్కొనువిధమున, బల్లి చీఁకటీఁగపైఁ గవి సిన కరణిని, ఇత్యాద్యుపములు భీమసేనునికిఁ దట్టునా? "క్రోధం బప్రతికారమై హృదయముం గుందించు" నవసర మున నిట్టి దూరపుటాలోచనలకుఁ దావెక్కడిది? ఒకవేళ అరమైలు దూరమునఁ జెట్టుచాటునఁ బొంచిచూచెడు కవు లకైనఁ దోఁచునా? తోఁపదని నా నమ్మిక. ఏలన, భీమసేనుని జూచి నణఁకుచుందురుగాన! కావున కథాంశము సాక్షా త్తుగ సమీపమున నడిచినట్లు భావనాశక్తిబలంబుచే స్ఫురిం చెనేని దూరపుసంబంధముగల బలాత్కృతాలంకారముల కుఁ దావుండదు. సాదృశ్యములలోఁ గొన్ని సహజములును అనివార్యములును. అవి తమంతటన యే ప్రయాసమును లేక వచ్చినయెడఁ గథాసందర్భముతోఁ గలసి మెలసి యుం డును. ఈ విషయమునందుఁ బ్రథమోదాహరణము కాళి దాసుని సాదృశ్యకల్పనము చూడుఁడు.

తే. "అట్టి సంతతిలేని నన్నెట్టు గనుచు
నంతఁ జెందవు మది మానినవర్య! చెపుమ!
ప్రీతిమైఁ దాన నీర్వోసి పెంపఁ దుదకు
గొడ్డువాఱిన యాశ్రమ కుజముఁ బోలె"*

మఱికొన్ని సర్వవిధముల సరిపోల నోగోవిందా! యనుచున్నను దీర్ఘాలోచనములుచేసి కష్టపడి శ్లేషాది కుయుక్తి పాశముచే నీడ్చి తెచ్చి తొండఱ మెయిఁజొన్పించినట్టులుండును. ఇట్టివి సంపూర్ణముగ విసర్జించిన నెంతయో బాగు. అలంకారములంగూర్చిన ముఖ్యపద్ధతులెవ్వియన, అయ్యవి ప్రయత్నములేకయ వచ్చినంత సహజముగనుండుట. కథలోని స్త్రీ పురుషులు మాటాడునపుడు పాత్రోచితములైన కొన్నింటిమాత్ర ముపయోగించుట. కవియే వర్ణించునపుడొకింత యెక్కువగ నలంకారములు వాడినను దోషము లేదు. కాని భావములు మహోజ్జ్వలములుగ రేగునపుడు ప్రకృతమునందే యవధానముంచుట మంచిది. అట్టి తరుణముల నలంకారములు సాధారణముగ నసంబద్ధప్రలాపముల.

సాదృశ్యతత్త్వము

సామ్యము వర్ణనకు నుపకరణము. ప్రధానంబుగాదు. సామ్యములుండిననేమి యుండకున్ననేమి? సొగసైన వస్తువును జూచినవెంటనే తనంతట సంతోష ముదయించును.

* ఈ పద్యము శ్రీ అనంతకృష్ణశర్మ విరచితము. (ఆంధ్రరఘువంశము స. ౧, ౭౦)

ఈ రీతినే సమస్త వస్తువుల యనుభవములయందును స్వతస్సిద్ధములైన సుఖక్లేశాది భావములున్నవి. వస్తువులు, వృత్తములు, చర్యలు ఇత్యాది ప్రకృతులకును మానవమనః ప్రకృతికిని స్వచ్ఛందముగనుండు భావవిషయమైన రీతులను వర్ణించుట కవితయొక్క ప్రధమగణ్యోద్దేశము. ఈ కార్యమునకు, సాదృశ్యనిరూపణాద్యలంకారములు సులభముగఁ దోడ్పడినవలదనరాదుగాని, యిట్టి యలంకారములు లేకున్న వర్ణనము తుదముట్టనేరదని భ్రమించి, వానిని కుయుక్తియను త్రాటిచే బంధించి ప్రబంధమను చెఱలో నుంచుట యెంతయుఁ బశ్చాత్తాపకరమైన నేరము. కమలముతోఁ బోల్పకున్న సీతాదేవి ముఖము చూచువారికి సుఖమియ్యదా? చిన్నతనముఁ బూనునా? అట్లగుట నా దేవిముఖమునే నేరుగ వర్ణించినం జాలదా? మఱియుఁ గమలముతోఁ బోల్చుటం జేసి సీతాదేవి ముఖమానందదాయియాయెనని భ్రమించు వెట్టు లెవరైన నున్న వారికొక ప్రశ్న. ఏమన, ఇఁక దేనితోఁ బోల్పఁబడినందున కమలము హర్షము నొసంగునదియాయెను? ప్రతి పదార్థమునకు నొక యుపమానముండి తీఱవలయునన్న కట్టకడపటి యుపమానమున కాధారమేమి? కావున నెట్లును ఏదోయొక వస్తువు తనంత, ఇతర మధ్యస్థము లేక, తన కనుగుణమైన భావమును బుట్టఁజేయునుగదా? అట్లగుట మొదటి వస్తువునకే యా గౌరవము నేల ప్రతిష్ఠింపరాదు?

వస్తుస్వభావములు భావములు
పరస్పరనిర్ణీతములు

వస్తువులంబట్టి భావము లేర్పడిన భావములంబట్టి వస్తువు లేర్పడుటయు నిజము. ఎట్లన, సంతోషకాలమున సర్వము ప్రకాశమానముగాఁ దోఁచును. దుఃఖము ప్రమ్మినచో లోకమంతయుఁ జీకటి ప్రమ్మినయట్లుండును గదా! అభిమన్యుని మరణము విని శోకతప్తయైన సుభద్రాదేవి ప్రలాపించుచున్న యీ పద్యము వినుండు:

సీ. "ఈ లోకమెల్లఁ బాడిల్లును బోలెనై
యున్నది నీవు లేమనికిఁ జేసి!
నీవు వేగమ గండుసేసి బంధులఁ బ్రీతిఁ
బొందఁ జేయుట గలఁపోలెనయ్యె,
జిష్ణుని కొడుకవు కృష్ణు నల్లుండవు వీ
నరులచేఁబడుట వోద్యంబుగాదె!
చెలువంపు మేనును జెన్ను మొగంబునై
యెప్పుడు పొడసూపె దింకఁ గుఱ్ఱ!
తే. అకట! యుత్తర యొప్పెడునది, మనంబు
దీనికెంతయు మెత్తన, యేను నిన్ను
వేఁడికొనియెద! వచ్చి యివ్వేలఁది వంత
దీపి తళుకొత్తు పలుకులఁ దేర్పవన్న!"

(భా. ద్రో. ద్వి. ౨౩౩)

ఈ మాట యెంతసత్యము! జయమగునేని ప్రపంచ మంతయు పెండ్లిల్లే. పరాజయమేని పాడిల్లే! కావుననే కదా వేమన

> "తనచావు జలప్రళయము
> తనదుఃఖమె సర్వలోక దారిద్ర్యంబున్"

అని నుడువుట!

విపరీతాలంకారరచనకు ప్రేరేపకము
భావశూన్యత

ఇంగ్లీషుకవులకన్న నాంధ్రకవులలో నలంకారము లధికములు అందును ప్రబంధకవులలో నత్యంత విపరీతములు. దీనికిఁ గారణమేమన. అలంకారరచన యాలోచనాశక్తికిఁ జేరినంత భావనాశక్తికిఁ జేరినదిగాదు. మన కవులు తఱుచు పండితులు. ఇంటిలోనే కూర్చుండి నిఘంటువులఁ గంఠపాఠము సేయువారు. వీరికి కార్యోత్సాహము భావప్రాబల్యము రెండును క్షీణములు. కావుననే భావనాశక్తి మట్టు. ఒక విధమైన యాలోచనాశక్తి యెక్కువ. కాన రేవగలును ఆలోచించి యాలోచించి దిక్కు గతిమోక్షము లేని యూహలఁ గల్పించుచు నదియే కవిత్వమని విఱ్ఱవీఁగ సాఁగిరి. యుక్తులు కుయుక్తులుఁ గవితాశక్తి యగునా? కానేరవు. కవిత్రయము వారిలో నిట్టివిఱుపులు లేవని చెప్పఁ

గాదు గాని ప్రబంధకవులయందు బలె పిచ్చిముదిరియుండ లేదనుట సర్వజనవిదితము. ఒకవేళ మన దేశభాషలలో నలంకారములకు స్వచ్ఛందమైన ప్రవృత్తి యాంగ్లేయ భాషలకన్న నెక్కువ యేమో! భాషాశాస్త్రవేత్తలు గొందఱు మనలో గుణవాచకములు వలసినంత లేకుండుటచే విషయవైశద్యప్రాప్తికై యలంకారములతో నిండిన శైలి నారాధింపవలసినవారమైతిమని సిద్ధాంతము చేసియున్నారు. ఇదియు సహేతుకమైన వివరణమేయని తోఁచెడిని.

భారతకవులప్రతిభ

ఈ విస్తారవ్యాఖ్యానమునకు ప్రకృతసాంగత్యమెట్టిదనఁగా: భారతకవులకు భావనాశక్తి యెంతయు గంభీరము. సమయోచితవర్ణనాప్రావీణ్యమునఁ దిక్కనతో సమానులెవరును లేరు. అరపాలైనవారును లేరన్న సత్యమునకుఁ దలవంపురాదు. పనికిమాలిన యలంకారములు వారి కవిత్వమున నపరిమితములుగావు. తుదకు వర్ణనములకుం బూనునపుడు సైతము కథయొక్క వేగమునకు భంగము గలిగింపనంత మితముగఁ జేయుదురే కాని కథమఱపునకు వచ్చునంత దీర్ఘముగ నెప్పుడును సాగఁబెట్టరు. అనఁగా నిక్కమైన కవిత వీరియందు నెలకొన్నదని నా విన్నపము. అందుఁ దిక్కనను గూర్చి నావంటివాఁడు ప్రశంసింపఁజూచుట యధికప్రసంగము. అతఁడు కవిబ్రహ్మ. అవతారపురుషుఁడుగాని కేవల మర్త్యుఁడా యని యాశ్చర్యపడవలసినంత ఘనుఁడు!

విషయము శైలి రెండును ముఖ్యములు

“భారతమునందు మనకంత రుచియుండుటకుఁ గారణము విషయము, అనఁగా కథ, గాని యా విషయము ప్రదర్శింపఁబడిన మార్గములు, అనఁగా శైలి ఇత్యాదులు, గావని” కొందఱ యభిప్రాయము. కాని యిది శుద్ధముగ బుద్ధి పొరఁబాటు మాట. దృష్టాంతము. భాస్కరుని రంగనాథుని* రామాయణములం జదివినవారు రామవియోగముచే శోకించు కౌసల్యాదశరథాదులయెడ నెంతో ప్రీతియు జాలియు వహించినవారగుదురుగదా! అయ్యలరాజు రామభద్రుఁడను కవి తన రామాభ్యుదయములో రామవనవాస ఘట్టమున దశరథుఁడు ‘నానార్థరత్నమాల’ను ఎదుట నుంచికొని పుటలఁ ద్రిప్పుచు నేడ్చినాఁడో యనునట్లు దరిద్రముపట్టిన శ్లేషాలంకారములు పెట్టి

సీ. “కానక కన్న సంతానంబు గావునఁ
　　గానక కన్న సంతానమయ్యె
నరయ గోత్ర నిధానమై తోఁచుఁ గావున
　　నరయ గోత్ర నిధానమయ్యె నేఁడు
ద్విజకులాదరణ వర్ధిష్ణుండు గావున
　　ద్విజకులాదరణ వర్ధిష్ణుఁడయ్యె
వివిధాగమాంతసం వేద్యుండు గావున
　　వివిధాగమాంతసం వేద్యుఁడయ్యెఁ

---

* రంగనాథరామాయణమును రచించినవాఁడు విఠలరాజు. రంగనాథుఁ డనెడువాఁడు కట్టుకథలకుఁ జేరిన కవియుకాని వాస్తవ్యుఁడుగాఁడు.

తే. గటకటా! దాశరథి సముత్కట కరీంద్ర
కటకలిత దాన ధారార్ద్ర కటక మార్గ
గామి, యెట్లు చరించు నుత్కట కరీంద్ర
కటకలిత దాన ధారార్ద్ర కటక తటుల?"

ఇత్యాది రీతులఁ బ్రలాపించినట్లు వ్రాసియున్నాఁడు. మఱియు శంకరకవికృత హరిశ్చంద్రోపాఖ్యానమున లోహితాస్యుని మరణముగూర్చి యేడ్చుచుఁ జంద్రమతి, రాజర్షి పత్నిగావుననేమో, కుమారునికంటెను తనకును సూపిరాడకుండఁ బ్రాణాయామముఁ జేయుచు, నీ దీర్ఘసమాసమును గూర్చి పద్యము చెప్పినది చూడుఁడు.

మ. అకటా! చేరెఁడు నేకరం బగఁడె సప్తాంభోధి వేష్టితస
త్సకలద్వీపకలాప భూపముకుటాంచత్పద్మరాగోజ్జ్వల
ప్రకటాపగ్గళ నిగ్గళత్కిరణ శుంభత్పాదుఁడైనట్టి రా
జకుమారుండు" (ఆ. ౫. ౭౬. ప.)

ఈ తీరుననే యెల్ల రామాయణములును వ్రాయఁబడియున్నచో నా గ్రంథములయొద్దికి మనుష్యులసనేల, తుదకుఁ జెదలు సయితము పోదనుట స్పష్టము. కాఁబట్టి విషయముచే రసము తప్పక కలుగుననుట తప్పు. కథ బాగుగనుండినం జాలునా? తగినరీతిని వ్రాయంబడి యున్నంగాని కాదు. ఈ దేశములో నొక్క యాంధ్రులకుఁ దప్పఁదక్కిన యందఱకును రామాయణమందుఁ గల యభిరుచి భారతమున లేదు. మనకన్ననో భారతము ప్రాణము. ఈ వ్యత్యా

సమునకుఁ గారణమేమి? ఆంధ్రంబున భారతరామాయణాదులకుఁ గల శైలితారతమ్యమే. శోకరసము వర్ణించునపుడును రామభద్రునకు శ్లేషలు సాంస్కృతిక దీర్ఘసమాసములును పెడరాని చీడలాయెఁగా' యుద్ధము ముగిసి జయము సిద్ధించిన పిదపను దాఁజేసిన దుష్కృత్యములఁ దలఁచికొని ధర్మరాజు పశ్చాత్తాపపడు ఘట్టమునుఁ దిక్కన్న వ్రాసిన విధముం జూచిన భారతమునకు మన యంతరాత్మలయందుఁగల నిత్య నివాసమునకుఁ గారణ మేర్పడకపోదు. చూడుఁడు.

ఆ. "అల్పకాల భోగ్యమైన రాజ్యమునకుఁ
గా, ననల్ప కీర్తి ఘనుని, జనక
సింహకల్పు, గంగ శేఖరజన్ముఁ, గ్రుం
చిలి, మనంబు నగడఁ జంపుకొంటిమన్నె?

(భా. శాం. ప్ర ౧౯౭ ప.)

మ. జనసంపూజ్య పదారవిందుఁడగు నాచార్యుండు శోకించి, నం
దనుఁ బోవ్వారయ వేఁడి, పెద్దయు ననుం దానమ్మి యర్థింపఁ, జా
వనివానిన్, గరిచావు బుద్ధినిడి, 'యశ్వత్థామ సచ్చెన్ నిజం'
బనియే గొంకతి! మేదిని పరిణ మార్భాంబే గురుద్రోహికిన్? ౧౯౮

ఆ. రాజ్యలాభలోభపరుఁడనై కడుఁ బాప
మైన బొంకు మాటలాడి, గురుని
గూల్ప నేర్చినట్టి క్రూరాత్ముఁ, డెగతిఁ
బోవువాఁడు? సెప్పుము పుణ్యచర్య! ౧౯౯

క. భ్రాత మహాత్ముఁడు కర్ణుం,
డాతనిఁ జంపించి యేలు నవనీ రాజ్యం
బాతురత నొసఁగుఁ గాక, సు
ఖాతిశయము మతికి నొసఁగునయ్యా? మునీంద్రా, అ. ౨౦౦

చ. కడిఁది మగండు కుంభజుఁడు గానఁగ నొడ్డిన మంటవోలె నుం
డెడి మొనఁ జూచి చూచి, యిది డెప్పర మన్యగ లేక పంచితిన్
గొడుకుఁ జొరంగ, నత్తెఱఁగు క్రూరతసైఁప సుభద్ర యట్లు, క
వ్వడి క్రియ, నోర్తురే యొరులు? నల్లభుఁడేలగు నట్టిఁ దుర్వ్యకిన్? ౨౦౧

చ. అడలడిఁ బొందఁగాఁ దగని యట్టిది ద్రౌపది, మేరుకల్పులం
గొడుకుల నేవురన్ జముఁడుగొన్న నెందురఁ జూడనేర్తునే?
పుడమి గిరీంద్ర పంచకము వ్రాల్సినఁ బాడటి నట్టులున్న య
ప్పడతుక యెట్లులోర్చు గృహభారము నెమ్మది నిర్వహింపఁగన్

క. ప్రాయోపవేశమున ని
ర్కాయంబుఁ దొఱంగఁ దలఁపు గదిరెదు, సంతా
పాయత్తచిత్తు, నకట క
టా! యని పోనిందు నను దృఢప్రతియుక్తిన్." ౨౦౨

పాత్రరచనాతత్త్వములు.

మఱియు పాత్రముల చరిత్రములను విస్తరించుటలో వర్ణనీయమైన పద్ధతి యేదనఁగా, స్త్రీపురుషులు గుణానుగుణమైన నడవడిగలవారయ్యును, ప్రపంచాచారములయందు బలె కావ్యములందును గాల దేశవర్తమానములవలన నొక్కొక్కయెడ విరుద్ధమైన వర్తనముగలవారుగా నున్నట్లు

ప్రదర్శించుట. సర్వకాలములయందును సర్వావస్థలయందును ఏకరీతిగా వర్తించువారుండుట యరుదు. మొత్తముమీఁద జాడ యెంత క్రమముగా నున్నట్లు దోఁచినను సూక్ష్మముగఁ బరీక్షించి చూచినయెడ వంకర లేమాత్రమును లేకుండదు. ఋజుమార్గం బట్లుండఁగా, నిక్కమైన యుపజ్ఞ లేమిచేఁ బరులో పెద్దలో చెప్పినట్లు వ్రాయఁజూచు నలఁతి కవులు, అలంకారశాస్త్రములలో నాయికానాయకులకు జాతుల నేర్పఱిచి గుణమ్ముల నిర్ణయించియుండుట బాగుగఁ బఠించియున్నవారు గాన, నదియ యొక వేదమనుకొని, ప్రమాణమను పిచ్చివట్టి, యందుఁ జేర్కొనఁబడిన ధీరోదాత్తప్రభృతులలోఁ దమకు వలయువారిని స్వీకరించికొని యెల్లదెఱఁగులం బ్రాచీనోపదిష్టమార్గంబుననే వర్ణించి యెదుట నిలుపుటయ కృతకృత్యతగ భావించిరి. బింబములకుఁ బ్రతిబింబముల నుత్పాదించుట కవిచేయవలసిన పని గాదు. మఱి ఫోటోగ్రాఫరుది· తన మనస్సుకుఁ దట్టినట్లు తన కన్నులకు గోచరించినట్లును వ్రాయవలయునే కాని యింకెవరికో తోఁచినట్లు దా వ్రాయఁజూచుట మూఢమతము. అట్లు చేసినఁ బద్యములు సిద్ధించినను గవిత పక్వస్థితికి రాఁజాలదు. ఇందుకుఁ గారణములు. మనసులు వేఱు. సంపూర్ణముగ సరిపోలునవి దుర్ఘటములు. కావున నేవిషయముం గూర్చి చర్చించినను సరే యొకనికిఁ దోఁచు భావము లితరుల భావములతోఁ గొంతవఱకు సదృశములై

యున్నను గొంతవఱకు భిన్నములుగను నుండుననుట ప్రకృతిలక్షణము. ప్రకృతిశాస్త్రములయందు సామాన్యగుణం బులకు గౌరవ మెక్కువ ఏలయన వస్తుజ్ఞానమే యందు ముఖ్యము. అట్లుగాక మనోరంజనమే ప్రధానముగాఁగల కవితాదిశిల్పములందు భిన్నగుణములకు గౌరవ మెక్కువ. చూడుఁడు. ఒక స్త్రీనిఁజూచి మోహించినవాఁడు ఆమెకు స్త్రీజాతి యంతటితోడను సామాన్యమైన గుణములచే నాకర్షింపఁబడియా మోహించును? అట్లయిన నీ యస్తియే కావలయునని పట్టుఁబట్టుట యేల? ఎవతె చిక్కినను సంతోషమని యుండరాదా? మోహమునకుం గారణము సామాన్యగుణంబులతోఁ గలసియు మీఱి మెఱయు ననన్యసాధారణములైన లావణ్యము, వచోమాధుర్యము, నడకలసొగసు ఇత్యాదులగు సౌందర్యములు. జాతి యను నది యస్తిభారమువంటిదనుకొనుఁడు కనులను మనసులను మఱల్చునది యదిగాదు దానిమీఁదఁ జక్కఁగఁ దీర్పఁబడి యుండు స్వరూపమను భవనము. ఈ సంగతి నెఱుంగని వారు 'పాడిందే పాడరా పాచిపండ్లదాసరీ' యన్నట్లు ఏవో యొక కొన్ని తరగతుల పాత్రములను వర్ణనములను బిఱికి పట్టుతోఁబట్టి వాని సంఖ్యలకు గుణకారము సేకూర్చిన నలంకారము సేకూఱునని యాంధ్రకవిత్వమున భావము లేని పదాటోపము ప్రకటించి పాడుసేసిరి.

'ఏమీ! ప్రతివాని మనసునకు వచ్చినట్లు వ్రాసినది

యుఁ గవిత్వమగునా?' యను నాక్షేపణ ముండునేమో! నే నన్నదదిగాదు. కవియైనవాఁడు తన భావము ప్రకారము వ్రాయవలయు నంటినిగాని, భావము ప్రకారము వ్రాసిన వారంతయుఁ గవులౌదురని నా మాటగాదు. అనఁగా నుత్కృష్టమైన భావములేని నీరసమానసులు కవిత్వముం జేయంబూనుట వారియొక్కయేకాదు మనయొక్కయు దురదృష్టము

పాత్రములు అనితరతుల్యములుగ నుండవలయు

సుప్రసిద్ధములైన పాత్రములన్నియు ననితరతుల్యములు. మఱియు ననితరతుల్యములే సుప్రసిద్ధములు. ఉదా: ద్రౌపది, సీత, సావిత్రి, శకుంతల, మందోదరి, శూర్పణఖ మొదలగువారు ఎల్లర చిత్తములలోను జక్కఁగాఁ దమ తమ గుణములచేఁ బ్రకాశమానలుగ నున్నారు వీరిలో మంచివారు సైతము భిన్నమూర్తులే. కాని, ప్రత్యేక పఱుచుటకు సాధ్యముగాని యొకే యచ్చునఁ గొట్టినట్టి బొమ్మలుగారు. ఇఁక ప్రబంధస్త్రీ లన్ననో యట్లుగారు. అందఱకు నొకటే మూర్తి వెవ్వేఱ గుర్తింప నలవిగానట్టిది. ఆకారములు, గుణములు, చీరలు, నగలు అన్నియును నలంకారశాస్త్రమను నొకే యంగడిలో నెరవు తేఁబడిన వస్తువులు. పేర్లు మాత్రము వేఱు. చర్యలేమో యొక్కటే. అవియు నంత శ్రేష్ఠములుగావు.

ఆదికవులను మధ్యకవులను గూర్చి చెప్పిన యీ మాటలు దిక్ప్రదర్శనముగఁ జెప్పఁబడినవే కాని ప్రతియొక్క కవికి నారోపింపఁదగినవికావని యెఱుంగవలయు. చూడుఁడు. స్త్రీ పాత్రములయందు మనుచరిత్రములోని వరూధిని యెంత మనోహారిణియగు ముద్దరాలు!

జీవకళయొక్క లక్షణము

పాత్రములు ప్రత్యేకాకృతులుగ నుండవలయుననుటయు, నయ్యవి బిఱుసువాఱినట్లుండక సమయోచితములగు మార్పులం జెందునవిగ నుండవలయుననుటయుఁ బరస్పర మిత్రములైన న్యాయములు. ఎట్లన, ఈ రెండింటికిని హేతుభూతమును దావలమును నయినది జీవము. జీవకోటులం బరీక్షించి చూడుఁడు. మూఁడు గుణములు తేట్లముగఁ గానవగు. (i) అవి జాతులుగ నేర్పడును. (ii) కాని ప్రతిప్రాణియు నితర ప్రాణులనుండి వేఱుగ గుర్తింపఁదగినంత వ్యక్తిని దాల్చియుండును. (iii) వికారము. అనఁగా మార్పులం జెందుట. ఇది యన్ని జీవరాసులయు స్వభావము. నిర్వికారముగా నుండవలయునన్న ఱాయి గావలసినదే! అదియునుంగాదు గాఁబోలు! ఏలన, ఆధునికప్రకృతిశాస్త్రజ్ఞులు లోహములు మొదలగు జడంబులు సైతము జీవులట్ల స్వాభావికముగ వికారము నొందునని నిరూపించి యున్నారు. కావునఁ బరమనిర్వికారస్థితిఁ దాల్పవలయునన్నరంభ లులేని లోకముఁ గనిపెట్టి యందు ఋషీశ్వరులగుటఁ

దప్ప వేఱొం డపాయములేని యుపాయము వెదకినను దొర కదు. (IV) ఈ వికారములును వ్యక్తిభేదముల మాఱ్చు. అనఁగా వస్తువుయొక్క ప్రకృతికి మీఱిపోవు. మఱి యెట్లు వ్యక్తి జాతిచే పరిమితమో యట్లే వికృతులును బ్రకృతుల చేఁ బరిమితములు. హృదయప్రమోదమే యుద్దేశ్యముగాఁ గల శిల్పకళలయందు వికృతులు ప్రధానతమములు.

వికృతులు లేని పాత్రములు జడసమానములు

ఇది తెలియనివారు ఎవనినైన నొకని ప్రారంభమున ధీరోదాత్తుఁడుగా నుండునట్లు వర్ణించిరయేని, మఱి వాఁడు చచ్చునరకు నా ధీరోదాత్తత్వమునందే పడవైచి పెట్టి పుణ్యము గట్టికొందురు. వీరియొక్క పాత్రములు గ్రుక్కు మిక్కనక యిటు నటుఁ జూడక ముక్కునకు సూటిగా నేగు చుండును. అనఁగా ఇనుపయంత్రములకుం జేరినవిగాని మనస్సును గలిగి, యది కారణముగ చాంచల్యముగల, చేత నములు గావు. పాత్రముల సహజవికృతుల నుద్ధరించుట యందు భారతమును మించిన గ్రంథ మీ ప్రపంచమునం దెక్కడను లేదు! మానవస్వభావ మీ గ్రంథరాజమున నెంతచక్కఁగ నెంత గంభీరముగ నెత్తి చూపఁబడినదో యది తలంపునకు రావచ్చునేమో గాని నాల్కకు వచ్చుట దుర్లభము. చిత్రవిచిత్రభంగులు గలిగి, భావార్ద్రములై,

స్వాభావికములై, మెఱుంగు వెట్టఁబడిన భారతపాత్రములం గూర్చి వ్యాఖ్యానముఁ జేయవలయునన్నచో నిటనుండి పింగళి సూరన్నను వెడలఁ గొట్టవలసినదే. ఈ యుపన్యాసమునకు నాయకుఁడుగాన నది మర్యాదగాదు. ఈ గుణములంబట్టి చూచిన రామాయణాదులు భారతమునకన్న నెంతో తక్కువయనుట నిస్సంశయము. ఇఁక సామాన్య ప్రబంధములన్ననో వానియందలి స్త్రీపురుషు లెండిన కట్టెలవలెనున్నారు. వంగలేరు, పెఱుగలేరు కాఁబట్టి ప్రాప్తులు రెండు: విఱుపఁబడుట! ప్రాయి నిడఁబడుట.

శాస్త్రాదేశరచనలు విరసములు

ప్రాచీనులు వ్రాసినట్లును అలంకారశాస్త్రము లాదేశించినట్లును విరచింపఁ బ్రయత్నించుట తెలివితక్కువపని. ఏలన ఒకకవి వ్రాసినవిధమున నింకొకఁడు వ్రాయఁజాలమి ప్రకృతిసిద్ధమైన యర్గళము. ఇందుకుఁ గారణములు. (I) మనసులు వేఱగుటంజేసి భావాదులును వేఱు. వివిధభంగుల స్ఫురణముగలవారు ఒకేతీరున నభినయింపఁజూచుట పరిహాసమునకు హేతువు. (II) భావము భాష యివి పరస్పర సాంగత్యముం దాల్చియున్నవి. ఇంచుక నిదానించి చూడుఁడు. ఏ విధమైన పదములచేరికయు లేని యాలోచనలఁ జేయుట సాధ్యమానా? ఏదీ! భాషాసాహాయ్యమే మాత్రముఁ గైకొనక కొంతసేపు దేనినిగూర్చియైన యోజింపుఁడు! ఈ గారడీవిద్య మనుష్యులకు మించినది. తలం

పుండిన భాషయు నుండవలయుట నిజము. అయినను భావ యుండినఁ దలంపుండి తీఱవలయునా యను నొక ప్రశ్నయు విచార్యము. భావము లఖండముగ లేకయుండినను పదా డంబరముఁ బ్రబలముగాఁ జూపవచ్చుననుటకు మన ప్రబంధకవులే సాక్షులుగాని, యట్టి పదములు నిరర్థకములుగాన హృదయాకర్షకములు గావు. రుచినీయవు. భావపుష్టి లేని పదపుష్టికి 'బడాయిశైలి' యని పేరు. పసిపిల్లలేగాని ధీరు లెవరును దీని నొకయెత్తుగఁ బాటింపరు.

కావునఁ దిక్కనరీతిని వ్రాయవలయునన్నఁ దానే తిక్కనావతారమెత్తి యతని మనోభావాదులఁ దాల్చినన యానుగాని, విరాటపర్వము గ్రుడ్డిపారముఁ జేసినఁ, గోరిక తుదముట్టదు. ఒకరు సృజించిన శైలి, విషయము, రీతి ఇత్యాది బింబములకు ప్రతిబింబముల రచింపఁజూచుట మంచిదిగాదు అదృష్టవశమున సాధ్యమునుగాదు. కష్టించి బహిరాకారముఁ దీర్పఁజాలితిమేనియు నంతరంగప్రతిపాదనముం జేయుట యెట్లు? ప్రాణము అను గుణములేని పాత్రములు చిత్తరులు. ద్రోణపర్వములో నభిమన్యు మరణ విషయమై జాలిఁ జెందుచు నర్జునుఁడు

ఉ. "హాయను ధర్మరాజ తనయాయను నన్నెడఁబాయ నీకుఁ జ
న్నేయను దల్లినేఁపఁ జనునేయనుఁ గృష్ణుఁడు వీఁడె వచ్చె రా
వేయను నొంటిపోక దగవేయను నేగతిఁ బోవువాఁడనే
నో యభిమన్యుఁ డాయనుఁ బ్రియోక్తులనుత్తరఁ దేర్పవేయనుౕ"

(భా, ద్రో, ద్వి, ౨౮.౨)

అని విలాపించిన సామాన్య పద్యముం జూచి తరు వాతి కవులందఱు నాక్రోశావసరంబులలో

ఉ. "రాయనుఁగాయనుం దొగలరాయనిఁ గేరునిగారవుంగొటా
రాయను మేటినాడెపు వొరాయనుఁ గిన్కయొనర్చెదేమి మే
రాయను నింతనీకుఁ గనరాయను దయ్యము పాడిదప్పెనా
రాయనుఁ గన్నవారునగ రాయను నిప్పని మానురాయనున్"
(అచ్చతెన్గురామాయణము అయో, ౮౯ ప)

ఉ. కాయను మేటితప్పు కొడుకాయను నిద్దపుఁబూఁతమావిమో
కాయనుఁ బంజరంపుఁ జిలుకాయను నబ్రపుసోయగంపుఁబ్రో
కాయనుఁ బల్కవేమి యలుకాయనుఁ బంతముదీఱెనోటుక్కై
కాయను నేరయిట్లుదుడు కాయనుఁ బాయఁగఁ గోరికాయనున్
(అచ్చ. రా. అయో, ౯౦ ప)

ఉ. హాయను గాధినందనమఖారినిశాటమదాపహారిబా
హాయను గ్రావజీవపపదాంబురుహాయను రాజలోకసిం
హాయనుఁ బోషితార్యనివహాయనుఁ గానల కేగితే నిరీ
హాయను నిర్వహింపఁగలనా నినుఁబాసి రఘూద్వహాయనున్.
(రామాభ్యుదయము ఆ ౫ ప ౧౦)

ఉ. జాయను జూపవేమి యను జాయను నవ్విధియెంత చేసెనా
రాయను నాదుగుండె బలురాయను నాత్మపరాక్రమోన్నతుల్
రోయును గాననాంతరము రోయును దుష్టకురంగచేష్ట సు
మ్మాయను జానకీ దనుజమాయనుగ్రుంగితె పల్కుమాయనున్.
(రామాభ్యుదయము, సీతావిరహఘట్టము)

ఇత్యాది వర్ణక్రమము ననుసరించి ప్రాసములతో వ్రాసిన రసికుల మనసులను తూఁ యనిపింపక మానునా?

మిశ్రచరిత్రములుగాని పాత్రములు
ప్రకృతి విరుద్ధములు

పాత్రములంగూర్చి యీవఱకు స్థాపింపఁబడిన పద్ధతులు రెండు (i) అవి నిర్జీవములట్లు బిఱ్ఱబిగిసి యుండఁగూడదు. (ii) మఱి తీఁగెలవలె నల్లునవిగానున్న నింపును సత్త్వమును వహించిననగునుఅనుట ఇట విన్యసింపఁదగిన విశేష మింకొండుగలదు. ఏదన పాత్రముల చరిత్రములు శుద్ధముగ మంచివిగానో శుద్ధముగఁ జెడ్డవిగానో యుండు నట్లు దీర్చుట శిల్పదోషములలో నొకటి. ఏలోపమును లేని స్త్రీపురుషులుండరు. మఱి కేవలము దుష్టులైన మానవులును గంటికిఁ గానరారు. మనుష్యప్రవృత్తి మిశ్రమైనది. కూనీచేసినవాఁడుసైతము పగ సాధించుటయను వీరకర్మమున కుద్యోగించువాఁడే కదా! దొంగలు పరులసొత్తును గ్రహించినను దమ భార్యలయు బిడ్డలయుఁ బోషణార్థమే కదా! ఇంతేకాదు. వెలుతురు చాయయు నెట్లు ఎడతెగని సంయోగముం దాల్చియున్నవో, యట్లే మంచిగుణములకును, దమనీడలోయను మాడ్కి నవియే యాధారముగఁ బ్రభవించెడు చెడుగుణములు సదా సహచరములై యుండును. ధైర్యము మంచిది. అయిన నభిమన్యునివలె నత్యంత

సాహసోదగ్రులైనయెడ వ్యర్థమైన ప్రాణనష్టికి మూలమగును. ఇంక నెదిరిని దమ్మును నెఱింగి సమయము పొంచి మీఁదఁబడుదమనువాఁడు జయము గొన్నవాఁడైనను అంతకడింది మగఁడుగఁ దోఁపఁడు.. నీతియనునది శకునికైతవముయొక్క యపరావతారము. నీతిరహితమైన విజృంభణము ఆశ్చర్యకరమైనను నానందకరమవునో కాదో! మఱియు సుగుణములే కొన్నియెడలఁ బరస్పరవిరుద్ధములగుటయు సంభవించెడు. అప్డేదేనొక న్యాయము నిరాకరించుట విధిలేని యకృత్యము. దృష్టాంతము. కర్ణపర్వమునఁ గృష్ణుఁడు చెప్పిన 'కౌశికోపాఖ్యానము.' సత్యము ధర్మమే. అయినను దొంగలువచ్చి 'నీ సొత్తెక్కడ'నని యడిగిన నిజము చెప్పవలయునా? శత్రువులువచ్చి 'నీ యింటఁ జొచ్చినవాఁ డెక్కడ నున్నాఁడు చూపుమా వాని గొంతు గోయవలయును' అని మర్యాదగాఁ బ్రార్థించిరేని, నిజముచెప్పిన భూతదయ నశించును, కనికరము నుద్ధరించిన ననృతదోషము ఘటిల్లును! అట్లగుటఁ గేవలము నిరంజనుఁడుగా నుండవలయునన్న నసాధ్యము. నిరంజనత, నిర్వికార, నిష్కళంకత ఇత్యాద్యభావములు మానవప్రకృతికిం జేరినవిగావు. మన నడఁతలు మిశ్రములు. ఈ న్యాయమునకు ననుకూలమైనరీతిని పాత్రముల చరిత్రములం జేర్చి విస్తరించుటలో భారతమునకు నీడుజోడైన గ్రంథము లెవ్వియును లేవు. సామాన్య కవుల పాత్రములు నిర్వికారములుగ నుండుటయే

కాదు. సంశ్లిష్టములును గావు. అవి యేకరసప్రధానములు గాని నానాభావాభ్యుదయములకు నాకరములుగావు.

వర్ణనములకన్న అంగాంగసాంగత్యము కావ్యముల శ్రేష్ఠము

ఒకానొక విద్వాంసుఁడు గొప్ప గ్రంథమున కొకదానికి విమర్శనప్రాయమైన పీఠిక వ్రాయుచు నా గ్రంథమును ప్రశంసించుటకై యిందుఁ బదునెనిమిది విధములయిన వర్ణనములునున్నవియని దృష్టాంతములతోఁ జూపియున్నాఁడు. ఇది దోషముగాదుగాని పొరపాటునకు వీలిచ్చెడు పద్ధతి. ఎట్లన. విడివిడి వర్ణనములఁ జేయుటలో సామర్థ్యముం జూపె నేని యా మాత్రమే కవియొక్క ఘనతకుఁ జాలునని భ్రమింతురా? చూడఁబోయినఁ బదునెనిమిది వర్ణనలుండిన నెవరికిఁ బ్రీతి; లేకున్న నెవరికి నష్టము! వర్ణనములకన్న ముఖ్యమైన విషయమేదనఁగా, కావ్యమునందలి యంగాంగములకుం గల కలయిక. పొత్తుపొసఁగని వర్ణనలు రసమునకుం బ్రతికూలములు. సంగీత మెపుడును హృద్యము. పాటపాడు వాఁడు, మృదంగమువాఁడు, పిటీలువాఁడుఁ గలసినట్లు వర్తించిననా దానిసొంపు, అట్లుగాక ప్రతివాఁడును ఇష్టము వచ్చినట్లు దన యావచ్ఛక్తి నక్కడనే వినియోగింప యత్నించిననా? తనంతట ప్రత్యేకముగ వాయింపఁబడు నప్పుడెంతయో మనోహరముగ నుండు మద్దెలమెట్టు సందర్భశుద్ధిని

మిూఱి వెలయింపఁబడినచోఁ జెడ్డ రోఁతగ నుండుననుట కేమి సందేహము! అట్లే పురపుష్పలావికల వర్ణనములు వ్యష్టిని జూచిన నెంత బాగుగ నున్ననేమి? సమష్టితో సంబంధములేని కూఁతగానున్న నవి దుష్టములే. స్త్రీపురుషుల యాకారసౌందర్యములు నిట్టులే. అంగములన్నియు వేఱు వేఱుగా శస్త్రవైద్యశాలలోఁబలె విభజింపఁబడియుండినచో వానిని గన్నెత్తి చూడ సుకుమారమానసులకు నౌనా? మఱి చెలువంపుఁదనమునకు జీవనమైన లక్షణము అంగముల సాంగత్యము. లోకములోనుండు వర్ణనీయాంశముల నన్నింటిని నొకచోటఁ బ్రోగుచేసియుంచిన నది సర్వవికారముల కాస్పదమైన కుప్పయగును! సీతమ్మకు ముక్కు సొగసు, రుక్మిణమ్మకు కన్నులు సొగసు, కావున నీయమ్మ ముక్కును ఆ యమ్మ కన్నులను దీసి బ్రహ్మదేవుఁడు వేఱొక పెద్దమ్మను సృజించెను! కావున నీ మూఁడవ యమ్మ సీతారుక్మిణులకన్న రెండింతలు సొగసుకత్తెయని వ్రాయువారికి శిల్పముయొక్క తెఱంగను వాసన యేమాత్రమైనఁ దెలియునని వచింపనౌనా? సీతమ్మముక్కు సొగసన్న నర్థమేమి? సీతమ్మయొక్క ముఖము మొదలగు నవయవములతోఁ జేరిక కల్గియుండుటచే, ననఁగా నా స్త్రీయొక్క యాకారముం బట్టి, యది చక్కనిదనుటగాని, యా ముక్కును గోసికొని పోయి యింకొకచో నుంచినను నదేరీతి సొగసుగానుండునని యర్థముగాదు.

"తమ తమ నెలవులఁ దప్పినఁ
దమ సొగసులె ఝోఁతలగుట తథ్యము సుమతీ!"

కావున నంగీకారములేని వర్ణనలు ప్రత్యేకముగ నెంత యద్భుతములుగా నున్నను నింద్యములే. కథయను నిండు టాకృతిని దీర్పఁజాలని కవి యంగములవంటి వర్ణనములఁ దీర్ప నేర్చుననుట పిచ్చికూఁత కావున విమర్శనముఁ జేయుటలో కథ, పాత్రములు, ప్రకృతి విశేషములు, వర్ణనములు ఇవన్నియుఁ బరస్పరమైత్రికలిగి విఱుపులు లేని యేకాకృతిగా నున్నవాయను విచారణ ప్రధానతమమని నా మనవి. కథ యొక్క గమనమునకు విరోధమైన దీర్ఘవర్ణనముం జేయుట రసవిహీనభావమున కొక గుఱుతు. భారత రామాయణ హరివంశాదులలో నీ లోపమును లేశమాత్రముఁ గానము. ఇప్పుడిట వివరింపఁబడిన న్యాయము గోప్యముగాదు. చదువరులెల్ల నెఱిఁగినదే.

స్వభావవర్ణన యనుటకు నిర్వచనము

ప్రకృతిసమ్మతమైన వర్ణనము అను మాటకు నిర్వచనము ఉన్నది యున్నట్టు చెప్పుటగాదు. ఏలన గవర్నమెంటువారి గెజెట్టులో జరిగినవి జరిగినట్లు వృత్తాంతములు ప్రకటింపఁబడును. అది కారణముగ నావ్రాఁతలు స్వభావోక్త్యలంకారమునకు దృష్టాంతములని యెవ్వఁడుఁ బేర్కొనఁడు. వస్తువుల నిజస్థితి నిర్దేశించుట శాస్త్రముల యీప్సితము. కళలయొక్క కాంక్ష యదిగాదు. ఎట్లన కళలలోఁ బ్రధాన

మైన పురుషార్థము రసము. రసము భావమునకు సంబంధించినది. భావములపరమైన దృష్టితో గణించి వర్ణించుటయే కళయందు శ్లాఘనీయమైన పద్ధతి. భావముతోఁ జూచుటకును భావము లేక చూచుటకును నెంతో భేదము. ఉదాహరణము. సుందరియగు నారీమణినిజూచి యువ్విళ్ళూరువానికి నామె సొగసు నిమిష నిమిషమునను వృద్ధిఁబొందునట్లు దోఁచుచుండును. వీనికిని ఆవేశము వృద్ధిఁబొందుట తప్పదు. "రాజు మెచ్చినదే రంభ" అనఁగా ననురాగముండెనేని ఎవరిమీఁద నా యనురాగము వ్యాపించునో వారు, తదితరులకెంత కురూపులుగఁ గానవచ్చినను, వానికి మనోహరమూర్తులుగఁ గానుపింతురు. అట్లగుట యెంతయుమేలు ప్రతివాఁడును మోహముకొలఁది సర్వోత్కృష్టురాలని భ్రమించి యెవతెనో యొక స్త్రీని వశ్యముఁజేసికొనఁ జూచుట యీ న్యాయముయొక్క మాహాత్మ్యమే. ఈ ధర్మము మనుష్యప్రకృతిని బాలించుచుండదేని, నిర్భావముగానే పక్షపాతములేక యెల్లరు నేస్త్రీని నుత్తమురాలని నిర్ణయింతురో దానినే యందఱు వలచి సుందోపసుందులట్లధోగతిం జెంది యుందురేమో! భావములయొక్క దృష్టికిని ఆలోచనాశక్తియొక్క దృష్టికిని ముఖ్యమైన భేదమేమనఁగా: యోజనాశక్తింబట్టి నిరూపించితిమేని సత్య మొక్కటియే. అనఁగా సిద్ధాంతీకరింపఁబడిన తత్త్వము సర్వజనులచే సరియని యొప్పుకొనఁబడియే తీరవలయును. దృష్టాంతము

గణితశాస్త్రము ఏడును పదితో గుణించిన డెబ్బదియగు ననుట నిర్వివాదము. ఎవ్వఁడైనను నా కీ మాట రుచింపదని యనినచో వానిని బిచ్చివాఁడందుము. కాని గోచరముల యెడ భిన్నభావములున్న నది ప్రకృతివిరుద్ధమని యెవరుఁ జెప్పరు. కావుననే 'లోకోభిన్నరుచి' యను సామెత ఎట్టి సౌందర్యవతియైన నేమి? "లోకములోనివారెల్ల నామె యందే బద్ధమోహులు గావలెను. అట్లు చేయనివారిని బిచ్చియాసుపత్రికిఁ బంపక తప్పదు" అని సిద్ధాంతముఁ జేయుఁ బిచ్చివాఁడు దక్క నింకెవ్వఁడైనఁ గడంగునా? కావున శాస్త్రములలో నేకకంఠముగ నెల్లరును 'ఇది సత్యము. తక్కినవి మిథ్యలు' అని స్థిరీకరించినట్లు కళలలోఁ జేయఁ జూచిన రసాభాసము నిత్యము. ఒకేవస్తువు మానవుల ప్రకృతులంబట్టి యనేకులకు ననేక భావముల కాస్పదము గావచ్చును. మఱియు భావములంబట్టి కొంతవఱకును రూపమేర్పడునుగాన ననేకరూపములం దాల్చినదియునగును. నానారూపములం జెందియుండుట యొక్క భగవంతునకే చెల్లిన భాగ్యముగాదు. అతని సంతతివారముగాన మన కును నందు భాగముగలదు! భారతములోని దుర్యోధనునిం గూర్చి విచారింపుఁడు. ధృతరాష్ట్రుఁడు, అనుజులు, సచివు లైన కర్ణాదులు, ప్రజలు, పాండవులు మొదలగు వివిధపక్ష ములవారిలో నొక్కొక్కరి కొక్కొక యవతారముగ నా తఁడు దోఁచలేదా! ఒకరికిఁ దోఁచినట్లు వేఱొకరికిఁ దోఁచె

నా? ఒకరి కనులతో నింకొకరు చూచుటెట్లు? చూడం బోయిన వస్తువొక్కటేయైనను మూర్తు లనేకములనుట కతం డును సాక్షిభూతుండే. ఇంతేకాదు. తాను గొప్పగానున్న పు డశ్వత్థామకు దుర్యోధనునిపై గౌరవముండెనేమి? గోగ్ర హణసమయమున నతనిని ధిక్కరించినట్టి సాహసుండు! అట్లుండియు నా రాజరాజునకు కష్టములు ప్రాపించినది మొదలు ఆతనియెడ సేవాధర్మము నిర్వర్తింపవలయునను శ్రద్ధయేకాదు. నిజమైన భక్తియుఁ బ్రీతియు పుష్కలముగఁ దాల్చినవాఁడు. తుదకు నమ్మహనీయుఁడు తొడలు విరిగి పడియున్నపుడు, ఆతని పాటునకు నెరియు మనమ్ముతో నా గురుపుత్త్రుఁడు విలాపించిన విధము వినుండు.

ఉ. పాండవులట్లు మజ్జనకుఁ బాపవిధిం దెగఁ జూచునప్పుడున్
జంపెతరప్రకోపము నసహ్యపుశోకము నిల్లు చిత్తమొం
డొండఁ గలంపలే విపుడ యొక్కఁడుఁ దక్కకయుండ వారి ను
ద్దండమహాస్త్రవహ్నిఁ బరిదగ్ధులఁ జేయక యెట్టులుండుదున్!

(శల్య. ద్వి. ౪౧౧ ప)

చ. సురమునఁ బెంపు చేవయును దుర్దమలీల వెలుంగుచుండ సు
స్థిరత శమంతపంచక విశిష్టతలంబునఁ బోరి సద్గతిం
బొరసెదు, నీకునై పగపు పుట్టదు, బంధులు రాజు దేవులున్
దిరియును, ఇంక వారిదగు దీనతకోర్వమి కుమ్మలించెదన్

(సౌప్తి. ప్రథ. ౨౧౭ ప)

ఉ. సీరియనారతంబుఁ దన శిష్యులలోపల నెల్లనిన్ను దు
ర్వారపరాక్రమాఢ్యుఁడని వర్ణనసేయుట గేలిసేసి, యా
నూరులికిం జయంబొసఁగె మాల విధాతృఁడు! వాని గెల్వఁగో
లేరికి సమ్మతంబగునె యిట్టిది! దీనను బెంపు గల్గునే? ౨౧౭

చ. కురువర! నీమగంటిమియుఁ గోల్తలయుఁ బలముం జలంబు దు
స్తరగతిఁ బేర్చి భీమునకుఁ జావక పోవఁగరానియట్టిదై,
నరు బెదరించి, కేశవుమనంబు గలంచి, యధర్మ వృత్తికిం
జొరుఁడనిపంచె, దీనిదివిజుల్ గని రింకిట వేయునేటికిన్! ౨౧౮

ఉ. ధర్మముమాని యూరులు గదంబొడిసేసినయంతఁబోక దు
ష్కర్ముఁడు వాయుజుండెడమకాల శిరంబటు దన్నెఁ! జూచి యా
ధర్మసుతుండు శాస్తిఁదగ దానికిఁ జేయఁడ! యాతఁడెప్పునం
తర్మదదుష్టుఁ డీగెలుపు దైన్యముసేయదె కీర్తిమాయదే? ౨౨౦

చ. కుడువఁగఁగట్టి బంధులకుఁ గోటివిధంబులఁ బెట్టి జన్నము
ల్నడుప ననేకధర్మ విధులం బొగడొందఁగఁ జాలునట్టి యొ
క్కుడుసిరియిచ్చి పేర్మినొకకొండగమన్చిన నీవు సావఁగా
నొడలిటులోమితిం గురుకులోత్తమ! యేనొక సేనకుండనే? ౨౨౨

కావున వస్తువు లనేకుల కనేక రీతులఁ దోచునను మాయ యొకటిమాత్రమే కాదు, ఒక్కనికే కాలదేశవర్తమానంబులంబట్టి యనేకవిధములఁ దోచుటయును స్వభావప్రభావమే. ఇక్కడ ఒక్కఁడంటిమి. వాఁడుమాత్రము వికారరహితుఁడా? కాఁడు. మఱి మాఱుచుండువాఁడే. కావున భావంబులు ప్రసిద్ధిగనుండు నీ లోకములో నానావతార

సిద్ధియు విశ్వరూపప్రదర్శనశక్తియు సర్వవస్తువులకు సామాన్యములు సహజములునైన లక్షణములు

ఆలోచనశక్తిచే నుత్పాదితములైన శాస్త్రములయొక్కయు భావబంధురములైన శిల్పములయొక్కయు దృష్టులు వేఱు. గోచరించు పదార్థముల తీరులును వేఱు. కావుననే శిల్పములు రచించుటలో స్వప్రతిభ ప్రకారము పోవలయునే గాని యలంకార శాస్త్రజ్ఞులు, ప్రాచీనకవులు వీరిని ననుకరించుచు ప్రతికల్పనలం జేయఁజూచుట పొసఁగరాని మతమని మున్నే చెప్పఁబడియుంట. శాస్త్రములలో నొకఁడు వ్రాసిన సిద్ధాంతముల నితరులును గ్రహించి ప్రచురింపవచ్చును. అది పునరుక్తిదోషంబు గాదు. కళలలో నుపజ్ఞలేనిది స్వారస్యముండదు. భావముల ననుసరించి యాకృతులు వివిధభంగులఁ దోఁచుననుట స్ఫుటముగదా! అనఁగా శిల్పులచే నారాధింపఁబడు సిద్ధియేదన నున్నదియున్నట్టు ప్రదర్శించుట గాదు. మఱి కన్నది కన్నట్టు ప్రదర్శించుట. ఉన్నదియున్నట్టు అనఁగా వస్తుస్వభావ మేర్పడియున్న భంగి యనుట. ఇఁక కన్నది గన్నట్టన్ననో, మన భావముచే దాని స్వభావము జెందిన వికారముల ప్రకారము అనుట. అనఁగా నిరవధికస్థితిగాదు. మఱి భావమును అవధిచే నిర్ధారితమైన స్థితి.*

* తత్వజ్ఞు లనేకులు భావాతీతమైన స్థితి యుండియు లేనట్లే గాన మిథ్యయని వక్కాణించెదరు. నిజస్థితియనునది వస్తువుయొక్కయు మనుజులయొక్కయు ప్రకృతులు రెంటిచేతను నిర్ధారితము.

ఈ రెండు స్థితులకుంగల భేదము. వస్తువు దనంతట నెన్ని గుణములం దాల్చినదో యెవరు నెఱుంగరు. లెక్కకు వచ్చునవి గోచరములు మాత్రమే. అగోచరము లుండినను నుండవచ్చును. మఱియు గోచరములన్నియు వస్తువును జూచినప్పుడెల్ల మనకు స్ఫురించుటలేదు ఏలయని యడిగితి రేని, ఏభావము మనస్సున నుచ్చస్థానము నధిష్ఠించి యుండునో యాభావమునకు సన్నుతములు, రుచికరములు, చింత్యములునైన గుణములు మాత్రము మిక్కిలి ప్రకాశ మానములుగ నగపడును. తక్కినవి మసురుగ్రమ్మినట్లు వెనుకంబడినవో యను గతి, దూరస్థములైనవాయను మాడ్కిని స్ఫుటములుగా నుండవు. మఱి మాఁగువాఱిన యవిగానో, ఆ సమయమున నేమాత్ర మెఱుకకు రానివి గానో యుండును. కారణమేమన. అప్పుడు వానిపై దృష్టి నిలుపుట యగత్యముఁగాదు. సహజమునుగాదు. దృష్టి వేనిపైఁ బాఱునో యవి ముందువచ్చి సమీపమున నిలిచి నట్లు విశదములుగ నుండును. పరిసరముల నుండినవి యస్ప ష్టములు. దూరముగ నుండునవి యప్పటికి నగోచరములు. ఆ భావము పోయి వేఱొక భావము మనస్సు నాక్రమించె నేని మునుపు తేజోవంతములుగా నుండిన భాగములంత ర్ధానమై, యప్పుడు గ్రహణము సోఁకినట్లు మఱుఁగుపడి యుండిన భాగములు ప్రజ్వలితమైన యుదయముం దాల్చి నవి యగును. ఇందులకు వేఱు దృష్టాంతము లేల? చూడుఁడు

కోపముగా నున్నప్పు డెదుటివాని దుర్గుణములమీఁదనే యవధానము స్థిరముగా వ్రాలును. శాంతముగ నున్నవేళ వాని సుగుణ దుర్గుణముల రెంటిని గమనించి యాలోచనతో మంచివాఁడా చెడ్డవాఁడా యని నిర్ణయింతుము. మహానందకాలములో నేరమొనర్చినవానిం జూచినను «ఏమో పాపము. కడుపాత్రమై దొంగిలించినాఁడు. ఇది యు నొక ప్రమాదమా» యని పరుషములకు సరళములాదేశమగునట్లు చేయుదుము. భావమును బ్రేరేపింపఁ జేసినవారిమీఁదనే కాదు, తదితరులమీఁద సైతమూరాగ సహితమగు చూపుపోకమానదు. భార్యతోఁ గలహించినవాఁ డామెమీఁదమాత్రమే గుఱ్ఱనియుండునా? మఱి చూచినవారి నెల్లఁ గఱవఁబోవుట పరమరహస్యమా? కావుననే కదా విద్యార్థులెల్లరుఁ బరీక్షకులకును వారి పెండ్లాలకును మనసులు గలపి చల్లఁగ నుండవలెనని విఘ్నేశ్వరునకు టెంకాయలు గొట్టుట!

సర్వలక్షణసమేతములుగా వస్తువుల నిర్దేశించుట తప్పు

ఈ మనశ్శాస్త్రతత్త్వముయొక్క యాదేశమేమనఁగా.

---

* ఆలోచనాశక్తికి శాంతము మొత్తముమీఁద సహాయకారి. భావములు గొంతవఱకు విరుద్ధములు. శమదమాదిసత్త్వగుణములు పట్టుపడినయెడల కైవల్యప్రాప్తి యెట్లోగాని కవితాప్రాప్తి నిండుసున్న. రాజసతామసగుణములు కవితయను మందాకినీమనోహరప్రవాహమునకు జన్మస్థానములైన మహోన్నతభాగములు.

ఎట్టి సమయములందును వస్తువుల సర్వసులక్షణములను వర్ణించుట గొప్ప యవలక్షణము. మఱి భావముల ప్రసిద్ధి ననుసరించి విశేషముం దాల్చిన గుణముల నధికముగను, సంక్షేపముఁ బూనినవానిని కొలఁదిగను, వర్ణించి, నిక్షిప్తము లైనవానిం బేర్కొనక విడుచుటయ కళకు శోభ. నిర్భావముగ వ్రాయు శాస్త్రకారుం డేవిషయమును విడువక సమగ్రముగ వస్తు స్వరూపము నిర్దేశించెనేని వానికది చెల్లిన విధమే. ఎందుకన. వానియుద్దేశ్యము వేఱు. నిజస్థితిని నిరూపించుట వాని కర్మము. కవిపని యదిగాదు మఱి భావములను వికాసమునకుం దెచ్చుట. దృష్టాంతము. వైద్య శాస్త్రము నభ్యసించువాఁడు మనుష్యుల దేహములోని ప్రతి సూక్ష్మవిషయమును గ్రహింపఁగోరి సాంగోపాంగముగ లోపలివానిని పైవానిని సర్వమును బరీక్షించును ఈ రీతినే మోహముచే నంధుఁడో, అర్థాక్షియో, యేకాక్షియో యైన నాయకుఁడు తన నాయికను జూచెనేని యీ సూక్ష్మములపై నతనికి మనసు పోవునా? పోవచ్చునా? అవి కంటఁబడునా? పడవచ్చునా? యోజింపుఁడు! యోజింపుఁడనుట నా తప్పు! దీర్ఘాలోచనలేక యీ సంగతి నెఱుంగనేరరను అనుమానమున్న మీరు మనుష్యులా కారా యను ననుమాన ముండక తీఱదుగదా! యోజన యేల? ఇది స్వతస్సిద్ధమైన భావము. రసికుల కెల్లరకు సామాన్యము. అది లేనివాఁడు శుద్ధ మృగమో జడుఁడో! కొన్ని శృంగార కావ్య

ములలో నాయకులు నాయికలను బాగుగ విమర్శించి సాంగోపాంగముగ సంస్కరణ చేయుట గలదు. అట్లు చేయుట యానాయికలను డాక్టర్ల దృష్టితోఁ జూచినట్లు అనఁగా శవ సమానముగఁ జూచినట్లనుట!

కావున గద్యమైనను సరే పద్యమైనను సరే, కావ్యముల వర్ణింపఁదగినవి భావోదయముచేఁ బ్రకాశమునకు వచ్చు వస్తువుల కొన్ని కొన్ని రేఖలు, కళలు, పక్షములు మాత్రమే. సర్వాంగవర్ణనము భావభావనాశక్తులు సంపూర్ణముగ నింకి పోయిన పండితమాత్రులు ప్రకృతిశాస్త్రజ్ఞుల యట్లు ఆలోచనాబలముచే సాధించెడు నసహ్యము! భావములన్నియు నేకకాలమున నుజ్జ్వలములుగావు కావున నన్ని లక్షణములును ఏక్షణముననైన భావపరమైన చింతతోఁ జూచు వారికిఁ గానఁబడవు. కళలయందు సర్వపదార్థములకును పార్శ్వగ్రహణము నిత్యము! అట్లగుటఁ బ్రత్యక్షమైన రేఖలమాత్రము వివరించుట భావస్వభావములు రెంటికి ననుగుణమైనరీతి. తక్కిన వర్ణనములు మనుష్యస్వభావములకు విరుద్ధములు. రసమునకు నాభాసకరములు.

భావనాశక్తియొక్క లీలలు

కవితయొక్క రూపు నెఱుంగఁగోరిన మనసుయొక్క రూపము నెఱుంగవలయుఁగదా! ఆత్మజ్ఞానము సంపూర్ణముగ నెవరికి నలవడఁగలదు! అందును నావంటి పామరున కేమి

తెలియును? ఏదో యొండు రెండు ముక్కలు విన్నవింప సాహసించితినిగాని, యీ సాహసము నెఱవేఱినదని నా కేమాత్రమునమ్మికలేదు. ఇంక భావనాశక్తియొక్క తెఱంగ న్నంగో మనఃప్రకృతుల కన్నిటికన్నను గోప్యమైనది. దాని చర్యలను గణింపనేకాదన్న నింక నిరూపించుటెట్లు? అయి నను గొన్నింటి నాజ్ఞాపించిన మనవిసేసెద. భావములతో సాంగత్యముం దాల్చునది గదా భావనాశక్తి ఇంక భావము లసంఖ్యములు. కావుటంజేసి వానిని రంజింపంజేయు భం గులును అసంఖ్యములే కొన్నియెడల సూర్యోదయాది చిత్రములం దద్రూపముగ వర్ణించిన సొగసు. స్త్రీపురుషు లమేయమైన దుఃఖమో సుఖమో దాల్చిన కాలములోం దగుమాత్ర ముత్ప్రేక్షించినంజాలును. కథ వేగముగ నడువవలసినచోట నలంకారముల గుప్తములంచేసిన నింపు. కవియే ముందుకు వచ్చి చెప్పెడుచోట్ల మితముగం గొన్ని యున్న దోషములేదు మఱియు కొన్నియెడలం బ్రకృతికి మీఱిన వర్ణనములం జొనిపినను వికారముదోంపకుండు టయేకాదు. అస్వాభావికమనియు సామాన్యముగ నెవరికిం దట్టవు. ఉదాహరణము. హితోపదేశము. ఈ గ్రంథమున ఎలుకలు పిల్లులు కాకులు నక్కలు మొదలైన తిర్యగ్జంతు వులు 'మనుష్యభాషణములవలె వర్ణముల' మాటలాడుట యకాక, నీతివిధానము విప్పిచూపుటలో విదురుని యన్నలు గానున్నవి. ఇది ప్రకృతికి విరోధమని కొందఱు భ్రమించుట

సహజమే. ఈ విచారముతో నిపుడేమి పనిగాని, యిట్లు విపరీతస్వప్నములతో నిండియుండినను ఆ గ్రంథము ఒక దేశము ఒక కాలమునను మితము అడ్డును లేక యన్ని దేశములవారికి నన్నివయసులవారికిని నిత్యహర్షముగానున్న దనుట యందఱకుఁ దెలిసిన సంగతియే. ఈ గ్రంథములోని కథలు హిందూదేశమునుండి పారసీకమున కాక్రమించి, యక్కడనుండి ఇటాలియా మొదలైన యూరోపు ఖండములోని దేశములందంతటను నాలుగువందల యేండ్లక్రిందనే వ్యాపించినందునఁ, నవి పారంపర్యముగ నాయా జాతులవారిలోఁ బ్రచారమునందు గాథలంబోలె సర్వసాధారణములైనవి. చరిత్రజ్ఞానము లేని పామరులు పరభాషనుండి దిగుమతియైన వారమనియైన నెన్నక తమ స్వభాషయందే యావిర్భవించినదనియు నెంచుటం దలపోసితిరేని, మనవలె జాతిమత వర్ణాదుల వ్యత్యాసముకతన పూజ్యులైన మనువుయొక్క సంతతివారో కారో యను సంశయమునకుఁ బాత్రులైన విదేశీయులచేతను, నీ గ్రంథమెంత గాఢముగ స్వీకరింపఁబడినదనుట విశదమవును. ఇట్లు లోకులెల్లరచేఁ బ్రీతితోను శ్లాఘ్యముగాను జూడఁబడిన కావ్యము భావనాశక్తి విరహితమనికాని, తప్పుఁద్రోవలఁ బోయినదనికాని చెప్పవలనుపడునా? మఱియు నీ గ్రంథము నిరుపమానము గాదు. ఇట్టివి యింకను ననేకములు సమస్తదేశముల భాషలందును గలవు. మన దేశములోనే యీ హితోపదేశమునకు

నెన్నియో మడుంగులు మిన్నయనందగు బృహత్కథ* యుండలేదా? భారత భాగవత, రామాయణా†దులలోను మృగపక్షివితానములు దేవమనుష్యభావములం దాల్చినవి గావా? మఱియు, అస్త్రములు, కామరూపధారణము, భూతభేతాళ వశీకరణము, ఇత్యాది మహేంద్రజాలములు పుంఖాను పుంఖములుగ గ్రంథములనేకాదు తరతరములుగ తల్లి బిడ్డలు చెప్పుకొనెడు ఊకుడు కథలందును గానంబడి యెడి శుద్ధముగఁ బ్రకృతి విరుద్ధములైయున్న యెడల వీని కిట్టి వ్యాప్తి సేకూరియుండదు నిర్హేతుకజాయ మానసిద్ధులు ప్రపంచవ్యవహారములలో నహి' అట్లగుటఁ గారణము విచార్యము

చూడుఁడు చిన్నచిన్నబిడ్డలు చీమలు, కుక్కలు, చిలుకలు, పిల్లులు మొదలగు హీనజాతి జంతువులతో సైతము నరత్వ మారోపించి మాటలాడఁగోరుట, కోపించుట, స్నేహించుట మొదలగు చేష్టల నొకరు చెప్పక చూపకయ తమంత నవలంబించుట సర్వజనసహజమే గదా! ఇం దస్వాభావిక మేమైన నున్నదా? మఱియు, బాల్య దశయందు లోకానుభవము వస్తుపరిచయమును దక్కువ గాన, నీ కాలమున సామాన్యములని మన మశ్రద్ధతోఁ

---

* బ్ర. శ్రీ వేదము—వేంకటరాయశాస్త్రిగారు దీనిని మిగులఁ జక్కని వచనశైలి నాంధ్రీకరించియున్నారు.

† రామాయణములో నిది మితిమీఱినదని కొందఱ తీర్మానము.

జూచుననిగూఢ, నెంతో యద్భుతములట్లు గానుపించుననుటయు నెల్లరకు విదితమే. అగ్గిపుల్లను గీఁచిన నది మండుననుట మనకొక వింతయా? బిడ్డలకన్ననో యదియొక విస్మయము పుట్టించెడు మాయ యక్షిణి! కాఁబట్టి పుల్లలపెట్టె దొరికినం జాలును. మఱుఁగునఁ గొనిపోయి గీయుట, వెలుతురు పుట్టఁగనే నవ్వుట, చేతులు దట్టఁబోయి క్రిందికి జాఱవిడుచుట! ఇట్లు నానారీతుల నాశ్చర్యమునం దాసక్తి గనుచున్నారుగదా! ప్రకృతింగూర్చిన జ్ఞానము లేనివారికి నిది సామాన్యము, ఇది యపురూపము, ఇది దైనందిన వృత్తము, ఇది యద్భుతము అని నిర్ణయించు వివేకము సున్న. అట్టివారికి స్వాభావికము అస్వాభావికము అను తారతమ్య మేర్పడదుగాన, సామాన్యముల నద్భుతములుగను, అద్భుతముల సామాన్యములుగను బరిగణించుట సహజము. ఈ బాల్యచాపల్యము వయసు బుద్ధియు వచ్చిన మనలో నడఁగి మాయమైయున్నను బొత్తుగ నశించినదిగాదు. ఒక్కొక్కప్పుడా భావము మనల నావేశించును. అట్టి తరుణములఁ దదుచితమైన చేష్టలకు మనమును బ్రారంభించి పిల్లలరీతి నాడుకొందుము. కట్టుఁగతల వినఁగోరుదుము. లేనిపోని యద్భుతముల నెవఁడైన 'నేను గాశిలోఁ జూచితిని. ఉత్తర కురుదేశములోని మహాత్ములయెడఁ గనుఁగొంటిని' అని చెప్పిన నెంతో నమ్మికతోను ఆనందముతోను ఊఁపిరి విడువక విందుము. కావున మనసునకు నాయా భావముల

యా దేశముచొప్పున సత్యమను భ్రమ గలిగించినఁ జాలు. భావనాశక్తి కృశకృత్యమే నీతిచంద్రికను (అందును జిన్నయ సూరిగారిది) చదువునపుడు అదేదో యొక లోకమైనట్టును, అందు పావురములు కాకులుఁ గూడ గ్లాడుట మాని మాట్లాడుట సామాన్యమగు విషయమైనట్లును మనకుఁ దోఁచు ననుటకు ప్రత్యక్షానుభవమే తార్కాణ. ఇట్లే పదితలల రావణుఁడు, మూఁడుతలల త్రిశిరుఁడు, ఖరుఁడు, మహిషుఁడు, జాంబవంతుఁడు, హనుమానుఁడు, వేయికన్నుల యింద్రుఁడు మొదలగు పురాణపురుషులును. విపరీతములు సైతము సత్యములను భ్రమఁ గల్పించు నాధారము లెవ్వియనఁగా: (1) ఇప్పటి కాలదేశములకు సంబంధములేనంత దవ్వులైన యుగములలోనో లోకములలోనో అట్టి కథలు నడిచినట్లు చెప్పుట. అట్లు చేసిన మనకుం బ్రసిద్ధములగు హేతువులం బట్టి సత్యాసత్య నిర్ణయముం జేయఁ బూనము. (II) ఇట్టి ప్రకృత్యతీతముల వర్ణించుచో నున్నట్టుండి యాధునికములు సామాన్యములునైన సంగతులను వేయఁగూడదు. వేసిన జాలమునకు భంగము ఆ మాయను స్థిరముగఁ బోషించునట్టి వర్తమానములఁ బొందించుచు నేకధారణినే యేగుట యుత్తమము. కళారచనలో గమనింపవలసిన విషయమే మన, రసాభాసమేమాత్రము గలుగనంత పొందికయున్నదా లేదా యనుట. విషయము ప్రకృత్యతీతమైననేమి, ప్రకృత్యధీనమైననేమి? విషయమునకన్న రీతి శిల్పములం బ్రధానము.

కావున లోకులకెల్లరకు రుచ్యములుగానుండు భారతాదివీరకావ్యములయందును, కథాసరిత్సాగరము మొదలైన వినోద కథలయందును గల ప్రకృతిని మీఱిన వర్ణనలకు నాధారభూతమైన భావనాశక్తి గణనీయము గాదనుట తప్పు. మఱియయ్యదియు మనుష్యులయందు అనశ్వరముగ నుండునేవోకొన్ని భావములకు సహజముగ ననుకూలములైన ప్రకారముల వర్తించునదియ యనుట యొప్పు. అట్లుగాదేని నా కథలయందు మన కెడతెగని మక్కువ యుండుటేల?

ఈ కాలమున బిడ్డలెట్లో పూర్వకాలమునఁ బెద్దలు నట్లే. అనఁగా ప్రకృతిజ్ఞానమంతగా లేనివారనుట. ఇదియే గదా ప్రాచీనగ్రంథగాథాపురాణములలో మన నమ్మికకు నందని యద్భుతములు విస్తారముగఁ జెప్పఁబడి యుండుటకు మూలము! ఆ పురాణకవులకు నవి యస్వాభావికములుగఁ దోఁచియుండవుగాఁబోలు! వారు ఘనమైన నమ్మకము విశ్వాసమునుంచి వ్రాసిరి. కావున నే మనకును నవిశ్వాసము అంతగాఁ బుట్టకుండుట. ఇప్పటివా రా రీతి వ్రాయఁజూచి రేని యసాధ్యమని చెప్పఁగాదుగాని* యెంతో శిల్పనైపుణ్యము లేనిది యవి కృత్రిమములుగఁ దోఁచుఁగాని నిక్కములట్లు భ్రమఁగొల్పఁజాలవు. కావున నాటకములలోను

* స్వభావాతిక్రాంతవిషయములఁగూర్చి సత్యతాభ్రమ సిద్ధించునట్లు వ్రాయఁజాలు పాశ్చాత్యకవు లిపుడుఁ గొందఱున్నారు. ఆంధ్రమున నీ ప్రతిభగలవా రున్నారేమో గాని నే నెఱుంగను. వీరేశలింగముగారు దప్పు-

గాప్యములలోను నాగాస్త్రము గారుడాస్త్రమును బ్రయోగింపకుండుటయ మొత్తముమీఁద సుగుణము. అట్లుగాదని వాని నావాహనముఁజేయువారు వానితో నాగ్నేయాస్త్రమును రప్పించి గ్రంథమంతయు నాహుతిగా నిచ్చినయెడ లోకమున కెంతే నుపకారము చేసినవారగుదురు!

ఎఱ్ఱాప్రెగ్గడ రచించిన

ఉ. "అంబ నవాంబుజోజ్జ్వల కరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబరచారుమూర్తి ప్రకటస్ఫుటభూషణ రత్నరోచిరా
చుంబిత దిగ్విభాగ శ్రుతిసూక్త వివిక్త నిజప్రభావ 'భా
వాంబర వీధి విశ్రుతవిహార' నన్నుం దయఁ జూడు భారతీ!"

యను సరస్వతీస్తవమున కవితాధిదేవతం గూర్చిన "భావాంబర వీధివిశ్రుత విహార" యను సంబోధన మెంత సత్యము! మఱియు గంభీరము!

భావనాశక్తి యనేక మాయలం బన్ను లీలావినోదిని. ఈ మాయల కన్నింటికి సామాన్యలక్షణ మొక్కటియే. ఏరసము నుత్పాదింపఁజూచునో దానిని కవియే మనఃపూర్ణముగఁ దాల్చినఁగాని చదువరులయందు అభిమతమగు చిత్తవిభ్రమము గలుగనేరదు. భావము లనంతములు నగాధములుఁగాఁ బ్రభవిల్లినఁ గవియు నమోఘుఁడగును.

కవితయొక్క గుణదోష నిర్ణయముంగూర్చిన యాధార తత్త్వములఁ గొన్నింటి నివేదింప సాహసించితి. మన్నింతురుగాక! గ్రంథవైపుల్యమునకుం జడిసినవాఁడనై దృష్టాం

తములఁ దఱచుగఁ బొందింపనైతి. క్షమింపుఁడు! ఈ వ్యాఖ్యానమునం దేలిన యంశములు:

(i) "అంతా కవులము గామా
యింతింతగఁ గందపద్య మల్లఁగలేమా?"

యని భాషమొదలగువానినిమాత్రము కృషిచేయుటచేఁ గవుల మగుదుమనుట బొంకు. (ii) శైలిభావప్రకాశకము. శైలి, భావము, ఇవి వియోగములేని ద్వంద్వంబులు. (iii) అట్లగుట ప్రాచీనకవులు అలంకారికులు మొదలగువారు చూపిన జాడలు ఉచితముగ నుపయోగించిన మేలు చేయునవియైనను, అవియే సంపూర్ణశరణ్యములని యెంచి యా మార్గములను మీఱి యొకయడుగైనఁ బెట్టఁగూడదనుట కవితాశక్తికి భంగకరమైన యూహ. (iv) ఆదికవులు భాషాంతరీకరణముఁ జేసినవారుగావున నపూర్వరచనాసామర్థ్యము వీరి కున్నదో లేదో తెలియదు. అనఁగా వీరి కుపజ్ఞ యేమాత్రమున్నదనుట వివాదాంశమేమో! అయినను మీఁద వివరింపఁబడిన గుణములఁబట్టిచూడ కవుల లక్షణములు పెక్కులు వీరియందున్నవనుట స్పష్టము. అందును దిక్కన మహాకవియొక్క ప్రభావము అజేయంబు. అద్వితీయంబు!

రెండవ ప్రకరణము

పింగళి సూరనార్యుఁడు మధ్యకవులకుఁ జేరినవాఁడు గావున ప్రాచీనగ్రంథములను ముఖ్యముగా భారతమును బహు శ్రద్ధతోను భక్తితోను బఠించియుండును ఇందుల కమ్మహేతిహాసములోని గుంభనల జ్ఞప్తికిఁ దేఁజాలినంత సాదృశ్యముగల రచనలఁ దాఁజేసియుంట యొకసాక్ష్యము. చూడుఁడు. కర్ణుఁడు తన యన్నయౌట యెఱింగినపిదప ధర్మరాజు చింతించిన విధంబు

"ఆ. అతనిమేను గుంతి యట్టులకైవడి
యరయ నేను జూచి యాత్మ నెద్ది
కారణంబొ యిట్లుగా ననుచుండుదు
నేమిసేయువాఁడ నింకఁ జెపుమ"

(శాంతి. ౧ ఆ.)

ఈ రీతినే సుముఖాసత్తియు మణిస్తంభుఁడు దనభర్తయని యెఱుంగనిదగుటంజేసి యతని నేమేమో పల్కి, పిమ్మట నతఁడు ప్రచ్ఛన్నశాలీనుఁడని యెఱిఁగినదై యతని నుద్దేశించి యాడిన ప్రకారము.

సీ. . . . . .

ఇంతదాఁక నెఱుఁగ నేనేమి యంటినో మిమ్ము
ననుచుఁ గన్నీళ్ళు రా నడఁచికొనుచు,
నవ్వుమాటల నగవుల మాయందుఁ
దొంటికైవడి గొంత దోఁచుచున్న,
వసుధ మానిసిఁ బోలు మానుసులు లేరె
యనుచునుండుదు . .

(కళా. ఆ. ౪. ప ౧౬౫.)

మఱియుఁ గణ్వాశ్రమ వర్ణనావసరమున నాదిపర్వములో:

“సీ. శ్రవణసుఖంబుగా సామగానంబులు చదివెడుశుకముల చదువుదగిలి
కదలక వినుచుండు కరులును, గరికరశీతలచ్ఛాయఁ దచ్ఛీకరాంబు
కణములఁ జల్లని గాడ్పాసపడి వానిఁ జెందిసుఖంబున్న సింహములును
భూసురప్రవరులు భూతబలుల్దెచ్చిపెట్టు నీవారాన్న పిండతతులు

ఆ. గడఁగి భక్షింప నొక్కటఁ గలసియాడు
మన్నయెలుకలుఁ బల్లులు నొండు సహజ
వైరి వర్గంబులయు సహవాసమపుడు
సూచి మునిశక్తి కెంతయుఁ జోద్యమంది”

అను పద్యమునుజూచి మణికంధరుని తపోవనము వర్ణించుచుఁ బింగళి సూరన్న పైరీతి ననుకరింపంజూచియు యమకమునకై స్వారస్యముఁ జెడఁగొట్టుకొన్న గతియుం గాంచుఁడు!

సీ. ఆవులునాకఁగన్నరమోదుచ్చపులులునుబులుఁచన్గడునంగఁబోవులేళ్ళు
లేళ్ళచెల్లాటరంజిల్లెడు హరులును హరులుగోళ్ళనుగోక సఁరుకరులు
కరుఁకటాళివైఖరినాడు పాములు పాములఁబాలించు బభ్రుతతులు
బభ్రుతతులప్రక్కఁబాయనిరొలుఁకలు నెలుకలఁ బెంచుపిల్లులునుగలిగి.

భారతపద్యములోని సొగసు దీనియందు లేదు. ఏలన. అందు జంతువులకునుండు నన్యోన్యతను జూపుటలో నిష్కారణచేష్టలు వర్ణింపక హేతుసంగతములగు చర్యల నారోపించుటయే కాదు. "భూసురప్రవరులు భూతబలు ల్దెచ్చి పెట్టు నీవారాన్నపిండతతులఁ గడఁగి బక్షింప" ఇత్యాది విశేషములచే నా మృగములకును మునిజనులకును గల మచ్చికను సూచించియున్నాఁడుగాన నీవర్ణనము మనోహరముగా నున్నది. సూరన్న పద్యములో పదములచే నర్థము నిర్ణయమునకు వచ్చినదిగాని, యర్థవ్యక్తికై పదములు ప్రయోగింపఁబడినట్లు గానము. మఱియు జంతువుల పట్టీని గూర్చి, యది దానిని గీరెను, ఇది వేఱొకదానిని గోఁకెను, అనుటలో మనోదృష్టికి నింపైన రూపములు ప్రత్యక్షముగఁ గానరావు. 'కడఁగి భక్షింప నొక్కటఁ గలసి యాడుచున్న' యను మాటచే నాటలో మచ్చికపడిన జంతువుల చెల్లాటములు స్ఫురణకు రాకపోవునా?

భీష్మాటోపమును వర్ణించుచున్న భారతములోని కొన్ని వచనముల ననుసరించి, కళాపూర్ణోదయములో అష్టమాశ్వాసములోని "ఇత్తెఱంగున నపార్థి వోత్తముండత్యంత

చిత్రంబైన" ఇత్యాది దీర్ఘవచనములు వ్రాయంబడియున్నట్లు దోఁచెడిని

'సూరనార్యుఁడు కొన్నియెడల నన్నెచోడుని ననుక్రమించియున్నాఁ'డని శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు వ్రాసియున్నారు. శ్రీనాథుని వైఖరియు నీ కావ్యమునఁ గొన్నిచోట్లఁ గానవచ్చెడిని కవులయందుఁ గాన్పించు నిట్టి సాదృశ్యములు విచార్యములైనను మిక్కిలి ముఖ్యములనిభావించుట తగదు. పోలికలంబట్టి చౌర్యము నొడిగట్టుట తగదు. సందర్భము లభిన్నములుగ నున్నచోట్ల భాషయుఁ గొంత సాదృశ్యముం దాల్చుట యప్రకృతముగాదు. విషయము, శైలి యివి పరస్పర సమన్వితములు అట్లగుట విషయ సంభూతమైన పదసాదృశ్యము కావలయునని తెలిసి తెచ్చిపెట్టుకొన్న కల్పనయని సంశయించుట పొరపాటు అయినను సాదృశ్యములు విశేషించి బహుళముగనుండిన నితరులఁ జూచి వ్రాసినాఁడను నిర్ణయ మనివార్యము. "పిల్లవసుచరిత్ర"ము లనంబడు నిటీవలి ప్రబంధములన్నియు రామరాజభూషణుని బిచ్చములకావా?

ఇట్లు మన సూరన 'యుత్కృష్టులైన గ్రంథకర్తల జాడల నెఱిఁగినవాఁడయ్యుఁ గొంతవఱకు నంతమంచివిగాని మార్గముల నవలంబించియున్నాఁడు. దీనికిఁ గారణమేమనఁగా. ఎట్టివాఁడును దన కాలములో శ్రేష్ఠములని యెన్నంబడిన రీతుల విరచింపఁ జూచుట సహజము. సమ

కాలకుల మెప్పులువోలెఁ దీప్తిమైన మెప్పులెవ్వి? మఱియు మనకవి మిగుల బీదవాఁడు గాఁబోలు! ఈ యనుమానమున కాధారములైన యంశములు గొన్ని శ్రీ వీరేశలింగముగారి కవిచరిత్రలో సూచింపఁబడియున్నవి. కుటుంబరక్షణార్థము ద్రవ్యార్జనమునకై యత్నించుట దోషమా? కాదు. ఆ కాలమున నిప్పటియట్లు ప్రజలు పుస్తకములఁ గొనుటచే నాదాయము గడించి జీవింపఁజూచుటకు వీలు శుద్ధముగ లేమింజేసి, యితఁడు రాజుల నాశ్రయింపవలయు విధికి లొంగినవాఁడాయెను. బమ్మెరపోతనవలె "మదంబ! నిను నాఁకటికిం గొనిపోయి యల్ల కర్ణాట కిరాట కీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!" యని చెప్పఁజాలిన ధీరులు వేయింటికొక్కరైన నున్నారో లేరో! రాజాశ్రయమున బ్రదుకుపాటు గోరువారు వారి యిష్టానుసారము వ్రాయక యేమి చేయుదురు? ఇఁక రాజులన్ననో పరిపాలన కార్యమునఁ దగిలి కాలంబు గడుపువారు. సాంతమగు బుద్ధితో విమర్శింపఁజాలినంత పండితులగుట యరిది. కావున నట్టివా రాచారముంబట్టి గుణదోషనిర్ణయముం జేయుట నైజము. సూరనార్యుని కాలములో ప్రాచుర్యమునకు వచ్చిన కవితారీతి ప్రబంధరచన అట్లగుటఁ దానును బ్రబంధధోరణినే వ్రాయవలసినవాఁడయ్యె. ఐనను భావగంభీరుఁడును వివేకవంతుఁడును అగుటంబట్టి సంపూర్తిగ ప్రబంధరీతి కూపంబునం బడలేదు. ఒక యడుగు గట్టున, ఒక యడుగు పల్లము

నంగా నిలిచి, తన యిష్టమునకు రాజుల యిష్టమునకును రెంటికిని మధ్యమున, సంపూర్ణముగ నిగ్రహముగాని యను గ్రహముగాని చేయని, త్రిశంకుస్థానమున నిలిచెను. "అన్యా లమనముల్, నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాఁడు ధన్యుఁడు" గదా! ఈ కవిధన్యుఁడాయెనో లేదో ఆయన లెక్క పుస్తకములు మనకుఁ జిక్క లేదుగాన స్థిరీకరింపనేరము! ఎది యెట్లుండె. కవితాస్వర్గమునఁ ద్రిశంకుస్థితిం దాల్చియు న్నాఁడు! అయినను దలక్రిందుగా వ్రేలాడుచుండలేదు. తలమీఁదుగనేయున్నది గావున నెల్లవిధముల మనకు సంభా వనీయుఁడు. తనకు శరణ్యులైన ప్రభువుల చిత్తవృత్తి ననుస రించువాఁడనుటకుఁ గళాపూర్ణోదయమునుండియే యొక దృష్టాంతముం జూపవచ్చును. చూడుఁడు. కృతికర్తశైవుఁడు. దీనికి నితఁడు దారపుత్త్రాది బాధలేని యౌవనకాలములో వ్రాసినదని యూహింపఁదగిన రాఘవపాండవీయములో నితనింగూర్చి చినవేంకటాద్రి చెప్పిన యీ పద్యమే సాక్షి.

ఉ. దక్షతయింతగల్గి విశదంబుగఁ గాంచియు నీ మదిౙ్ ఫలా
పేక్షఘనంబుగామినిది యిట్టనఁగొంకెద నీకునో 'లలా
టేక్షణభక్తిశీల' రచియించుట కష్టముగాదె శ్రీ విరూ
పాక్షున కంకితంబుగ శుభార్థము రాఘవపాండవీయముౙ్.

ఇఁక భర్తలైన నంద్యాలవారన్ననో వైష్ణవము గొంత ముదిరిన మహనీయులు! "శ్రీ విష్ణుపదభక్తిచే ధర్మసంపత్తి

ధర్మసంపత్తిచేతను జయంబు" నడసిన పుణ్యులు. అందును కృతిపతియైన కృష్ణమహీపాలుఁడు "మాధవ పదపద్మ సమారాధనవిధిసాధితావిరతభద్రుండు" ఇంతమాత్రమా? "విశ్రుత తిరుమలతాతార్య శ్రేష్ఠాన్వయసుదర్శనాచార్య తనూజ శ్రీనివాసగురు చరణాశ్రయణ సమార్జితాఖిలాభ్యుదయుఁడు"! మఱియు "వైష్ణవమతశీలుఁడు" కావుటంబట్టి రాఘవపాండవీయప్రభావతీప్రద్యుమ్నములలో శివస్తుతితోఁ గావ్యారంభముం జేసిన భక్తుఁడు కళాపూర్ణోదయమున విష్ణువునకు నగ్రార్చనం జేసెను! మఱియు మణికంధరుని తీర్థయాత్రను వర్ణించుచో విష్ణుస్థలములఁగూర్చి ప్రసంగించెఁగాని శైవస్థలముల నంతగాఁ బొగడలేదు. అచ్చోట్లను, తక్కిన శాస్త్రముల నెల్ల నాకలించి "యవి యాత్మల మెచ్చని పాంచరాత్ర సిద్ధాంత విధానసమర్థన సమర్థకృతార్థమతిప్రదీప్తలు"ను "శ్రీ మహితాష్టాక్షరీ జపమంత్ర పరాయణులును" "దేవతాంతర చింతనావిదూరులును" నీతనికిఁ గానవచ్చిరే కాని, శైవసిద్ధాంత సమర్థకులుగాని, పంచాక్షరీజపపరాయణులుగాని యొక్కరైనఁ గంటఁబడలేదు! తుదకు వైష్ణవ మతముయొక్క ప్రధానతత్త్వమును బోధించుచు "లక్ష్మీనారాయణ సంవాద"మునుజూపి ప్రబంధమును ముగించెను! పాపము! దారిద్ర్యముచేఁ గుందింపఁబడనివాఁడెవఁడు? ఇట్లు యౌవనమున స్వాతంత్ర్య మవలంబించి యున్నను మధ్యకాలమున దారపుత్రాది పోషణమునకు

వీలులేక చాలకాలము పారతంత్ర్యప్రవృత్తుఁడైయుండి విసిగినవాఁడౌటఁ గాఁబోలు వార్ధకమునందు ప్రభావతీ ప్రద్యుమ్నమున స్వాతంత్ర్య మవలంబించుటయకాదు, గంభీరముగ నిట్లు వాక్రుచ్చుటయు:

 మ. "జనముల్మెచ్చఁగ మున్రచించితినుదంచద్వైఖరిం గారుడం
బును శ్రీరాఘవపాండవీయముఁ గళాపూర్ణోదయంబున్ మఱిన్
దెనుఁగుంగబ్బములెన్నియేనియనుమతిప్రాదివంశాభి వ
ర్ణనలేమింబరితుష్టి నాకవియొనర్పంజాల నత్యంతమున్"

ఈ పద్యముం జదువునపుడు కవియాదిని బడినపాట్లకు దుఃఖమును, తుదకు నిరంకుశక్రీడకుం జొచ్చెఁగదాయని సంతసమును బొందకమానము. ఈ ధైర్యమహిమచే నితఁడు సర్వజనశ్లాఘనీయుండ.

కళాపూర్ణోదయము వ్రాయుతఱిని ఒక్కకాలమును మాత్రమేకాదు, రాజుల నాశ్రయించిన వాఁడగుటచేఁ బ్రబంధశైలియం దనాదరముగలవాఁడయ్యుఁ గొంతవఱకు నా శైలి ననుక్రమించెనని విన్నవించితిని. కావున ప్రబంధముల చందముంగూర్చి యించుక దిక్ప్రదర్శనముగ వ్రాయుట యుక్తము.

ప్రబంధలక్షణవిమర్శనము

రామరాజ భూషణుఁడు వసుచరిత్రలో వాక్రుచ్చిన ప్రకారము:

ఉ. "కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిఁబుట్టురత్నము, లవారిత సత్కవి కల్పనావిశే
షానహ పూర్వవృత్తములు సానఁదీరిన జాతిరత్నముల్
గావున నట్టిమిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్"

దీనింబట్టి వితర్కించిచూడ నా కాలమువారు రచనల కన్నింటికి ప్రబంధములు శ్రేష్ఠములనియు, ప్రాచీనకవుల కావ్యములకన్న ప్రశస్తములనియు నెంచినట్టు లనుమానమయ్యెడి. ప్రబంధము స్వకపోలకల్పితముగానున్న నదియొక దోషమఁట! శుద్ధముగఁ బూర్వవృత్తముగానున్న నదియు సరిపడదఁట! కథ ప్రాచీనముగాను వర్ణనలు నవీనములుగాను నున్న సానవెట్టిన జాతిరత్నములవలె నిగనిగలాడునని రామరాజభూషణుని యభిప్రాయము. ఈ సిద్ధాంతమ యనివార్యమని యెంచితిమేని, కళాపూర్ణోదయము కేవల కవికల్పితమైన కథగావునఁ బ్రబంధములలో చేరనిదగును. ఈ బహిష్కారము కష్టముఁగాదు, నష్టముఁగాదు! మఱి గొప్పతనమున కొక కారణమనియుఁ జెప్పవచ్చును!

ప్రబంధము లేమో నూతనమైన మహా సృష్టియని మన పూర్వులు భ్రాంతిఁ గొన్నట్లున్నది. కృష్ణదేవరాయలు మను చరిత్రకారుని "ఆంధ్రకవితాపితామహుఁ" డను బిరుదం బుతోఁ బూజించెను. అనఁగా కవిత్వమును సృష్టికిఁ దెచ్చిన వాఁడని ధ్వని! అల్లసాని పెద్దనకుం బూర్వ మొక కవిబ్రహ్మ యుండెఁగాని వానిని మనవారు మఱచిరో, స్థానభ్రష్టునిఁ

జేసిరో, లేక యొక్కొక మన్వంతరమున కొక బ్రహ్మ యేర్పడుట మంచి విభాగమని యెంచిరో! నాకుం జూడ ప్రబంధములును భారతాదులఁ గొంతవరకుఁ బోలియున్నవిగాని పర మాపూర్వములుగావు. ఎట్లన: ఈ రెండు విధములైన రచనలయందును

కథ ప్రాచీనము. భారతము మూలమునకు ప్రతిపదార్థటీకగాదు. మఱి రసపోషణార్థము కవిత్రయమువారు కొన్నియెడలఁ బెంచియుఁ గొన్నియెడల సంక్షేపించియు వ్రాసియున్నారు. ప్రబంధములుమాత్రమేమి యెక్కువ? నిజమే. వీనియందు వర్ణనలు బహుళముగనున్నవి. పూర్వకవులు నాలుగు పద్యము లెక్కువయను సందర్భమున వీరు నలువది యున్నను జాలదని ఘోషింతురు! ఈమాత్రము పరిమాణభేద మున్నంతనే వస్తుభేద మున్నదనుటెట్లు? అనఁగా ప్రాచీనకవులయు మధ్యకవులయు గ్రంథములకు భేదములు లేవని నా తాత్పర్యముగాదు. మఱి ప్రబంధములు మూలరహితములైన యాదిమ విధానములు గావనుట. ఈ సృష్టియందును ప్రాఁతవాసనలు లేకపోలేదు. ఇఁక భేదముల వివరమెట్లనిన:

ప్రబంధములలో కథ ముఖ్యముగాదు. మఱి వర్ణనలకు నవకాశ మబ్బుటకై తెచ్చిపెట్టుకొన్న నెపము. అనఁగా వర్ణనలు కథాసాంగత్యము లేనివనుట. సందర్భశుద్ధి లేని వనుటకు పర్యాయవచనము!

కధముఖ్యము గాకపోవుటమాత్రముగాదు ఒకేయంత్రశాలలోఁ జేయఁబడిన సరకులవలె నీ కధలన్నియు నించుమించు ఏకస్వరూపముం దాల్చిన యవి. అనఁగా చర్విత చర్వణమునకుం జేరినయవి. *వీని సామాన్యకథాక్రమం బెట్టిదనిన

ప్రబంధముల కథాసారము

ఒక పట్టణము ఒక రాజు. వీరికేమి గ్రహచారముపట్టినదని తెలియకముందే ప్రథమాశ్వాసము సంపూర్ణము. చెవియో కన్నో జ్ఞానేంద్రియముగ రాజుగారు కన్యామణి యొకటున్నదని గ్రహించి యుండుమతి కొంచెమును గోలుపోవుట. తన స్నేహితునితో విరహవిషయమైన ప్రసంగము చేయుచుఁ గన్యామణి శరీర మేమాత్రము విడువక విమర్శించుట! వేఁటకుఁ బోవుట. ఇత్యాదులు. ద్వితీయాశ్వాసము ముగిసెను. కన్యామణిమాత్ర మూరకుండునా యేమి? ఆ యమ్మ తబ్బిబ్బు ఇంతంత యని చెప్పఁగాదు. శ్లేషలు వెట్టిన నేమి తృప్తి! శేషలుపెట్టినఁ గొంత ఫర్వా లేదు! తనవలెనే చంద్రముఖులైన చెలికత్తెలం జేర్చుకొని నాయకుని సౌందర్యవిషయమయి యొక రెండుగంట లుప

---

* మనుచరిత్రము వసుచరిత్రము వీనికి నడుమ వ్రాయఁబడిన గ్రంథములును ఇంత గుణశూన్యములుగావు. ప్రబంధధోరణి మిక్కిలి ప్రకటనమునకు వచ్చిన తదనంతరకాలపు గ్రంథములు హీనములు. (చేమకూర వెంకటపతి కృతులు దప్ప) అను సమయము గూఢము.

న్యాస మిచ్చు వేళకు మూఁడవయాశ్వాసము ముగింపునకు రా కేమిచేయును? కన్యామణియొక్క కాంక్ష నుపశమనము చేయుటకై చెలు లామె నుద్యానవనమునకుఁ బిలిచికొని పోవుట. సరోవరసందర్శనము. ఆ ప్రొద్దుమాత్ర మందఱును స్నానముఁ జేయుట, చన్నీళ్ళు వడు వేళకు గగుర్పాటు వణఁకు మొదలైన శృంగారావస్థలు తిక్కతిక్కనట్లు ప్రబలుటయు, యజమానురాలిని చివురుటాకుల శయ్యపైఁ బరుండఁ జేసి వస్త్రములు సడల్చి శైత్యోపచారములు చేయుటయు, నవియు నిష్ఫలంబులగుటయు, చంద్రోదయవర్ణనము. ఏమో, వినోదము చూతమని వచ్చిన చంద్రుని నాశుకపికవాణులందఱుఁ గలసి యేకకంఠముగఁ దిట్టుటయు, మలయమారుతమన్మథదూషణము మొదలగు నోహాంచేసు సంగతులు గలిగి

క. "సర్వజనంబులు చదువ స
ఖర్వంబగు కౌతుకంబుఁ గాంచెదు తెలుఁగుల్
పర్వంగఁ జేసి నాల్గవ
పర్వంబది యస్తమించు భామినులారా!"

ఇంతైన వెనుకఁ బెండ్లి కాకపోవునా? సూర్యోదయవర్ణనము (కారణము మృగ్యము!) ఇంక నెవిద్యైన మిఱిచి పోయియుండిన నిదే సమయమని గాగా యన్ని వర్ణనములును, పరిణయము, దంపతులు పురప్రవేశము చేయుట, ఆ పురములోని స్త్రీలందఱుఁ దొట్రుపాటుతో వీరినిఁ జూడ

వచ్చి బదులిచ్చుటకో యనం దమ యంగసందర్శనము అందఱకును జేయించి ఋణవిముక్తులగుట! శయ్యాగృహ ప్రవేశము. చెలికత్తియలు క్రొత్తగా సిగ్గుదాల్చిన కన్యామ ణికి నింపైన నీతులు చెప్పుట, ప్రథమసంయోగముయొక్క సాంగోపాంగవర్ణనము! శ్రుతి ఫలము సంతానప్రాప్తి! ఇత్యాది నానాచిత్రములం బ్రదర్శించి యైదవయాశ్వా సము సమాప్తిఁ జెందును. ఈ విషయమునే ఆఱాశ్వాసముల గ్రంథముగా వ్రాసినను బాధలేదు. అయ్యది కష్టనష్టము లకు నతీతము. లాభమునకు నతీతమే!

పాత్రములన్నియు నొక్క తీరుందాల్చిన బొమ్మలు. అలంకారశాస్త్రప్రకారము చెక్కఁబడినవి. ఆయా కావ్య ములలోని పాత్రములు నిర్జీవముల యట్లుండుటతోఁ బో యిన నెంతో పుణ్యము! అన్నికావ్యములయందలి పాత్ర ములును ఒండొంట ననుకరించునట్టి ప్రతిబింబములు. పేరు ఊరుమాత్రము మార్చియుందురు. ఇఁక నీమాత్ర ముఁ జేయక వ్రాయఁ గడంగనగునా? స్వభావము, చరిత్ర ము, నడవడి, తీరు మొదలగు లక్ష్యగుణములన్నియు నెర వలి సొత్తులు.

వసుచరిత్ర

ఉపజ్ఞ మనకు ఘటిల్లదేని యది యొక గొప్ప లోప మని చింతించుట మన ప్రకృతి. రామరాజభూషణుఁడు కథాకల్పనమందు ఉపజ్ఞ లేకుండిన నెంతో మేలని యాదే

శించెనుగదా! ఇది యస్వాభావికమైన తలపోఁత. వర్ణనలయందుపజ్ఞ వ్యాప్తికి వచ్చిన కృతికి సానవెట్టినట్లని యాతఁడు సెలవిచ్చి, యా పద్ధతికి నిదర్శనము నేర్పఱుచుటకో యసఁదన రచించిన వసుచరిత్రములో నత్యద్భుతములు ననన్యసాధ్యములునైన వర్ణనలు బహు చమత్కారముగఁ జేసియున్నాఁడు. ఈ మహాకవి చందమునఁ గొన్ని రకముల వర్ణనములు చేయువారెవరును లేరు. ఈ వర్ణనలయందు దోషములు లేకపోలేదు. అందుముఖ్యములు అవి కథావేగమునకు నడ్డులు. కథయే లేదు, కథావేగ మెక్కడిది యని యాక్షేపించితిరేని నాకు సమ్మతమే. ప్రత్యేకముగఁజూచిన మనోహరములైనను గథాంగములతో పొందిక లేనివి. భావనాశక్తిచే నప్రయత్నము ననర్గళమునుగా వచ్చిన స్వచ్ఛంధధారలు గావు. మఱి సామ్యశక్తిచే బలాత్కారముగఁ దేఁబడిన యుపమోత్ప్రేక్షలు. సామ్యమంటిమి. వసుచరిత్రములోని సామ్యములు వస్తుస్వభావములంబట్టి తటస్థించినవియుంగావు. మఱి నామాదిభాషాశక్తిచేఁ గృతములైన యవి. శ్లేషచే నుత్పత్తికి వచ్చు నలంకారములవలె గొడ్డువాఱిన నీరస భావములు వేఱొండు లేవని వక్కాణింప నుద్యుక్తుఁడనైనందులకు మీ క్షమాపణము వేఁడెదను. ఇన్ని లోపములుండి నప్పటికిని వసుచరిత్రము మిగుల గొప్ప గ్రంథమనియు భాషకు మండనాయమానమనియుఁ జెప్ప నెవఁడును సంకోచింపఁ బనిలేదు. ఇందుకుఁ గారణము లెవ్వియు

నఁగా భాషాజ్ఞానమున కిది మంచి యాధారము. పదముల లో నెంత సత్తువ యున్నదని చూడఁగోరువారికి దీనియంత ప్రయోజనకారియగు గ్రంథ మింకొకటి లేదని చెప్ప వచ్చును. మఱియు సామ్యశక్తి భావనాశక్తివలెఁ గవితకుఁ బ్రాణంబు గాకపోయినను సమ్మానార్హములైన శక్తులలో నొకండు. కావున దాని నమేయంబుగ దీపింపఁజేసిన రామరాజభూషణుఁడు సర్వజనస్తోత్రపాత్రుఁడు ఇట్టి వర్ణనల కితం డించుమించు ఆదిను కర్తయగుటచే నవి యొకరి ననుసరించి వ్రాయంబడినవిగావు తన మనస్సున తోలు తఁ బుట్టినవి. అట్లగుటచే నైజములు అకృత్రిమములు. కాన రుచ్యములు. ఆనందకములు. శ్లేషాది దుష్కర దుర్బోధ రచనలకుం బూనినను శైలి మంజులగుణముంగల యది. అతిశ్రావ్యము. సాధారణముగఁ జమత్కారము విపరీత ముగ నున్నయెడ సుఖ ముండుట యరిది. దృష్టాంతములు. ఏకాక్షరపద్యములు. ఇందులో సుఖ మేమైనఁ గలదా? సంగీతములోఁ దలవంపులగునట్లు దీర్ఘాలుదీయుచు స్వర ములు వేయుచున్నయెడ "అబ్బా! ఏమి సామర్థ్యము! ఎంతసేపు గుక్కపట్టుచున్నాఁడు!" అని యాశ్చర్యము భరింతుముగదా! ఆశ్చర్యమునకు సమానమైన యానంద మెక్కడిది? కంఠవ్యాయామ మింత ఘనముగ చేయలేకు న్నను సొంపుగా మధురకంఠముతో సామాన్యులైన స్త్రీ పురుషులు పాడిన నెంత హాయి! అనఁగా కళలయందు

రెండు గుణములఁ జూపింపవచ్చును. సుఖము, చమత్కారము. శిల్పముయొక్క యభిమతము సుఖముగాని చమత్కారము గాదని వేఱ చెప్పనేల? వసుచరిత్ర చమత్కార ప్రధానమ యయ్యును సుఖమును బొత్తిగాఁ బోఁగొట్టుకొన్నది గాదు. కావుననే దానియందు మనకుండు గౌరవాదరములు. కేవల చిత్రకవిత్వము భాషతోఁ జేయు కుస్తీవంటిది. 'భాషను ఎన్నివిధముల సంగఁ దీసినాఁడు! ఎన్ని బంధముల ద్రుక్కించినాఁడు!' అను నాశ్చర్యమును బుట్టించును. నిజమైన కవిత గలిగించెడు నాశ్చర్యము వేఱు. ఏదన. 'సర్వజనవేద్యములగు సామాన్యములైన ఈ సంగతులు పదములు ఇత్యాది సామగ్రులఁ గొని యెంత యాహ్లాదకరమైన కృతిగాఁ గూర్చినాఁడు! మనకు నా పదములు తెలియుఁగదా! సంగతులును దెలియునుగదా! తెలిసి యేమి కట్టుకొంటిమి!' అని చింతయు విస్మయమును దాల్చుట. దొమ్మరివాఁడు చేయు నద్భుతములను జూచి మనము చింతఁ దాల్పము. ఏలన, పరిశ్రమముఁ జేసిన మనమును వానివలె సమర్థుల మగుదుమను నమ్మిక గలదుగాన. తిక్కనను దలంచి నపుడు నా బ్రదు కేలయని మన మను టెందుకు? "దిన దినమువాడు పదములతోనే యతఁ డెట్టి కూర్పులం బన్నినాఁడు! ఇది పరిశ్రమచే వచ్చు విద్యగాదు. స్వాభావిక ప్రతిభ. ఇంకొక జన్మమెత్తినఁగాని యీడేరునట్టిదిగాదు!" అను విచార ముద్బుద్ధము గావుటచే.

వసుచరిత్రలోని కొన్ని పద్యములు చిత్రకవిత్వముం జూచినఁ బాఱిపోవలయు ననువారి నైతె మాకర్షించునంత రమణీయములు. ఇంచుక యుదాహరణముఁ జూపెద.

చ. చలిత లతాంత కాంతియును చందురు కావిచెఱంగుదాఁటి స
మ్మిళిత వయోవిలాసముల మీఱిన మిచ్చుఫలస్తనాగ్రముల్
వెలువడఁ గప్పెఁ బత్త్రణము వేల్లితదోహద ధూపధూమ కుం
తలముల విచ్చి దాడిమ లతాలలతాంగి నృపాలు చెంగటన్.
(౧ ఆ. ౧౬౪ పద్యము)

సీ. ధరయే యపాంసుల తలచూప రాకుండఁ
దనకూర్మిరేని నప్పునను ముంచె
సతియే యచండిక పతిఁ బట్టుకూఁతురై
జగడాలు పచరించి సగముచేసె,
కమలయే నిశ్చల రమణుపై రెదకుమో
పై నిల్చి యతని పేరదుగుపఱచె
వాణియే మితసూక్తి నదలదు తలవాఁకి
లిని జేఘుమాటమోచె ననఁజేసె,

ఆ. ననుచు భూకాంత శ్రీకాంత హరునికాంత
నజునికాంతను నిరసించి యా సిరంగ
పార్థివుని కాంత తిమ్మాంబ పతికిఁ గుశల
కీర్తి బలస్మృద్ధి నిర్గుణసూర్తు లొసఁగు.
(ఆ. ౧. ప ౩౬).

సీ. చుట్టఁ జుట్టుకొని శేషుఁడు నిద్రవోవును
ముదిపన్నగములలో మొదటివాఁడు
మొనయుఁ డాదిమ కూర్మము ముడుంగు మేనుమో
పినఁ బెద్దవారిలోఁ బెద్దవాఁడు
సమధికాశాప్తి హస్తము చాఁచుఁబద్మినీ
వైరిదిక్కరి తలవడఁకువాఁడు
తనయొంటి పంటిచేతనయంటు నాదికా
లము ఘోణి పాండురోమములవాఁడు
ఆ. కదలలేఁడద్రి బహువయః క్రమము వాఁడ
టంచు వారల నిరసించి యవనికాంత
తనభుజాదండమున నుండఁదనరుచుండు
భావజవిభుండు వేంకటక్ష్మావరుండు.
(ఆ. ౧. ప ౮౧)

సీ. మోహోపదేశ తమోముద్రితములైన
కనుదమ్ముల హిమాంబు లునుపరాదు
శ్రమబిందు తారకాగమఖిన్న కుచకోక
ములఁజంద్రనామంబుదలఁపరాదు
పటుతాపపుటపాకపరిహీణతను హేమ
మింకఁబల్లవపుటార్చిడఁగరాదు
శీర్యదాశావృంతశిథిలతానులతాంత
మసియాడ వీవనల్వీసరాదు
తె. లలనకానంగకేలికీలాకలాప
సంతతాలీఢ హృదయ పాత్రాంతరాళ
పూరితస్నేహ పూరంబు పొంగిపారలఁ
జల్లని పటీర సలిలంబు సల్లరాదు.
(ఆ. ౩ ప ౨౧౦)

ఉ. కొండఁటవిల్లు వేదలలకుండలిరాజఁటనారి, యమ్మనం
తుండఁట, బైటిపల్లియలు దున్నినవాఁడఁట యొండు రెండు భ
ర్గుండిది నిందుపౌరుషమొకో యని గెల్వవెముజ్జగంబు ను
ద్దండత నొక్కతుంట విలుదాలిచి యంటినఁ గందు తూపులన్!
(ఆ. 3 ప ౨౦౨)

ఈ విషయ మిట్లుండె. కథావిషయమున నుపజ్ఞ యావశ్యకముగాదని గురువు చెప్పె. అతని శిష్యులనందగు తరువాతి ప్రబంధకవు లెల్లరు వర్ణనలంగూడ నుపజ్ఞ పనిలేదని యేమో, వసుచరిత్రలోని యూహాలన యనుసరించువారై బిల్ల వసుచరిత్రముల ననేకములం బ్రకటించి, యా కార్యములందు రోఁత హెచ్చించి గురువునకుంగూడ లఘుత్వమాదేశమగునట్లు చేసి కవిత్వము భావసంబంధము లేని పదసంబంధిగా నొనర్చి పాడునకుం దెచ్చిరి.

ప్రబంధములనాటకసరణిమృగ్యము

ప్రబంధములలో నాటకకౌశలము మృగ్యము. పాత్రోచితమైన భాష శ్లేషబంధురములైన కావ్యములలో మందునకైన దొరుకునే! చెలికత్తె నోరుదెఱచిననేమి కన్యామణి నోరుదెఱచిననేమి? బయటఁ బడునది శ్లేషయే! శ్లేషను, అందును అభంగశ్లేషను, ఘటింపవలయునన్న సాంస్కృతిక శైలి యుండియ తీరవలయును. ఏరసము నేభావమును వెలయింపఁ బూనినను దీర్ఘసమాసములతోఁ జేయుట విధి. ఏకసమాసమైన వృత్తముల నేద్చునప్పుడును బ్రయోగించు

కోమలాంగులఁ దలఁచుకొన్నచో వారి శ్వాసకోశము లెంత ఘనములని యాశ్చర్య మయ్యెడిని!

ప్రబంధములకు దేశక్షయమునకు గల సంబంధము

శ్రీ కృష్ణదేవరాయల కాలములో విజయనగరమెంతో విఖ్యాతిఁ గాంచియుండెను. రాయచూరుమహాయుద్ధమున హిందువులు మహమ్మదీయుల నోడించి వారి రాజ్యములం బ్రవేశించి యడ్డులేని యధికారము వెలయించు వారైరి. దేశమునఁ బౌరుషము దేదీప్యమానముగ నున్నందునఁ గావ్యములయందును నది ప్రతిఫలింపకపోలేదు. రాయకృతమైన యాముక్తమాల్యద, మనుచరిత్ర, పారిజాతాపహరణము, కాళహస్తిమహాత్మ్యము వీనియం దెల్ల నపూర్వతయను గుణమున్నది. మఱియుఁ గొన్ని కొన్ని భావములు కవి నిండుహృదయంబుతో వ్రాసియుండుటయుఁ దేటతెల్లంబ. తాళికోటయుద్ధమున హిందువులు పరాజితులైరి. మహమ్మదీయులు విజయనగరమును ధ్వంసముసేసి పాడుగోడలుదప్ప నింకెవ్వియు నందు నిల్వకపోయిన వెనుక దేశమున నరాచకము ప్రవర్తిల్లెను. చిల్లర పాళయగాండ్రు స్వతంత్రులైరి. విచ్ఛేదము దౌర్బల్యమునకు మూలముగదా! అంతటితో హిందువులు మఱలనైనఁ బగసాధించి నష్టమును బూరించికొందమను నాశను వదలుకొనిరేమో!

ఇట్టి పశ్చాత్తాపకాలమున బుద్ధి యెట్లు పాఱును? హృదయ మేయానందము దొరుకునని వికసించును? కావున నన్ని శక్తులుఁ బోయి పండితుల యేకశక్తియైన జ్ఞానశక్తిమాత్రము మిగిలెఁ గాఁబోలు! అసలు పూర్తిగా నడుగంటని వసుచరిత్ర కాలములో నున్నంత ప్రజ్ఞయు, మగంటిమియు, తరువాతి నాళ్ళవారైన మనకు నందరానివైనందున నేమో, రసహీనములు, ఏకక్రమములు, అనన్యములునైన కావ్యములు పుంఖానుపుంఖములుగ వెడలినవి! ఇవియు లేకపోయియుండిన దేశము పరిపూర్ణాంధకారముపాలయి యుండుఁగాన, నీమాత్రము వెలుతురైన నిలిపినందులకుఁ బండితులను బాళయగాండ్రను మనము కొనియాడవలయు.

ఐరోపాలో రాజులు నాశమెత్తినను ప్రజయను నింకొక ప్రకృతి ప్రతాపవంతమై యుండుఁగావున, కవిత కేవలము నగరి నాశ్రయించి బ్రదుకు విద్యగాదు. హిందూదేశములో మనుస్మృతి దెబ్బదగిలిననాఁటినుండి ప్రజ యిూనాఁటికును లేవలేక పడియున్నది. దానిది పరాశ్రయమైన బ్రదుకు! కృష్ణదేవరాయలు, శివాజీ వీరింబోలిన మహనీయులవతరించిరేని, జనసామాన్యమును వారివెంట కుక్కల గుంపువలెఁ బోయి యెవరిమీఁదఁ బడుమన్నను బడును గాని, నాయకులు లేనిచో దిక్కులు దెలియక మఱలఁ బ్రాచీనకర్మమును బారంపర్య హీనస్థానమును అవలంబించును.

క. "ఏమీ! రాజులు మంత్రులుఁ
దామతిదుర్బుద్ధులైన ధరయెల్లను గ్రిం
దై మాఁడి మడియునో! జన
సామాన్యము సంఘచరిత చక్కనిదైనన్."

మనవారిలో సంఘచరితమను భావమే యున్నదో లేదో! భావమే లేనిది ప్రవృత్తి యెక్కడిది? తమతమ కుటుంబములయు, తెలగయు క్షేమచింతయేగాని రాష్ట్రముం గూర్చిన చింతలు లేనివారగుటం జేసి, వీరి ప్రారంభములచే దేశమున కేమాత్రము మానప్రాణరక్షణములు సమకూఱవు. అట్లగుట వీరకృత్యములు, గంభీరోద్యమములు వీనిచేఁ దెలివియు విరివియుఁ గాంచు కవిత సాధారణ జనులపై నేల దృష్టియుంచును? తన కడుపుమీఁదఁదప్ప నింకెద్దాని మీఁదను గన్ను మనసుఁ బోనివానిపైఁ బరులకన్నులు మనసులు నేలపాఱును? చీయని వాపోవుటకుఁ దప్ప! ఐరోపాలోని కవీశ్వరులు గొందఱు కాఁపువారు, సైనికులు మొదలైన తక్కువ వృత్తులవారి బ్రదుకులును వర్ణనార్హములని భావించి యెంతో సుందరముగఁ గావ్యములలో వ్రాసి యున్నారు. మన గ్రంథములమాత్రము చదివి యీ పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రముయొక్క స్థితిగతుల నరయఁ జూచువారికి, ఈ దేశమున బీదసాదలపై నాదరముగల కవి యెవఁడైన నున్నాఁడా? తుదకు, బీదసాదలైన నున్నారా? యను సంశయముపట్టినను దప్పు వారిదిగాదు! శోకరసము వర్ణింప వలయునన్న ననుకూలమగు సందర్భమెయ్యది?

క్రొవ్వుకాఱెడు నాయికానాయకుల యూహామాత్రము లైన కష్టములా? ప్రజలు దినదినముఁ గన్నీరు గార్చుటకైన సనకాశము లేక కుడుచుచుండు పరిపరివిధములైన గోడులా? శాంతరసమునకుఁ బోషకమెయ్యది? తమకు నష్టముఁదే నట్టి వైన రాజులయొక్క యుదారచర్యలా? ఆఁకట మాఁడి మలమలలాడుచు నింటికివచ్చి వంట సిద్ధముకాకుండినను భార్యపైఁ గోపగింపక కన్నులు మూఁతవడుచుండ విధిని ధ్యానించుచు నొక మూలఁ గూర్చుండు పొలము కాఁపు యొక్క నడవడియా? ఆహా! జనసామాన్యముయొక్క ప్రతిదిన వృత్తములలో నెంత భావము, రసము, గుణము నుపగతములై యున్నవో మన కవులకుం దెలియవుగదా! రాజపుత్రులను, రాజకన్యలను, చాలనందుకు బ్రాహ్మణులను, వేశ్యలనుబట్టి ఝుంఝూంల మాడుట దప్పఁ గవితకు మేలైన యన్యకర్మములు లేవా?

సామాన్యజను లీ రీతి నలక్ష్యముగాఁ జూడఁబడుటకు హేతువు లెవ్వియన. ఈ దేశమునఁ బ్రజ సాధించుటకుఁ జేయి, తన్నుటకుఁ గాలు, మొఱవెట్టుటకు నోరు ఏదియు లేని పశువు! ఐరోపాలోని జనులు రాజసగుణ శోభితులు. మన పాలిటి భాగ్యము తామసమో, దాని తోఁబుట్టువగు సత్త్వమో యేదో యొక జడత్వబీజము! జాతిభేదములవలన శ్రేష్ఠకులులకు తదితరులపక్షమున మర్యాదయు గౌరవమును గలుగమి. శ్రేష్ఠులకుమాత్ర మర్థింపఁదగినదను నియతిని

విద్య దాల్చినదగుట. దీనివలని దుర్దశలు రెండు. మొదటిది. విద్యవచ్చిన యుత్తమవర్ణులకు తక్కినవారితోడి సాంగత్యము తక్కువగావున వారింగూర్చి వ్రాయఁజాలినను వ్రాయనేరరు. రెండవది. విద్యాదానమునకుం బాత్రముగాని జనబాహుళ్యము ఎంత దెలిసినదయ్యును అక్షరములు రాని లోపంబున వ్రాయనేరదు. అథవా ఒకరిద్దఱు కవితాశక్తి నెట్లో సంపాదించిరి పో! ప్రాశస్త్యముననున్న పద్ధతి రీతిఁ జెప్పి యగ్రజాతివారిని మెప్పింపవలయుననికదా వారు ముఖ్యముగాఁ దలంతురు! అట్లగుట నల్పజీవితమును వారు సరకుసేయుదురా? చేయరు. జాతికి జాతికి స్పర్ధ యేర్పడుట వలన పాండిత్యము ప్రకటించి బ్రాహ్మణుల మీఱవలయునని రామరాజభూషణుఁడు యత్నించెనేమో యనుట విచార్యము! ఏదియెట్లున్న నేమి? అగ్రజాతులవారి యహంభావము, అశ్రద్ధ, ఆచారము ఇవినేరుగను, అన్యజాతివారిని దమ మార్గమునకు నధీనులఁగాఁ జేయుటను, కవితోచితమైన విషయమును మిక్కిలి సంగ్రహపఱచినవి. ఒక్క రాజులను రాజకన్యకలను వదలినయెడఁ గవితకు గతిమోక్షము నుండవు గాఁబోలు! ఆంధ్రకవిత్వము రాజులను రాణులను నమ్మి జీవనము జరుపుకొనునది గనుక, వారైశ్వర్యమును గోలుపోయినతోడనే తానును వైరస్యమును వికృతవేషమును దాల్పవలసినదాయెను. ప్రజలలో సత్త్వము స్థిరముగ లేనిది కవితనిత్యసౌభాగ్యము వడయనేర్చు నెట్లు?

మనయొక్క రాజులదినములలో సైతమలనడనంత విన్యాసము నేఁడు ఆంధ్రమును జెందియుండుటకు, బ్రిటిష్‌వారి పరిపాలనమాహాత్మ్యమును, దానిచే మనయందు ప్రభవిల్లిన వృద్ధి నతిశయముగఁ జెందుద మను నుత్సాహమును ముఖ్యకారణములు. విద్యయు నెల్లరు శక్తికొలఁది నిరాతంకముగ గ్రహింపవచ్చును. ఔన్నత్యమునకు సంఘ దురాచారముల నిర్మూలముచేయుట విడువరాని సమయము గావున, నాంధ్ర సాహితీపునరుద్ధరణప్రభావులైన శ్రీ వీరేశలింగముగారిచే దారి చూపఁబడిన యనేకులు, ప్రజలయొక్క మేలిమి నాసించి, వారలకుఁ దెలియునట్లు అనేక ముఖ్యవిషయములఁగూర్చి వ్రాయుచుండుటచే, భాషయందలి ప్రీతియు, గౌరవమును, అభిలాషయు, కుతూహలమును మును పెన్నఁడుఁ దాల్చి యుండనంత వ్యాప్తినిఁ బెంపును వహించుచున్నవి. ప్రకృతము కావ్యములు, నాటకములు, ప్రహసనములు ఇత్యాది కృతులతో నివేదింపఁబడు విషయములసంఖ్యములు. సర్వజనహితములు. ప్రాఁతమార్గములనే యా పద్ధతు లరిగిపోవునట్లు గొర్రెల మందలవలెఁ బోవునవి గావు. మఱియు దేశాభ్యుదయమను మహోద్దేశము గలవౌటఁ బౌరుషోద్దీపకములు. నాయికానాయకులు సగమునకు సగము పలాయితులైరి. రాజులు రాణులును ప్రచ్ఛన్నులై యేమూలం దాఁగిరో యెం దడఁగిరో! వెతఁబడువారు లేరు. వెదకువారును లేరు! కలియుగాదినుండి యింత

దాఁక జమకు ఖర్చుకురాని సాధారణజనులు నేఁటికిఁగదా గణ్యులైరి! ఇఁకముందు పూజ్యులగుదురుగాక!

'తే. అక్కజంబుగ నిప్పు డత్యంత దీప్తి
వెలుఁగుచున్నావు భారతీ! విమలమహిమ
నాంధ్రదేశంబుతో మార్పు లనుభవించి,
యేమిచెప్పుదుఁ? గలికాల మింక నెట్లొ!'

మూఁడవ ప్రకరణము

కళాపూర్ణోదయము

కళాపూర్ణోదయ మాంధ్రంబున నద్వితీయమైన గ్రంథము. ఏజాతికిం జేరినదిగాదు. తనంతట నొక క్రొత్తరకము. ఆంధ్రభారతాదులు సంస్కృతేతిహాసములకుం బరివర్తనములు. మనుచరిత్రాదులయందుఁ గథలు నవీనములు గావు. ప్రాచీన గ్రంథములనుండి గ్రహింపఁబడినవి. ఈ విమర్శమునకు గుఱియైన కావ్యమన్ననో కవియొక్క స్వసృష్టి బాణునిచే సంస్కృతమున రచింపఁబడిన కాదంబరి వంటిదని యందురుగాని, దానినుండియైన సూరనార్యుఁడు విషయముల గ్రహించినట్లు గానము. ప్రబంధకవులెవ్వరిలోను గనఁబడని ప్రతిభయు, భావనాశక్తియు, సందర్భశుద్ధియు, పాత్రోచితపద్యరచనయు నిందు సుప్రసిద్ధములు. ఇంత భావగాంభీర్యము గలదియు నూతనపద్ధతులం బోవునదియునైనను, గాలదోషము నెల్లఁ బూర్ణముగఁ దప్పించికొనఁగలుగును? ప్రబంధకవులయందలి స్ఖాలిత్యములు నిందును బెక్కులు గలవు. కాని దోషములకన్న గుణము లెన్నియోమడుంగు లెక్కువ యని దృఢముగను మనఃపూర్తిగను జెప్పుట కేయాతంకమును లేమి చదువరుల కెల్లను

స్పష్టము. దీనివలె భావనాశక్తిచే నిర్మింపఁబడినదియు, తేజరిల్లునదియునైన గ్రంథము తెనుఁగులో లేదు. పరదేశభాషలయందలి పుస్తకములతోఁ బోల్చిచూచినను దీనికి గౌరవహాని యేమాత్రమును గలుగదని నాయాశయము. మనకు నిదియేకము. తనవంటిది లేనిది. ప్రశస్తములకు దేశాంతరకృతులతోఁ దులదూఁగఁగలదియగుట, నన్యులు పరీక్షించినను దలవంచుకొన వలసినదిగాదు.

భావనాశక్తి స్వచ్ఛందప్రచారములలో నొకటి. అట్లగుట దానిని సమగ్రముగఁ దాల్చినకవులకు నదియొక గొప్పవరముగాఁ దోఁపదేమో! కావుననే కదా మహాకవులును శిల్పులును హనుమంతునివలె దమ యౌన్నత్యమును దామెఱుంగకుండుట! కాళిదాసుఁడు వాక్రుచ్చిన విధము నెఱుంగరా?

“కడుశిక్షితులైనను దమ
యెడనమ్మిక దమకుఁ గలుగ దెన్నఁడు మదిలోన్”

వారి కేమో వారి వాక్కులు సహజములుగ సాధారణములుగఁ గాన్పించును. వినువారికన్ననో యా యద్భుతము చెప్పఁదరముగాదు! సూరనయు కళాపూర్ణోదయము తన రచించిన గ్రంథములలో నుత్తమోత్తమమని యెంచినాఁడో లేదో యనుట సందిగ్ధము. ఎట్లన. నంద్యాల కృష్ణవిభుఁడు తద్దేశించి పల్కినట్లుగా.

మ. "ఇటమున్నారుడ సంహితాదికృతు లీవింపొందఁ-
ర్భుటవిస్తారము, చెప్ప నేలయవి, సంస్తుతో
ఘటనన్ రాఘవపాండవీయ కృతి శక్యఁ
చ్చటనెవ్వారికి, నీక చెల్లెనది భాషా

అని వ్రాసియుండుటయోగ
ములో కృతిపతియైన పెదవేంక

శా. "రెండర్థంబుల పద్యమొక్క
కుండన్, దద్గతిఁగావ్య మె
పాండిత్యంబున నందున
త్కుం డెవ్వాఁడిల రాః

అని సెలవిచ్చిన
కావ్యములం గల గ
నాయని సంశయిం
య రచనానంతర
చుటం జూడ దా
యు నూహింప
యనందగుదాని
ప్రభావతీప్రద్యు
తగా వాడకయు
గాదు. మఱి ర
కము. ఏది యె
నన్నమాట, రా

ిగా ననుగ్రహించిరే కాని, అఖండభావ
ూర్ణోదయమునకు నట్టి పట్టము గట్టరైరి!
ుచూడఁబడని వింతగాదు.

తిజ్ఞయుఁ దత్ఫలములును
గుణదోషములు రెండిటికిని
ు ప్రారంభమునఁ జేసికొన్న
మైన సంకల్పమును గవియే
ు. "సకలలక్షణలక్షితం
ని . . . . . . యొద్దియే
కుఁ" గౌతూహలివై
ద్రలీలావిచిత్రంబగు"
ప్రభువుగారి గౌరవ
కథాసంవిధానవై
ంబును, బుణ్య
ంబను మహా
యుద్దేశ్యమే
ండవలయునని.
ని, యిట్లు పం
తి యేర్పడినదా
తియందలి వస్తు
బట్టి పుట్టి పెరుగు
టెఱుగనిచ్చి, యప్పు

డప్పుడు సవరించుచు సంస్కరించుచు దోహదము చేయుచు
వచ్చిన మేలా? మొదటనుండియే గూ యారసములు దప్పక
యిచ్చెదుదానిని గల్పించెదను అని సంకల్పించుకొని పిమ్మట
దాని యుత్పత్తిఁ జేయఁజూచుట మేలా? యోజింపుఁడు.
భావనాశక్తి కారణశక్తియొక్క సేవనమునకు నిల్చిన మహాత్తు
గాదు. మఱి స్వైరిణి. గుఱ్ఱముల నడిపినట్లు గతివేగము
గుదించి త్రిప్పి కొంతకుఁ గొంత వశ్యము చేసికొననగుఁ
గాని, యరిపమితముగ దాని స్వేచ్ఛావిహారమును నివారిం
చితిమేని నది చెడును పరిశ్రమము తగినంత లేమి మంద
మగును. కృశించి నశించినను నశించునేమో! సకల లక్షణ
లక్షితములు ఐహికసాంప్రదాయముల ప్రకారము నిర్లక్ష్య
ములు. నిర్లక్ష్యములు గాకున్నను నిర్దోషములు గావు.

ఘూరనార్యున కీ యుద్యమముచేఁ గలిగిన మేలు గీడు
లెవ్వియన· అపూర్వకథాసంవిధానమునకుం బూనుటచే
నుపజ్ఞకు భావనాశక్తికిని మంచి ప్రవేశము దొరికినది. ప్రాచీన
కవు లితరుల కథల భాషాంతరీకరించినవారగుటను, ప్రబం
ధకవు 'లాద్యసత్కథ'లైకొని కైసేఁతలకుం దొడంగుట
చేతను, ఆ యిరుదెఱఁగుల కృతికర్తలయందును మాతృకలు
లేని యెన్నికలును భావనాశక్తియు వ్యాపించుటకుఁ దరుణము
కరవాయెను. కళాపూర్ణోదయము సామాన్య ప్రబంధముల
కన్న నెక్కువ రసవంతముగ నుండుట కిదియొక కారణము.

మఱి భారతమంత సరసముగాని దగుటకు మూలమేదనఁగా సర్వాంగలక్షణములును బలాత్కారముననైనఁ దెచ్చి రాసివేయవలయునని కవిసంకేతము చేసికొన్నవాఁడగుటచే కథ సహజముగఁ బక్వమునకు రాక యచ్చటచ్చట నూఁదరవేయఁబడి యుండుట. అయిన నొక్కటి. కథ కంటికిఁ గనఁబడనంతటి కృశత్వమునొందియుండుట ప్రబంధములలోని కొఱఁతలలో నొకటియని మునుపే చెప్పఁబడియెఁగదా! ఈ లోపమును చాలమట్టుకు పూరించి ఈ కావ్యములోని కథకుఁ బుష్టి దెచ్చిన తంత్రములలో "సర్వలక్షణసంపన్న" తాసమయము ప్రముఖము ఎట్లన. రసములు తొమ్మిది. 'శృంగారవీరకరుణాద్భుతహాస్య భయానకభీభత్సరౌద్రశాంతము'లని. ప్రతియొక్క రసమునకుఁ జెందిన భావానుభావములెన్నియో యున్నవిగాని, మనవారు శృంగారమునకుఁ జెందిన వానిం దప్పఁదక్కినవాని నంతగాఁ దలపోయరైరి. అందుచేత ప్రబంధములలో నన్నిరసములుఁ బ్రదర్శింపఁబడనయ్యె. అట్లు చేయవలయునన్న వివిధములైన కార్యజాలములతో నిండిన విస్తృతకథయొక్క ప్రాపు తప్పక యుండవలయు. ఒక యుద్యానవనమందు ఒకజత నాయికానాయకులకన్న నొకటి రెండు రసములకన్న నెక్కువ పుట్టించుట దుర్లభము! రమారమిగా నిర్ణయించితిమేని, ప్రబంధములలో అద్భుతహాస్య భీభత్సభయానకరౌద్రరసములు మృగ్యములు. వీర శాంత కరుణారసంబులును శోషితంబులు.

మనవారిచే శృంగారమనఁబడు* నొక్కరసముమాత్రము దట్టముగఁ గాఁచుచుండును. మన సూరకవి కళాపూర్ణోదయమున నీ యన్ని రసములకును స్థానము లేర్పఱుచు కోరిక గలవాఁడౌటచే వాని కన్నింటికిఁ జోటు దొరకునంత విశాలమగు కథ గల్పింప వలసినవాఁడయ్యె. అందుచే నిట్టి కథ తుచ్ఛముగాదు. మఱి మిక్కిలియు ప్రాబల్యము గలయది. అయిన నొక దురదృష్టము. ఒకేకథలో నన్ని రసములు నిముడ్పవలెనన్న నా కథను దారుమాఱుగ నీడ్వనిదిగాదు. అనఁగా అసంగతమైన యంగములఁ దెచ్చి పెట్టి స్వారస్యము నక్కడక్కడఁ జెడఁగొట్టి కథకు వికారము గల్పించినాఁడని నా మనవి సమగ్రపరిపూర్ణతమనుజులకు సుఖముగ జీర్ణమునకుఁ దెచ్చికొను నాహుతి గాదనుట మాటి మాటికిఁ జెప్పుట యేల? అట్టి కఠినంపుఁ బదార్థముల గాసించి కవి కష్టముల పాలైనాఁడు. అయినను మొత్తము మీఁద నీ యిచ్ఛయు శుభకరము. ఇది లేకున్నఁ గళాపూర్ణోదయము ప్రబంధములలోఁ గలసిన గ్రంథముగా నుండియుండునేమో! ఆ దుర్గతికిం దప్పించిన మంత్రము నింద్యమనరాదు!

కల్పనాసామర్థ్య మీ కవికిఁబలె నాంధ్రులలో మఱెవ్వరికిం గానము. తిక్కనాదులకు నుండవచ్చునేమో! ప్రత్య-

---

* ఇది నిజముగా శృంగారమనుట నిర్వివాదముగాదని యిఁక ముందు సూచింపఁబడును.

క్షమునకు రా నవకాశము లేనివారగుటకతన వారిం గూర్చి యీ యాలోచనఁ బెట్టికొనుటలో ఫలము లేదు. ఇఁక ప్రబంధకవులన్ననో, ఒక్క కథయొక్క ప్రధానాంశములయందె కాదు, సందర్భముల నేర్పఱుచుటయందును గల్పనఁ గలవారుగారు. గొఱ్ఱెల మందరీతి నొకరుపోయిన దారినే తలవంచికొని యందఱుఁ బోయిరిగాని, స్వేచ్ఛాగమనముఁ దాల్పరైరి. సూరనార్యునియందు ప్రబంధకవులకుం గల వర్ణనాశక్తితోడఁ గథాకల్పనాశక్తియు, వివిధములైన సందర్భములను సంధానమునకుఁ దెచ్చు ప్రతిభయు, సహవాసములు. మఱియు భావనాశక్తికిఁ దోడు భాషాశక్తియుఁ గలవాఁడగుటఁ దానే యించుమించు సర్వకవితాలక్షణసంపన్నుఁడనం జెల్లుఁగాదె? కవిత్వము భవ్యంబగుటకు భావము భాష రెండును గలసి మెఱయవలయుట నిత్యసమయము. సూరనార్యుఁ డీ రహస్యము నెఱింగినవాఁడనుటకు నిదర్శనమేమనఁగా. కవితాస్వరూపమును ప్రభావమును వర్ణించి తా వ్రాసిన

లం. భా.: 'చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము గలిగినను,
సౌరభముఁ జలువయు దలిర్పం, బొలుపెసఁ
గుకపూరపుఁ బలుకులకుఁ గోమలత నెలకొనిన, సౌరభముఁ జలువప
సయుంగో, మలతయును గలిగి జనముల మిగులఁ బెంపెసగు
మలయుపవనంపుఁ గొదమలకు మధురత్వం, బలవడిన నీడుమఱి
గలదనఁగ వచ్చుఁ గడువెలయఁగల యీసుకవి పలుకులకు నెంచఁగ."

(అ. ౧. ప. ౧౮౬)

అను పద్యము. భావము శైలిని మించినదా, శైలి భావము మించినదా యని వెల్లఁగొనరించు నగ్రగణ్యపద్యములలో నిదియొకటి! కవిత్వప్రశంసల నెన్నింటినో చూచి యున్నానుగాని, మనోహరములైన యిన్ని యాకృతుల నెదుర నిల్పి మైమఱచునట్లు చేయుమాటల నింకెయ్యెడను గనలేదు, వినలేదు! ఊహనుండి యూహకుఁగా భావము మీఁది కెగయుచుఁ దుదకుఁ గంటికి గనరాని యంత యౌన్నత్యమును వహించినది గదా!

కవికృతశైలివిషయికవిచారములు

సూరనార్యుఁడు శైలివిషయమై చేసిన చర్చలను, బహు చమత్కారముగఁ బాత్రము లొకళ్ళొకళ్ళ వాక్యములం బ్రశంసించినట్లు వ్రాసియున్నాఁడుగాని, తానే నేరుగఁ జదువరుల సంబోధించినట్లు వ్రాయలేదు. ఈ కవితో సమకాలికుఁడైన 'షేక్స్పియర్' అను నాంగ్లేయ కవిచక్రవర్తి కొన్నియెడలఁ దన శైలింగూర్చి సగము నవ్వు టాలకుంబలెఁ బ్రసంగమ్ముఁ జేయందలంచి స్వయముగ వ్యాఖ్యానంబుఁ జేయుట యనుచితంబకాదు, కథాగమనమునకు విరుద్ధము నని యెంచి, పాత్రముల యొండొరుల వచనముల విమర్శించునట్లు సేసి, యా మార్గమునఁ గొంతకుఁ గొంత దన యభిప్రాయంబు వెలువరించుట గలదు. సూరన్నయు నీ మార్గ మవలంబించినవాఁడే. నేరుగా కవియె కథలో మాటాడుట కథయందు మనకుండవలయు

నవధానమునకును, దానిచేఁ గలుగు మైమఱపునకును విచ్ఛేదహేతువు. కావునఁ గవి బోధనలు సైతము పాత్రములమూలమునఁ బ్రచురించుట నాటకసందర్భమునకుఁ బోషకము. కావ్యమనునది జగత్తు రీతినుండవలయును ఎట్లన. జగంబు మన యెదురనున్నది. దానిమీఁది దృష్టి చెదరకుండుటకో యన జగత్కర్త యదృశ్యభావుఁడైయున్నాఁడు. కావ్యమును జదివి యానందించుచుఁ గవిని మఱచితిమేని, యది కృతఘ్నత యేమోగాని, యది యే కవియొక్క కృతార్థతకు గుఱుతు. మఱియు పాత్రముల మఱుఁగుననుండి వారిచేఁ జెప్పించినఁ దనకు గర్వము, ఆత్మస్తుతి మొదలగు నేరములు మోపఁబడవు.

సూరన శైలింగూర్చి చేసిన విచారములన్నియు, పాత్రముల చాటున కథకును దనకును భంగమురాని మాడ్కిఁ జేసియున్నాఁడు. అనఁగా బయటఁబడకయ తన కృతిని దానే విమర్శించియున్నాఁడనుట.

దృష్టాంతము. మణికంధరుఁడు చేసిన దండకరూపమైన కృష్ణస్తవముంగూర్చి కలభాషిణి ప్రశంసించిన తెఱంగు:

సీ. "పాసఁగ ముత్తెపు సరులొప్పహాళించినలీలఁ
దమలోన దొరయు శబ్దములఁగూర్చి
యర్థంబు వాచ్యలక్ష్య వ్యంగ్యభేదంబు
లెఱిఁగి నిర్దోషత నెసఁగఁ జేసి

రసభావములకు నర్హంబుగ వైదర్భి
　　మొదలైన రీతు లిమ్ముగ నమర్చి
రీతుల కుచితంబులై తనరారెడు
　　ప్రాణంబు లింపుగాఁ బాదుకొల్పి

తే. యమకమనుపమాదులును యమకాదులునగు
నట్టియర్థశబ్దాలంక్రియలు ఘటించి
కవితఁ జెప్పంగ నేర్చు సత్కవి వరునకు
వాంఛితార్థంబు లొసఁగని వారుగలరె?"

(కళా. ఆ. ౧. ప. ౧౮౫)

ఇది వ్యర్థపద్యంబుంగాదు. ఎట్లన. ఇందులోని విశేషముం జూడుఁడు. కలభాషిణి యిఁక ముందు మణికంధరుని మీఁదఁదాను దొలినుండియు మోహము దాల్చినదని చెప్పఁబోవుచున్నది. కాన హాని కా మాటయందు నమ్మిక పుట్టుటకై యీ పొగడ్త యనువయ్యెడి. మఱియు మనసు దగిలినవారల చెయ్వులు బహు ప్రశస్తముగ మనకుఁ దోఁచుట స్వాభావికము. అట్లగుట శైలియంత బాగుగ లేదని పండితులు నిరూపించినను, నీ శ్లాఘనకుఁ గొఱఁతరాదు. కారణము లేమనఁగా. అది కలభాషిణి వచనము. ఆమె మనసుప్రకారము వ్రాయంబడినది. అత్యుక్తిగా మీకుఁ దోఁచినను గలభాషిణికిఁ దోఁచియుండదు గదా! మఱియు నామె వారాంగన. వారాంగనలకు ముఖస్తుతులు అతిశయోక్తులును జీవనాధారముగాన నైజములు. కాఁబట్టి య

హంభావముచేఁ గవి యాత్మస్తుతిఁ జేసినాఁడని స్థాపింప వల నుగాదు. అతని శైలి చెడ్డదిగా నుండినను సరే. ఈ పద్యము సమయోచితము. ఇఁక శైలి యీవర్ణనకుఁ దగినదిగానుండిన నసలు దోషమే లేదు. చూచితిరా! ఈ కవి మహిమ! ఈ సీసముయొక్క సొగసు కథయొక్క పెంపకమునకు ననుకూలము. కవియెడం జెల్లినను జెల్లవచ్చును. చెల్లదన్నను అని మిత్తప్రసంగము గాదు!

ప్రభావతీప్రద్యుమ్నము కొన్ని సందర్భముల కళా
పూర్ణోదయము ననుక్రమించెడును

కళాపూర్ణోదయములో భావనాశక్తి యఖండమన్న నా విజ్ఞప్తికి నిదియొక తార్కాణ. ఒక్క యఖండమగుటయ కాదు. కొన్నియెడల మితినిమీఱి యతిశయదోషముం జెందియున్నదన్నను, గవియెడ నన్యాయముఁ జేసినవారము గాము. ప్రభావతీప్రద్యుమ్నము నందన్నన్ కవిత్వవిద్య యింకను బక్వమునకు వచ్చినది. అనఁగా శుద్ధరచనా మాత్రము గమనించిచూచిన వెనుకవ్రాయఁబడిన యీ గ్రంథము దానికిఁ బూర్వమగు కళాపూర్ణోదయమునకన్నఁ గొన్నివిషయముల మిన్న. ఎట్లందురో. శైలి యింకను మంచి పాకమునఁబడియున్నది. లోకోక్తులు మొదలగు నలంకారము లెక్కువ యగుటయకాదు, రమ్యములును. అన్వయసౌలభ్యము నధికము. కాని భావనాశక్తి యెంతయుఁ

దక్కువ. బహుశః కవి వయసుముదిరినవాఁడైనందున రాగములు కృశించియుండును. రాగాదుల విజృంభణము లేనిది భావనాశక్తి యడరనేర్చునా? ఎది యెట్లుండె. కళాపూర్ణోదయ సందర్భములఁ గొన్నింటిని ప్రభావతీప్రద్యుమ్నములోను అనుకరించియున్నాఁడు. తొల్లిటిగ్రంథమందుఁగల నూతన కల్పనలు వెనుకటిదానిలో లేవు. మఱియు నందలి కల్పనలు గొన్ని చిల్లరమార్పులతో నిందుఁ బొందింపఁబడియున్నవి. భావనాశక్తి వ్రాలెననుట కింకను సందేహమేల?

చూడుఁడు, మణికంధరుని తపోభంగముఁ జేయుటకై వచ్చి కార్యసిద్ధి గడించిన రంభయామోటుదపసి శృంగారములకుఁ గరంగని దగుటను, నలకూబరాయత్తచిత్తయగుటను, జేసి యొకానొకప్పుడు

క. "కళలంటి కఱచి తనచె
య్యువ్వలఁ జొక్కెడు తపసి మది చివుక్కురు మనఁగా
నలకూబర! విడువిడురా!
యలసితి ననిపల్కె మన్మథాతి వివశతన్."
(కళా. ఆ. 3. ప. ౪౭)

అన్యనాథునిఁ జేర్కొనుట మణికంధరుని కోపమునకుఁ గారణముగదా! ప్రభావతీప్రద్యుమ్నములో నాయికానాయకులకుఁ గోపముఁ దెచ్చిపెట్టవలయునని యుద్దేశించి కవి యీ కళాపూర్ణోదయము సంగతివంటిదానినే చేర్చియున్నాఁడు.

శా. "ప్రద్యుమ్నుండు ప్రభావతీరతి విహారప్రౌఢి సారస్య సం
పద్యుక్తిం గడుఁజొక్కి 'దక్కితిరతీ! మత్ప్రాణమా! నీకు' నం
చుద్యత్ప్రేమ సమృద్ధిఁ బల్కె నదియాయోషాలలామల్ శ్రవ
స్సద్యఃపాతనిశాత శూలసమమై చాలంగ నొంచెన్వెసన్." ఇత్యాది.
(ప్రభా. ఆ. ౫. ప. ౧౦౯)

ఒకచో రంభ 'నలకూబరా!' యనిస్మరించుట. వేఱొక చోట ప్రద్యుమ్నుఁడు 'రతీ!' యని పల్కుట. సామ్యము స్పష్టము. కాని మొదటి సందర్భముయొక్క కౌశల్యము రెండవదానియందుఁ జూపట్టదు. తారతమ్యము లేమ నఁగా: ప్రభావతమ్మగారికి వచ్చిన పొలయలుక వర్ణనకై దిగు మతి కాఁబడినదేకాని కథాసాంగత్య మేమాత్రమును దానికి లేదు. వచ్చిన నెవనికి లాభము, రాకున్న నెవ నికి నష్టము! చాలీచాలనిదానికి శ్లేషవాసనయు మిగుల గాటు! ఇఁక కళాపూర్ణోదయసందర్భమన్ననో సర్వవిధముల నుత్కృష్టము. రతి యట్లు ప్రభావతి రాజకన్య. వయసున నెంతో చిన్నది. రతిదేవి పురుషునకన్న పెద్దమ్మ గదా! కాఁబట్టి కోమలాంగియైన ప్రభావతితో ముచ్చటించునపుడు ఈ జ్యేష్ఠాదేవిని దలఁచుకోవలసిన విధియేమి? పాపము. రంభగతి వేఱు. మోటుదపసి యెక్కడ? రసికశిఖామణియు ధనవంతుఁడునైన నలకూబరుఁడెక్కడ? ఇంతేగాదు. మణి కంధరుఁడు నలకూబర రూపముందాల్చెఁడేని కథ సాగదు. ఇరువురు రంభలు, నిరువురు నలకూబరులు నుండుట యావ

శ్యకము. రంభ 'నలకూబరా' యని కనులు మూసికొనుట, యింకను గామత్ప్రాప్తినడయని మణికంధరునికి నలకూబరవేషముం దాల్చుటకు నమోఘమైన హేతువు. కావున నీవైరస్యము దండుగప్రణయ కలహముగాదు. మఱి కథావృద్ధికి నావశ్యకము.

శైలినిగూర్చిన తర్కములు

కవియొక్క శైలివిషయముం గూర్చిన చర్చయు నిట్లే కళాపూర్ణోదయములో నిది కథాకల్పనకుం జేరిన యవశ్యక్రియలలో నొకటి. ప్రభావతీప్రద్యుమ్నములో నిట్టిది యొకటుఁన్నది గాని, యది విడువఁబడఁ గూడనియంత కలయికతో వెలయునది గాదు. ఆ పద్యమేదన. ఇంద్రుఁడు శుచిముఖిని గొనియాడుచు నాడిన;

సీ. "శబ్దసంస్కార మెచ్చటను జాఱఁగనీక
పదమైత్రి యర్థ సంపదలఁ బొదలఁ
దలఁపెల్ల నక్లిష్టతను బ్రదీపితముగాఁ
బునరుక్తి దోషంబు పొంతఁ బోక
యాకాంక్షితస్ఫూర్తి యాచరించుచు నుశా
ఖా చంక్రమ క్రియఁ గడవఁ జనక
ప్రకృతార్థ భానంబు పాదుకొనదుకుచు
నుపపత్తి యొందు నత్యూర్జితముగ

తే. నొకటఁ బూర్వోత్తర విరోధ మొందకుండఁ
దత్తదవయవవాక్య తాత్పర్య భేద
ములు మహావాక్య తాత్పర్యమునకు నొనరఁ
బలుక నేర్చుట బహుతపః ఫలముగాదె!''

(ప్రభా. ఆ. ౨. ప. 3)

అనునది రెండు గ్రంథములలోని యీ రెండు పద్యములం బోల్చి చూచితిమేని నీ రెండవకృతి రచించులోపలఁ గవి కొంతమట్టుకు శైలింగూర్చిన యభిప్రాయము మార్చినాఁడనియుఁ జెప్పుట కవకాశమయ్యెడి. కళాపూర్ణోదయ పద్యముంబట్టిచూచినఁ గవి యలంకారశాస్త్రములయెడ బహు భక్తిగలవాఁడనియు, నర్థాలంకారములుమాత్రము గాక శబ్దాలంకారములును అవశ్యానుష్ఠేయములని భావించినట్లును, గానంబడియెడి. ప్రభావతీ ప్రద్యుమ్న పద్యములో నలంకారశాస్త్రములంగూర్చిన విచారచిహ్న లెవ్వియును లేవు. శబ్దాలంకారములంగూర్చి కవి యువ్విళ్ళూరక పోవుటయే కాదు, అర్థాలంకారములనైన ధ్యానించినట్లు పొకడగానము. భావములు, అర్థములు, తాత్పర్యములు, అవయవసంయోగము మొదలగు తలఁపులతోఁ జేరిన లక్షణములమీఁద నేకాగ్రమగు దృష్టిని నిలుపుట మేలని యెంచెనేమో! ప్రభావతీప్రద్యుమ్నములో చిత్రకవిత్వ మత్యల్పము. ఇంచుమించు శూన్యమును. కళాపూర్ణోదయమున నంత యెక్కువగాకున్నను దానియందుకన్న

నధికము. ప్రబంధములయందుంబలె నమితముగాదు. రస నాశ మొనరించునంత విపరీతపువాక్సరణి యీ కవి యెంత దపసుచేసినను సాధ్యమగు వరముగాదు ఏలన భావగంభీరుఁడుగాన. ప్రభావతీప్రద్యుమ్నము విషయమున ప్రబంధ సంబంధి. శైలిలోఁగాదు. కళాపూర్ణోదయము మొత్తము మీఁద విషయమున ప్రబంధసంబంధిగాదు. శైలియం దచ్చటచ్చట నావాసనం దాల్చినదియ. మొత్తముమీఁద ననుటచే నాఱవయాశ్వాసముయొక్క యంత్యభాగము మొదలు గ్రంథసమాప్తిపర్యంతము తుచ్ఛమైన ప్రబంధధోరణిలో నేకారణముచేతనో వ్రాయంబడి యుంట సూచితము. సూరనార్యుని రచనాపరిణామముం జూచితిరా! అఖండ శ్లేషపూరితమైన రాఘవపాండవీయముతో ప్రారంభించి, తుదదాఁకు సరికి ప్రభావతియందు శ్లేషకవిత్వము వచ్చునో రాదో యనునంత తక్కువపఱచియున్నాఁడు!

సూరన్నయొక్క చిత్రకవిత్వము

భారతము నత్యంతాదరములోఁ బఠించినవాఁడయ్యు, కాలదోషంబుచే శబ్దచిత్రములం బ్రకటించుటకు నోర్చిన వాఁడయ్యె ననుటకు నిదర్శనముగఁ గొన్ని పద్యము లుదాహరింతము:

సీ. "విశ్రాంతివిరతిఁ గావింపక సారవ
త్స్వాహత్య సౌమ నస్యంబు లెఱిఁగి
సమయంబుఁ దప్పక శ్రవణ కఠోరంబు
లైన శబ్దముల నత్యాసలాత్తఁ

జేయక, సత్పరిచిత సుకుమారవా
క్స్వరళితాభిప్రాయఁగా నొనర్చి
పదబంధ శిథిలతఁ బాటిల్లఁగా నీక
యేచందములయందు నేమరిలక

తే. పఱఁగు కవియు దోషా కరుఁడును యశము దు
గ్ధమును బడయు, నట్లు గానినాఁడు
కృతి దురాప మొదవు కీర్తియుఁ బాలు నీ
కుంట గాదు, హాసయోగ్యుఁ జేయు"

(కళా. ఆ. ౧ ప. ౮.)

ఇందు శ్లేషప్రధానము.

సీ. "శేషు దర్పము చివ్వి శీతాంశు రుచి నవ్వి
పాలమున్నీటిపైఁ గాలు ద్రవ్వి."

. . . . (కళా. ఆ. ౧. ప. ౭౬.)

సీ. "మెఱుఁగుటద్దపుమించు మించుబాగులనింపు
నింపుచక్కనిముద్దు నెమ్మొగంబు

. . . (కళా. ఆ. ౧. ప. ౧౩౫.)

క. మాయమ్మానను నీవే,
రాయలవై కావదేవ రాజే జే జే
మాయాతుము లాని నయది.
పాయకసంతోసమున్న పలమిలసామీ."

(కళా. ఆ. ౬. ప. ౧౭౧)

ప్రథమాగమాదులు మదాశయుని పురోహితాదుల నోడించుటకై సంస్కృతాంధ్రభాషాశ్లేషముతో నీ పద్యము బల్కి వారిని వెగడువఱిచి రాజునకుం దమ్ముం దెలిపికొనిరి. ఈ సందర్భము కాళిదాసుని చరిత్రచే సూచితంబు. చిత్రకవిత్వమైన నేమి? కథావృత్తముతో ననుసంధించినదియు ప్రధానమును గావున నిది సమంజసమే. ఇంతటఁ గవి విరమించి యుండిన నెంతో బాగుగనుండెఁ. ఇంకను నీలాటి పద్యము వినవలయునని కళాపూర్ణుండు కుతూహలుఁడై వీరి నడిగినట్లును, ఆ రాజుయొక్క వినోదార్థముగా

క. "తా వినువారికి పరవిగ,
భావతో నానునతి విభావసు తేజా
దేవర గౌరవ మహిమాన,
మావలసిన కవిత మరిగి మాకు నదీశా."

(కళా. ఆ. ౭. ప. ౧౭౨.)

అను పద్యము ప్రథమాగముండు నివేదించినట్లును వ్రాసియున్నాఁడు. ఈ రెండవకల్పన పనిలేని పాండిత్య ప్రకటనమేకాని, యప్పటి వృత్తాంతముంబట్టి సహజముగ నేర్పడిన సరసముగాదు. మణికంధరుని తీర్థయాత్రాభివర్ణనములో నతఁడు సేవించిన క్షేత్రముల కనేకములకుఁ గవి యంత్యప్రాసనియమమాపాదించి యుండుట బమ్మెరపోతన విలాసప్రభావమేమో!

మ. "యమునం జూచెను నీచికాచయయమునం బ్రాంచద్ఘనశ్యామతో
యమునన్ సారసకైరవోచ్చయయమునన్ . . . ఇత్యాది.
(క౹. ఆ. ౨. ప. ౧౧౧)

మఱియు రగడ లేనిది రాగము గుదురదని కాంబోలు శ్రీరామస్తోత్రము నొకటి వ్రాసి మణికంధరుని జిహ్వకు నంటించినాఁడు. ఇట్లనేకరీతుల శబ్దచిత్రము సంఘటించి యున్నాఁడుగాని, యిది కావ్యమునకు వన్నెఁదెచ్చు పద్ధతి యనుట గడు సాహసము.

ప్రభావతీప్రద్యుమ్న విమర్శనము

ప్రభావతీప్రద్యుమ్నమునం దిట్టి విఱుపు లపురూపములు. మఱియు కథాప్రారంభముననే పాత్రములను బ్రవేశింపఁ జేయుటఁబట్టి కవియే నేరుగ మనకు బోధించుట యేమాత్రము లేదు. అట్లగుటచే వర్ణనలు పాత్రముల మూలమునఁ జేయఁబడి కథలో మిళితములైయున్నవి. చూడుఁడు. మొదలెత్తగనే.

క. "శ్రీరమణీ రమణీయమ,
హోరస్థ్సలుఁ డచ్యుతుఁడు సముజ్జ్వల మహిమన్
ద్వారక నుండఁగ నొకనాఁ,
డారూఢాదరత నింద్రుఁ డవ్విభుకడకున్ "

అని యింద్రకృష్ణులకు ప్రవేశముఁ గల్పించి, ఇంద్ర మాతలి సంవాద రూపమునఁ బురవర్ణనముం జేసియు

న్నాఁడు. ఇంద్రుఁడు చింతాక్రాంతుఁడై యుండఁబట్టి పురవర్ణనాదులచే నతనికి మఱపుఁ గల్పింపఁ జూచుట సారథిధర్మమేకదా! కావున నియ్యది ప్రబంధములనెల్ల సర్వసాధారణములగు దిక్కులేని వర్ణనలకుం జేరినదిగాదు మఱి సార్థకము.

కథతో గాఢాన్వయములేని సంగతులు ప్రభావతీప్రద్యుమ్నమునందు మృగ్యములు అవయవముల సంయోగము పరస్పరతయు నిందుంబలె నాంధ్రగ్రంధముల నెచ్చటంగానము. త్వరపడువారికి శ్రీకృష్ణుని యజ్ఞము అశ్లిష్టవృత్తాంతముగాఁ దోఁపవచ్చుఁగాని, యదియుఁ గార్యసాధనమున కుపకరణప్రాయము. ఎట్లన. దైత్యరాజు ననుమతిఁ బొందిగాని యేరికిం జొరఁగానిపురము నేరికిఁ బ్రద్యుమ్నుఁడు ప్రవేశింపఁ గలఁడని, శ్రీకృష్ణుఁడు తలపోయుచుండఁగా నా యజ్ఞములో భద్రుఁడను నటునికిని బ్రాహ్మణవటువులకును వాగ్వాదము జరుగు కాలములో, వటువులు భద్రునుద్దేశించి

సీ. “ఏము మ్రుచ్చులమె యూహింప మ్రుచ్చుఁదనాల
పుట్టిన యిండ్లు మీ బోంట్లకాక
యాటవాండ్రని నమ్మి యనుమతింపఁగ నెట్టి
పురమైన నశ్రమంబునను జొచ్చి
పగలెల్ల నాటల భ్రమయించుచును సందు
గొందులెల్ల నెఱింగి కొనుచురేలు
కన్నగాండ్రగుచు నగళ్ళు ప్రవేశించి
యందు నెంతటివార లడ్డమైనఁ

తే. జక్కడఁచుచుఁ బేను గ్రుక్కిన పాటిగా
నిష్టమైన యర్థ మెల్లఁ బడసి
బ్రతుకుచునికి మీ స్వభావ మింతయును ద
ప్పదు యథార్థ మనుచుఁ బలుకుటయును.”
(ప్రభా. ఆ. ౧. ప. ౧౦౮)

ఆ మాటలనే తనయుపేక్ష కుత్తరంబుగ వనజాక్షుండు గ్రహించి తన యుపాయము సిద్ధించెఁగదా యని సంతసించి ప్రద్యుమ్నాదుల నటవేషమున వజ్రనాభపురికిం బంప నిశ్చయించెను. నటవేషముననున్న ప్రద్యుమ్నుఁడు వజ్రనాభుసభలో నటించుచుఁ జెప్పిన

చ. “సకలవిశేషశోధనకుఁ జాలినయో నెఱజాణ వజ్రనా
భకులవతంసరత్నమ ప్రభావతిరోహిత కంటకంబు తా
వకమగు చూపునాపయిఁ బ్రవర్ధితరాగతఁ బర్వెఁగాన న
త్యకలుషవృత్తి నా సుకృతమంతయు నేఁడుసుమీ ఫలించుటల్”

తే. “నీకు నామీఁదఁగల యట్టి నెయ్యమునుమ,
హాదరము నీవు పనిచిన హంసి చెప్ప
నాత్మలో ననవరత నాట్యప్రసంగ
మున నిను భజించు వేడుక ఘనము నాకు.”
(ప్రభా. ఆ. ౪. ప. ౧౦౫, ౧౦౬)

అను పద్యములును మఱుఁగుననుండి చూచుచున్న ప్రభావతికిఁ దన కూర్మిఁ దెలుపునట్టివ కాన కథకు ననుకూలములే. ఇట్లే యన్నివిషయములును గథానుసారము వచ్చు

నవియేకాని 'ముగ్గురు మూఁడు లోకములైన ముసలిది యమలోక'మను మాఁడ్కిఁ గథను జెల్చి చెఱుపునవిగావు.

భావలోపములు

రచనాదోషములు లేకున్నను గళాపూర్ణోదయమున కన్న నిది నికృష్టమనుటకు భావలోపము లాధారములు. ఇందులో వచ్చు స్త్రీ పురుషులు గొందఱే. అందును గృష్ణాదులు పురాణపురుషులు. వీరి సమాచారము ప్రాఁతకథ. ఇఁక ప్రద్యుమ్నుఁడన్ననో విరహాది వేదనలకు నిదానమైన ప్రబంధపురుషుఁడేకాని యెక్కువ పరివృత్తిగలవాఁడు గాఁడు. ఇఁక ప్రభావతియన్ననో. నాకుం జూడ నెంతయు నసహ్యురాలు! రూపమున్నది. నాథుఁడెప్పుడు వచ్చి పైఁబడునను తహతహ దట్టముగ నిండియున్నది. రూపమును గామావేశముం దాల్చిన పాతివ్రత్య మున్నం జాలునా? ఇందులోని శృంగారమనునది జావళులకుఁ దోడుపోయినది! తండ్రికిఁ బతికిని యుద్ధము సంభవించెఁగదా. ఎవరు గెల్చినను దనకు దుఃఖమేగదా యను నాలోచన యీ పతివ్రతాశిరోమణి మనసున కేల తట్టును? ప్రద్యుమ్నుఁడు భార్యనుద్దేశించి 'నీ తండ్రిని జంపకున్న మన బ్రతుకు నిలుచుమార్గమెద్దియు లేదు' "ఒండొకత్రోవఁ ద్రొక్కఁగాఁ గూడద, యేమి సేయుదును ఘోరవిచారము పుట్టె నాత్మలో" నని పలుకఁగా, దేవిగారు, "విభునిందముఁ గాచికొనంగ వేఱు త్రోవ నెమకి కానకంతఁ బితృవత్సలభావముఁ బొఱనూకిన" దఁట!

ఈ భావము నీ మహాకావ్యమున నింతకుముం దెక్కడను జూపినదికాదు. అణుమాత్రమైనఁ దాల్చియుండె ననుటకుఁ జిన్నె లెవ్వియును లేవు. మఱి యెంతో గారాబముతోఁ జూచుచుఁ, గోరిన కోర్కు లెల్ల నడిగినమాత్రన దీర్చు కన్న తండ్రి కనుగప్పి గాంధర్వవివాహక్రీడకుఁ జొచ్చిన కన్యామణి! అట్లగుట నీమెకుఁ 'బితృవత్సలభావ' మెక్కడిది? ఉండెఁబో. ఎంతో భద్రముగ మన కెవరికి నెఱుఁగఁబడకుండు నట్లు ఎక్కడనో పాతిపెట్టినది! తండ్రింగూర్చిన హృదయాందోళన మేమెని గలదా! హిందూపతివ్రతలకు నుండరాదే మో! మన శాస్త్రఘోషలలోఁ బరిచయముగలవారి నడిగి తెలిసికొనుండు. ఇట్లు ప్రభావతి మన సన్యాసులవలె తనకు లేనిదానిని ధైర్యముతోఁ బాఱనూకి

క. "తాన చనిమూల నున్నయ
నూన తదీయాసిఁ దచ్చి యొసఁగి గెలువుమీ
దానవపతిఁ దక్కినయను,
మానము మానుమని పలికె మానవతి పతిన్!"

(ప్ర. భా. ఆ. ౫. ప. ౧౯౫)

అదిరా! సౌకుమార్యము, సౌమనస్యము మొదలగు కోమలగుణంబుల యపరావతారముగదా యీ మానవతి! ఈ పరమ పవిత్రురాలితో ద్రౌపదిఁ బోల్చి చూడుఁడు! భీమసేనుఁడు కీచకవధార్థమై ప్రతిజ్ఞఁ జేయుచు

తే. "ఎల్ల యెల్ల విధంబుల నెందుఁ జొచ్చె
నేని, నా ధర్మతనయుండు దానవచ్చి
యడ్డపడ డేని, నీవ పెంపారు కరుణఁ
గాచితేని నాచేఁ బడుఁ గీచకుండు."

(భా విరా. ఆ. ౨. ప. ౨౩౨)

అని ద్రౌపదితోఁ గఠినాక్షరంబుగాఁ జెప్పుటలో, నా పాంచాలి, తనకట్టి యవజ్ఞ సేసినను, నా సూతుఁడు కామాంధుండు గావుటఁ బశ్చాత్తాప పాత్రుండని కని కరించి క్షమించి కావఁజూచునంత యుదారచిత్తురాలని ధ్వనిఁ గల్పించినందున నా మహాదేవికిఁ గొఱఁతఘటిల్లెనా?

పాతివ్రత్యతత్త్వము

నడవడియను వస్త్రమమూల్యముగా కుదురవలయు నన్న నొకేతరగతి పోగులు రంగులుఁ జేర్చినఁ జాలునా? నానావిధములైన వర్ణములుగల తంతువులు విచిత్రరీతి నొండొంటికి వన్నె యలవడుమాడ్కి మిశ్రపఱిచినఁగదా నాణెము సిద్ధించును? ఈ తత్త్వము నెఱుంగమింగాదె పతివ్రతలన్న నొక్క పతిచింతదప్ప నింకేదియు లేని మూఢురాండ్రని భ్రమించియుండుటయు, తద్ద్వారా దేశమునకే కాదు స్త్రీలకు సైతము దైన్యకారణములైన నీతుల బోధించుటయును! ఒకానొక పతివ్రత పురుషుఁ డెవ తెనో యొక స్త్రీని గోరిన దానిని వలపించి తేఁబోయనఁట! అందుచే నామెకు పంచభూతములను వశ్యపఱుచుకొనునంత మాహాత్మ్యము

సేకుతెనఁట! భార్యను దూతికగాఁ జేయువాఁడెంతమాత్రపు మగవాఁడో! భర్తకై యన్యస్త్రీలఁ జెఱుపఁ జూచునదియు నా మాత్రపు టాఁడుదియే! పతియేయఁట దైవము! వేఱు దేవుఁడు, దయ్యము, దేశము, జాతి, మానము, గౌరవమును దేనిని సడ్డసేయరాదఁట! ద్రౌపదీదేవి ఉద్యోగపర్వము లోను మఱి కొన్నియెడలను జేసినరీతిఁ బురుషులకు వ్యతిరిక్తముగా మాట్లాడుట మహాపాపము! పురుషునివాక్యము నపౌరుషేయమగు వేదముగా భజించుటయ శాస్త్రవిహిత ధర్మము, కర్మము! ఈ దౌర్భాగ్యప్రలాపముల మొత్తపు టర్థ మేమనఁగా, "మగవారమైన మాకు నాఁడువారైన మీరు బానిసలుగా నుండుఁడు. మఱి మా పనులన్ననో కారణముఁ జెప్పి న్యాయములు గౌరవప్రాప్తములు అని చూపఁ గాదు. ఏలన. రాష్ట్రము, స్వాతంత్ర్యముఁ గోలుపోయి దాసులమై యుండుటఁబట్టి యొరుల కనుసన్నల మెలఁగవల యునేకాని, శాస్త్రభంగిని మానము మనస్సాక్ష్యము నిగూపించిన త్రోవఁబోవ మావలనఁ గాదు. అట్లగుట మా చర్యలంగూర్చి చర్చింపకుఁడు. ఏమీయని యడుగకుఁడు. మీ రట్లు చేసితిరేని బయటనే గాదు మాయింటఁగూడ మా గౌరవము దక్కదు. అంతటె యొద్దఁదన్నులు వడి వచ్చు వారము. మీరైనఁ బూజింపకున్న మా కభిమాన మబ్బు టెట్లు? మేము దాసులము. మీరు మాకు దాసులైనచో దాసానుదాసులయ్యెదరు. అనఁగా దేవసన్నిభులరు. సేవ

చేత దేవతలగు సూక్ష్మము. ఈ కర్మభూమిలోఁ దొలుతఁ గని పెట్టఁబడిన హాయియైన తంత్రము! దాని లాభమంతయు ధారాళముగ మీరే యనుభవింపుఁడు!" అనుట! పతిని దప్ప నింకేమియు స్మరింపఁగూడదఁట! ఈ స్వరూపములనే యవివేకలమగుదృష్టితోఁ జూచుచుండిన నెటువంటివారికైనఁ గనులు నిల్చునా? ఏమి గొప్ప ప్రతాపమూర్తులైన శూరులు వీరులని వీరినే యెంచుచుండుట సాధ్యమగును! దేశము గొప్పగానుండు కాలములో స్త్రీలకు నొక కుటుంబము మీఁదనే కాదు, రాజకార్యములు, చరిత్రాది శాస్త్రములు, సైన్యములు మొదలగు మానరక్షకప్రకృతులు ఇత్యాది లౌకికగణంబులయందెల్ల శ్రద్ధాదృష్టి వాఱుచుంట సహజము. గాంధారి ద్రౌపది మొదలగు భారతస్త్రీలును, గార్గి మైత్రేయీ ప్రభృతులగు ఋగ్వేద యుగములోని లోకోత్తరచరితలును, మనవారినుండియే యీ విషయమునం జూపఁదగు సాక్షులు. రాజ్యము స్వాతంత్ర్యము లేని దయ్యేనేని నిల్లువిడిచి బయటికి వచ్చుటకు భయము. ఏలన. తమ వారికిఁ దమ మానము రక్షించుశక్తి లేమింజేసి. పౌరుషోద్ధురులైన పతులయెడ స్త్రీలకు స్వాభావికమగు తవులు మెండు. అది లేని పతులు ఇఁక నీతిశాస్త్రములచేతనైనను దమయందు వారిహృదయములను భద్రపఱచికొందమను యుక్తిఁ బన్ని పతివ్రతాలక్షణములం బ్రకటించిరేమో! సాహసవంతుఁడు జనముల నాకర్షించుట నీతిచేఁ గాదు. మఱి ప్రకృతిచే. మఱి

యు, 'ఇల్లు గ్రామము కులము వీనిం దప్ప పెఱవాని జోలి మన కేల? అధికప్రసంగము లీనాళ్ళలో నపాయకరములు.' ఉదుమున కేటికయ్యా ఊరిలో పెద్దతనము!" అని యన్ని పరాక్రమములు నుడిగి గుమ్మము కచేరీలకు దిగరేని స్త్రీలకే కాదు, పురుషులకు సైతము గృహచింతఁ దప్ప మఱేమి యుండఁగలదు? పాతివ్రత్య మొక్కండు దక్క స్త్రీలకే ధర్మములు గూడవను సిద్ధాంతము దేశము పురుషులు భంగమునకు లోనయి నిరాశచే నిరుద్యోగులై యుంటచే వచ్చిన చేటుగాని, బాగుగా విచ్చలవిడి వర్తించు ఋషుల శాసనము గాదు. అది యట్లుండె.

ఒకవేళ ప్రభావతీదేవి రాక్షసరాజు కూఁతు రగుటం జేసి కఠినాత్మురాలుగా నుండుట ప్రకృతి నిషిద్ధముగాదని యందు రేమో: ఆ యమ్మయొక్క జననవృత్తాంతమును వర్ణించుచు, నీ త్రిలోకసుందరి సామాన్య జనులను వేగిరము వేగిరముగ వక్కముక్కలుగా సృజించు బ్రహ్మచే సృజింపఁబడినది గాదనియు, నిష్కారణముగ నా త్రిపురసుందరి స్వయముగ నిదానించి చూచి సర్వ సామగ్రులంగూర్చి బాగునకుఁ దెచ్చిన కన్యామణియనియుఁ గవి చెప్పియుండుటంబట్టి, యీ వాద మొప్పుకోఁదగినది గాదు.

ప్రాచీనుల మోహాతాపము

నిజము చూడఁబోయినఁ ప్రభావతీప్రద్యుమ్నము శైలి నొక్కదానిం దప్ప తక్కిన విషయములలో సామాన్య

ప్రబంధముల మీఱినది గాదు. కథ మిక్కిలి సన్నము. చిత్ర రూపములు, దూతికలు మొదలగు మధ్యవర్తుల మాటలు, వీనిచే నా కాలమువారికిఁ గామాగ్ని యున్నట్టుండి ప్రభవిల్లి మనసులను దేహములను దహింపఁ జేయుసంత తైక్ష్ణ్యమును బహు త్వరలోఁ గాంచుట సర్వసాధారణమేమో! బహుశః వారెల్ల నెండిన కట్టెలో! ఇప్పు డింగ్లీషు ముక్కలు చదువు వారు 'నేరుగాఁ జూచి మాట్లాడిననే కాని యీ దండహ్యా మానత మాకుఁ బట్టువడదు' అని యాక్షేపించుటఁ జూడఁగా కాలవైపరీత్యము బోధపడియెడిని. మనది ప్రత్యక్ష మోహము. మన పెద్ద లింతకన్న నుద్రేకముగలవారగుటం బట్టి వినినచేచాలును! గుప్పున మండెడివారు. వకీళ్ళమూల మైన పరోక్షమోహము వారికి ప్రధానము. అయిన నాకొక సంశయము. మన పెద్దలు వేదవేదాంతవికాసభాసురవిచిత్ర చరిత్రులే. రాగరహితులే. శమదమాది సంపత్సహితులే! అట్లుండియు నీయొక్క విషయవిషయంబునమాత్ర మేల యింత చాంచల్యము వడసిరో తెలియఁజాలముగదా! అవ్యాజాద్భుతములలో నిదియొకటి. నిర్హేతుకజాయమాన చిత్తవిభ్రమమును వేదాంతవిచారమును సమ్మేళించి యుం డుట యాశ్చర్యముగదా! ఆశ్చర్యమైనను అప్రకృతమా? కాదేమో! ఎట్లన. ఇంద్రియముల నిగ్రహింపవలయు నిగ్రహింపవలయునని జపముచేయుచుండువారు, ఆ యిం ద్రియములయందే నిగాయుంతురుగాన, నదియొక విధమైన

యున్మాదహేతువు. కాకున్న నందఱికన్న ముందుగ జితేం ద్రియులైన మహర్షు లప్సరసలఁ జూచి చూడకమున్న యేల యుర్వ్రీభూరుదురు! గంతులువేయుదురు! మఱియు భరత ఖండము క్షీణదశకు వచ్చినదిమొదలు గొప్పగొప్ప ప్రయ త్నములు గొంతెమకోరికలైనందుననేమో కాని తుచ్ఛ ములు స్వాత్మైక విషయములునైన సుఖములం దప్ప నింకెందును బుద్ధిపాఱుట యరుదాయెను. చిల్లరచింత లెక్కువ. కీర్తికరము లసాధ్యములైనందున భోగములే పర మార్థములని గణింపవలసిన వారమైతిమి. జీవితమనునది యుండఁగా కాలక్షేపము పొంటైనెనఁ బురుషార్థ మొకటి యుంచుకొనక తీఱునా? "వ్రతముపోయె. యశస్సు పోయె! ఇంద్రియానుభవమైన దక్కనీ" యని మనకుం దెలియక మన మన సీజాడల నుపక్రమించెనో! చూడుఁడు. ఐరోపా వారు శృంగారవర్ణన మెంతో దివ్యముగఁ జేసియున్నారు. వారు రాజసతేజులు. మనలో నాలుకంబట్టినది సత్త్వ గుణము. మనసుంబట్టినది తమోగుణము.

పాశ్చాత్యుల శృంగారవర్ణనము

వారియొక్కయు మనయొక్కయు శృంగారమునకు ముఖ్య తారతమ్యము లేవనఁగా: మనవలె వారంగ వర్ణన మంతగాఁ జేయరు. చేసినను మొగము కన్నులు మొదలగు బాహిరభాగములమాత్రము ప్రశంసింతురు. మనలో నఖ శిఖాపర్యంతము విప్పివిప్పి చూపుట యందఱు నాశ్రయిం

చిన కావ్యలక్షణము. పడుకింటిలోనికి వెళ్ళిన వెనుకఁగూడ చెలికత్తె లామెను వదలినను వదలుదురుగాని కవి యేమో యొక నిముసమైన వదలఁడు తప్పవేయక యట్లే చూచుచుం డును. 'రవిగాననిచోఁ గవిగాంచుట' మనలోని ముఖ్యసం ప్రదాయము. వేదాంతవిద్యాదీప్తిమంతమైన యీ పుణ్య భూమిలో నీ రుచి ముదిరి యుండుటకుఁ గారణమేమన. స్త్రీలను జాగ్రత్తగ మఱుఁగున నుంచుటయే! శీలరక్ష ణార్థము చేయఁబడిన యేర్పాటే యశ్లీలములకెల్ల మూలము! ఎట్లన. నివారింపఁబడినదానికుండుచవి యనివారితముల కుండదు. చూడవలదన్నదే గదా యన్నింటికైననందము! సమ్మోహనాస్త్రమన్న నిదే! వలదని యడ్డగించితిమేని దానియందలి వలపు అనర్గళమగును. దమమును జెఱుచునది నిర్బంధము. నిలుపునది స్వాతంత్ర్యము. 'అతిరహస్యము బట్ట బయలు' అన్నట్లు ఎయ్యది గుప్తమో దానియందే యంద ఱకు దృష్టి. ఇంకను బరిష్కారముగ సాంగోపాంగముగ విమర్శించి చూతమను కుతూహలము సహజము. మన దేశ ములో నెవతెయైన నొక స్త్రీ నాగరికత గలయది వీధిలోఁ బోవునేని, ఆ యూరివారి కన్నులన్నియు బిట్టబిగిసి యామె పైఁబడుట మీకుఁ దెలియదా? ఈ మర్యాదలేమి కేమికార ణమో పచ్చిపచ్చి విశదవర్ణనలకును నదియేకారణము. చూపునకుండు తహతహను దెరలచే నాఁపవచ్చును. మనో దృష్టి మేరమీఱిచూడఁ బ్రయత్నించిన నివారకసాధన

మేమి? సౌమనస్యము. అది మనవారిలో నింకను దగినంత వృద్ధికిరామి తెల్లంబు.

అంగముల వర్ణించునప్పుడును, ఐరోపాలోని కవులు ఆ యంగము లేరీతిభావమును బ్రదర్శించుననుటఁ జూపుదురేకాని, భావస్థగితంబులుగానియవి యసంభావ్యములని వానిమాటఁదలపెట్టరు. భావములను వెలువరించుట ముఖనేత్రాదులకుఁగల చక్కఁదనమున కాదిమమైనట్టియు హృద్యమైనట్టియు లక్షణము. వీనిలోఁ గొన్నింటిమాత్ర మనుభావము లనుపేర మన శాస్త్రకారులు గణించి, వారాంగనల యభినయము రీతి, శిక్షమేరకు నడుపఁబడు త్రిప్పుటలలోఁ జేర్చిరిగాని, మొత్తముమీఁద నంగవర్ణనమును మనసుతోఁగలసినట్లు చేయుశక్తి, యీ యాధ్యాత్మిక దేశములో బ్రుంగుడువోయి యెన్నోశతాబ్దములైనవి.

స్త్రీల గుణగణములను శ్లాఘనతో వర్ణించుట పాశ్చాత్యులలోని సదాచారము. ఏలన. గుణముల గణింపక యాకారమునుమాత్రము చూచి వలపుగొనుట యా జనములలో నభావ్యము. స్త్రీపురుషులు ధారాళముగ నొండొరులతోఁ గలసి మెలసియుందురు; కాన, రూపమునకుఁ దళుకు తక్కువ. ఇఁక వలపు జనింపవలయునన్న నడవడి, చరిత్రము, చదువు, సద్గుణములు, కీర్తికరములగు కార్యముల యం దాసక్తి మొదలగు నాత్మసంబంధములైన యోగ్యత లావశ్యకములు. కావున నాయికానాయకులకు నివి యుద్దీ

పనవిభావములగుట వీనిని వర్ణించుట శృంగారకావ్యములలో ముఖ్యము.

మనవారిలో స్త్రీలకు మనోవికాసములేనిగతి పట్టినది. కావున రూపమొక్కటియె మోహమున కాలంబనము. పశుప్రాయకృత్యమే కామితార్థము. వీనికిందగిన వర్ణనల మాట చెప్పవలయునా? అపారములు.

పురుషులు గడింప నెంచు సాహసోద్యమములలో సైతము స్త్రీలు తోడుపడఁగలవారని పాశ్చాత్యులనమ్మిక. ప్రకృతిశాస్త్రములు, తత్త్వములు మొదలగు విద్యలఁ గృషి చేయుటయందును భార్యలు భర్తలతో సంగమింతురు. వారు సహాధ్యాయులైన స్నేహితు లట్లు నానావాంఛితంబుల సఫలముఁ జేయఁ జూచుచుందురుగాన, శృంగారకావ్యములు శుక్రాచార్యుల రీతిని ఒంటికంటితో నొకే స్థలముననే తిక్కెత్తినట్లు చూచుచుండునవి గావు.

హిందువులలో స్త్రీలకుండు స్థితిని నేనేల వివరింప? వంటిల్లు పడకటిల్లు ఈ రెంటికి వెలియైన నెందులకుం బనికి రారు! పురుషులకు వారికిని దేహసాంగత్యమేకాని మన స్సాంగత్య మెక్కడిది? వారు చేరి మాట్లాడుట యరుదు. మాట్లాడవలయునని నవీననాగరికులు పంతము పట్టినను అన్నవస్త్ర విహారాదిసరసములుదప్ప నింకే పలుకులకు వీలు లేదు! కావుననే కాన్యకన్యకలు సంభోగవిషయములందప్ప నింకేప్రపంచముఁ దెలియనట్టివారుగానుండుట. రాజకన్యలు

గావున పాపము వంట పనియుండెలియదు. మఱి తెలిసిన దొక్కటే. ఈ దేశములోని స్త్రీలు విషయవాంఛాపూర్తికి ననుకూలములయిన పాత్రములుగఁ జూడఁబడుచున్నారే కాని, పురుషులతో సమానముగ నన్నివిధముల వెలయు శక్తిగలవారుగాఁ జూడఁబడుటలేదు. ఇప్పటివారిస్థితిలో నట్లు చూచుటకునుగాదు. బ్రిటిష్‌వారి ప్రోత్సాహము సౌరాజ్యము వీనిచే నిఁకముందు బాగుపడుదురేమోకాని, యా యౌన్నత్యము వారధిష్ఠించునఱకు జీవించియుండి సుఖించుటకు నావంటివారు మార్కండేయులుగారు!

కామమనునది పురోవృద్ధిహేతువని యూరోపియనుల భావన. ఎట్లన. వరించు స్వాతంత్ర్యముండఁబట్టి యేదేనొక హృదయాకర్షకమగు విశేషము గలిగియో నేర్చియో యున్నంగాని యేకాకులుగా జీవనము గడుపవలసినదే. కాఁబట్టి స్త్రీల మెప్పుకొఱకై యెల్లరు శ్రమకోర్చి శక్త్యనుసారము గొప్పతనము నందఁజూతురు. మఱియు, స్త్రీలును దెలివితేటలఁ దేఱినవారుగాన నట్టివారి సావాసము శ్రేయోహేతువు. ఒకానొక కవి యాదేశించినరీతి, శూరుని లక్షణమేమనఁగా.

తే. "ఒక్క కాంతనుగోరి, మహోద్యమములఁ
బూని సాధించుటలచేతఁ బూజసేసి
రాజ్యమును దైవమును భార్యరాగమడరఁ
బ్రీతులం జేయుటయు కాని వేఱుగాదు."

అట్లగుట స్త్రీలమీఁది మోహము వీరకృత్యములకుఁ బ్రోత్సాహకము. అభ్యుదయకారకము. హిందూదేశములో స్త్రీలు అధఃపతితులైయున్నందున వారి వెంటంబోవుట పాతాళయాత్ర. మఱి వెంటంబోకున్నఁ దీఱదు గనుక, వారిని, విద్య, స్వాతంత్ర్యము మొదలగు దానంబులచేత, నుత్తమపదవికిం దెచ్చిననేకాని యీ దేశ మెన్నటికి శుభములకుఁ బాత్రంబుగాదు. ఇపుడు వేయిసంవత్సరములుగ మన దేశములలో నుత్పన్నములగు గ్రంథములలో స్త్రీలు గొప్పదశకుఁ బురికొల్పువారనుమాట తుట్రాగా లేదుగదా! ప్రబంధములలోని నాయికలు 'నామీఁదవచ్చిపడు' మను టదప్ప నింకే యశస్కరములగు పాటులకైన నాయకులఁ బురికొల్పుట చూచినారా? ఇది శుద్ధ పశుప్రాయమైన కేళి. దీనిఁ గామమనరాదు. అన్నచోఁ బురుషార్థమును సూచించునాపదముచెడును! కామినులు గర్హణీయలనియు నికర్ష హేతువులనియు విరక్తివ్యాఖ్యానము లెన్నియో యున్నవి. తొలుత మగవారు మగతనము గోలుపోవుటచేఁగదా యాఁడువారీ పాడుస్థితికి వచ్చిరనుట మఱచి, తమ దోషములచేఁ దప్పులై, కీడ్పడినవారిని, దామే దూషించుటం జూడ, మనవారు మనుష్యులా కారా యను సంకోచము రాకమానునా? ఇఁకనైన వారిని మీఁదికిఁ దేవలయునన్న, ప్రోత్సాహ వాక్యములచే ధైర్యవతులం జేయవలయుఁనే కాని, తిట్లచే వారు ముందుకు రాఁజాలుదురా?

మిశ్రరసములుగాఁ గావ్యములఁ దీర్చుట మంచిది

నట్టి శృంగారమునుమాత్రము వర్ణించుట యా రసమునకు వైరస్యముఁ గలిగించుట. మనుష్యప్రకృతి యెట్టిదనఁగా, నేమార్పును జెందక యేకరీతిన యుండు వస్తువులయందు అవధానము చాలకాలము నిలుపఁజాలనియది. అవధానమును సుఖమును సమన్వితములు. ఎయ్యది తృప్తికరమో దానియందు మనసుంచుట సులభము. సహజమును. క్లేశకరములమీఁద బలనంతపెట్టినను మనసు నిలుకడఁ గాంచదు. భోజనపువేళ మితముగ నేయివేసికొనిన రుచి, అదిదప్ప వేఱేమియు లేకున్నను, మఱి యమితముగ నయ్యది స్వీకరింపఁబడినను దానియందు రోయింపు జనించును. ఆఁకటితోడ మనసును ఇతర పదార్థము లేమేనున్నవాయని కోపముతో నలుదెసలను భార్యను జూచును. ఐరోపాలోని కవులు* ఈ తత్త్వము నతిక్రమింపక వ్రాసిరి. అనఁగా కావ్యముల నేకక్రమముగఁ బోనీక రసముల మిశ్రముచేసి యన్నింటియందు నభిరుచి స్థిరముగ నెలకొనునట్లొనర్చిరి. మన శృంగారకావ్యములు ఏకరసప్రధానములగుట నీరస

---

* ఇచట నైరోపాలోని కవులఁ గూర్చి చెప్పఁబడిన స్తుతియంతయు భారతాదుల రచించిన మన పూర్వులయందును జెల్లును. చెల్లనివారిదిరనంగా దేశక్షయకాలపు హిందూకవులగు ప్రబంధకారులు.

ములు. వెగటు, ఱోఁత ఇత్యాది జుగుప్సారసములకు నాకరములు.

నీతికిఁ గవితకుఁ బ్రత్యక్ష సంబంధము లేదు

ఇట్లనుటచే నిటీవలి మన శృంగారకావ్యములు నీతి బాహ్యములు, చెడ్డవియని రేఁగుట కారంభించిన పరమ పారిశుద్ధ్యధురంధరులలోఁ జేరినవాఁడనని యెన్నఁబోకుఁడీ! కావ్యము శిల్పము, నీతిశాస్త్రముగాదు. ధర్మశాస్త్రముఁ గాదు. శిల్పముయొక్క యుత్కర్షనికర్షముల నేర్పఱుప వలయునన్న దాని రచనాసంవిధానములఁబట్టి నిరూపింప నగునేగాని, 'భగవద్గీతలయంత పారిశుభ్ర్య మిందులో లేదు, రామానుజభాష్యమువలె ముక్తిదాయకముగాదు' అని వాపోవుట నిర్నిమిత్తప్రలాపము. తుదకు గోప్యములఁ బచ్చిగా వర్ణించినను నీతిశాస్త్రముంబట్టి ఖండించుట తెలివి తక్కువ. మఱి రసభంగమా కాదా యనుటయే శిల్పవిమర్శ నముయొక్క ఒక్క పరీక్ష. తక్కిన పరీక్షలిట యధికప్రసంగ ములు. ఆభాసములు. నాకుం జూడ ప్రబంధములయందు మనకుఁ బ్రీతిలేమికిఁ గారణము వానియందు నీతిలేమిగాదు. మఱి రసపోషకములగు స్థితిగతులకు వెలియై, రసికుల కెల్ల నవి వైరస్యము మెండుగఁ గల్పించుట. శిల్పముయొక్క ముఖ్యోద్దేశ్యము మనసును హరించుట. ఈ వశీకరణశక్తి యుండినయెడ నీతిలేకున్న నేకొదవయు లేదు. అది లేనిచో

నుపనిషత్తుల నుడుకఁబెట్టి ధృతియంతయుఁదీసి యందు నించినను నే ఫలమునులేదు. కావున మన భాషకు నీతి ముదురునట్లు చికిత్స, దోహదము, ప్రాయశ్చిత్తముఁ జేయ వలయునను పరమపారిశుద్ధ్యధురంధరుల కొక దండము వెట్టి దూరముగఁ బొమ్మనుటయే కర్తవ్యము. ఇష్టములేకున్న నీ గ్రంథములవారు చదువనేల? ఎవరును బతిమాలుకొలేదు గదా! ఇంట్లో గొళ్లెము వేసి పాపములఁ జొరనీక భద్ర ముగానుండినను సరే. మఱి ధర్మోద్ధరణక్రియకై పోలీసు వారి శరణుఁ జొచ్చినను సరే! మన త్రోవ మనది.

కవిత దేశీయుల నడవడిక సూచకము

పాశ్చాత్త్యులయొక్కయు హిందువులమగు మనయొక్కయు శృంగారవాక్యముల తారతమ్య విమర్శనముచేఁ దేలినవి కవిత్వతత్త్వవిషయములేకావు మఱి కాలదేశములచే సిద్ధాంతములైన జనుల జీవితములకును గృతులకును నిత్యసంయోగ ముండుట యింకను బ్రధానమైన యంశము, కావ్యములు ఊహామాత్రములనుట గొంతవఱకుఁగాని సమగ్రముగ నిజముగాదు. ఎంత యూహింపఁజాలిననేమి? మన చుట్టుఁబట్టువారల భావముల గతుల స్పర్శ యేమాత్రమును లేని యూహలఁ జేయ మనకు సాధ్యమా? జనుల నావరించి యుండు స్థితులు కొంతకుఁ గొంత యేని దప్పక కావ్యదర్పణముునఁ బ్రతిబింబింపకపోవు. కావ్యపరిశీలనము చక్కఁగఁ జేసి తిమేని జనుల నడవడి, చరిత్రము, జీవించువిధములును

బొత్తిగా గోచరింపకపోవు. ప్రబంధములయొక్క దౌర్భాగ్యము దేశదౌర్భాగ్యముయొక్క ప్రతిబింబము. నిష్కారణముగ భాషనుబట్టి పీడించెడు పిశాచిగాదు.

ప్రభావతీదేవి వర్ణనము తుచ్ఛము

ప్రభావతీ ప్రద్యుమ్నము నానారసశోభితంబుగాదు. ఉండు నొక రసము సైతము తగినరీతుల విలసనములుగల్గి నానాకారములం దాల్చిన మహోత్తరమాయగా నుండమిచే విసుగు నిచ్చుచున్నదియని తోఁచెడిని. "లోకోభిన్న రుచిః" నా మాట నామట్టుకు. ఐనను గారణములఁ జూపుట విధి. శుచిముఖిప్రభావతీదేవింగూర్చి ప్రద్యుమ్నునితోఁ జేయు దీర్ఘ ప్రసంగముం జూడుఁడు.

సీ. "నెత్తమ్ములనుచుఁ గ్రొన్నెలలంచు
పటుఫలశ్రీలంచుఁ దాబేటి చిప్పలనుచు."

అను రెండవ యాశ్వాసములోని ౬౮-వ పద్యము మొదలుకొని

క. "ఏయంగకమునుభావన
చేయక వ్రాయంగరాదు చేసిననానం
దాయత్త మదిఁ జొక్కుఁ బ
రాయత్తపు బుద్ధిఁ జెలువ నలవియెవ్రాయన్"

అను ౯౬-వ పద్యము వఱకును

ఇందుఁగల యశ్లీలదోష మటుండనిండు. అది మన సదాచారములలో నొకటి. చెలువము శుద్ధముగ లేని కుయుక్తులు నుపమాభాసములు నెన్ని! నాభియనునది గంభీరమైన చెఱువఁట! నూగారు మన్మథుని చిమ్మనఁ గ్రోవియఁట! పయ్యెదయను ఎలలో బయటఁ బోయి విహరించి నత్తమని కుచకుంభములు పక్షులరీతిఁ గొట్టుకొనుచున్నవఁట! బొడ్డు నొక సొగసు! అదిపొన్నవిరి! ఆ యమ్మయూరువులు ఏనుఁగు తొండములకైన నెక్కువ! అన్నింటికైనను మీఱిన తుచ్ఛసామ్యముం జూడుఁడు! జంఘులు శాలిగర్భములు. వజ్రాల కాంతి నీళ్ళు. అందెలు మళ్ళు. మీఁగాళ్ళు కచ్ఛపములు! బురదయేమో కవి చూపలేదు! ఒకవేళ నీవర్ణనమే కాఁబోలు! ఇట్టి బలాత్కారోపమలకుం బూనినచో, గాడిదె, గుఱ్ఱము, క్రోఁతి, కొంగ మొదలగు ప్రపంచములోని యే వస్తువుతోనైన స్త్రీలఁ బోల్చి వర్ణింపవచ్చుఁగదా! సరేకాని నా కొక సందేహము. ఇంత విశదముగ భాగభాగమును బెదవులు చప్పరించుచు శుచిముఖి వర్ణించెఁగదా. దాని కీ యంగోపాంగదర్శన మెట్లబ్బెను! పూర్వము కన్యామణులు కోకలు విప్పి తాండవమాడుచుంటగలదా! లేక, యందఱికిని వస్త్రములను మానమును వ్యర్థముచేయు దివ్యదృష్టియుండెనా? మఱియు, పింగళి సూరన్న కృతులలో పాత్రములు సాధారణముగ దీర్ఘచర్చలఁ జేయరు. కవి బహుచమత్కారముగ మాటమీఁద

మాటవచ్చి విషయము విశదమగునట్లు సంభాషణ లేర్ప ఱుచును. నాటకకౌశలమని పేర్కొనఁబడిన ప్రతిభలో నిది యొక కళ. ఈ శక్తిలో నితఁడు లక్కనతో సమానుఁడన్నను బైమాటగాదు. నిదర్శన మిఁకముందు నివేదింతును. ఇంత సమర్థుఁడయ్యును అంగవర్ణనాశృంగారమునకుం బూనె నేని యాశక్తిఁ గోలుపోయినవాఁడౌట యెంతయుఁ జింత నీయము. శుచిముఖియొక్క యుపన్యాసము ముప్పది పద్య ములకన్న నెక్కువ. ఇంతసేపును బ్రద్యుమ్నుఁడు నోరు వచ్చిన జీవముంబలె నిలుచుండుటఁ జూడ, అతనికే కాదు, మనకుఁగూడ నలసట! పాత్రములను ముందునిల్పిన పిమ్మట నెల్లరు నప్పుడప్పుడేమైనఁ జేయుచున్ననే వినోదము. ఒకరు నోరు బ్రద్దలగునట్లు మాట్లాడుచు తక్కినవారు కొయ్య బొమ్మలరీతిని, పల్లెటూరివాండ్రవలెను, నోరుదెఱచికొని తెప్ప వేయక నిలువఁబడియుండిన ప్రకృతికి రసమునకు రెండిఁటికిని కీడు. సామాన్యులగు కవులలో నీదోషము లుం డిన విచారము లేదుగాని, మహాకవియు సంభాషణరచనలలో దక్షుఁడునైన సూరనార్యుఁడీ లోపమున వ్రాలుట మనసు గుందించు చెడుగు:

ప్రభావతియొక్క కామనిర్భరత యేవంపుఁబాటుగాఁ దోఁచునేకాని రమణీయమని యెన్నుట దుస్తరము. వచ్చిన యావేశముం జూడుఁడు.

ఉ. "ఇట్టి మనోహరాంగుఁ డొకఁ డెందయినం గలఁ డేని, కల్గియుం
గట్టిగ నా కతండు బిగి కౌఁగిటఁజేర్పఁగ వచ్చు నేని, నే
నిట్టటుఁ గొంకినన్ విడక యిష్టవిహారములెల్లఁ గాంక్ష జే
పట్టి యొనర్చు నేని, రసభావము లెట్టివి యొక్కొ యత్తఱిన్!"

(ప్రభా. ఆ. 3 ప. ౪౧)

మఱి చెలికత్తె ప్రభావతియొక్క విరహచిహ్నాలను శుచిముఖికిం జూపుటదిలకింపుఁడు.

సీ. "నెలఁత ముక్కరయందు నీలంబుగాదు సూ
తెలిదలుకొత్తు ముత్తియము గాని,
యువిద సందిళ్ళ బాహుపురులు గావు సూ
మితిచూడ నిడిన యూర్మికలు గాని,
సుదతి పాలిండ్లఁ గస్తురి నల్పు గాదు సూ
కనుదోయి కాటుక కప్పుగాని
రమణి కర్ణికల వజ్రపు దీప్తిగాదు సూ
ప్రాఁగెంపుదునకల రంగుగాని

తే. యూర్పువేఁడిమిఁ గృశత బాష్పోదయమున
గండ పాండిమఁ దత్తత్ప్రకారములను
గానఁబడియెడు నోవిహంగమ పురంధ్రి
యింక నీచేతనున్న దీ యింతిబ్రదుకు."

(ప్రభా. ఆ. 3. ప. ౮౭)

చెలికత్తెలీరీతిఁ జెయివేసి విప్పిచూపుటకోర్చెడు రాజకన్యకలెంత సుకుమారులు! పూర్వము ఆడికెల ధారణామే

యున్నట్లు లేదు. రాణివాసములో నేమైలయు సోఁకక పెరిగిన కన్యామణి తన భావము ప్రకటించురీతి వినుండు.

సీ. "ఆ రతికిఁ గరంబు లైతిరే నవ్విభుఁ
  గౌఁగిలింపఁగ నబ్బుఁ గరములార!
ఆ యింతికిఁ గుచంబు లైతిరే నతని వ
  క్షోనిపీడన మబ్బుఁ గుచములార!
ఆలతాంగికిఁ జెక్కు లైతిరే నారమ్య
  శీలుచుంబన మబ్బుఁ జెక్కులార!
ఆ నెలంతకు వీనులైతిరే నా కళా
  విదు మంతనం బబ్బు వీనులార!
తే. యట్లుగా నోఁచకేల నాకైతి రకట!
యని నిజానయనంబుల కాత్మఁగచు
బాల్యమునఁ దన్ను రమణసౌభాగ్య కలిత
యనిన సాముద్రికుల మాట లరసిలిట్టు."

(ప్రభా. ఆ. 3. ప. ౧౦౪)

ఇట్లు అంగములంగూర్చి పలవించుట గణికలకైనఁ దగునా? మోహమనఁగా వీరికి దేహక్రీడయేకదా! ఇదియా శృంగారము! 'అయ్యో! నాకుచములారా! మీరు ఆ యమ్మను జేరియుండిన సుఖపడుదురు గదా!' యని యెవ్వరైనఁ దలంతురా! ఆత్మతృప్తి గోరుదురే కాని, యంగాంగములకుఁ బ్రత్యేక సుఖమున్నదని భ్రమించి వాని ప్రారబ్ధమునకై విలపించువారున్నారా? శృంగారప్రకృతి మన కవులకు నగోచరార్థము. సుఖమెఱుంగునది మనసు. ఇంద్రియ

ములకు నెఱుక నహి. అవి జ్ఞానము కర్మము మొదలగు క్రియల కుపకరణములు. మనసు ప్రపంచముం దెలిసికొను టకు, నిచ్ఛారీతిఁ గార్యముల జేయుటకు నను వైన మార్గ ములు. వానికి ప్రత్యేకముగ సుఖము ననుభవించు ప్రభా వము లేదు.

సీ. "ఓ హంసి! నిన్ను నే నొక్కాటి తుదమాట
యడిగెద నీ హృదయంబు నందుఁ
గలయట్లు చెప్పుమీ కల్లలాడిననీకు
నాతోడు సుమ్ము ప్రాణసఖి వీవు
తడయక ప్రద్యుమ్ను కడకింక నొకమాఱు
పోయి దుస్తర మైన నా యవస్థ
చెప్పి చేరికఁ గొంత చేయవచ్చునొ రాదొ
యీ దురాశాపాశ మెందుఁ దెగని

తే. బంధమై ప్రాణముల వెలువడఁగ నీక
యూఁగి పెంచెడు మదనాగ్ని నహరహంబు
నీవు చని యవుగాములు నిశ్చయించి
యాశఁ దెగఁ గోయుమదియె మత్ప్రాణరక్ష."

(ప్ర. ఆ. ౩. ప. ౧౦౭.)

వరుండు వలచివచ్చిన నుత్తమురాండ్రు సంతసింతురు. ఒడంబడుదురు. ఈ కన్యయో వాఁడు, కరుణ, పశ్చాత్తా పము వీనిమైవచ్చినను జాలుననుచున్నది! వలపునఁగూడ బిచ్చమడుగువా రెట్టివారు? దానితోఁ దుష్టిఁజెందు వా రింకను నెట్టివారు. ఈ లాలసత చిత్తవికారముగాదు. మనో

విభ్రణముగాదు. ఆత్మస్పర్శ లేని శరీరతాపము. రోగికి మందువలె, వినికిచేతనే ప్రజ్వరిల్లు కన్నెలకు నాయకసంగమమును తాపహరము. మనోహరమనుట బొంకు. మన్మథుఁడు మనోభవుఁడట! దానికన్న సంగభవుఁడనుటలో నర్థ ముత్కటము!

క. 'అని నిజ శంకల కన్నిటి
కినిఁ బరిహారములు సెప్పి గెంటకయుండన్
దనయాస నిలుప దితిసుత
తనయ రమణుఁ గవయ మిగులఁ గమకించు మదిన్.''

వ. హంసిం జూచి.

సీ. ''నీ చెప్పినట్లు యిన్నియునైన మొదలఁ ద
త్పుర మెంత దవ్వో నీ వరుగు టెపుడు
పోయి వేళ యెఱిఁగి పొసఁగ నవ్విభునకీ
దృశమైన నాకోర్కెఁ దెలుపు టెపుడు
తెలిపిన నేవిఘ్నములకు లోపడక నా
పై నతఁ డనుకంపఁ బూను టెపుడు
పూని తా నిచటికి రానొక్క నెపమున
గురునాజ్ఞ దొరకించు కొనుటయెపుడు
తే. నట్టి పెనుమత్సరపురాశి వజ్రనాభుఁ
డస్మదిచ్ఛకు ననుకూలుఁ డగుటయెపుడు
విరహవారిధి నేఁగడ వెళ్ళు టెపుడు
వలవని దురాశలను గుమారిలు టెగాక.''

(ప్రభా. ఆ. 3. ప. ౧౨౦, ౧౨౧, ౧౨౨.)

ఇది గఱువతనము! మితభాషలేని జావళీసరసము! కలహంస ప్రద్యుమ్నునితో నమ్మగారి వేదనల నెంత మఱుఁగు వెట్టి నుడివెడినో యాలకింపుఁడు!

చ. “కొఁగరకచూపుచేతఁ గడుఁ గ్రోలిన నీచెలువంబు చెల్వమా
నసమున నెంతమిక్కిలి ఘనంబుగ హత్తెనొ కాని యప్పుడో
రసిక శిఖావతంస! యదురత్నము! కాకరకాయ రీతిగాఁ
గిశలయపాణి చన్నుఁగవ క్రేవ గగుర్పొడిచెం బొరింబొరిన్.”

ఉ. “వావిరి నెల్ల ప్రొద్దును భవత్పరిరంభణచుంబనాదినా
నావిధభోగలీలకు మనంబున నువ్విళులూరుచున్కి శ్రీ
డావతి దెల్పెఁ గొన్ని నిశలం గనుమూసినయంతమాత్రఁ బై
పైవిలసిల్లు కుట్టమితభావ విశేష విజృంభణంబులన్.”

మ. “కలలం గూడిన వేళ నెట్టి పొలయల్కల్పుట్టెనో, యేమి నీ
వలనం దప్పు ఘటిల్లెనో, యెఱుఁగఁ, దత్స్వప్నాగమామర్శవి
హ్వలిత స్వాంతయుఁబోలె నిద్ర నెఱయన్ వర్జించెఁ బద్మాక్షి యా
తు లహోరాత్రములందుఁ బద్మకుముదస్ఫూర్తిన్విడంబించుచున్”

(ప్రభా. ఆ. ౪. ప. ౭౫. ౭౬. ౭౭.)

ఇది జావళీలకన్న నికృష్టమైన పాళయగాండ్ర శృంగారము! ఇట్టి యనౌచిత్యములఁ బలికిన జనబాహుళ్యమునకు వేదాంతవాదములచే నగుదానికన్న నెక్కువ విరక్తి తటస్థించును. ఇదియ సరససల్లాపమని భావించు మృగప్రాయులింకను మన దేశమున నున్నారా?

ప్రభావతీదేవి కన్నెయయ్యు నారితేఱిన గణికలకృత్యముల శ్రద్ధగాఁ జేయుటయందెంత ప్రౌఢయో యీ పద్యమునఁ దెల్లంబయ్యెడిని.

సీ. "కేళీ గృహంబు ముంగిట గర గరికలా
　　లోకించు గంధాంబు సేకమరయు,
నలుగు పూఁతలఁ బరిమళముఁ బరీక్షించు
　　రంగ వల్లికల తెఱంగుఁ జూచు,
పకినల మంచంబు జాడ విమర్శించుఁ
　　గుంకుమ పఱపు భంగులు గణించు,
హారంబట్టు తలగడ యొప్పు విచారించు
　　నగరు ధూపముల సోయగములెంచు,
తే. నలరు టోనర్లుమేల్కట్లు నంగరాగ
　　పూర్ణపాత్రికలును గందవొడి బరణులు
　　జాలవల్లిక లాదిగా సముపభోగ
　　సాధన శ్రీలు పరికించు సారెకబల."

(ప్రభా. ఆ. ౪. ప. ౧౪౪.)

ఇట్లు భోగసాధనములెల్ల సమకూర్చి సర్వసన్నాహసమేతురాలయ్యుఁ బ్రియుఁడు రాఁ గొంత దామసించినం దున, మఱియొక విరహప్రలాపమునకు మొదలిడఁజొచ్చి యేమనుచున్నదనఁగా.

క. "పత్తు నవశ్యము నేఁడని
చిత్తము తమిరేఁచి యంతఁ జింత యొకతెపై
హత్తిన నదిస్పృథ వుచ్చినఁ
బుత్తురు మగవారిమాట పొసగదు నమ్మన్."
(ప్రభా. ఆ. ౪. ప. ౧౪౭.)

ఇట్లుత్కంఠఁ గొనియుండియు శాస్త్రప్రకారము చంద్రోపాలంభనము సమకూర్చిన యీపెయొక్క మనస్థైర్యమును, కవియొక్క సందర్భశుద్ధిని పొగడుటకు నాదిశేషునకైన నలవియా? పిమ్మట చంద్రునివదలి దక్షిణానిలునిఁబట్టినది. అటుతర్వాత నతనికొకింత విరామదానం బొసంగి, మన్మథుని పైకెత్తుకొని, యీ యలసటచేత శాస్త్రక్రమముగఁ, బ్రాణములు కంఠగతములుగాఁగా, 'ఇదే చచ్చెదను జూడు' మని "చెప్పలు దేలవైచుచు" క్రిందఁబడిన నొప్పిగదాయని "పూలపాన్పున వ్రాలఁబోవుటయు." పూర్తిగా వ్రాలలేదు! ఈ తమాషానంతయు ప్రచ్ఛన్నరూపముతో డ్రామారీతిగాఁ జూచుచుండిన ప్రద్యుమ్నుఁడు ప్రత్యక్షమై పట్టుకొనఁగా, అమ్మకు నెక్కడలేని సిగ్గువచ్చినది. పాపము! ప్రభావతి యెంతమంచిది! తనబాధలు దనకుండఁగా నలంకారశాస్త్రమున కేబాధయు రాఁగూడదని పరోపకారవృత్తిమై, ప్రతిదూషణమును, ప్రతిదశను దప్పక యాదరించి చూపినదిగదా! వరుఁడును ఎంత ధీరోదాత్తుఁడు! ఈ నాట్యములన్నియు ముగియు

వఱకుఁ దమిని బిగఁబట్టిన వోర్పుకాఁడు! అయ్యో! దరి ద్రమా! అనివార్యమైన మోహమును గోఁతివలె నాడిం పఁజూచుట శృంగారమా! వికారమా? ఇంతటితోఁ బో యెనా? ప్రభావతి ముప్పది పద్యములరోదనము శ్వాసము బిగఁబట్టి, పూజారులు మంత్రములనే కరువు వెట్టినట్టు త్వర త్వరగాఁ జేయుచుండఁగా, 'ఏమమ్మా' యనియైన నడిగినఁ గాలయాపనముగదాయని యుచితమానముం దాల్చిన శుచిముఖిరాగవల్లరులు, వధూవరులు పడుకటింటికిం బో యినవెనుక వెన్నాడి మధ్యస్థములకుం జొచ్చుట మన వంటివారికి ఱోఁతయనిపించును. వారెంతే దయతో నా గాంధర్వపుఁ బెండ్లికూఁతును బిలుచుకొనివచ్చుట, బుద్ధులు గఱపుట మొదలగు వేడుకలున్నవి. "తిగిచినరాక యీ డిగింపంబడిన" దఁట! చెలికత్తెలును శాండో కుస్తీచేసిన బల శాలినులు గావున నెట్లో తుట్టతుదకు దేవిగారిని "ఏనుఁగుఁ గంబానకుఁ దెచ్చినట్లు" తెచ్చి విభునిముందఱ నిలిపి యొక చిన్న యుపన్యాసమిచ్చి వెళ్లినారు: వెళ్లినారని తోఁచు చున్నదిగాని, నిజముచెప్పలేను! ఇవియ మనవారిరాగములు. కోమలత, మార్దవము సౌకుమార్యము మొదలగు సౌమన స్యంబులకు వెలియైనవగుట నాగరికపుఁ జందముగలవారికి నింపుగావు. మఱి పూర్వకాలపు నవాబులు, రాజులు, పాళయగాండ్రు మున్నగు మోటువారికి తగియుండునే మో. భావించుటయు బహుప్రయాసము. ప్రభావతీదేవి

తరువాత శాస్త్రోక్తరీతిని బొలయలుక దాల్పఁగా నాయమఁ దేర్పం బ్రయత్నించి, యెంతకుఁ దేఱకున్న (నియమిత కాలము నిండని దా యన్ను తేటిన నది తప్పుగదాయని యోజింపనంత మూఢుఁడు) ప్రద్యుమ్నుఁడు నిష్ఠురముగా "దానవునకు నుదయించిన, దానవుగావున లతాంగి! దయ చాలదు" అని, 'భార్యమీఁదఁ గోపమువచ్చిన నామె పుట్టు పూర్వోత్తరముల నెల్లఁ దడవి తడపి వాపోవపలయు' నను సనాతన హిందూగృహస్థధర్మము నుద్ధరించుటయు మిక్కిలి చిత్రము. ఈ పొలయల్కకు ప్రేరకము శ్లేష. మగఁడు ఒక యర్థము నూనినవాఁడై "రతీ! భవదుత్తమరతీ!" యని ధ్యానించుచుండఁగా, నందు వేఱొకయర్థము గనిపెట్టిన ప్రభావతి

"పట్టపు దేవియైన రతి
భ్రాంతినె పల్కెదవేమొ నాథ! నే
గట్టిగ నారతిప్రముదఁ గాను!
ప్రభావతి యండ్రు నన్నిలన్".

అని యతనికిఁ దన పేరెత్తి చెప్పునంత కోపనయగుట సహజము. ఈ ప్రణయకలహముచే ప్రద్యుమ్ననికి విరహ వేదన రెండవతరంగమురీతిఁ బొంగి పొరలఁగా, హంసకుఁ దన కష్టముఁ దెలుపుచు, నా మాటగాఁ బ్రాణేశ్వరితోఁ జెప్పుమని యేమని వ్రాయుచున్నాఁడు.

ద్విరదగతిరగడ. "ఓహంసి నీచేత　　.　　.　　.

నీమోవి చిగురుఁ దేనియలు గ్రోలెడి యాస
నీమొల్క నవ్వువెన్నెల చలువగొను నాస
నీమృదు కపోల సన్నిధిని మోమిడు నాస
నీమోహనశ్రోణి నిమురఁగలిగెడు నాస
నీదు పాలిండ్ల నానెడు నక్షునను నాస
నీదు శృంగార కళ నెలవులంటెడి యాస
నీదు మణితామృతమునింతుఁ జెవినను నాస."

(ప్రభా. ఆ. ౫. ప. ౧౫౨.)

పశుకృత్యమే కామమనుట యిందుచే సువ్యక్తము గదా! మఱి యిట్టి వ్రాఁతల నితరులకు వ్రాయువాని మన శ్శుభ్రత యెట్టిదో! కవి ప్రద్యుమ్ను నిట్టి నీచపాత్రముం జేయుట యాతఁడు గొల్లఁడనియా?

దోషవిచారము చాలదూరము చేసితిమి. ఇందునకుఁ కారణములు రెండు. నిష్పక్షపాతబుద్ధితో నారయుట విమర్శకుల ధర్మము. రెండవది కళాపూర్ణోదయముయొక్క గొప్పదనముకొలఁత యెత్తఁగోరిన సాధారణ ప్రబంధముల కుం దానికింగల వ్యత్యాసము ప్రకటించుట యావశ్యకము. ఇంతేకాని దోషములఁ జూపినందున గుణముల లేవను నన్యాయ్యాపవాదము మోపువారము గాము.

కావ్యములోని మంచిగుణములు

ఎంత దక్కువపడినను స్వభావమును బూర్తిగఁ బోఁగొ ట్టుకొననౌనా? అట్లే యెన్నిలోపములున్నను సూరన తన

నైజమునేల విడుచును! ఈ కావ్యములోఁ గొన్ని యద్భుత విశేషములున్నవి. అవి యనితరసాధ్యములు. మానవ ప్రకృతి నద్దమువలెఁ జూపించునవి. సంభాషణములు విస్మయావహములు. నాటకధర్మములను బోషించియున్నాఁడు. స్ఖాలిత్యములతోఁ మిశ్రమైనదను చింతయేగాని నాకు, గుణము మగ్నమైనదని క్షణమైన నెంచినవాఁడఁగాను. ఈ గ్రంథమున నాశ్చర్యకరమైన పాత్రము శుచిముఖి. ఈ హంసియొక్క దిట్టతనము, బిగువు, నేర్పు, తీఁపిమాటలు, మెత్తమనసు, చమత్కారము నాహ్లాదకరములు. అనేకపాత్రములు ప్రదర్శింపఁబడు స్థానముల వర్ణనలు తఱుచుగ సంభాషణమూలముగఁ జేయఁబడియున్నందున నివి పొలుపెక్కినవి. సంభాషణములనఁగా దీర్ఘప్రసంగములుగావు. అవి సామాన్యప్రబంధకారుల విలాపములు. మఱి యిందుఁ గలసి మెలసినట్లు పలుకఁబడు వచనములు. మాటమీఁదుగా మాటవచ్చిననే యందము. బడిపంతులవలె అరగంట వ్యాఖ్యానముంజేసిన నాటకసరణి చెడును. కథయందు నిరర్థకాంగములు మెండుగ లేవు. కల్పనయొక్క జిగిబిగి కళాపూర్ణోదయమునకన్న సాంద్రమని నావిజ్ఞప్తి. ప్రత్యేక వర్ణనలు భావసమృద్ధములు. చూడుఁడు. ప్రద్యుమ్నుఁడు 'పోలో' యనఁబడు గుఱ్ఱపుసవారి చెండాట నాడుచుండుట కవి యెంత రమ్యముగ వర్ణించియున్నాఁడో!

సీ. "తోలుదొల్తనయ్యేక తురగంబు మండల
గతిచారియగుచు నిక్కంబు దోఁచె
నావెనుకను సరూపాశ్వాలి చెదరక
చక్రాకృతిని బర్వుసరణిదోఁచె
నంతటననలిస్ఫుటావయవంబుగా
నెనసియేకాంగ వేష్టనతఁ దోఁచెఁ
దుదిఁ దద్విభూషణ ద్యుతిరాజి మాత్రంబు
కొఱవి త్రిప్పినరీతి మెఱసితోఁచె

తే. నంతకంతకు గతివేగ మగ్గలింప
రాఁగవాగె యెచ్చరిక పరాకుజియ్య
యను జనులు రిచ్చవడి తమపని మఱుపఁగఁ
బరఁగునమ్మేటి నెఱరౌతు ప్రాశికతన."

(ప్ర ఆ. ౨. ప. ౩౨.)

ఇట్టి వేగము అనుభవమున లేకున్నను, ఒకవేళ నంత వేగముదటస్థించినయెడల కవి వర్ణించిన యాకృతులు గోచరించుట 'రంకల్ రాట్నము' జూచినవారికెల్లఁ దెల్లము. అత్యుక్తియుండిన నిట్లుండనొప్పు, శుద్ధముగ నసాధ్యమని తోఁపఁగూడదు. మఱి యపురూపములైనను భావ్యములుగ నున్న స్వారస్య మెక్కువ. విరాళిపాలైన ప్రద్యుమ్నుఁడు నిర్హేతుకములగు నుత్సాహ నిరుత్సాహ స్థితులం దాల్చి లేనిపోని కారణముల నూహించుట మోహగ్రస్తులకు స్వాభావికమైనస్థితి. ఇది యీ కవి వర్ణించినట్టు లితరు లెవ్వరుఁ జేసిన జాడ నాకుం దెలియదు: వినుండు.

చ. "శుచిముఖి మాట యొండరసి చూడఁగ నెంతయు నాసపాటొన
ర్చుచు మదిఁ ద్రిప్పుచున్న యది, చూడ్కికి నన్నె పోలువాని నా
రుచిర తరాంగి చిత్తరువు రూపొకటిన్ రహిఁ జూడఁ జెప్పెఁ ద
ద్వచనము చొప్పు నేమినియతంబు సమాకృతులెందుఁ గల్గవే."
(ఆ. ౨-౪.)

చ. "ఇది పదిలంబుగా నడుగకే నపుడక్కట కోర్కి దాఁచి వ
ట్టిదొరతనంపు నీటు ప్రకటించితిఁ, బాపపు లజ్జ నన్ను నో
రదిమె, ననాదరంబు తెఱఁగై యది హంసికిఁ దోఁచె నేమొ! ని
ల్వదమతియించుకైన, గలుగ ల్చవి గాని కథల్వచింతురే!" ౫

ఉ. ఏనొక యించుకంత మనసిచ్చిన మాటలు పల్కకుండఁగాఁ
గాని మరాళి యద్దనుజ కన్యకకై ననునొత్తిమాచి యే
మైన ననంగఁ బూనునని యాత్మకుఁ దోఁచుచు నున్న దిడ్డు, కా
దేని ప్రసంగముం దిగిచి యేల నుతించుఁ దదీయ రూపమున్. ౬

మ. అటుగాకద్భుత రామణీయక గుణాఢ్యంబైన సద్వస్తువుం
బటువాచారసికుల్ ప్రసంగమయినన్ బారంబుముట్టన్ రసో
త్కటతం జెప్పక మానఁజాల రను పక్షంబొందు భావించినన్
ఘటియిల్లున్ వనితాంగ వర్ణనకు నిక్కంబన్యథా సిద్ధియున్. ౭

చ. హరియును వాసవుండుఁ దము నంపినకార్యము హంసి దానయై
ధరణికిడిగ్గి చెప్పి మదుదగ్రమనస్థితిఁ గాంచు టెన్న గా
సురరిపుఁ జంప నన్ననుపు సుద్దులు పుట్టఁగఁ బోలు నెల్లెడన్
సరసిజనేత్రు దక్షిణ భుజంబవు నీవని పల్కినందునన్. ౮

ఉ. అన్నియు నేకవాక్యముగ నారయ నాసలు వెంచు పక్షమే
యున్నది కొంతమించి యిదియోజన సేయఁగ నాదురూపెయా
కన్నియచేతి చిత్రఫలకంబున నున్నది యెవ్వరట్టిచో
నన్ను నెఱుంగ వ్రాయననినన్ శివ వ్రాయుట వింటిఁ జూడఁగన్" ౯

ప్రభావతీరాగవల్లరుల యేకాంతగోష్ఠులు బహు రమ్యములు. అందఱికన్న నుత్తమపాత్రంబగు శుచిముఖిం బ్రశంసించి ప్రభావతీప్రద్యుమ్నుల నింతటితో వదలుదము. వారును వదలినఁ జాలునని యుత్కంఠమై గ్రుక్కిళ్లు మ్రింగుచున్నారు!

శుచిముఖి చరిత్రము

వజ్రనాభుని పురంబులోని విశేషంబులు మీఁ రెఱింగి తెలుపుండని మరాళముల నింద్రుఁడు నియమించునపుడు, ఈ హంసికథలోఁ బ్రవేశించి, యతనితోఁ జిత్రఫలక వృత్తాంతముఁ దెల్పి, యిఁక దైత్యునకుఁ గాల మాసన్నమయ్యెనని ధైర్యము చెప్పినది. ఆ సందర్భములో నింద్రునితోఁ జెప్పినట్లు రాగవల్లరీ ప్రభావతులకు ప్రద్యుమ్నుని విషయమై నడచిన సంవాదమును నివేదించినది. పిమ్మట ప్రద్యుమ్నునికి వలపుపట్టునట్లు నాయకురాలిని వర్ణించుట పూర్వమే తెలిపియున్నాము. అందును బింకమును స్త్రీ స్వభావమును వెల్లడిసేయుచున్నది. ఎట్లన. ఈ కార్యమునకై యేతెంచినదయ్యు ప్రద్యుమ్నునితో "రహస్యమైనదియె యైనను భవత్పరిపృష్ట మెంతయుఁ, జనకనిమేషముం దడయసంగతిగాదునుమాకు నైన నీ, వనఁగ జనార్దనుండనఁగ నారయ భేదము లేదుగావునఁ, విను వినిపింతు"నని బిగువు బేరము గనఁబఱచినది! మఱి కన్యామణి సౌందర్యముం గూర్చి నిమిషము నిలువనోపనిదయ్యు గంటపట్టెడు వివర

ముల లెక్కప్రకారము వినుతించియు, తన ప్రతిభను గొంత చెప్పునదియై

ఉ. "ఎమ్మెయిఁ బ్రజ్ఞమీఱ నచియించెదనన్న నచింపలేన య
క్కొమ్మ బెడంగులోన నొక కోటి తమాంశమునైన, నంత మా
త్రమ్మ మదుక్తిశక్తి యనరా దతివాఙ్మహిమాఢ్య నేను, మా
యమ్మ సరస్వతీసతి తనంతటిదానిగనన్ను దిద్దుటన్."

చ. "నలినజురాణివాస మొకనాఁడు ననుం దనచేత ప్రోదిరా
చిలుకను వాదుకుం గవితఁ జెప్పఁగఁ దా నియమించి యందునా
పలుకులఁ గొంతవాసిగని భావమునంగడు మెచ్చుచు న్నఖాం
చలమున నాదు రెక్కలను చక్కఁగ దువ్వుచు గారవింపుచున్.

చ. ప్రబలములైన కౌతుక కృపారస వత్సలతాదరంబులన్
శబలితచిత్తయై యపుడు నా 'కుపమాతిశయోక్తి కామధే
ను' బిరుదమిచ్చి తల్లిఖితనూపురముం భువనైకమాతయ
య్యబల మదంఘ్రిఁ దాఁదొడిగె నాబిరుదం బదిచూడుమేర్పడన్."

(ప్రభా. ఆ. ౨. ప. ౯౦, ౯౨, ౯౬)

అని నుడివి బిరుదములకు దర్శనప్రాయ వాక్యము లాడినది! అన్నింటికైనను సొగసైన ఘట్టము ప్రభావతీ శుచిముఖుల వాగ్యుద్ధము. తన రహస్యము ప్రకాశము చేయక ప్రద్యుమ్నుని వృత్తాంతముఁ దెలిసికొనవలయునని ప్రభావతియు, ఆ గుట్టు దీసికాని యామె కోర్కె నెఱవేర్పఁ గూడదని హంసియు, నొండొరులఁ జఱచి మల్లయుద్ధనైపుణిం జూపుట (అనఁగా మాటలమాత్రము) యుత్తమోత్తమ

ప్రదర్శనములలో గణ్యము. స్త్రీ స్వభావము నెంత నేర్పుతోఁ గనుపఱచుచున్నాఁడు! ఆ ఘట్టమునంతయుఁ జదివినఁగాని దాని చవిగ్రోలలేము.

(మూఁడవ యాశ్వాసము ౪౪-వ పద్యము మొదలు
౩౫-వ పద్యము వఱకు.)

క. ఇటు గాక లోకముల నిం
తటిచెలువుఁడు గలఁడె గలిగినను సుబ్బెద యి
చ్చట నచ్చటఁ గలఁ డని య
క్కట నన్నిట్లేచు టంబకరుణ తెఱంగే.

సీ. అని పల్కుపలుకు లాయవసరంబునఁ దత్స
మీపంబునం దనురూపగతిని
శుచిముఖి సంచరించుచు విని యిత్తన్వి
చిత్తంబు వడసి యేఁ జెలిమికలిమి
హత్తించుకొనుటకు ననుగుణం బగువేళ
యిదియ యటంచు నూహించి మదిని
దగునుపాయంబు వితర్కించి యపుడు య
దృచ్ఛనపోలె నా తెఱవయెదుట

తే. నడ్డముగ నల్లనల్లన యరుగుచు సవి
మర్శదృష్టినిఁ బలుమఱు మరలి మరలి
చిత్రఫలకంబువంక వీక్షించెఁ గొంత
సరిగడచుదాఁక నొకవింతసరణి మీఱ.

క. అపు డమ్మరాళి చందం
బుపలక్షించుచుఁ గపోలయుగ్మము దరహా
సపుఁగాంతిఁ దనరఁగా నా
చపలేక్షణ తనదుప్రాణసఖి కిట్లనియెన్.

క. కలదులపులుఁ గిది తానే
మెలుఁగునొకో తిరిగి తిరిగి యీఫలకముపైఁ
బఱపెడుఁ జూడ్కులు నా నా
మెలుఁగుంబోఁడికి మరాళి మృదుమధురోక్తిన్.

వ. ఇట్లనియె నోపడంతీ నీ పలికినట్ల మా యట్టితిర్యగ్జంతువు లేమియు నెఱుంగమి యథార్థంబయ్యెనను నేను నీచేతిచిత్రఫలకం బర్రపడి చూచుటకుం గారణంబు వినుము మున్నొక్కచోట నొక్కపురుషుం జూచి తత్సమానరూపుని మఱి యెందునుం గానక యిప్పు డిందు నతని కైవడి దోఁచిన నిది తదీయరూపం బెఱింగి వ్రాసినతెఱంగో యటు గాక యట్టివాఁడె వేఱొక్కఁ డెక్కడ నైనం గలిగెనో యని యించుక విమర్శించి వీక్షించితి నన విని ప్రభావతి యద్భుత

ప్రమోదసందేహంబులు డెందంబునం గ్రందుకొనుచుఁ గందళింప నప్పొలుఁగుం దప్పక చూచి యిట్లనియె.

శా. ఏ మేమీ యిఁక నొక్కమాటు చెపుమా యీ వున్న రూపిట్లయో
యేమైనం గలదో విభేద మిట రమ్మీక్షింపు మింకన్ వచ
స్సామర్థ్యం బరయన్ మహాత్మ వని యస్మ ద్బుద్ధికిం దోఁచె దా
హా మాభావము గాన లేవె మదిలో హంసీ భయం బేటికిన్.

వ. అనిన నది మదిరాక్షి నీక్షించి యిట్లనియె.

క. నీ వనినయట్ల యేను భ
యావహులను గానివారి నాకృతిన కనం
గా వలఁతి నైనఁ బిలునక
యే వెట్టినె చేర నిరువు రేకత మాడన్.

వ. అనిన వెఱఁగంది యాయిందుముఖి సఖియునుం దానును నొండొరుల మొగంబులు చూచి నగుచుఁ జెవులకుం జవులు మివుల నలవరించు గులుకు తెలుంగుగల కలికిపలుకులకె వలచి మొలచు కుతుకంబున నతివశంవదహృదయలై తమ కిద్దఱకుం దాని పెద్దబుద్దులు నుద్దులు ముద్దు రప్పించుచుం దద్దయు నుద్దీపిత రాగంబు లగుచుండ రాగవ ల్లరి యాగఱునతనంబులాగు లేగరితలందును మున్ను కన్నవిన్నయ వియె దీనికఱదు లెంత యరుదులు చూచితే యంచు నాయంచపై నాదరాహ్లాద మేదురనిరీక్షణంబుల నీక్షించి యోపక్షికులభూషణంబ

నీభాషణంబు నిక్కంబ మిక్కిలి నక్కఱ పడి వేఁడక ప్రౌఢలగు గఱువ లిరువు రేకాంతమాడుచోటి కేటికిఁ బోయెద రిది యట్లు గాదు గదా యే యొక్క సందియంబు నివర్తించుకొనఁగోరి యిత్తఱి నత్యంత ప్రార్థనంబు గావించుచున్నవారము గావున నీకన్న యప్పురుషునియొప్పు నిప్పలకపై వ్రాసినరూపంబు చొప్పు నొక్కటి యగునో కాదో యీదండకు వచ్చి నిచ్చలంబుగాఁ జూచి నిశ్చయించి చెప్పు మిప్పుడుచు నేను నిట్టివాఁడెందును లేఁడు కలఁడను వివాదంబునం బన్నిదంబు చఱచినవారము.

క. అనుటయుఁ బందెముకొఱకై
నను వేఱొకపనికి నైన నాకది తెలియం
బని గలదె మీకు నాచే
వినవలసినయర్థ మరసి వినిపింతుఁ దగన్.

తే. అనుచు శుచిముఖి తనమాట కాపడంతు
లీక్షితాన్యోన్యవదనలై యెంతదూర
మఱుగుచున్నది దీనివాక్యాశయ మని
మివుల వెఱఁగందఁ గొంత చేరువకుఁ బోయి.

క. సవిమర్శదృష్టి నాటిత
కవిధాన మొకింత నడపి కడుఁ బదిలముగా
వివరింప నతనిరూపము
యవు నౌ నది యిందు సందియము లేదనియెన్.

చ. అనుటయు రాగవల్లరి మహత్తరమోదవిశేషసంభ్రమం
బునఁ బఱతెంచి యప్పలుఁగుముద్దియఁ దద్దయు ముద్దుగారవం
బున జిగురొత్త నెత్తుకొని పోయి ప్రభావతిదండఁ బెట్టి యొ
య్యనఁ గొనగోళ్ళఁ దత్తనురుహంబులు దువ్వుచుఁ గూర్మి నిట్లనున్.

ఉ. అంచవు గావు నీవు నను నారసి ప్రోవఁగ మూర్తిమత్త్వముం
గాంచినభాగ్యదేవతవు గాని మదుక్తి తెఱంగు నేఁడు గ
ల్పించితి వేజగంబునను లేఁడిటువంటిమనోహరాంగకుం
డంచుఁ గలంచు నిజ్జలరుహానన మానక నాదుచిత్తమున్.

వ. అనిన విని ప్రభావతి నిజవయస్యం జూచి.

తే. రాగవల్లరి నీ వేల వేగిరించె
దింతమాత్రంబ చాలు నే యీప్సితార్థ
సిద్ధి కతనిలక్షణము లీచిత్రమూర్తి
యందు నేమైనఁ గల వేమొ యడుగవలయు.

వ. అనిన విని యాహంసి యాచిత్రరూపంబు నిరూపించి ప్రభావతి నుద్దే
శించి యిట్లనియె.

ఉ. ఆరయ నింక నే మడిగె దల్లవె యాతఁడు శంబరుం ద్రిలో
కారిని ద్రుంచునప్పటిప్రహారకిణంబు లురంబునందు నా
హారతికంకణాంకములు నల్లవిగో మెడయందు వీరశృం
గారకళాఢ్యు నిట్లతని గట్టిగ నెవ్వ రెఱింగి వ్రాసిరో.

వ. ఈ లక్షణకథనంబుచేత నతనినామజాత్యాదు లత్యంత ప్రసిద్ధంబులు
మీరు మీయంతనె యెఱింగెదరు గావలయు నంతఃపురవాసినులు
గావున నెఱుంగరో యని యెఱింగించెద నంటి నేని.

చ. ఎనయఁగ నెవ్వ రెంతమన సిచ్చినచించిరి తాను వారితోఁ
బనుపడ నంతమాత్ర ప్రతిభాషణ మాడుట యుక్త మంద్రు మీ
కొనరఁగఁ బన్నిదంపు గెలుపోటలు దీర్పఁగ నిప్పుడేను జె
ప్పినదియ చాలు నింకఁ దలపెట్టుట చెల్లద యెక్కు డేమియున్.

తే. నీవ కద ప్రభావతి యన నిన్ను మున్ను
తరుణి నే వింటి, రాగవల్లరియె బోటి
పేరు నీ విపు డన వింటి మీ రిరువురు
నీ యెఱుక మఱచెదరు సూ పోయి వత్తు.

ఉత్సాహ. అనుచు గగనభాగమునకు నంచ యెగయఁ జూచినన్
దనుజకన్యకాలలామ తనగు రెండుచేతులన్
వినయ మొప్పఁ బోదుగఁ బట్టి వేనవేలు భంగులన్
దనరఁ బ్రియము జెప్పుచును ముదం బెలర్ప ని ట్లనున్.

సీ. నిద్దంపుఁబండువెన్నెల గాయు టెక్కుల
యొప్పు చూడఁగ నొక్క యుత్సవంబు
మెఱుఁగుదీఁగెలబాగు మించుపక్షాంతహా
టకరేఖ లరయ నొండొక ప్రియంబుఁ
గమనీయ మగుమహాగమనగాంభీర్యాది
విలసనం బీక్షింప వేఱెయింపు
మాధుర్యధుర్యకోమలవచనామృతం
బనుభవింపఁగఁ గౌతుకాంతరంబుఁ.

తే. గలుగఁ జేయుచు నువ్విళ్ళు గొలుపునీదు
సంగతి యొకింత గని యెట్లు జాఱవిడుతు
నింక రాగవల్లరి పేరు నీవు నిజము
ననఁగ నీతో నొనర్తు నెయ్యంపుఁ జెలిమి.

ఆ. ప్రణయ మొప్ప మిగులఁ బ్రార్థించుచున్నట్టి
నన్ననుగ్రహించి నాదుచెలిమి
కొడఁబడంగవలయు నోహంసభామిని
యనుచు వేఁడుకొనఁగ నంచ పలికె.

ఉ. ఇప్పుడు నీవు చెల్మికిని హేతువుగాఁగ గణించినట్టి నా
యొప్పును గిప్పుఁ దా నెచట నుండు రహస్యవిచారవిఘ్న మా
కెప్పుడు నీకుఁ దోఁచె నపు డింతియు రోసెదు దీనిచేత మీ
యిప్పటిమంతనంపుఁబని యేమఱ కంపుఁడు పోయి వచ్చెదన్

వ. అనిన విని రాగవల్లరి హంసీమతల్లికం జూచి యిట్లనియె.

క. పోయెదఁ బోయెద నంచి
ట్లోయంచలతల్లి యేల యుడ్డాడింపన్
మాయేకాంతపుఁబనికిని
నీయునికి విరోధి గాదు నిర్వాహకమున్.

వ. ఇదే నిమిత్తంబుగా సఖ్యంబు గావలయు నని ప్రార్థించెదము గాని కేవలం బైన తావక రామణీయకంబునన కాదు నీదుపలుకుందెరువులు పరికింప నిది నీవును దెలియుట విస్పష్టంబ యైనను శుద్ధాంతస్థితి దోషంబునం జేసి యేమయి యీమాట మాటు పెట్టక గొబ్బునం

జెప్ప నేర కున్నవారము చెప్పి వేఁడికొనక యేపనికిని నీవు చోరమి
మొదలన పదిలంబుగాఁ దెలిపినదానవు గావున.

ఉ. పట్టిమఱుంగుఁ బెట్టి నుడువం బని లే దది యెల్ల భేరి జో
కొట్టుట కాక ని న్నెలుపఁ గూడునె మాటల నీవు గంటి న
న్నట్టిశుభాంగుఁ డీరమణియాసల కాస్పద మిప్పు డాతని
న్గట్టిగ నన్వయాదికథనంబునఁ దెల్పి యనుగ్రహింపవే.

తే. ఇప్పుడిది చెప్ప కెడ సేయు టీలతాంగిఁ
బ్రాణసంకటపఱుచు టోపక్షిరమణి
కావునను గావవలయు శీఘ్రంబ చెప్పి
వెనుక నెఱిఁగింతు నీకు మా వృత్త మెల్ల.

వ. అనిన శుచిముఖి వచనవక్రత చాలించి యిట్లనియె.

ఉ. అంతిపురంబుకన్యలఁట యాత్మ తెఱంగభిధాప్రయుక్తి నొ
క్కింతయు నేర్పరింపరఁట యిట్లన నిట్లని నాకు నాకె య
ర్థాంతరము ల్గడించుకొని యంజక యెట్లు యుపస్తుతు ల్ప్రపం
చింతు నటంచు నుంటి నిఁకఁ జెప్పెద మీరలు గుట్టు దెల్పుటన్.

ఈ భాగము కవి వ్రాసినదియా? స్వభావసిద్ధమా? స్వభావమును మఱపింపఁ జేయునట్టి శిల్పము శిల్పముగాని యన్యము కృత్రిమము. ప్రకృతి ననుసరింపనిచోఁ గళకు సత్యమురాదు. మఱి యనుసరించుటఁ దప్ప నింకేవిశేషము లేకున్న సత్యమున్నను సొగసుండదు. అనుసరించినట్టే పోవుచుఁ గ్రమక్రమముగ మీఱి మెఱయుట కళాసామ్రా

జ్యము.) ఒకానొకరు చెప్పినరీతి, ప్రకృతి యాకారము. ఆ యాకారమును చక్కఁగా నలంకరించి మెఱుఁగుపెట్టిన రీతిని తగిన విషయముల సంగతిని బొదిగి సజీవమై లేచి వచ్చునట్లు చేసిన నయ్యది కళ. ఈ భాగము దివ్యము. పాముజాడ పామునకు గుర్తు. స్త్రీలజాడ స్త్రీలకే యెఱుక. శుచిముఖియొక్క బిగువుబింకములు, పొడుపుమాటలు, యుక్తులు వర్ణింపఁదరమా? ప్రభావతిని బొమ్మరీతి నాడించు నామె వాచాలత స్తుత్యతీతము.

కల్పనాస్ఖాలిత్యములు

కల్పనయందు నీ కావ్యము నిర్దుష్టమని యంటిమి. అమ్మాటకు బాధకము లొండురెండు గన్పట్టెడి. సునాభుని కూఁతులకు గదసాంబులు పతులగుదురని నారదు లాశీర్వ దించి పోఁగా, నా కన్యలు "ఎక్కడి ద్వారక, ఎక్కడి గద సాంబులిది విన్నఁజెనుచేటు స్వామిచేత, నసురులకుఁ బగ వీడఁట యాపురంబు" అని, యాశీర్వాదబలముచే వెల్లివిరి సిన తమి "భోగయోగ్యమగు ప్రాయము" నకు మున్నె తమ్ముఁ దొందరపెట్టఁ, జాలఁ బరితపించిరట! ఋషుల యా దేశము విన్నమాత్రన మనసుచెప్పిన దిక్కుకుఁ ద్రిప్పుట, మనవారి సాధుగుణమును వినయమును జూపు చిత్ర మేమో! భోగయోగ్యమగు ప్రాయముకుదరకమునుపే పతిచింతందాల్చు సామర్థ్యము గలవారౌట గాఁబోలు, బాల్యవివాహములకు నిజమైన నిదానము! ఈ విషయము

లటుండనిండు. ద్వారకాపురిలోని గదసాంబులం గూర్చి సునాభుని కూఁతులకుఁ దెలిసిన యామాత్రము వారి యక్కగారైన ప్రభావతికిం దెలియకపోనేల? ప్రద్యుమ్నుఁడు భర్తయని యెఱింగియు దిక్కులేని పక్షిరీతి నాపెరోదనముఁ జేయుట కృత్రిమ ముగ్ధత్వమా! మఱియు, కృష్ణుఁడు అనామధేయుఁడుగాఁడు. దనుజశత్రువు! అట్లగుట నతనియు నతనియింటివారియు సంగతులు గడురహస్యములుగానుండునా? అందును ముఖ్యముగా విరోధులయిండ్లలో! అందును ఇంద్రునిపై దండెత్తిగెల్చిన వజ్రనాభుని పురిలోను, గృహములోను!

వజ్రనాభుని పురింజొచ్చు నుపాయమునకు సూచకముగ నుంటయ భద్రుని చరిత్రముయొక్క ముఖ్యోద్దేశము. ఉపాయాంతరము లున్నయెడల నీ చరిత్రంబు వ్యర్థంబగును. కాన నితరములగు వెరవులు సాధ్యములని కవికనఁబఱచియుండుట గొప్ప పొరఁబాటు. కథయొక్క కూర్పు బిగి తప్పిన దనుటకుఁ దార్కాణములు.

తే. "అప్పుడు ప్రభావతికి నొక్క యాతిన విరులు
గొనుచుఁ బోవంగ నందునింపునఁ జరించు
తేఁటిగమిలోనఁ దానొక్క తేఁటియగుచు
నేగ మాయాఘనుండు రతీశ్వరుండు."

(ప్ర. ఆ. ౪. ౧౨౭)

తేటియైనవాఁడు హంస యేల కాఁగూడదు! ఆ పురిఁ ప్రవేశము హంసలకు సుగమము. అవి వాలాయముం బోవుచు వచ్చుచుండునవి.

చ. "తడవులఁ బట్టియేము సతతంబును బోదుము వానివీటికిన్
గడుమతి చాలమిం గడుపు గక్కుఱితి న్సురలోకనాథ . .
(ప్ర ఆ. ౧. ప ౧౧౮.)

అని శుచిముఖి యింద్రునితో నివేదించి యతని కొఱకై వేగుపని నడుపుట కొప్పుకొన్నది. కావున "మాయాఘనుండు రతీశ్వరుండు" భద్రవేషముఁ దాల్చినది చూడఁగా 'గోటితోఁ బోవుదానికి గొడ్డలి తెచ్చినట్లు!' సునాభుని తనయలకు నీప్సితసిద్ధికిఁ గారణము చిలుక రాయబారము. ఇంతేకాదు. వజ్రనాభుఁడు ప్రాణములతో నుండఁగానే

శా. " . . సంగ్రామవృ
త్తాంతంబుల్ విని తార్క్ష్యవాహనుఁడు చక్రాద్యాయుధ ప్రోల్లస
త్కాంతిక్రాంతదిగంతరుండయి వడిన్ దావచ్చె నచ్చోటికిన్."
(ప్రభా. ఆ. ౬. ప. ౨౧౨.)

సమారాధనకు బ్రాహ్మణులవలెఁ దండోపతండములుగా నింకెందఱు వచ్చిరో! ఇఁక వజ్రనాభుని పురమన్ననో "తపమున బ్రహ్మఁ బ్రసన్నుఁ జేసి, మేరువుపొంత మారుతా

తపములకున్ని జానుమతిఁ దక్కఁ బ్రవేశమొనర్పరా"దిగా నతనిచే నిర్మింపించినది! అనుమతి లేక కృష్ణుఁ డిప్పుడు చొచ్చినట్లు ఇఁకఁ గొంతముందుగా వచ్చియుండిన నెవ్వరైనఁ దల దీసియుందురా? విష్ణువుయొక్క మహాత్మ్యమున కతిశయముఁ గల్పఁబోయి, బ్రహ్మసంకల్పమునకు కథాకల్పనమునకును విచ్ఛేదముఁ దెచ్చి పెట్టికొనియుండుట మంచి బేరముగాదు. మఱియు ప్రభావతియొక్క గదినుండి తన విడిదివఱకు రాకపోకలు నిర్విఘ్నముగ నెఱవేఱుటకై ప్రద్యుమ్నుఁడు భూవివరమొకటి గల్పించెనఁట! ఇదియు నిరర్థకశ్రమము. కాకి, పిల్లి, ఎలుక ఇత్యాది గృహజంతువుల రూపముందాల్చి యథేచ్ఛముగ నేల సంచరింపరాదు? ఈ కావ్యములో నొక్క కామముచేతనే గాదు, ఊరకయు నిట్టి చిత్రభ్రమ లప్పుడప్పుడు గల్గుచుండును.

ఈ గ్రంథములో జాతీయములు లోకోక్తులును విశేషముగా వాడఁబడియున్నవి. సంఖ్యయందకాక గుణమునందును నవి గొప్పలు, కాని 'అతికిఁబోయిన నెగ్గు తప్ప' దనుట నీరీతిశైలినుండియుఁ జూపవచ్చును. ఈ యుపమానముం జూడుఁడు!

ప్రభావతీ దేవియొక్క సౌందర్యమును ప్రద్యుమ్నునికి శుచిముఖి వాగ్దర్పంబున విప్పి చూపుటలో

చ. "కొసరక చూపుచేతఁ గడు గ్రోలిన నీ చెలువంబు చెల్వమా
నసమున నెంత మిక్కిలి ఘనంబుగ హత్తెనొ కాని యప్పుడో
రసిక శిఖావతంస యదురత్నమ కాకరకాయ రీతిగాఁ
గిసలయ పాణి చన్నుఁగవ క్రేవ గగుర్పొడి చెంబొరింబొరిన్."

'కాకరకాయ' యఁట! ఎండుజిల్లెడుకాయ యన రాదా! పంతముఁబట్టి యేవైన గుణములు బలాత్కారముగ లాగివేయఁ జూచినచో విఱుపులు తప్పవు.

ఈ కథలోనుండు పక్షులకు వంశమూలములైన పాత్రములు కళాపూర్ణోదయములోని చిలుకలు. ఈ విషయము నందును ప్రభావతీప్రద్యుమ్నము తత్పూర్వగ్రంథము ననుసరించియున్నది. సరస్వతీదేవి చిలుకయు, ఇంద్రుఁడు రంభతో మణికంధరుని తపోభంగ విషయమైన సందేశము నానతిచ్చిన విధంబును గలభాషిణితోఁ దెలుపు చిలుకయు, శుచిముఖికిని, సునాభుని సుతలకు దూతికయైన కీరమునకును గోలము సాములు. ఈ కవికిఁ బక్షులయం దాదరము ఎక్కువ కాఁబోలు!

తుచ్ఛ శృంగారములకు గారణములు

మనయనాచారములు

ప్రభావతీప్రద్యుమ్నములోని దోషములంగూర్చిన ప్రస్తావము మనసు గట్టిచేసి యెట్లో చేసితిమిగాన, కవిపరమైన ప్రతివాదములును ఇట సమర్పింపంబూనుట సహజ.

మును సంతోషకరమునైన ధర్మము. శృంగారరసవిషయము లగు నాభాసములకుఁ గవికాదు ఉత్తరవాది. మఱి యట్టి యనిష్టములే యింద్రభోగములని రోఁతఁజెందక గ్రహించు మన సంఘము! భావనాశక్తి యెంత యుద్ధురమైయుండిన నేమి? హనుమంతుఁడు సముద్రము దాఁటఁ జాలినను దనసీడఁ దా దాఁటఁజాలునా? అట్లే, తన యౌవనజీవము నెట్టిస్థితిగతుల నడుచునో వాని సాంగత్య మేమాత్రము లేని తలంపులను దెచ్చుట తరముమీఱిన కోరిక. ఇందులకు మతతత్త్వముల నుండియే ప్రబలప్రమాణములఁ జూపవచ్చును. దేవలోక మన నేమి? ఈ లోకములోని సుఖములు లభించుటకు నాస్పదమైన పదవియే కదా! అనఁగా నీ లోకములోని దుఃఖములు నిర్మూలింపఁ బడినట్లును సుఖములు అమేయములైనట్లును భావించిన దేవలోక మేర్పడును. పరమనునది యిహముచే సృజింపఁబడిన ప్రతిబింబమేగాని యన్యముగాదు. యౌవనము మంచిది. ముదిమి చెడ్డది. అట్లగుటచే దేవతలు నిత్యయౌవనులనియు, మనము యజ్ఞములఁ జేసిన నిత్యయౌవనులమగుదుమనియు మనుజుఁడు పేరాసచే నెంచుచున్నాఁడు. నిత్యయౌవనమున్న రంభలుండవలయు. లేనిచో నది నిష్ఫలము. ఈరీతి నైహికముల ననుసరించి యీ ప్రపంచమున మనకుఁగల సుఖములు, ఆశలు అను సామగ్రితోఁ గట్టఁబడిన మాయాలోకములే వైకుంఠము, కైలాసము మొదలగు పరమపదవులు. తుదకుఁ దేవునినై

నను సరే, మనుష్యులం బోనివానిగా నూహించుచున్నామే గాని, యతఁ డతీతుఁడని నోటిమాటయున్నను భావమున నట్టిఁడుగా సాక్షాత్కరింపఁ జేయుట యసాధ్యము. ఆతనికి వేయిచేతులున్నవని సిద్ధాంతముండెఁబో. వేయి మనదిగా కున్నను చేతులను వస్తువులు మనవేగదా! మనయొక్క యంగములు, ప్రాణము, మనసు వీనితో నేమాత్రము సాదృశ్యము లేని భగవంతు నొకనిఁ గల్పించి స్మరించుట యలవియా? యోజింపుఁడు! అట్లగుటఁ గావ్యవర్ణనములును అనుభవబద్ధములగుటేమివింత! అవి యీ లోకములోని రసములను ప్రకటింపఁజేయు కృతులు. కావున సంఘములో నుండు సౌరభమో దుర్గంధమో వానియందును బర్వియుం డుట నైజము. అనివార్యము. రాజకన్యకయయ్యు, దేవేం ద్రుని జయించినవాని కూఁతురయ్యు ప్రభావతీదేవి పచ్చి పచ్చి కూఁతలఁ దన మధురమైన నోటితోఁ బ్రేలుట మనకుఁ దలఁపఁగా నెంతో జుగుప్స! శుద్ధాంతకాంతామణియఁట! ఇఁక చర్యలో

ఉ. “వావిరి నెల్లప్రొద్దు . . .
మ. కలలంగూడిన . . .
(ఇవి వెనుక నుదాహరింపఁబడినవి.)

చర్య లట్లున్నను నష్టము లేదు. ఆమెమాట లంతకైనఁ బచ్చివి!

“మనసునఁ గాకున్న మాటలయందైన
సౌకుమార్యములేని చానలేల?”

వారియందు స్త్రీయనుశబ్ద మప్రయుక్తము. వాస్తవము విచారించిన నీలోపములకుఁ గారణము మన దురాచార హేయజీవితమేగదా! శుద్ధాంతములఁట! ‘‘పోఁతుటీఁగకైనం బోలయరాని చోట్లఁట!’’

శుద్ధాంతవాసప్రభావము

సరి! కలలకు గోడలడ్డమా! మనసునకు బీగములు బంధములా! శుద్ధాంతము లేర్పఱచుటయను లఘుకార్యముచే శుద్ధాంతరంగములు సమకూఱునా? మఱియు, నీ మఱుఁగేగదా మానము విడుచుటకుఁ బ్రేరకము! ఎట్లన, ఇట్టివారు చెలులు, దూతికలు, దాసీజనులు మొదలగు మధ్యవర్తుల మూలముగాఁ దప్ప నితరములగు నుత్తమ మార్గములఁ దమనైజమగు వలపును దృప్తిఁబొందింపఁజాలరు. మధ్యస్థము పిలిచిన పిమ్మట మానముఁగొని యుండుటెట్లు? మఱుఁగుగానైన సగము చూపి చూపక యుండుటెట్లు? శుద్ధాంతమనఁగా సేవకులు మొదలగు నీచులతో సావాసమన్నమాట! గరువతనమునకిది యనుకూలమా? మఱియు, నట్టి కన్యకలకు నితరచింతలే యుండవుగాన తమ చింతయే ప్రధానము. రాజ్యము, దేశము, జ్ఞానము, ధర్మము, వీనిం గూర్చిన విచారములు సున్న. అప్రయోజకముగా నుంచఁబడి యుండుటచే మనసు పరిశ్రమలేక కృశించి నశించును. ఇట్టివారు స్వసుఖపరాయణులగుటేమి చిత్రము! మఱి సుఖమనఁగా వీరికి దేహసుఖమనుటఁ దప్ప నిం కేయర్థమైనఁ

గలనైనఁ దోషఁగలుగునా? ఏ పనిపాటులును లేక తిని, కండక్రొవ్వి, మదాంధులై కాలము భారముగ నుండునట్టి జవ్వనులు శుద్ధాంతముల నున్నను సంతసానులట్ల ప్రవర్తింతురు. విచ్చుకత్తుల పారా లెక్కవయూకొలఁది సందుదొరికినం జాలు! సమయము నర్థపుచ్చక త్వరలోఁ గార్యము నడుపుకొందమను తొట్రుపాటును గలుగును. అది యుదయమయ్యేనేని, మానము, మఱుఁగు, సౌమనస్యముఁగల శృంగార మెక్కడిది? శృంగారమునకు బదులు జావళీలు వచ్చి చేరును. పాపము. మన దేశములో నెందఱో స్త్రీలకు దూతికాముఖమైన మోహమేగదా గతి! కన్ను లుపయోగింపఁబడనందున వీరి కవి మందము లగునేమో! చెవులు అనవరతోద్యోగములో నుండునవిగాన చుఱుకుగలవగునేమో! చిత్ర ఫలకమో, చెప్పుడుమాటయో కామసందేశపద్ధతులు! ఇవి దప్ప వేఱుమార్గములు మృగ్యములు!

"పురుషుఁడే దేవుఁడు. ప్రస్వేదగాత్రుఁడైనను అస్వేదగాత్రతుల్యుఁడు" అని పద్మగంధులు యోజించుటకును యోజింపఁ జేయఁబడుటకును గల కారణములలో శుద్ధాంతనివాసమొకటి. ఎట్లన. బయిటఁ బోయినఁగాని లోకవర్తమానము లెఱుకకు రావు. కూపస్థమండుకముల కా కూపమే పాలసముద్రము. రాజ్యాంగముల నుద్ధరించుటలో నిపుణులైన మంత్రులు, దేశభక్తిచే విరాజిల్లు ప్రతినిధులు, యుద్ధరంగమున శత్రువుల నోడించి నిత్య యశోభాసితులై

దేశదేవతలంబోని సేనానాయకులు, ప్రకృతిశాస్త్రవిచక్షణులు, తత్త్వార్థదక్షులు, ఇత్యాది చరితార్థుల సంగతి పొంతంబోక గుప్తములోం గూరుచుండి దొరతనము—అనంగా నింటివారిమీంద—చేయు మహారాజును దప్ప నింకెవరిని జూడని భార్యకు వాండే యఖండపరిపూర్ణుండుగాం దోంచునేమో! ఒకే యాకారము గుటిపెట్టి యస్ఖలితంబుగం జూచుచుండిన నది నిరాకారబ్రహ్మమట్టులు పరిణమించునేమో! కాకిబిడ్డ కాకికి ముద్దు. తమ తల్లిని మించిన రూపవతులు గుణవతులు లేరని చిన్నబిడ్డలు నమ్ముదురు. పెద్దవారై యనేకులం జూచినపిమ్మటం బోల్చిచూడనారంభించి తక్కినమ్మల యుత్తమత్వము నొప్పికొనుట గలదు. ఇంకొక రెక్కువవారున్నారనినంతనే తల్లిమీంద ప్రేమపోవునా? పోవునని బుద్ధిశాలినియైన యే తల్లియేని నసూయ వహించునా? జనముల తారతమ్యనిరూపణకృత్య మొకటి. అనురాగపాత్రములని భావించు కృత్యము వేఱొకటి. ఈ రెండును సర్వత్ర నైక్యభావముం బూనునవిగావు. చూడుండు. శంకరాచార్యుండు ఘనుండైన తార్కికుండన్నమాత్రమునసే యతనిని గాంగలించికోవలయునని యందఱకు బుద్ధి వొడముట యావశ్యకమా? నైజమా? తర్కము బలముగా నుండవచ్చును. రూపము దక్కువగా నునికి, గుణము సర్వసమ్మతముగామి, దానితో సంశ్లేషింపంజాలిన ప్రకృతులు విరుద్ధములుగావు. అట్లగుట వలపున కుత్పాదకములగు

వేయి హేతువులలో నొకటి యున్నయెడ సర్వస్త్రీలును వాని పైఁబడుదురని నమ్మువారును, నమ్మి యట్లు నడచువారును మనుష్యులా జడులా? స్త్రీలవిషయమై మాత్సర్యముం దాల్చువారికి రెండు విధములగు భ్రమలుగలవు. ఏవియన. తాము పరిపూర్ణులై యున్నంగాని వారు హృదయపరిపూర్ణముగఁ దమ్ముఁ గామింపరనియు, నెవనియందైన నేదైన సుగుణము అధికముగా దేదీప్యమానమైయున్నచో, వాఁడు గంటఁబడెనేని, తక్కిన గుణముల సంగతి యాలోచింపక, వానిపై నుద్దండముగాఁ బడుదురనుటయు. ఈ యెన్నికలు రెండును హేతురహితములు. సర్వగుణసంపన్నుఁడైన వానితో విసుగు దవిలిన మనసుతో గుణ్త్రపువాని వలచువారులేరా? తుదకు ఉన్నతులగు పురుషులు సైతము, ఎన్నో తబ్బిబ్బులకు లోపములకు నాకరములైన భార్యల మీఁదఁ జూపు ప్రేమావేశమును, నిరంజనుఁడైన దేవుని యందుఁ బ్రకటింపఁజాలుదురా? చిత్తము పలుపోకలఁ బోవునది. గోడలచే నెట్లు నిరుద్ధము గాఁజాలదో యట్లే కారణమునకును దుర్నిరోధము. ఇది స్వభావసిద్ధమని యందఱెఱింగియుండియు, నైరోపాకవులు ప్రయోగించినట్లు ఈ న్యాయము మనవారు తమ కృతులలో వ్యాప్తికిఁ దెచ్చియుండలేదు.

మీఁద వివరించిన భ్రమలవలనఁ గలిగిన క్షోభములు రెండు. రాజుగారు దేవి నొకదాని సంపాదించి పుర

మున నూరేగునపుడు పౌరస్త్రీలందఱుఁ గామాతురలమై వానిం జూడ పరిపరి వికారవేషములతో వచ్చిరని ప్రబంధముల వర్ణింపఁబడియుండుట. ఈ కవుల యూహా యేమనఁగా "రాజు! ఇంక వానిం గలయఁగోరిక తరుణు లెట్లోర్తురు! మనము రెండణాల దక్షిణ నాశించి యేతారతమ్యముల నెంచక ధనికులను దొంగభక్తి నాశ్రయించుచున్నాముగదా! స్త్రీలును మనకన్న నెట్లు శ్రేష్ఠలు! నికృష్టజన్మలే గావున వారిలో నిట్టి పిచ్చియెక్కువ!" యని కాఁబోలు! రెండవది "భర్త దేవుఁడు. గుఱకపెట్టెడు ప్రాణాయామబ్రహ్మ! వాని నేయంశమందైన మీఱినవా రెవ్వరు లేరు. ఒక్క లేరనుటయే కాదు. సృజింపఁబడరు. పడఁజాలరు!" అని భక్తిఁ దాల్చియుండవలయునను పాతివ్రత్యధర్మప్రకటనము. ఏమి యీ జనులకుఁ గల దైన్యమహిమ! పరిపూర్ణులని తలంపఁబడ రేని భార్యలు చీయని వదలిపోదురా! భార్యలుమాత్ర మంత పరిపూర్ణలా? మనుష్యులలో మనుష్యులమని యెల్లరు నున్న సంసారము సాఁగదా! మఱి, సభలకుఁ బిలిచికొనిపోయిన వివేకానందస్వామి, గోకలే, మున్నగు మహనీయులం గాంచి, "వీరు గొప్పవారు" అని భార్యలు మెచ్చికొని రేని, మనసుమాఱినవారౌదురను భయముం దాల్చు మగవారి నీచతకొలఁది నిర్ణయింపఁబోలునా? స్త్రీలు గుణముకొలఁది వలచువారైరి పో. అది శ్రేయోహేతువే గాని యనిష్టసాధకమా! వారి

హృదయానందము నర్థించియైనఁ బురుషార్థము సాధింపఁ జూతుము గదా!

మోహప్రకృతి

మన గ్రంథములలో చిత్తవిజ్ఞాన మత్యల్పము. అనఁగా పూర్వకావ్యములఁ దప్పఁదక్కిన యర్వాచీనగ్రంథములలోననుట. పురుషుఁ డెందఱ స్త్రీలనైనఁ గోరవచ్చునఁట! తప్పులేదు! తప్పేల? దక్షిణనాయకుఁడు! కృష్ణమూర్తి! స్త్రీలు అన్యపురుషులమీఁద మనసు పోనిచ్చిరేని, అయ్యో ఎంత పాపము! పాతాళమును మఱింత లోఁతుగాఁ ద్రవ్వినఁగాని యా పాపము నింపలేము! కన్ను గదల్చినఁ జాలు! ఆపె బంధకి! దుర్మార్గురాలు! మగవారికొక న్యాయము, స్త్రీలకొక న్యాయముగా నేల విధింపఁబడెనో చెప్పువారు లేరు! అది యటుండనిండు! స్త్రీయనునది జడముగాదు. తిర్యగ్జంతువుఁగాదు. ఆత్మ గలిగిన మనవంటి చేతనము. మన మేరీతిని స్నేహితులు, బంధువులు, అన్నదమ్ములు, కొడుకులు, భార్యలు (బహువచనము హిందూజనులలో నయోగ్యముగాదు) మొదలగు ప్రాణసములతో సహేతుకముగనో నిర్హేతుకముగనో, కాలవశమున భేదింతుమో, ఆ రీతినే స్త్రీలును భేదముఁ గొనకుండుటకు వారేమి యంత్రములా! మానవులు గారా! భేదము గొనినంతనే మనల నెవ్వరుఁ దుచ్ఛులని గణింపరు. మఱి కారణము లారసి తీర్మానింతురు. మనలో స్త్రీ నడవడిం గూర్చి సిద్ధాంతము సేయునప్పుడు ఖం

డనమేగాని విచార మెక్కడిది? అట్లగుట గొప్ప బుద్ధిచేఁ బ్రేరితమైన భర్తమీఁది విరక్తియనునది యొకటున్నదని మనవారికిఁ దెలిసినను, బహిరంగముగ నొప్పుకొనరు. కావ్యముల నిట్టి చిత్రచరిత్రలు వర్ణింపఁబడియుండలేదు. చూడుఁడు, తన భర్త కులాభిమానము విడిచినవాఁడైనఁ బత్నియేల వానిని వదలరాదు? అన్యాసక్తుఁడై యిచ్చిన బాస మఱచినఁ దనకు నట్టి మఱవేల రాఁదగదు? లంచములకొఱకో పగచేతనో మాతృద్రోహముఁ జేయువాఁడై తన దేశమునకు నాశముఁ గోరి శత్రురాజులకు సాయముచేయఁ గడఁగెడు దురాత్ముని భార్య శిరచ్ఛేదనముఁ జేసిన నకృత్యమా, సుకృత్యమా? మఱి దేశభక్తుఁడై నిరంతర యత్నములచే దేశాభ్యుదయము నభివృద్ధిఁ జేయువాని నేల ప్రీతిపాత్రుఁడని చేరువఁ జేర్చికొనరాదు! ఒక్క పతివ్రతా ధర్మమున్న నింకేధర్మములును బనికిరావా? అవి యస్తమించునా? వాని నుపాసింపకున్న నవి కీడు తేకుండునా? ఈ పాడు పాతివ్రత్యము నుద్ధరించు ప్రకృతియొక్క గృహముమాత్రమె. అదియే పతిభక్తికి రంగస్థానము! దేశోద్ధారకధర్మముల కైన నిది యెక్కువయా? అలనాఁడు మహమ్మదుగోరీకి నాహ్వానసందేశ మంపి దేశము నొరులచేత సమర్పించిన జయచంద్రున కతని రాణి విషమో తవుడో పెట్టియుండిన నామె కొక దేవాలయము గట్టించి పూజసేయకుందుమా? పతిభక్తి నేటఁ గలిపినవారందఱు నొక లెక్కయనుట మన

యాచారము! పతులను గుణములకొలఁది వర్ణించి, వారిని విసర్జించిన భార్యల యుద్దేశ్యములను గారణములను గణించి, వీరియందును గౌరవలాఘవముల నిరూపించి చూచితిమేని, భర్తను వదలినవారిలో ననేకులు మహాత్మురాండ్రని యేర్పడును. మఱియు వదలనివారిలో ననేకులు పేదబుద్ధి గలవారని, పిఱికివారని, నీచాత్మురాండ్రనియుఁ దెలియకపోదు!

ఏదేని యొక్క ధర్మమునుమాత్రముపట్టి మనుష్యుల చరిత్రల గణింపఁజూచుట మౌఢ్యము అందును ఆ ధర్మము నుండి తొలఁగినవారి స్వభావము, స్థితిగతులు, కారణములు కాంక్షలు, వేనినింబాటింపక తీర్పుచేయుట కన్నులు పోయిన కబోదిమతము

దీనిచేఁ గావ్యములకు గొప్ప లోపము సంభవించినది. ఏదియన. శృంగారమనిన నేకవిధమైన శరీరరాగమని యెట్లు భ్రమించిరో, యట్లే జారశృంగారము నేకగతిం బోవునదియని యోజించి, నరుల మనసులు నానారూపములైన చిక్కులందాల్చినవనుటఁ దెలిసికొనక, విసుగు పుట్టించునంత యభిన్నవర్ణనలఁ జేయు దౌర్భాగ్యము. జారస్త్రీ లెల్లఁ జెడ్డవార యఁట! కండకావరముచే నన్యులఁ గోరువారఁట! ప్రబంధములలోని పతివ్రతలుమాత్రము కండకావరముచేఁ గోరువారుగారా? ఇంకే వరము వారికున్నది? శృంగారము నీచశృంగారము. దానికిఁ దగినట్లు జారత్వమును నీచముం జేసి జతఁగూర్చిరి. మనుష్యస్వభావమును బరీక్షించి

ప్రాయక యలంకారశాస్త్రములఁ దలనిడికొన్నందుకుఁ గలి
గిన యధోగతి యిది!

సరాసరికి నీ గృహకృత్య పతివ్రతలకన్న నైరోపా
మొదలగు వృద్ధిభూములలోని పలు గాకులు మేలు. రుష్యా
వారికిని జపానువారికిని కొన్నియేండ్లక్రింద ఘోరయుద్ధము
ప్రాప్తమైనపుడు, రుష్యావారి రణసన్నాహములయొక్కయు
కోటలయొక్కయు, సైన్యములయొక్కయు మర్మముల నెఱుంగ
జపాను రాజ్యములోని నారీమణులు కొందఱు బుద్ధిపూర్వ
కముగ వేగుపనికిఁ బూనినవారై, తరుణములందు శత్రు
సేనానాయకుల పరిరంభణములకుం గూడ సమ్మతించి,
యమూల్య వృత్తాంతములను దేశమునకు దానముచేసి
యుపకార రాజ్యపట్టమహిషులైరని వినియున్నాముగాదె!
వీరిని నీచచరిత్రలని భావింప నొప్పునా? గృహధర్మము, దేశ
ధర్మము విరుద్ధగతులం బోవునవియైనచో దేశధర్మము నెడ
నెక్కువ గౌరవముఁ గలవారా నికృష్టులు! గృహమునకు
మించినది లేదనువారా? యోజింపుఁడు! దృష్టి ననుసరించి
కొలఁది లేర్పడును. సంఘపరమైన దృష్టితో తత్త్వపరిశీల
నము చేయువారికి హిందువుల నీతులు మొత్తమువీఁద
హీనములని తోఁపకమానవు. ధర్మముల పరస్పరప్రాతి
కూల్యము ఐరోపియనులు విమర్శించినట్లు మనవారు చేయ
లేదు కారణము, మూఢభక్తిపరాయణులు గావున, యో
జించి యనుష్ఠించిన గుణదోషములు గాన్పించును. యోజ

న లేక చేయువారికి సందేహ మెక్కడిది, సత్యాసత్యవిమర్శ మెక్కడిది? తాటాకులలో వృద్ధప్రచారములో ప్రమాణములు. మనసుగాదు. కావునఁ గావ్యములోని కన్యకల కెట్లో, సిద్ధాంతులకు నా రీతినే మనస్సునది యడుగంటిన ప్రకృతి.

వీరయుగముల స్వాతంత్ర్య మఖండము

మూఢభక్తి ప్రాబల్యమునకురాని భారతకాలములో ధర్మముల యన్యోన్య వైరముం గూర్చిన శోధన లుండెననుటకు దృష్టాంతములుగలవు. అన్నమాటప్రకారము తమ్ములు నడువవలసినవారైనను భీమార్జునులు ధర్మజుం గినిసి తూలనాడలేదా? సత్యము భూతదయ ఈ రెంటికిని బొత్తుగలుగనిచోట్ల, భూతదయయే శ్రేష్ఠతరమని కృష్ణుని యుపదేశము. పతులకు లొంగి వినయవిధేయతలమై నడువవలసిన విధిగల దయ్యు ద్రౌపది సమయముల ధర్మరాజాదిపురుషులఁ గఠినాక్షరంబుగాఁ జిన్నఁ బుచ్చి పలికి క్షత్రియధర్మోద్ధరణంబు గావించి యసదృశకీర్తివైభవోపేతయై వెలింగెఁ, గదా! ఈ వెనుకటినాళ్ల చప్పిఁడి పతివ్రతామణు లామెను మీఁటి వెలయువారా? చవిసారములేని పాత్రములకు దారి చూపినది రామాయణము. భరతుఁడు మొదలగువారు నిర్వికల్పులు. భారతవీరులు సవికల్పులు, మనుష్యులు, దారుయంత్రములుగారు. "సంతతక్షముండు సంతతేజుండు

నగుట పాపమందు రనఘమతులు" అని 'తాఁబట్టిన కుందేటికి మూఁడేకాళ్లు' అని వాదించు మూర్ఖమానసులఁ దీసివైచినది ద్రౌపది. ఆమె దివ్యచారిత్రమే యా నీతికిని నుత్తమ నిదర్శనము. పౌరుషముగలవారు విమర్శము, కారణశక్తి, నిర్భయహేతువాదము, వీనిం జూచి జడియరు. దైన్యముం గుదుచు శుష్కసత్త్వులకు నన్యశాసితములగు నాచారాదులు ప్రధానములు, స్వాతంత్ర్యము లేనివారగుటచే స్వేచ్ఛాయోజన ప్రాగల్భ్యము వారికి నలభ్యము ఇఁక విమర్శనము, కారణానుకార ప్రచారము, ఇవి యెక్కడివి?

'హిందూదేశములోని కవులు స్వబుద్ధి నుపయోగింపక శాస్త్రములు, ప్రాచీనగ్రంథకర్తలుఁ, పోయినదారినే గొఱ్ఱెలనుందవలెఁ బోయినవారగుట వారి కావ్యములఁ బరిశోధించుటచే నా కాలమున దేశస్థితి జనుల నడవడి ఇత్యాది చారిత్రకాంశముల గుఱు తెఱుంగుట దుర్ఘటమని యొకానొకరు నుడివిరి. ఇందు సత్యము లేకపోలేదు. కాని, యీ కవులు వర్ణించిన జాడలును తమ కాలమునాఁటివారి జీవితముచే ఘనముగఁ గాకున్నను నల్పముగ్నైన నిర్ధారితములు గాన, వీనిచేఁ జరిత్రాంశములఁ గనుఁగొనవచ్చుననియు, భాషయొక్కయు దేశముయొక్కయు చరిత్రమును అన్యోన్య సామ్యముం దాల్చిన యవిగాని యేమాత్రము సంబంధము లేనివగుట యశక్యమనియు, స్థిరీకరించుట యీ దీర్ఘవ్యాఖ్యానముయొక్క ముఖ్యతాత్పర్యము.

సూరన్న ప్రదర్శించిన యభవ్యశృంగారము, దేశీయుల యనాచారముంబట్టి యేర్పడిన వికార మన్నంతన, యీ కవి నిర్దోషియని చెప్పుట కష్టము. రససంపోషణమునకుఁ బ్రతికూలములైన విషయముల పొంతఁ బోనేల? పోయెఁ బో యిదియు నుత్తమ నాయికా నాయకుల స్వభావమని చాటనేల? జనసామాన్యముకన్న నెక్కువ సౌమనస్యము లేకుండుటయు నొక కళంకము గదా! మఱియుః అట్టి సౌమనస్యము కవి గలవాఁడని కళాపూర్ణోదయముంబట్టి నిరూపించితిమేని--నిరూపింపఁగలమను ధైర్యమున్నది--యాయుత్తమగుణమును ప్రభావతీప్రద్యుమ్నము చేయు కాలమునఁ గోలుపోయి యుండుట యొక దోషము. పశ్చాత్తాపముఁ గలిగించు కృత్యము! వయసు హెచ్చుటచేతనో, మఱి యెందుననో, భావనాశక్తి వాడువాఱియుండును! కల్పనాప్రతిభ మిక్కుటముగ నుండిననాళ్ళలో వ్రాయంబడినదగు కళాపూర్ణోదయముయొక్క గుణదోష ప్రకటనమును మఱల నందుకొందము.

ద్వితీయ భాగము

మొదటి ప్రకరణము

కాలసరణి కథాసరణి

కథను వివరించు పద్ధతులు రెండు. విషయముల జరిగినట్లు కాలక్రమానుసారముగాఁ జెప్పుట, కాలక్రమమును వదలి స్వారస్యమగు నే సందర్భముననైన ప్రారంభించి పిదప వెనుకముందఱగా కథను బెంచి పూర్తిచేయుటయు. ఇందునకు దృష్టాంతములు. భారత రామాయణములు కాలక్రమానుసారముగా వ్రాయఁబడినవి. ఈ యితిహాసములలో వీరుల వంశావళులు, వారి జన్మము, వయసు, పెరుగఁ బెరుగ సంభవించిన కష్టనష్టములు, ఇత్యాదులు కాలోపగతంబైన వరుసమేరకుఁ జూపఁబడి యుండుట సర్వజన విదితము. ప్రభావతీప్రద్యుమ్నముం గమనింపుఁడు. కాలముంబట్టి కథ నేర్పఱచియున్నఁ దొలుత వజ్రనాభుని వృత్తాంతము, వాని తపోమహిమ, నాకలోకదండయాత్ర, మహేంద్రపరాజయము, ఇవి వర్ణింపఁబడి యుండును. కవి యిటనవలంబించిన మార్గము వేఱు. 'ఇంద్రుఁడు శ్రీకృష్ణదర్శనార్థమై విజయంచేసి' యని ప్రారంభించి, కార్యమే

మని యాతఁ డడుగుడు, తాను దత్పూర్వకథ కొంతమట్టుకు విన్నవించినట్లు కారణములు వెల్లడిచేయుటకునైన చర్చలచేఁ గథయొక్క యాదిని దీసికొని వచ్చినాఁడు. దీనికిఁ బాశ్చాత్యు లిడినపేరు 'తర్కక్రమము' అనఁగా కార్యము నుండి వితర్కించుచుఁ గార్యములు పుట్టుటకుఁ దత్పూర్వమే ప్రసిద్ధికి వచ్చియుండిన హేతువుల నరయుట. తర్కక్రమ మను మాటకైన 'కారణక్రమము' అనుట స్పష్టతరము. కాలకారణక్రమములకుఁ గల వ్యత్యాసముఁ జూపుట కొక నిదర్శనము:— ప్రాతఃకాలమున నిద్ర లేచి భూమి తడిగానుండుటఁ గాంచితిమేని యా తేమనుబట్టి రాత్రి వాన గురిసి యుండునను హేతువు దెలిసికొందుము. వస్తువుల స్థితి—అనఁగా నునికికి వచ్చినవిధమును—బరికించిచూచిన వాన దొలుతటిది. తేమ తరువాతిది. మనకు వస్తువులం గూర్చిన యెఱుక పరముగాఁ జూచినఁ దేమ యాదిమసత్తు. వాన దానినుండి దెలిసికొనఁబడిన యనుమానము. కావున స్థితిపరంపరల నిర్ణయింపఁ జూచితిమేని యాదిమధ్యాంతములఁ గాలముప్రకార మరయవలయు. వస్తువులు పుట్టినజాడ నటు విడిచి, దానికి హేతువులైనవానిని వెదుకుచు వెనుకకును, దానినుండి సంభవించిన ఫలముల నరయుచు ముందునకును విచారములు సల్పితిమేని యయ్యది కారణక్రమము. వస్తువుయొక్క తత్త్వము ప్రకాశితమగుటకు నీ రెండువిధంబులు ననుకూలించినవట. వానను బ్రథమమునఁ

జేర్కొని హేతువును గొనియాడి దానియందుఁ దదనంతరము పుట్టినది తేమయన్నను ఒక్కటే. తేమను దొల్తఁ జూపి యా సిద్ధికి నేమి కారణమని యాలోచించి వాన హేతువని యటుతరువాత స్థాపించినను నొక్కటే. ఆలోచన యొక్క ప్రారంభావసానములు భిన్నములుగాని యది పోవు త్రోవ యొండే. ఇట్లు ద్వివిధగతులఁ జరించినను సిద్ధాంత వ్యత్యాసము లేమికిఁ గారణమేమన. స్వభావమునఁ గార్యకారణజాలంబు నిర్వికల్పమగు క్రమమును దాల్చి యునికి. వానచే నేల తడియగుటయు, నేలయంతయుఁ దడియుటకు వానఁ దప్ప నింకే హేతువును లేకుండుటయు నిజములైన నీ ప్రత్యయముల నొకదానినుండి యింకొకదానిని వ్యక్త పఱుచుట సుసాధమ. నికరముగా నీ యవయవమునే యాధారముగఁ గొని యోజింపవలయునను నిష్కర్షయుండదు. హేతువులయుఁ దత్ఫలములయు ననవరతసాంగత్యమే యుభయక్రమములకుఁ దావలము.

వస్తుతత్త్వ పరిశీలకశాస్త్రములలోఁ గాలక్రమమునకుఁ బ్రసిద్ధి యెక్కువ. ఎందుకన, ఎయ్యది సృష్టిలో నాదియో దానినే గ్రంథమునను ఆదిగాఁ జూపిన శాస్త్రమునకు వైశద్యము. కావ్యములయందుఁ దత్త్వముగాదు ప్రధానము. మఱి రసము. అట్లగుట మొత్తమీఁదఁ గాలక్రమమును విసర్జించిన బాగు. ఎందుకన.

'కృతినాయకుని తల్లి గర్భముధరించినది. పది నెలలకు సుతోదయము. పిమ్మటఁ బెరిగినాఁడు. చదువు సాములు నేర్చినాఁడు,' ఇట్లని వ్రాసితిమేని రసము రెండు విధములఁ జెడును. నాయకుఁడు పుట్టి పెరిగిన విషయములలో మన కేమి యక్కఱ! లోకములో నున్నవారందఱు పుట్టకయ పెరుగుదురా? మఱి వానియందు మనకుండు శ్రద్ధకు హేతువు వానియొక్క గొప్పతనము. గొప్పతన మనఁగా. గుణములచేతనో, తన పడినపాట్లచేతనో, తాను సాధించిన మహోద్దండ కార్యములచేతనో, మన మనసులఁ దనయొద్దికి లాగికొను గుణము. కావున నట్టి ముఖ్యాంశములను, వానితో గాఢమగు చెలిమిఁ జెందిన విషయములనుమాత్రము ప్రచురించిన రసము సాంద్రముగ నుండును. లేనియెడ బానెఁడు నీళ్ళలో వైచిన గచ్చకాయంత బెల్లమువలె నది హీనమగును.

రామాయణ భారతముల విషయానుక్రమణిక

రెండవది. పుట్టె, పెరిగె, నేర్చె, దేశయాత్ర వెడలె. నిట్లని వ్రాసిన నొక సంగతిఁ దెలిసినంత నిఁకముందు ఘనమైన కార్యమో ఫలమో గలుగు నను శంక మనకుఁ గలుగదు. కావున నుద్వేగముతోఁ జదువుదమను కుతూహలము వొడమదు. ఇఁక ముందేమి వచ్చునో చూతమని మనసు తహతహఁ గొనదు. కథయందు నవధానము జీర్ణ

మగును. ప్రస్తుతవిషయముతోఁ దృప్తిఁ జెందియుందుము. తరువాతి వృత్తాంతములు తాపై నిదానముగ వచ్చువఱకు నుద్రేకము లేక వేచియుందుము. చూడుఁడు. రామాయణములో, రావణుఁడు సీత నెత్తికొని పోవువఱకుఁ గథ కొంచెము కొంచెముగా విడిచి విడిచి చదివినను ఆయాసము దోఁపదు. అటుపిమ్మట "అయ్యో! సీతగతి యేమాయెనో! పగఁదీర్పక శ్రీరాముఁ డూరకుండునా! యుద్ధ మెట్లు చెల్లినది! ఆ పరమసాధ్విని రావణుఁడు చెఱచినాఁడా! ప్రాణములతో నుండనిచ్చునా! భర్తయు మఱఁదియు నామెను రక్షింపఁ జాలిరా! చెఱఁదలఁగినను సౌఖ్యపడెనా!" ఇత్యాది బహుభంగుల హృదయ మల్లలనాడి యాపె జీవితము తుద ముట్టువఱకు నన్ని వివరముల నెఱుంగ నలజడిగొనును. కావ్యము ముగింపునకు వచ్చినను నాపెపై మనకుండు చింతయు ప్రీతియు గౌరవమును ముగియవు. అనేకులు వాల్మీకి బహిరంగము చేసినది చాలదని, తమ తమిఁ దృప్తిఁ జెందుటకై యయోధ్యలో పట్టాభిషేకానంతర మా యమ్మ యెన్ని క్రీడావినోదంబుల ననుభవించెనని యూహించి యా యను సుఖము దమ సుఖముగా నానందింతురు. "భోగము లెన్నియున్న నేమి? ఆనాటి పరిభవ మమ్మానవతి హృదయముఁ బాయునా? శల్యమువలె నాటి వేదన యొనర్పకున్నె? అట్లగుట శ్రీరాములకు వ్యసనము దోఁపఁగూడదని బయట నాటలు పాటలు నవ్వులు నెన్ని ప్రచరించినను

లోన నానాఁటికిఁ గ్రాఁగి క్రుంగుచున్నా!" యని యాక్రో
శించువా రెందఱు! మఱి, పారంపర్య నీచమును నీతియని
భావించు నితరులు "రాముఁడు మన యట్టివాఁడే! పరుని
యింటఁ గాఁపురమున్న యాలియెడ సందియముఁ దాల్ప
కుండునా? తాల్పఁడేని మగవాఁడా! కావునఁ దప్పక వెలి
వేసియుండును" అని యెంతురుగాఁబోలు! ఇట్లు పల్లెఱం
గుల నమ్మహాదేవి నొక నిమిషమైన నెడఁబాయఁజాలక మన
స్వాంతము లా యమం జుట్టి రక్షకసైన్యము లట్లు గాచు
చు నామె కారోపింపఁబడిన యవస్థలఁ దాల్చును. దీని కేవి
ప్రమాణము లందురో, మీ యనుభవమును, పుంఖానుపుం
ఖముగ బయలువెడలిన ఉత్తరరామాయణము, మైరావణ
చరిత్ర మున్నగు, నుపరామాయణములును. వాల్మీకియొక్క
మాహాత్మ్య మేమనవచ్చును! అతని భావనాశక్తి తాఁకినఁ
జాలును, మనకుండు బడుగో బక్కయో యైన ప్రతిభయును
సాంగత్యప్రేరణచే రేగి యావచ్ఛక్తిని బట్టువట్టి బయటఁ
బెట్టి విజృంభణముతో నెందఱు పట్టినను నాపరానిదై
"భావాంబరవీథి" విహరించును! కవి బ్రహ్మల చంద మిట్టిది.
తా మిడిన యారగింపుతో రక్తి పూర్తియై యంత మొందదు.
మఱి యారగింప నారగింప నింకను గావలయు నను స్పృహ
ప్రజ్వరిల్లును. ఆత్మకేళియందు విరతి కాస్పదమైన రతి యొక్క
డిది. రామాయణంబున సీతాపహరణ మెట్టులో భారతమున
ద్రౌపదీ వస్త్రాపహరణము నట్టిద. పాంచాలీపరిభవము రక్తి

ముతోఁగాని తదితరములతోఁ గడిగివేయఁ గాదని మనసు నకుఁ దట్టని మనుజు లున్నారా? ఆ కార్యము నెఱవేఱు వఱకు నందే చిత్తములు హత్తి యూపిరాడనట్టు లుండును. అయిన నొక విజ్ఞప్తి. ఇప్పుడు వ్యాప్తిలోనుండు భారతము దాని కాదికవియైన వ్యాసుఁడు వ్రాసినది గాదు. వ్యాస ప్రోక్తము గొంత భాగముమాత్రము. గ్రంథము సుప్రసిద్ధ మగుడు జైనులు, వైష్ణవులు, బౌద్ధులు, స్మార్తులు, వీరశైవులు, పౌరాణికులు మొదలగు తెగలవారందఱుఁ దమ తమ సిద్ధాంతముల నందులోఁ జొనిపి యా యితిహాస మును బాడుసేసిరిగాని, మూలకవియొక్క భావగాంభీర్యము గణనాతీతమగుటంజేసి యది యింకను బొత్తిగఁ బూఁడి, యింకి, నిస్సారముగాకున్న యది. ఇది మన దేశముయొక్క భాగ్యములలో ప్రాథమికము. మతముల వాతఁబడియు జీర్ణముగాక బ్రతికియుండుటకన్న మించిన మాహాత్మ్యము త్రిలోకముల మూలమూలలగా వెదకినను దొరకదు! అట్టి మాహాత్మ్యముగల భారతముం దలపోసిన నానందముచేఁ గనుల నీరు గ్రమ్మునేకాని, నాలుక తుదకు మాటలు వచ్చునా! పలుకులు దుస్తరములు గదా! మనసు దుర్భరమైన అరణ్యశాంతిత్రయములు ముక్కాలు మువ్వీసము కృత్రిమపర్వములు. తక్కినవానిలో నాదికవి వ్రాసిన ఫక్కినే విశుద్ధముగ నీ కాలమువఱకు వచ్చిన వెవ్వియును లేవు, గాని సరాసరికి శుభ్రములని యంగీకరింపఁబడఁజాలి

నవియ. కావ్యశోభ నాపాదించు రెండు దుర్విపత్తులందుం డుట రసికుల పాపఫలము! ఎవ్వియన. దుర్యోధనుఁడు పాండవుల నడవికిఁ దోలుట యొకటి. పంద్రెండేండ్లుగూడ నజ్ఞాతవాసమే విధించియుండినఁ బాండవుల బ్రదు కెట్లయినఁ గానిండు, మనకు వైరస్యములేని కావ్య శ్రవణానందము గల బ్రదుకు దప్పియుండదు. పాండవుల యరణ్యప్రవేశముచే మనకైన ప్రాప్తి యేమని తెల్పుదు? దానికన్న నెన్నియో మడుంగులు క్లేశకరమగు వర్ణాశ్రమాది ధర్మములంగూర్చిన మతివిహీనదీర్ఘప్రసంగ ప్రవేశము. అరణ్యరోదనమఁట! దానికంటె దిక్కులేనిది కావ్యములలో వేదాంతరోదన! ఆ ధర్మరాజు శుద్ధముగ వదరుఁబోతు! ఋషులను జూచినదే దండముఁ బెట్టి దూరముగాఁ దన నీడనైన వారికి సోఁకనట్లు తొలఁగిపోవుచుండిన నెంత పుణ్యముగా నుండును! కాలక్షేపార్థము అడిగిన ప్రశ్నలే యడుగుచు, నుత్తరము లెంత విరుద్ధములుగ నున్నను గంగిరెద్దురీతిఁ దలయూంచుచు నాయన సల్లాపములు సలిపె! మనకవి ప్రలాపములు! రెండవ విపత్తు ఏదియందురో ఆ భీష్ముఁడు పెద్దమనుష్యునిరీతి గుటుక్కుమని చచ్చి జన్మ సాఫల్యమునొందక కొన్ని నెలలు క్రిందఁబడి యునికి! మన గ్రహచారముగాకున్న భారతవీరులనెల్ల నుత్తముఁడని పొగడ్తఁ గన్న యాతఁడు పరస్పరాసంగతవిచారములనెల్ల మన నెత్తినఁ గట్టియుండునా? ఋషి సందర్శనము, భీష్మోప

దేశము, అను నీ రెండు తరుణములు సాకులుగఁ జేసికొని యీ హిందూదేశములో నెన్నివాదములు, వేదములు, మతములు, తత్త్వములు బయలువెడలెనో వానినన్నింటిని సులభముగ లోకులలోఁ బ్రసరింపఁ జేయుకొఱకై యీ యుత్తమోత్తమకావ్యములో నిమిడ్చి దానిని కంటకపాషాణవన్యసత్త్వభయంకరంబైన మహారణ్యముఁగా నొనర్చిరి. కవిత్రయమువారీ చిక్కుల విడఁదీసి విడిచి యాంధ్రభారతము మాతృకకంటె రసవత్తరముగ నొనర్చిరికాని, జనాపవాదశంకంజేసి యేమో, వారు పూర్తిగా సవరింపలేదు. రామాయణమునందు కథాసంయోగము అఖండము. ముఖ్యాంశములనుండి దృష్టిని పెడత్రోవకుఁ దీసికొనిపోవు సంగతు లంతగా లేవు. భారతమున నుపశాఖలు మెండు. కొన్ని శాఖలునుగావు, ఏ సంబంధమును లేనివగుట. కావున నప్పుడప్పుడు దారిఁదప్పి పరిభ్రమించువారమై పిమ్మటఁగష్టపడి కథారాజమార్గమునకు వచ్చులోపల తత్పూర్వము పఠించిన భాగములు మఱపునకు వచ్చుటయు సహజము. మఱపునకు రాకున్నను వానిచే హృదయములలో దీపించిన భావములు ఉడుకును దక్కువయగును. రచనలో రామాయణము మేలు. భావనాశక్తిం గొని పరిగణించిన భారతమునకు గౌరవ మధికము. ఒక్క యధికమన్నంజాలదు. హస్తిమశకాంతరమన్నను సత్యమునకు నగౌరవము రాదు!

ఈ యితిహాసములు సైతము కాలక్రమముగా వ్రాయఁబడక కార్యకారణరీతిగా కథలకెల్ల నాధారభూతమగు విషయముతో నుపక్రమింపఁబడి యుండినచో స్వారస్యమింకను నుద్ధురముగ నుండును. ఇవి త్రొక్కిన మార్గముననే వీనిలోని గుణములుమాత్రము లేని చిల్లరకావ్యములు తఱుచు పోయియున్నవి

"అనేకవిధ పదార్థప్రపంచ సంచితంబు, నుపపర్వ మహాపర్వోపశోభితంబు"గ నుండుటయొక్క కతముగ, నాదినే భారతమునఁ గథాసంగ్రహము నిర్వర్తింపఁబడి యుండుటయు, "ద్వాపరాంతమునఁ బాండవధార్తరాష్ట్రులకు మహాఘోరయుద్ధంబయ్యె"నని వక్కాణింపఁబడియుండుటయును. ఇందుచేఁ గథ కొంతమట్టుకు నేకీభావముం జెందుట, చదువరులకు ముఖ్యాంశములు గజిబిజిలేక యేర్పడుటయునను శ్రేష్ఠములైన సిద్ధులు సేకుఱినవి. రామాయణమునందును కాలానుసరణముచేఁ గలుగు నైక్యభంగము సమర్థించుకొఱకుంబోలె సంక్షేపముగ నాదినే కథాభాగములు దెలుపఁబడియున్నవి.

కార్యకారణక్రమమునఁ గథను వర్ధిలఁజేసినవారు ఆంధ్రప్రాచీనకవులలో నాకుఁ దెలిసి సూరన్నఁ దప్ప నింకెవరును లేరు. బహుశః ఈ మార్గసంచారమునకు మొదలిడినవాఁ డితఁడే యేమో! ఈ విషయమై ప్రభావతీప్రద్యుమ్న

ముం గూర్చి చర్చించుచో నొక్కింత వ్రాసియుంటిమి, గాని యందును నది కళాపూర్ణోదయము ననుకరించినదని చెప్ప లేదు. కార్యకారణ సమ్మేళనముచే నేకీభూతముగా వ్రాయఁ బడిన గ్రంథములలోఁ గళాపూర్ణోదయము ప్రథమము. స్వతంత్రముగ నవీన భంగుల రచించుట కవియొక్క మహా ప్రతిభకు ఫలము, సాక్షియును.

కళాపూర్ణోదయమునఁ గార్యక్రమము

ముఖ్యపద్ధతి

కాలక్రమముంబట్టి చూచిన నీ కథకు నాదిమభాగము పంచమాశ్వాసములోని సరస్వతీ చతుర్ముఖుల లీలాకేళి. అనఁగా సామాన్యకవులు వ్రాసియుండినఁ బంచమాశ్వా సము ప్రథమాశ్వాసమైయుండును చూచితిరా! ఈ కవి యొక్క కూర్పులోఁ గథాప్రారంభమునకుఁ గావ్యప్రారంభ మునకు నెంత దవ్వో! ఇట్లు దూరస్థములయ్యు నల్లిక చెదరక జిగిబిగిగా నున్నందున నియ్యవి గాఢాశ్లేషముం గాంచి యున్నవి. కథ పూర్తిగాఁ దెలియుటకు నైదాశ్వాసములు చదివి తీఱవలయు. ఇఁక కథ నెఱుంగవలెనన్న కుతూహల మన్ననో ప్రథమాశ్వాసములోనే యంకురితము! “రంభా నలకూబరులవలనఁ గడపట వినంబడిన వాక్యం బొక్కటిఁ దలంచికొని కృతాంజలియై” కలభాషిణి నారదునితోఁ దా విన్న ప్రకారంబు నీ రీతి విన్నవించుచున్నది.

సీ. . . . . .

ఏను వృథాభ్రాంతి నింతనంతను దాని
　　వెంబడిఁ జని పల్కు వింటినొకటి
వినుఁడది, యర్థేశతనయుఁడో యబల! యి
　　న్నారదు మాటలు నడుమవేఱ

తే. పొడమె నేమయ్యెనల "కళాపూర్ణుసుద్ది"
కడమచెప్పుమన్న రంభయప్పుడ తెలుపనె
నీకు మఱి చెప్పరాకుంట నీ కథయును
నీకు నాతోడుసు మ్ముబ్బ నీకుమనియె.

(కళా. ఆ. ౧. ప. ౧౯౧.)

ఇదియే కళాపూర్ణునింగూర్చిన తొలుతటి ప్రస్తావన. ఔత్సుక్యముఁ బ్రేరేచు విధములు చూడుఁడు. రంభ తన ప్రియునికినైనఁ జెప్పరాని కథ యెట్టిది? ఏ కారణముచేత నామె మౌనధారిణియాయె? నను మొదలగు ప్రశ్నలు తమంతట నావిర్భవించి, సమాధానము దెలియువఱకుఁ గథనుండి మనలఁ గన్నెత్త నీకచేయును. కావ్యములలోని యేకీభావమనఁబడు గుణంబదియ. అనఁగా నొక పట్టున, నొక త్రుక్కగా సర్వముఁ గ్రోల మేనిఁ దనివి నీయమి. భాగ భాగముగాఁ జదువఁబోయినఁ దృప్తిలేదు. ఏలన. సమాప్తి వఱకు నేభాగము నఖండముగాఁ దెలియఁబడమిచే.

తే. "ఏనెఱుఁగ వేడ్కపడుచున్న దానవో త
పోధనోత్తమ యాకళాపూర్ణుఁడనఁగ
నెవ్వఁ డాతని పుట్టుము న్నేమిచెప్పె
నెద్ది చెప్పరాదనియె నాయిగురుఁబోఁడి."

(కళా. ఆ. ౧. ప. ౧౯౨.)

యని పలికిన కలభాషిణి పలుకు లాయమవే గాదు. మనవియును. మందుకొఁ అవి నెగఁద్రోసినట్లు నారదుండు "ఇదియంతయు నపూర్వంబు నాకునుం జెప్పరాదు" అని యానతిచ్చు తఱికి మన యుద్రేక మాఁపరానిదయ్యెడు! నారదుఁడు ఈ కథ 'యత్యపూర్వ' మనుట, కవి పాత్రముల మూలమునఁ దన కృతిని దానే యట నట విమర్శించుట కింకొక ప్రమాణము. రంభానలకూబరులకు నీ యపూర్వ వృత్తాంతముంగూర్చిన ప్రసంగసమయమును వివరించుచు నారదుఁడు కలభాషిణితోఁ దన ప్రియునకైనఁ దాఁ దెల్ప మికి నా యప్సరస చెప్పిన విధంబు వినుమని యిట్లనియె.

సీ. యోషారుషాభరణ తత్కథలు వ
చ్చిన నేమి యంటేని వినుము దెలియ
నా కథ లిఁకఁ జెప్పినట్టివారును విని
నట్టివారును ధాత్రియందుఁ బుత్ర
పౌత్రప్రపౌత్రాది బహు సంతతియుఁ దన
ర్చుచుఁ జిరకాలంబు ప్రచురసంప
దభివృద్ధిశోభిత శుభసౌఖ్యములుగాంతు
రను మాట యున్నది యాదియంద

"యేను నీకది చెప్పిన దీనికొఱకు
ననిఁ బుట్టింగవలయునోయని వెఱచెదఁ
బ్రాణవల్లభ యని తానకాంగసంగ
సౌఖ్యమునఁ జేర్చు నాకు నిష్టంబులగునె."

తే. అదియు వింటివి గదయని యనియె దేని
యేను వినినట్టి పిమ్మట నిట్టిమాటఁ
బలికె నొక్క యమోఘ వాగ్విలసనుండు
గావున వచింప వినవికఁ గాదు నాకు.

(కళా. ఆ. ౧. ప. ౨౦౧, ౨౦౨.)

ఈ మాటలతో మనయొక్క యుత్కంఠ గొంతుకు మీఁదుగాఁ బోవును! ఉత్కంఠకుఁదోడు అద్భుతమును వచ్చి చేరును ఎట్లన కేవల నిరర్థక వ్యాఖ్యానమైన ఫలశ్రుతిఁ గూడఁ గథలో ముఖ్యాంగముగఁ జేర్చినాఁడేయను విస్మయ మొక్కటి! మఱి, ఈ ఫలములు దేవతల కశుభములగుటచే దేవత లీకథను వక్కాణింపరు. మనకు శుభములు గావున వినవలయునను సంభ్రమ మింకను నుద్గాఢమగును. ఒక పక్షమువారికి మేలుగను, మఱియొక పక్షమువారికిఁ గీడుగను అవతరించిన ఈ చరిత్ర మేరీతి భూలోకములో వ్యాపింపఁగలదని యాశ్చర్యపడమా? కథ దేవలోకములోఁ బుట్టియుండుట ఈవఱకే స్పష్టము. ఇఁక దేవతలు దెల్పనిది మనకుఁ దెలియు టేభంగిని? కథయేమో తెలిసియేయున్నది. లేకున్న నీ కావ్య మెక్కడిది? నారదుఁడును,

తే. ''అతిపవిను రంభకును గల యట్టిభయము
నాకుఁ గల్గుటఁ దత్క్షథనీకుఁ జెప్పఁ
గూడ దట్లయ్యు మిక్కిలి కుసలయమున
వెలయఁ గలదది వెలయు త్రోవలును గలుగు.''

(కళా. ఆ ౧. ప ౨౦౪.)

అని చెప్పుచున్నాఁడు. అతని వాక్య మమోఘము! అట్లగుట నెవ్వరికి నపాయంబు నాపాదింపని యే మంత్రముచేఁ గవి యీ క్రియ సమర్థించునోయని యబ్బురపాటును దొట్రుపాటును జదువరులకుఁ దలముస్కలౌఁ గదా! మనల నేకాగ్రావధానులం బరాకృష్టచిత్తులం జేయుటకన్న శిల్పసౌభాగ్యమెయ్యది? కల్పనయనఁగా నిట్లుండు నదే కల్పన. ఊపిరియాడకుండునంత యుద్వేగముం గల్గించునది.

ఆధారవిషయమును గార్యముచే రోయఁబడిన కారణముగాఁ జూపుటయేగాదు. మీఁది యుదాహరణములం జూచిన నంగప్రాయములను చిల్లరవిషయములంగూడఁ గాలసరణిగ నీ కవి వర్ణనసేయఁడని తెలియుచున్నది. రంభానలకూబరు లాడుకొనుచున్న కళాపూర్ణగాథలు అటుతరువాత నడిచిన కలభాషిణీ నారదప్రసంగమునం దేలుచున్నవి. దీనింగూర్చిన నిదర్శనము లీ గ్రంథములో లెక్కకు మీఱియున్నవి. నారదుఁడు గానవిద్యాభ్యాసమునకై ద్వారకకు రాకపోకలఁ జేయుట ప్రథమ ద్వితీయాశ్వాస

ములలో నివేదితము. దీనికిం గారణము కలభాషిణీమణిస్తం భుల సంభాషణములో నారదునికిఁ దుంబురునితోనైన మాత్సర్యమునకు హేతువు ఆ నారదుఁడే మణికంధరునితోఁ జెప్పినట్లు సిద్ధుఁడు వివరించిన, తుంబురునికి గాన విద్యాప్రభావంబున వైకుంఠలోకములోఁ బూర్వ మెప్పుడో నడిచిన యనితరభావ్యసత్కారము కాలక్రమమును బాటిం పక నాటకరీతిగాఁ బాత్రములచే కథను బెంపొందించుటలో సూరన్న యద్వితీయుఁడు. ఈ కౌశల మీతరికిఁ బరిపక్వము గామిచేతనో, యలంకారశాస్త్రములకు విధేయుఁడైనందు ననో, ద్వారకాపురవర్ణనము ప్రభావతీప్రద్యుమ్నమున నున్నంత సొంపుగా నిట లేదు. కవియే నేరుగ వర్ణించునట్లు వ్రాయుట యొక దోషము. మఱియుఁ బురజనవర్ణనముం గూడఁ జేసియున్నాఁడు. ఇది గర్హ్యము. ఏలన. కావ్య మున నే యే పాత్రములు వచ్చునో వానినిమాత్ర ముచిత స్థలముల వర్ణింపవలయునేగాని, కథారంభమున నిష్ప్రయో జన వర్ణనములం జేయుట యసంగతియను వికారము.

కల్పనాదోషములు

షష్ఠాశ్వాసములోని 189-వ పద్యమువఱకు నుండు నంత ప్రౌఢముగఁ దరువాతి భాగములు లేవు. ఈ గ్రంథ మంతటితో సమాప్తిఁ జేసియున్న సమ్మాన్యతరమై యుం డును. ఏడవ, ఎనిమిదవ యాశ్వాసములలో భావనాశక్తి, ప్రతిభ మొదలగు కవిత్వ మూలశక్తులు బలహీనములు.

తుదకు మధురలాలసాపరిణయాదులు వర్ణింపఁబడకున్నను తత్పూర్వకథచే నూహ్యములకావున వానిని బొందించి యుంట పునరుక్తిఁ బోనిది. ప్రధానాఖ్యానముతో నైక్యము వీని కత్యల్పము. అట్లుండియు నీ నిరర్థక ప్రస్తావనకుఁ గవి యేల ప్రవర్తించినాఁడనుట చింతనీయము.

కథాంగము లేక భావముండాల్చి యొక శరీరముగా నేర్పడియున్నఁ గళకు ప్రాశస్త్యము. అట్టి గాఢసంయోగము నకు షష్ఠాశ్వాసములోని పూర్వోదితపద్యమునకుఁ దరువాతి భాగములన్నియు విచ్ఛేదహేతువులు. ఇది యెఱింగి ప్రతి క్రియచేయ నెంచినవాఁడై కాఁబోలు, కథయొక్క యాది నుండి యంత్యమువఱకు 'పూసలలో దారమట్లు' ఇమిడి యుండుగతి మణిహారవృత్తాంతముం గూర్చియున్నాఁడు. ఈ హారవృత్తాంతముం దిలకింపుఁడు.

మణిహారవృత్తాంతము

దీనికి నాదిమప్రభువు విష్ణువు. అతనిని దపస్సుచే మెప్పించి దానిని బడసినవాఁడు సుగ్రహుఁడు పిమ్మట బ్రాహ్మణశాపమున నతండు దనతొల్లిటి యెఱుకయంతయు హాతంబుగాఁగా, నూతనావతారమెత్తినవాని యట్లు సత్వ దాత్తుఁడను పేరఁబరఁగి రాజుగాఁ గొంతకాలముండి పిమ్మటఁ గళాపూర్ణునికి మంత్రిగాఁ గుదిరె. సుగ్రహుఁడు మున్ను దేవతాలయములోఁ బెట్టి మఱచిన యా మణిహారమును మధురాపురపు బ్రాహ్మణుఁ డొకఁడు తీసికొనిపోయి తన

యింట బహు వర్షములు పూజసేయుచు నుంచికొని ద్వారక కరిగి శ్రీకృష్ణునికి సమర్పించెను. శ్రీకృష్ణుఁడును "దండకాకృతి సముజ్జ్వల సంస్తవలీల కెంతయుఁ ఘనముగ మెచ్చి, యిచ్చె మణికంధరనామునకుఁ." మణికంధరుఁ డలఘు వ్రతునకు, నతఁడు కళాపూర్ణునకును, నాతఁడు శిశుప్రాయయగు మధురలాలసకుం గ్రమముగ నొసంగిరి. అట్లగుట నీ హారమును సరస్వతీచతుర్ముఖవిలాసక్రీడయుం బోలెఁ గధ నేకీభూతముం జేయు కల్పనలలో నొక్కటి. పూర్వోత్తర భాగంబు లన్నిటికిని ఈ హారము సామాన్యము. కథనెల్లఁ బ్రాఁకియుండు తీఁగవంటిది

ఈ రీతి నీ కల్పన మహోత్తరమైనదయ్యు నిష్కళంకంబుగాదు. ఎట్లన. ఆ హారముయొక్క నాయకమణి యెవ్వరి హృదయస్థలంబున నెంతవఱకు సోఁకియుండునో, యంత తడవును వారికి సర్వజ్ఞత్వము, వాక్యపటుత్వమును సిద్ధించునని విష్ణువు వరము దాని సత్యము ననుభవమునకుఁ దెచ్చికొనులోపల సుగ్రహుండు శాపహతుఁడాయె! మధురాపురి బ్రాహ్మణుఁడన్ననో దానిని గంరములో ధరింపక పూజసేయుచు బహు వర్షము లున్నాఁడఁట! వాని భార్యయొక్క చిత్తస్థైర్యమెంత దృఢమో! ఆపెగూడ దొంగతనముగానైన దానిని వేసికొనలేదు. శ్రీకృష్ణుఁడు మణికంధరుని మెడలో వేసినాఁడుగాని యది "బాలతఁ గనుపట్టు విష్ణుని కలాపము గావునఁ దద్భుజాంతరస్థితికి చాలకొప్పి గళసీమన యెంతయు

గుప్తమై" యుండెనఁట! 'బాలతఁగనుపట్టు,' అను విశేషణము సమంజసమా? పూజారి బ్రాహ్మణుఁ డిచ్చినది బాలకృష్ణునకా? షోడశసహస్రమహిషీయుతునకా? పిమ్మట శిశువుగా నున్న మధురలాలసకుఁ గళాపూర్ణుఁడు వేయఁగా నాయకరత్న మాపె హృదయంబు సోఁకునట్లు పడినది! సమయముఁ జూచి పడవలసినచోటఁ బడినదిగదా! ఎంత తెలివిగల పతకము! అట్లు సర్వజ్ఞయైన యబ్బాలకామణి యనేకుల పూర్వవృత్తాంతముం దెల్పి సత్వదాత్ముని చరిత్రమునకు వచ్చునప్పటికాపె "యటునటుఁగదలఁగఁ దన్మణి హృదయస్థలముఁ బాసి కడకేఁగుటఁ దెలివి యుడిగెను'" ఇట్లు వ్రాయుట కామరూపధారణమునకన్న నభావ్యము ఏలన సత్యముగా నుండునా యను శంకఁ గలుగఁ జేసి కథయందు నమ్మకను భ్రమను బోఁగొట్టుఁ గావున. ఇఁక ముందటి వృత్తాంతమింకను ప్రాయోభావమునకు దూరము.

వ. "నాఁడిట్లు బోధోదయం బగుటయు నుడుగుటయు నేతన్మూలంబులని యెవ్వరు నెఱుంగకుండుటను నిది సామాన్యహారంబయను తలంపున మావారు దాఁచి మఱచుటఁ జేసి నాఁటనుండి నేఁటిదాఁక నిద్దివ్యహారం బెవ్వఁడును ధరియించుటలేదు. నేఁ డాభరణసమయంబునఁ బ్రసంగవశంబునఁ దలంచికొని చెలులు తత్ప్రాప్తిప్రకారం బెఱింగింప నిది సుముహూర్త లబ్ధంబైన ప్రథమభూషణంబనియు భవద్దత్తంబనియు సత్యావరంబునఁ దెప్పించి హృదయభాగస్పర్శి నాయకరత్నంబుగా నిపుడు ధరియించియున్న దాన."

(కళా. ఆ. ౮. ప. ౧౮౯.)

ఇందలి యసంభావ్యములు రెండు. కన్యగానుండు నపుడు ఆ రాజు గాలిద్రైన సోఁకునా దేవుఁడా! యని వ్యథఁగూరుచున్న విరహవేదనకాలమున, పెండ్లినాఁడు, ఎన్నఁడునురాని ప్రసంగవశము ఇప్పుడేల పైఁబడవలయును? రెండవది. 'హృదయభాగస్పర్శి నాయకరత్నంబుగా' ధరింప బుద్ధి నిష్కారణముగా నేల పొడమవలయు? లోకములో నదృష్టములు, నిర్హేతుకములునైన యాకస్మికములు లేక పో లేదుగాని, పదేపదే వలసినచోట్లనెల్లఁ గాకతాళీయన్యాయ ముల నాశ్రయించుట కల్పనకు మిక్కిలిఁ గొఱంత. కామ రూపములు, దివ్యదృష్టి, ఇత్యాదులు అన్ని కష్టములకు ననుకూలించు సాధనములుగానఁ బ్రశస్తములు గావు. సర్వ సందర్భములలోఁ జేరఁజాలినవి యీ కథలోఁ దప్పక చేర్పఁ దగిన యంశములని చెప్ప వీలులేదు గనుక, నిట్టి వేసందర్భ ములను జేర్పకుంట మేలు కథకెల్ల సూత్రమువలెనుండు నీ హారమిన్ని వక్రముల కాస్పదమగుట చింతావహము!

షష్ఠాశ్వాస మధ్యభాగమునకుఁ దరువాతి భాగములు తుచ్ఛప్రబంధరీతిని వ్రాయఁబడిన భావవిహీన ఘట్టములు గావున వానిని ప్రత్యేకముగ విమర్శించుటొప్పు. తత్పూర్వ భాగములలోఁ బ్రతిభ, భావము, కృతినిర్మాణచాతు ర్యము, నివన్నియుఁ బుష్కలముగ ప్రకాశించునట్లు రచిం చిన యీ మహాకవి నీరసవర్ణనములకుం దిగుటకుఁ గారణ ములు, కాలదోషములును, అలంకారశాస్త్రములయెడ

వినయవినమ్రుఁడై 'సర్వలక్షణసంపన్నము'గా వ్రాయఁ బూనిన దౌర్భాగ్యపుఁ బ్రతిజ్ఞయును. మహాకావ్యమని శాస్త్రకారులచేఁ బేర్కొనఁబడినదాని నుత్పాదింపఁబోయి, కవిత్వమున కుత్పాత మాపాదించెననుట స్పష్టము.

ప్రథమభాగములోని పొరబాటులు

ప్రథమభాగమున* కాలదోషము లంతగా లేవు. అనఁగా ప్రబంధముల తీరు తక్కువయనుట. మఱి సర్వలక్షణసంపన్నతచేఁ గలిగిన దోషములు పెక్కు లున్నవి. మణికంధరుఁడు తపస్సు చేయుటకు నుపోద్ఘాతమో యనునట్లు నిస్సంగత్వదోషభాజనమైన యాత్రాభివర్ణన మొకటి చేయఁబడి యున్నది. ఈ యాత్రలచేఁ గథకుఁ గలుగు ఫలములు రెండు. వైపుల్యము, వైరస్యము. ఆ! ఒక యూహామై దీనిని సార్థకమందమా! ఈ ఋషి తపోభంగమునకై రంభ రాఁబోవుచున్నదిగదా! ఆమెకు నసహ్యము గలుగ కుండునట్లు కొన్ని స్నానములు చేయించి శుభ్రకాయునిఁ గాఁ జేసి యుంతమని కవి తర్కించియుండునా? తర్కించి యుండెఁ బో. కోరిక యీడేరు మార్గ మిది గాదుగదా. ఎట్లన. వీరెన్ని మునుకలు వేసిననేమి? తపస్సులోఁ గూర్చుండి యేకాగ్రముగ మైమఱచి కొన్ని వత్సరములు

---

* నేను ప్రథమభాగమనునది ౬-వ యాశ్వాసములోని ౧౮౯-వ పద్యమువఱకు నుండు భాగమనియు, ద్వితీయభాగము దక్కినదియనియుం దలియునది.

వత్సరము లేల?—వాసరములున్నం జాలదా?—మలయమారుతమువలె ప్రజ్వరిల్లుటకు: అనాదరణపాత్రమగు నీ ప్రసంగములకు నాహుతిగా నీఁబడినవి సుమారు నలువదియైదు పద్యములు!

కలభాషిణికిని నలకూబరునిపైఁగల మోహము కృతార్థమగుటకు నీ తీర్థయాత్రయొక్క యిక్కట్టు. చూడుఁడు. నలకూబరునిఁజూచి వలచినపిదప నారదుని శిష్యురాలై గానవిద్యాభ్యాసమునఁ గడపిన యేండ్లు నాలుగు. ఇట్లంత కాలయాపన మప్పుడే యయియుండఁగాఁ ద్వారలోఁ దపోవర్ణనముం బ్రదర్శించి హృదయసాఫల్య మందటకుఁ జేసి యుండిన బాగు. ఆ మధ్యమున యాత్రకై యొకటి రెండేండ్లు వినియోగించుట శృంగారభంగము. కలభాషిణికి వయసు ముదురకయుండునా? మఱియు, నా నాలుగేండ్లు నీప్సితసిద్ధికొఱకైన సన్నాహమునఁ గడపఁబడెఁగాన నాపె యోర్చియుండుట సహజము. ఈ యాత్రలోఁ దగులఁబెట్టిన కాలము నామె యేరీతిఁ గడపెను? నలకూబరస్మరణలోనా? విరహవిషయమైన సఖులతోడి సల్లాపములలోనా? కవి యా యకనొంటిగా విడిచి మఱచియుండుట మహాపాపము. పొరఁబాటు! యాత్రవలనఁ గలిగిన ఫల మిదియే!

ఈ ఘట్టమునకన్న సందర్భశుద్ధిలేనిది పంచమాశ్వాసములో ౧౩౨-వ పద్యము మొదలు ౧౭౪-వ పద్యము వఱకునుగల పసిపాపచేఁ జేయఁబడిన యోగవిద్యావిషయకమైన

దీర్ఘప్రసంగము. ఈ విమోచనమార్గప్రదర్శనము శుద్ధముగ ననవసరము. అసంగతము. అసమ్మతమును!

దోషవిచారణ యటుండనిచ్చి ౧౫౭ కావ్యము నుత్కృష్టతమంబని పరఁగంజేసిన గుణంబుల నభినందింతము.

సద్గుణములు

నాటకరీతిని సంభాషణాదులచే వృత్తములం బ్రకటించుటయందు నీ గ్రంథము అసదృశము. సామాన్యకవులు రాజు నొక్కనిం బేర్కొని యతని దేహమనోలక్షణముల ముప్పది నలువది పద్దెములచే పొడవుగను అసంగతముగను గ్రంథాదినే వల్లింతురు! అనఁగా తత్పూర్వ కవులరీతినే మాఱుమాటలం జేయు స్తననమనుట. వందిమాగధస్తుతులచే నెవ్వని గొప్పతనమును సాక్షాత్కారముం జెందినట్లు తోఁపదు. గుణములు చర్యలచేఁ బ్రకటితములగు నే నడవడియు లేనివాని మనఃప్రకృతి నెఱుంగఁ బోలునా? కావున కథలో నాయకుం డొనర్చు కృత్యములచే నతని శీలము తెఱంగు మనకు బోధయగునట్లొనర్పనగునుగాని, ప్రత్యేకముగ ధర్మముల జాబితా నొకటి వ్రాసి యతని మెడఁ గట్టినఁ గవియొక్క బుద్ధిలేమిదక్క నింకెద్దియుఁ దెల్లంబుగాదు. అనేక కార్యములతో నిండినట్లు కథం గల్పింప లేనివారికి జాబితాపద్ధతియే గతి. దుర్గతి ఈ సార్వభౌముండు చైతన్యమును సహించిన సంగ్రహధర్మశాస్త్రము అనుటలో సత్య

ము సుఖమును రెండును సున్నలు. మఱియు, ప్రదర్శింపఁ బడు కార్యజాలములతో సంబంధము లేని గుణముల వర్ణించుట పనికిమాలిన పెత్తనము. సంబంధముగల గుణముల మాత్రము వర్ణించుట కర్తవ్యమేని, కార్యసంబంధములచే నవి యొకరు చెప్పక చూపకయ తమంతఁ దేటపడవా? యుద్ధమున నవక్రవిక్రమము చూపెడు నభిమన్యుంగూర్చి వేఱుగ నితఁడు ధైర్యశాలియని శ్లాఘింపకున్న మన మెఱుఁగలేమా? అట్టి శ్లాఘనలు గూడదని కాదు నామతము. మఱి పాత్రములమూలమునఁ జేయంబడినఁ గథ నెట్టులు వాఱని యైక్యమును వహించి స్వారస్యముగనుండు. కళాపూర్ణోదయములో రాజవర్ణనఁ జేయలేదు. ప్రభావతిలోను జేయలేదు. ఇందులకుఁ గతంబేమి యొక్కో! బహుశః గ్రంథాదిని రెంటియందును రాఁదగిన మహాత్ముఁడు కృష్ణుఁడు. ఇతఁడు సుప్రసిద్ధుండు గావునఁ గవి యితనిగూర్చిన ప్రస్తావనము లనావశ్యకములని విరమించెనో! యోజింపుఁడు. తెలిసిచేసిన మనకేమి? తెలియకచేసిన మనకేమి? పాకము బాగున్న నామోదించుటయె సరి.

కథాప్రారంభముననే యెంత వడిగా నెన్ని పాత్రములం బ్రవేశింపఁ జేసినాఁడో తలపోసి యానందాశ్చర్యముల భరింపుఁడు! ఉద్యానవనములో కలభాషిణి చెలికత్తెలతోఁ గూడి డోలావిహారంబు సల్పుచుండఁగా, నారదునితో నాకాశమార్గంబునఁ బోవుచుండు మణికంధరుఁడు

మ. "తమిఁ బూఁదీఁగలఁ దూఁగు టుయ్యెలలఁ బంతాలాడుచుం దూఁగునా
కొమరుం బ్రాయపు గబ్బిగుబ్బెతలయంఘ్రుల్ చక్కఁగాఁ జాఁగి మిం
టి మొగంబై చనుదెంచు రీవి గనుఁగొంచే దివ్యమా నీంద్ర నా
క మృగీనేత్రల మీఁదఁ గయ్యమునకుం గాల్చాచు లాగొప్పెడిన్."

(కళా. ఆ. ౧. ప. ౧౪౭.)

అని ప్రశంసించిన ప్రకారము సరిగాదని నారదుండు.

మ. భళిరాసత్కవి వౌఁగు నిక్కమతగం భావింప నీవన్న య
ట్లెల ప్రాయంపు మిటారికత్తెల బెడంగే నెందునుం గాన, వా
రలడోలాచలనోచ్చ లచ్చరణముల్ త్రైవిష్టపస్త్రీల యా
దలఁ దన్నం జనునట్లు మించెనని నీ మీ దప్పె యొప్పెయగున్.

(కళా. ఆ. ౧. ౧౪౯. ప.)

క. "అని పలుకునపుడు నికటం
బున నలకూబరుఁడుఁ దాను మొగిలు మఱుఁగునన్
ఘనమగు దివ్య విమానం
బునఁజనుచున్ రంభ విశదముగ నది వినియెన్."

(ఆ. ౧. ౧౫౦. ప.)

ఆదినే యీ రీతి నైదుగుర నెదుర నిల్పుటయ గాదు. మాట మాటకును గథ పెరుగునట్లు చేయు మాహాత్మ్య మున సూరన నిస్తులుఁడు. ప్రథమాశ్వాసము ముగియున రికి కథామధ్యమున మునిఁగినవారమై, యెట్లు వచ్చితిమో, 'యాది యెయ్యది, అంత్య మేదిక్కున నుండు'నని విస్మయా నందముల నోలలాడుచుందుము. మణికంధరుని స్తుతి వ్యర్థచే

ష్టగాదు. ఆకాశమునఁ జేయఁబడియుండినందున గలభాషిణి వినియుండదు. అటు వినమి యావశ్యకము. లేనిచో నలకూబరునిపైని వలపుచేనైన దైన్యముతో నారదు నాశ్రయించియుండదు. మఱియు నా పొగడిక రంభకు నసూయాకారణము. ఆ యసూయచేఁగదా యాపె నారదునితో మాటలాడుటకై వచ్చి నలకూబరుఁడు "నరభాముల పోఁడుములకు భ్రమయకయున్నే" యని దరహాసము చేయుట! నారదుండును ప్రతిహాసముఁ జేయఁబూని,

క. "నినుబోలు వనిత నీకును
వనజముఖీ యితనిఁ బోలువాఁ డితనికి నెం
దును గల్గి కలఁచునో యి
ట్టినిగాఢపు మదము సొంపురీవులు చనునే."

(కళా. ఆ. ౧. ప. ౧౬౫.)

అనిపల్కు తఱికి కథయొక్క యస్తిభారములో సగము సంపూర్ణమయ్యెను. పిమ్మట లెక్కకు వచ్చునో రాదో యనునట్టి చిల్లరవిషయముం బోని.

వ. "అంత నమ్మహామునీంద్రుని యాజ్ఞానుసారంబుగాఁ దద్విమానంబు కలభాషిణి విహరించుచున్నయెలదోఁటలోనికిం దిగియె నట్టియెడ రంభా నలకూబరులును వినయపూర్వకంబుగా నతనిచేతననిపించుకొని యప్పు డెదుటఁ గాన్పించు వాసుదేవ ప్రాసాదరాజంబునకుం జేయెత్తి మ్రొక్కి నిజేచ్ఛం జనిరి. . . . . . .

(కళా. ఆ. ౧. ౧౬౭. వ.)

అను వాక్యముతోఁ గలభాషిణి నలకూబరుని వలచుటకును గళాపూర్ణునిసుద్ది వినుటకును సహజమైన సమయముఁ గల్పించి తక్కిన సగము ననాయాసముగ ముగించిన యీ కవియొక్క ప్రతిభ యవాచ్యము గదా! ప్రథమాశ్వాసము కథకు నాలవాలము. సమస్తములైన కార్యములయుఁ గారణ బీజంబులందుఁ జల్లఁబడి యున్నవి.

ఐక్యమను లక్షణము

సామాన్యకవులతోఁ బోల్చిచూచిన సూరన్న కళాకౌశలమింకను వైశద్యముతో వెలుఁగును. మన ప్రబంధములు తఱుచు కథానాయకుఁడగు రాజు అనునొక్క పాత్రముతోఁ బ్రారబ్ధములు. ఆయననుగూర్చిన యప్రస్తుతవర్ణనము ముగియుటకుఁ బట్టునది యొకగంట. పిమ్మట నర్మసచివుఁడో యెవఁడో యొకఁడు వచ్చుట, అటుతర్వాత వేఁట వెడలుదురేమొ. అక్కడ నొక సఖీజన పరివేష్టితయగు కోమలాంగిని జూచి రాజును విదూషకుఁడును (నర్మసచివులు విదూషకులుగ నుండుటయు విదూషకులు నర్మసచివులుగ నుంటయు హిందూ రాజధర్మ గదా!) రెండుగంట లొకరితో నొకరు శ్లేషలు, అతిశయోక్తులు, ఉత్ప్రేక్షలుఁ జెల్చునప్పటికి నిది దయ్యాలతో నిండిన కావ్యమని దూరముగఁ బాఱవైతుము! కళాపూర్ణోదయముతో నుపమింపఁదగినది, మూలము స్కంధము సామాన్యములయ్యు, వివిధగతుల దెసలవ్యాపించు శాఖోపశాఖలు

గలిగి కనుపండువుగ నుండు మహావృక్షము. సామాన్య ప్రబంధములు, కొలుకులు ఒకదానివెంట నింకొకటి యతికించుటచే నేర్పడిన గొలుసువంటివి. ఐక్యము వీనిలో లేదు. ఎన్ని కొలుకులైనఁ జేర్పవచ్చును, ఎన్నియైనఁ దీసివేయవచ్చును. వైపుల్యము దక్క నింకెద్దానికిని లాభనష్టము లుండవు ఆకృతి మాఱదు. వృక్షములు మొదలగు సజీవములవలె నుండుకావ్యముల నేయంగమునైన ఛేదించుటకుఁ గాదు. నూతనాంగములఁ జేర్చుటకుంగాదు. ఎట్లు చేసినను పరిమాణ భేదమేగాదు, ఆకారమును వికృతమగును. ఐక్యమును కథాలక్షణమును బరీక్షించు పద్ధతియేదనఁగా, ఉన్నభాగములఁ దీసివేయవచ్చునా, క్రొత్తవియేవైనఁ జేర్పవచ్చునా యని విమర్శించుట. ఈ కార్యములు పొసఁగనివైన నైక్యము స్ఫుటము. సాధ్యములైన నైక్యభావ మపక్వము.

'మానవప్రకృతిని అద్దమువలెఁ జూపుశక్తి గలవాఁడు సంభాషణలఁ దీర్చుటలోఁ దిక్కన్నకు సరివచ్చువాఁడును.', అని సూరనార్యుని ప్రశంసించినందుకుఁ దార్కాణమైన ముఖ్యభాగములలోఁ గొన్ని, యిరువురు రంభలు నలకూబరులును బ్రవేశించి చిత్రవిచిత్రగతులఁ బొరఁబాటుతో సంచరించియు నేయనుచితములకు నసీప్సితములకును బాల్పడక కృతార్థులగు తృతీయ చతుర్థాశ్వాసములలోని ఘట్టములు.

సూరన్నయు షేక్స్పియరును ఒకరి పేరొక రెఱుంగ నైనఁజాలని యంత దవ్వులనున్న సమకాలీనులు. జాతి మతవేష భాషాదుల వ్యత్యస్తులు. అట్లుండియు నీ వింత నేమిచెప్ప? షేక్స్పియరు వ్రాసిన 'కామెడీ ఆఫ్ ఎరర్స్' అనఁగా "తబ్బిబ్బుల ప్రహసనము" అను నాటకమునకును, రంభానలకూబరద్వయ విలాసమునకును పెక్కు పోలిక లున్నవి! రెంటియందును భేదములేని రూపముగల నాయకు లిరువురు, నాయిక లిరువురు. అన్యోన్యపాత్రముల నిరూపిం చుటకు నసాధ్యమైన భ్రమ తటస్థించి, నాయికా నాయ కులు తమవలచినవారని యొండొరులతోఁ జేరియుండు వేళ, 'అయ్యో! పాపము. అన్యునిచే నీకన్య చెఱుపఁబడి యెనా?' యను సంశయము మనకుఁదోఁచి మనసు కలఁత పొందించును. కాని, కథ యామూలాగ్రముగ విశదీకరిం పఁబడు సరికి తమతమ యభిమతముల కనుకూలములైన విధంబుల దాంపత్యము లేర్పడినవని చూపి, మనకు దిగ్ భ్రమము వాయుటతోడన పట్టరాని నవ్వును సంతోష మును గవి గలిగించును! ఇట్టి కథాసందర్భమెంతో యపు రూపము. అట్టిదానిని హిందూదేశములో సూరన్నయు నాంగ్లద్వీపమ్మున షేక్స్పియరును నెట్టి సంబంధములును లేనివారయ్యు నేకకాలమునఁ దలపోయుటఁ దలంచితిమేని, యిదికాల యోగప్రభావమా? ఆకస్మికవిచిత్రమా? యని విస్మయభరితాంతః కరుణల మగుదుము.

రంభా నలకూబరాపహాస ఘట్టము

మృగేంద్రవాహనాతిరస్కారంబున దూరముగఁ గొట్టుకొనిపోయి యొక పూఁబోదరింటఁ గలభాషిణితోఁబడిన మణిస్తంభుఁడు ఆమెను బలాత్కరింపఁ బూనఁగా నవ్వరవర్ణిని "ఈ పాతకిబల్మిఁ బట్టెడుఁగృపన్ వీక్షింపరే కావరే!" యని మొఱయిడఁగా "వెఱవక యెవ్వఁడురా వెతఁబఱపెడునిట్లతివ"నని, నలకూబరుఁడు, పూఁబోదరింట రంభతో వినోదము లాడుచుండిన వాఁడు, (ఇతఁడు నలకూబరాకారుఁడగు మణికంధరుఁడు) సరసము చాలించి, తన సింహనాదము విని పాఱిపోయెడు సిద్ధుని వెంబడించి పట్టుకొని తిరిగి వచ్చులోపల, కుబేరనందనుని నైదాఱు సంవత్సరముల నుండి ధ్యానించుచు సమాగమసమయంబు నిరీక్షించుచున్న కలభాషిణి, మునుపు నారదుఁడిచ్చిన వరప్రభావంబునం జేసి రంభాకారముందాల్చినదై, యా నలకూబరుని త్రోనఁబట్టి యతనింగాంచి ప్రేమయుఁ బక్షపాతంబుఁ దోఁపఁబల్కు భార్యచందంబున.

శా. . . . అక్కటకటా! యేమంచునిన్ దూరుదున్
గేలన్ గైదువు గీదువేమియునులేకే యిమ్మెయిన్ వత్తురే?
చాలన్ దూరముగాఁగ నేనిదె పరిశ్రాంతిం గడున్ నొచ్చితిన్
జాలుంజాలుఁ గరంబు మెచ్చఁదగు నీ చందంబు ప్రాణేశ్వరా!.

(కళా. ఆ 3. ప ౧౫౭)

యని ప్రీతియు నిష్ఠురతయు మెఱయఁబల్కి సమాధానముఁజెప్పి, నిజవాంఛా సాఫల్యమునకు విఘ్నముగానున్న సిద్ధునిఁ దొలఁగించుటకై నాథునింగూర్చి చెప్పుచున్నది.

క. "వీఁడా యట్లన్యాయపుఁ
బోఁడుములకుఁ బూనినట్టి పుణ్యుఁడు, పూవి
ల్కాఁడో వల్లభ యెంతటి
వాఁడైననగుఁ గాక విశంకవర్తనుఁడెందుఁ గా"

(కళా. ఆ 3. ప ౧౫౯.)

నలకూబరాకారుఁడును సమ్మతించి వానిని వదలిపెట్టి "నీవు నిర్బంధింపఁ జూచిన స్త్రీ యెక్కడ? చూపుము" అని ధట్టించి యడుగుడును, తానే యా స్త్రీ యగుటం జేసి కలభాషిణి లోనినవ్వు వెలికిరానీక కష్టపఱుపఁబడిన యుత్తమనారీమణులయెడఁ బురుషులకన్న దట్టముగ స్త్రీలకునుండు సహజమగు కరుణయుఁ బశ్చాత్తాపమును బోఁద్రోయని విధంబున.

సీ. " . . . . . .
వీనితో నిదియేమి విడిచిపెట్టుముశీఁడు
తనునట్లుడించివెళ్ళిన నెడఁగని
యాయింతిడాఁగి యెందరిగెనో
యెచటఁ జూపెదు?" . . . .

(కళా. ఆ. 3 ప ౧౬౬.)

నని యాసిద్ధునిఁ బంపించివేసినదై, యిఁక నిజమైన రంభవచ్చి యెక్కడ కార్యభంగమొనర్చునో యని శంకించి యతఁడు బయలు వెడలివచ్చినచోటికిం దూరముగఁ దీసికొని పోనుంకించినదై, యేశంకకు నవకాశమియ్యనియుక్తిగా.

> "　.　.　.　.　దాని
> మనమిఁక వెదకుదమని తాను నతఁడు"
>
> (కళా. ఆ 3. ప ౧౬౬.)

సిద్ధుఁడు దొల్తఁ బరుగెత్తిన తెరువునఁ గడుదవ్వుగాఁ జనియె! పాపము! ఎన్నియోనాళ్ళుగా వేచివేసరిన లలనారత్న మీ కలభాషిణి! సర్వము పక్వదశకు వచ్చు సమయమున నెన్నో విఘాతములఁ గడుపవలసిన తప్పురాలు! వర సంగమముచే నిట్టిస్త్రీలకుఁ గల్గుసుఖమును నాత్మతృప్తియును బ్రభావుతులకుండవు. ఉండఁదగవు! ఇట్లు కష్టములనెల్లఁ దరించి యభిమత కేళిందేలి నాయక సంయోగ మహానందయ్యె.

> శా. "　.　.　.　.　.　.　.
> లోలత్వంబుననుండ నచ్చటికి నాలోలత్వదశ్రేణిచా
> ప్పాలోకించుచు రంభవేటొకతె డాయఁగా వచ్చెఁ జిత్రంబుగన్!"
>
> (కళా. ఆ 3. ప ౧౭౦.)

ఈపెయ యప్సరస యయినరంభ. నలకూబర "విడువిడురా" యన్నమాటకు మనసు చివుక్కురుమనఁగా మణి

కంధరుఁడు తన్నుఁబట్టిన శనివలె వెడలిపోవగా హృదయ కాంతుఁడగు నలకూబరుంగదిసి యుందమని పయనమాత ఱికి నా మణికంధరుఁడు తనివిఁదీఱని వాఁడగుటఁజేసి తన తపశ్శక్తి వినియోగించి నలకూబరాకారుఁడై తనుఁగలసి కొనఁగా, కుబేరనందనుండే యనుభ్రమచే త్రికరణ సుఖ ముల ననుభవించుచు నీవఱకునుండినయది. అట్లా నలకూ బరాకారుఁడు ఆర్తస్త్రీ విలాపంబువిని దద్రక్షణకై వెళ్ళి కొంచెమునరాక చాలకాలము మసలఁగా, తమిఁబట్ట లేక తామసము నోర్వక యతని రోయుచువచ్చి యతనిఁ గన్ను లారఁ జూచుటయేగాదు, అతని యొద్దనున్న తనప్రతిబింబ మనఁదగు నింకొకరంభను గన్నులుబుకునట్లు పొడగను చుండగా నలకూబరుండును దిక్కుదెలియనివాఁడై

తే. "నీదు ప్రతిబింబమదియొ దాని ప్రతిబింబ
మీవొ యేమని చెప్పుదు నిగురుఁ బోఁడి!
యేర్పఱుపరాకయున్న వానీవునదియు
దీనికరుదంది చూచెదఁ దిరిగి తిరిగి.

క. తుదనేమి చెప్పనాదం
డఁదొలంగిన దాని నిను దడంబడకుండన్
మదిలోన నేర్పఱించుట
సుదుర్లభము" . . . (కళా. ఆ 3. ప ౧౭౫. ౧౭౬).

అని పల్కుచు విభ్రాంతుఁడయ్యెను' అయ్యో! కల భాషిణికి వచ్చిన కష్టము! లేకలేక క్లేశపడి సంపాదించిన

యర్థము క్షణభంగురమయ్యెడు తెలంగ్గైన నా దైన్యము చెప్పఁదీఱునా? అపుడా లతాంగి యేమన్నది?

సీ. "అట్లైనఁ బ్రాణనాయక నినుఁ గౌఁగిటఁ
బాయనేవేళను నీ మాయలాఁడి
యీ సూపుతో మనకెడసేయ నేతెంచి
నదియొ తొల్లియు నొక్కయసుర జంత
జనకనందనకు రామునకును నెడ సేయఁ
గడఁగి వచ్చుట వినఁబడుచునుండుఁ
గావున దీని నిక్కడఁ జుట్టుఁబట్టున
నుండఁగనిచ్చిన నొప్పకుండు.

వట్టిమొగమాట లాలించి గట్టిగాఁగ
నదరవైచుచుఁ జనుమంచు నౌరనీవు
గదలెదు సుమంచు సంభ్రమునమ్మొనవ నపుడు
కాంతు కంఠంబు నొకకేలఁ గౌఁగిలించె"

(క౯. ఆ 3. ప ౧౭౭)

ఇఁకపైన నీయిద్దఱు సవతులకొట్లాట వర్ణింపఁబడియుండు తెలుంగు వర్ణింప నా తరముగాదు! ఇది యద్భుతావహము. స్త్రీ ప్రకృతికి దర్పణము. రసవత్తరము! ఎన్ని సామెతలు నీతులు, తిట్లు, తలత్రిప్పులు! తుట్టతుదకు కన్నీళ్ళును! సత్యా రంభ వచనములు కొన్ని చూడుఁడు!

క. "వినుమా యేర్పాటు దనం
తన యగుచున్న యది యెట్లుఁదప్పదు, సత్యం
బనఁగా దైవంబనఁగా
జనులకు లేకున్న నెట్లు జగములు నడచున్"
(కళా. ఆ 3. ప ౧౮౨)

. . . . . .

సీ. "అల్లప్పుడొకచోటఁ జల్లని సురపొన్న
నీడ మెచ్చుచును నాతోడఁగూడి
యందుఁ బల్లవశయ్యఁగందర్పకేళి
నింపొందు నొకఁ బడవాటి యందు నొక్క
వనితయాక్రందనధ్వని వినఁబడుటయు
నీవు దిగ్గున లేచి పోవుచుండ
నేను నీతోడన యేతెంచు నొక
యిట్టి డాపలివంక కేగుటయును
జూచినిలిచితి నేను నిల్చుటఁ గనుఁగొని
యెచట నెట్లిది హత్తెనో యెఱుకపడద
వేగిరింపక నీవ భావించుకొనుము
కల్ల నిజములు క్రమముగాఁ గానవచ్చు"
(ఆ 3. ప ౧౮౪)

దీనికి మాయారంభ యిచ్చెడు ప్రత్యుత్తరము:

చ. . . . .
మన చరితంబుఁ జెప్పెను సమస్తము వేల్పులసాని చెప్పిన
ట్లనిజముగాఁగ నిశ్వరవిలాసిని యెచ్చటనుండి చూచెనో!
(ఆ. 3. ప. ౧౮౫.)

తే. అచట నపుడట్టు నినుఁగూడి యాఁఱినదియు
నట్ల నీవేగుచో వచ్చినదియుఁ దాన
యగుచుఁదోఁప సందదికి యెట్లాడ నేర్చె
మగువగాదుర యిది! పెనుదగర గాని! ౧౮౭

.   .   .   .   .   .

క. “వినువల్లభ! కన్నుండం
గనుపాపందివియు నేర్పుగల మునిమ్రుచ్చి
వనిత తగదిచట నుండన్
వెనుకను దిద్దుకొనవచ్చునే యొకసైపన్” ౧౮౮

అని నలకూబరునిఁ బిలిచికొని వెడలఁ గలభాషిణి యుపాయంబుఁ బన్నఁగా, నిఁకనూరకున్న వరుఁడు దక్కఁడని సైరణ దొలంగఁ బెట్టి, నలకూబరుఁడు చాటుగా నిదివఱకుఁ జేసిన సంవాద మప్రయోజకమని నేఱుగా సవతి నాక్షేపించుచు.

క. “త్రుళ్ళఁగ నేటికి నిలునిలు
మిల్లలికినఁ బండువగునె యింతటిలోనే
వల్లభునకుఁగడు నచ్చిన
యిల్లాలవె యేను లాతినే పోఁదోలన్”

క. “మగఁడా పట్టెంబునఁ దలఁ
దెగఁ గొట్టినఁ గొట్టుఁగాక, తెకతేరఁగ నీ
కెగవిడిచిపోయెద నెప్రా
వగనాకాణాచియైన వలపుల పంటన్!”

క. ఈ రీతిని మద్వల్లభుఁ
గోరిక మెడఁ గౌఁగలించుకొని నీవుండన్
సైరించుట కొఱగాదిది
రారమ్మిఁక నోర్వఁ జుమ్ము రావేయనుచున్.

క. వెడదెరువులిచటఁ జెల్లవు
పుడమినహా దొంగలానఁ బొడిచినఁ గోకల్
విడుతురె గడియింతునె యొ
క్కడి గతిమాలిన పిశాచికవో నీ మాటల్!

వ. అనుటయు నాయింతి సైరింపక.

మానిని. అంత మదింపకువేయని పల్కిన నంత మదింపకువే యనుచున్
గంతులడంచెద లెమ్మనిపల్కిన గంతులడంచెద లెమ్మనుచున్
రంతులనేమి ఫలంబని పల్కిన రంతులనేమి ఫలంబనుచున్
బంతముచూడఁగదేయని పల్కినఁ బంతముచూడఁగదే యనుచున్.

సీ. ఒట్టుసుమీయన్న నొట్టుసుమీయంచు
నేమేమి యనిన నేమేమి యనుచుఁ
గానీ గదేయన్నఁ గానీ గదేయంచు
నింకేల యనిన నింకేల యనుచు
నోసిపోవేయన్న నోసిపోవే యంచు
నౌనంటి వనిన నౌనంటి వనుచు
మఱవకుమిదియన్న మఱవకుమిది యంచు
నీవెంత యనిన నీవెంత యనుచు

నొకతె మగనికి నాసించుటొప్పదనిన
నొకతె మగనికి నాసించుటొప్పదనుచుఁ
బట్టియాడె నా రంభతోఁ బ్రథమ రంభ
ప్రియుఁడు నిలుమన్న నిలువక పెద్దరొదగ.

(కళా. ఆ 3, ప ౧౯౦. ౧౯౧. ౧౯౨. ౧౯3. ౧౯౪. ౧౯౫. ౧౯౬.)

రూపమునఁ బ్రతిబింబములు, మాటలఁ బ్రతిధ్వనులు! మాటలనేగాని దెబ్బలసరసము పొంతకైనఁబోరు! కరములు అభినయములకేగాని కొట్లాటకుఁగావని స్త్రీలనైజమతము గదా! ఇవ్విధువున వాగ్యుద్ధము రేగుచుండఁగా నారదులు విచ్చేసి నలకూబరునితో హాస్యములాడిరి! పిమ్మట నతఁడు తనకై పోరుచున్న రంభల నిరువురింజూపి వీరిలో తథ్యమిథ్యాభావము లేర్పఱుపుఁడని వేఁడఁగా నా కలహభోజనులు.

క. . . . తథ్యమిథ్యా
భావంబులకేమి నీకు భావింపఁగ స్వా
భావికమే యీ యాకృతి
భావము నిజమెద్ది యీ ప్రపంచమునందున్!

క. నీ పట్టురునడ నొక్కతెఁ జూపి
యొకతె గర్వమడఁపుచున్ వలయుగతిన్
ప్రాపింపవచ్చు భోగము
నీ పుణ్యంబినుమడించి నేఁడు ఫలించెన్!.

(ఆ 3. ౨౧౦. ౨౧౧.)

అని యానతిచ్చి తమ దారిఁ దామేగిరి. రంభలు మరల నెప్పటి యట్ల వాగ్యుద్ధమునకుం దొరఁకొనిరి. అం దొక్కతె.

క. "అఱపులుడిగిపోపోనీ
యఱచేలంబండ్లు వచ్చినప్పుడు మమ్ముం
గఱచెదవుగాని తగునెడ
మొఱయిడు మది యెట్టి దైవములు వినియెడినో!'

(ఆ 3. ప ౨౧౮)

అనుటయు సత్యరంభ.

క. "కానిమ్ము వేగిరింపకు
నీ నుదుటనె ప్రొద్దు వొడిచెనో యేదైవం
బైనను విననిప్పుడె యిదె
నా నిజమేర్పఱచి నీకొనర్చెద శిక్షల్."

(ఆ 3. ప ౨౨౦.)

అని బదులిచ్చి యొక్క మంచి యుపాయంబుఁ జింతించి నలకూబరాకారునితోఁ గలసి విఱ్ఱవీఁగుచుండెడు రంభను 'రా, దేవసభకుఁ బోవుదము' అని యాపెకు ఖేచరత్వంబె లేమి నాతనికిం బోధించుటకై పిలుచుడు, దైవమా! ఇఁక కలభాషిణి గతియెట్లు? కోరినవారి రూపములఁ దాల్చువరము నారదులచేఁ బడసెనేగాని, కామ గమనముఁ బడయదాయెఁ, గావున రంభచేతిలోఁ జక్కఁగఁ జిక్కనదై, చిన్నతనము రాకుండునట్లు బింకములైనఁ బలికి

త్రోవఁ జూచికొందమను స్త్రీ సహజమైన గరువతనంబు మెఱయ నేమనుచున్నది చూడుఁడు!

సీ. "అప్సరః స్త్రీలలో నగ్రగణ్యాత్వంబు
　　జగదుప శ్లోకితంబుగ వహించి
యూర్వశీ మేనకాద్యుత్తమ స్త్రీలు రా
　　వమ్మ పోవమ్మ నా నతిశయిల్లి
యెన్నండు నెచ్చోట నెవ్వారిచేఁ బ్రేలఁ
　　జూపించికొనక ప్రస్తుతికి నెక్కి
నలకూబరుండు ధన్యతముండునా గరు
　　వతనంబుచే నీకు వన్నెఁ దెచ్చి
యొప్పునే యింకఁ గడపటి నిప్పిశాచి
నాకు సరిచేసికొని దేవలోక సభకు
నీవు నూ నీవు నుమ్మని యే విధమునఁ
గలహమాడెద నిదినీవె తలఁచి చూడు."

(ఆ 3. ప ౨౨౭.)

క. కోపము పాపమునకుఁ బో
త్రీపెనుఁ దగవునకుఁ దగఁగనే తిట్లాటల్
ప్రాపించునో పడంతుల
కోపురుషశ్రేష్ఠ యవియు నొక్క బ్రతుకులే!　　　౨౨౯

వ. అదియునుంగాక.

క. రంభకునహహో యొకప్రతి
రంభగలిగి తిగిచి తెచ్చె రచ్చల కనినన్
స్తంభింపనీరు హాస్యా
రంభణమిాపోరు నిర్జరవిటుల్ నగుచున్.　　　౨౩౦

క. నా నడకలకును యోగ్యము
గానిది యిపుడిచటనైనఁ గలహామా, బ్రదుకె
ట్లైన నగుఁగాని యిఁక నీ
యాన ధరణి విడిచిదివికి నడుగటువెట్టన్! ౨౩౧

క. ఈ కలహానుపుడు వినఁబడు
నా కంబున సురల యాననములేగతి నా
లోకింతుఁ దెగినఁ దెగనీ
నాకు మరుఁడు నిన్ను నిలుమనన్ రాకునికిన్! ౨౩౨

ఇప్పుడేకాదు. ఇఁకముందును నాకలోకమునకు నడుగు వెట్టదఁట! మనుష్యాంగన. పోఁజాలదు! ఈ లోపముఁ గప్పి పుచ్చుటకై యేమియుక్తి! మఱియు "తెగినఁ దెగనీ నా కుమరుఁడు" అనునది 'కార్యము మించిపోయినది యోటమితప్పదు' అని యెఱింగియు, తానే ముందుగా నతని వదలినట్లు నటించియైన మానము రక్షించుకొందును అని యెంచి చేసిన యింకొక యుక్తి యిది! సరి. నలకూబరుఁడు సంశయాత్ముఁడై యాపెను మెడవట్టి పాయంద్రోసెను. నిర్నిద్రమోహాఫలమా యిది? సత్యరంభయు నాయమను 'కత్తిచేతఁ గాయము వాయుము' అని శపించెను! ఉదారచిత్తులకు కష్టములే గదా ప్రాప్తి! కలభాషిణి యేకచిత్తయై యిన్నేండ్లు తపించినందుకు ఫలము లిట్టివి! అయినను వరునిచే నా క్షణకాల మాదరింపఁబడుటయే ఈ కడగండ్లకెల్ల మించి మీఱిన ప్రతిఫలముగా నా మహనీయురాలికిఁ దోఁ

పక యుండదని నమ్మెదను! గొప్పవారికి వ్రతమే సుఖము. తుచ్ఛులకు సుఖమే వ్రతము! ప్రబంధములోని నాయకల కెల్ల నీ కలభాషిణి శిరోమణివంటిదగుటను, కవియొక్క చమత్కృతిని విడఁదీసి చూపుటకై యీ ఘట్టము నింత విస్తరించి ప్రదర్శించినాఁడను. పాపము. ఇట్లు ఖిన్నమానస యైన యవ్వారవధూతిలకంబు కలభాషిణి యేగుటయు, నాయమఁదలఁచుకొన్న మన కెల్లరకు దుఃఖమురాకపోదు! ఇఁక రంభం దలఁచికొన్న నవ్వు తప్పదు! ఏలన. ఇంత గాఢముగ నా దైవతకాంత కొట్లాడిన దెందుకు? నలకూబర ప్రాప్తికై దొరికిన దెవ్వరు? ఆ మోటుదపసి మణికంధరుఁడు! వానియొక్క నిజముఁ దెలిసియుండినయెడ రంభ చీయని కన్నెత్తియైనఁ జూడక యరిగియుండదా? ఏమో యింద్రుఁడాజ్ఞాపించెనని వానిం గలసినదిగాని మోహము చేఁగాదు మనసులేని పరిణయములోఁబడి ప్రుక్కుచుండ వలెనని స్వతంత్రులైన పుణ్యాంగనల కేమి విధి!

'సరియే కాని, కలభాషిణికిమాత్ర మిట్టి యనిష్టము ప్రాపింపలేదా! ఆపె గోరినదియు నలకూబరునే, తుదకు' ననుభవించినది మణికంధరుని. అట్లగుట రంభకన్న నామె యెట్లు పరిహాసమునకుఁ దక్కువపాత్రము'? అని యడుగుదు రేమో! ఈ వివరమిఁక ముందేర్పడును. మణికంధరుని తోడి కూటమియు నాపెయొక్క వాంఛితంబకాన దానిచే విమనస్కత యాపెకుఁ బాటిలలేదు.

ఇట్లు రంభ నలకూబరునింగూడి తనకు విజయము సిద్ధించినను, అతనికై తాఁబడ్డ పాట్లుదలఁచి, ఇదివఱకు వైరముచేఁ దనయందు నుదయించిన స్థైర్యము, కాఠిన్యము నా వెరితోఁడన యంతర్ధాన మొందఁగా, స్త్రీజన సహజమగు మెత్తఁదనము తన్నాక్రమింప, మనసు నొప్పిచేఁ గోపంబు వగఘాగా

సీ. . . . .

ప్రియుఁ జూచి "మగవారి ప్రేమ లిట్టివిగదా
యెట్లు నమ్మఁగవచ్చు నిచ్చలోనఁ
బ్రాణేశయటు దండవాసినమాత్ర నీ
ద్రిమ్మరి నెచ్చోటఁ దెచ్చికొంటి
నిన్ను నేమన నున్నది, నిరభిమాన
గుణతనినుఁ జేరు నన్నను కొనుట గాక
నాకునా యిన్ని పాట్లంచు" నా కులమతి
నడలెఁ గన్నుల బోట బోట నశ్రులొలుక.

(అ. 3. ప. ౨౪౧)

ఆహా! యీ సంగతి యెంత స్వాభావికముగ నున్నది? సవతియుండువఱకుఁ గన్నుల నిప్పులు. ఆపె పోయిన వెంటఁ గన్నుల నీళ్ళు! ఒక నిమిష మెండ. మఱునిమిషము వాన! ఈ లీలాలాలిత్యము ప్రేమభరాలసలగు స్త్రీలకే కదా! కొందఱు దీనిని చపలతయందురు. ఈ చపలత లేకున్న వారికట్టి యాకర్షణశక్తియు మనసుల రంజింపఁజేయు

పటిమయు నుండునా? నిశ్చలతత్త్వము లెవరికిఁ గావలయును? జడులైనవారికిఁ దప్ప. స్త్రీలయందు కోపము మిక్కుటమైన దాని ప్రతికార్యమగు నేడ్పును తప్పదు.

వియోగాంతముంగాంచిన యీ వధూవరులిట్లు ఒండొరుల నూరార్చుచు నుపశమన క్రియలకుత్సహించుచుండఁగా.

మ. " . . . . వేఱొక్కఁడం
తనవచ్చెన్ నలకూబరుండచటికిన్ "నా రూపముందాల్చి వం
చన నెవ్వాఁడుర చేరినాఁడఁట దురాశన్ రంభ" నంచున్ వెసన్?"

(ఆ. 3. ప. ౨౪౩.)

వీఁడే నిక్కంపు నలకూబరుఁడు. పురుషులలో నీసును రోషమును హెచ్చిన నవి మాటలఁ దీఱవు. మఱి పోటులఁ దీఱుఁగాని. వచ్చిన రెండు నిమిషములకే వాదములు, సత్యములు, సామెతలు వీని పొంతఁబోక ప్రధానకార్యమున కాయత్తుఁడై రెండవ నలకూబరుఁడు.

మ. "మది నా మాటలు నమ్మవేనియునిఁకన్ మమ్మిద్దఱన్ ధైర్యసం
పదఁ బెంపారఁగ దవ్వులన్నిలిచి యోపద్మాక్షి! వీక్షింపుమే
నిదె ఖండించెద వీని మామకమహాహేతిప్రకాండంబుచేఁ
దుదశోధించెదుగాని నీకుఁగల యుక్తుల్మీఱ నా సత్యమున్."

(ఆ. 3. ప. ౨౪౯.)

అన్నాఁడు. న్యాయనిరూపణమునకుఁ గత్తులవంటి ధర్మరాజు లెవ్వరు లేరనిగదా మగతనముగలవారి సహజ మతము! యుద్ధమను మాటలేచు సరికే, రంభ తన కృత్రిమనాథుని గట్టిగాఁ బట్టుకొని, యే జగడము ప్రారంభము గాక మున్నే.

చ. " . . , . భూరికృపఁ జను గావరే ప్రియుఁ జ
మనుపరె వేల్పులార! యొక మాయపురక్కసుఁ డాక్రమించి తాఁ
దునుముచు నున్నవాఁ డలుకతోడ నిరాయుధు" నంచు . . . .
(ఆ. 3. ప. ౨౫౦.)

నేడ్చుటకు మొదలిడినది. ఈ యేడ్పునకుఁ గారణము భీతి. దీనికి ముందేడ్చినది కొట్లాట, కోపము, వీనిచేనైన యలసట, కోలుపోయిన యభిమానము, అలక, ఇత్యాదులచేనైన వ్యసనభావముచే.

నారదుఁడు రంభల నపహసించి పోవువాఁడు ఊరక పోలేదు. నలకూబరుని కడకుఁబోయి యతనితో 'నీ యాకారముందాల్చి యింకెవ్వఁడో రంభను గూడియున్నాఁడు. త్వరలో వెళ్ళి సొత్తు దక్కించికొనుము' అని యుపదేశింపగా, నాపల్కుపై సత్య నలకూబరుఁడు వచ్చి యామిథునముయొక్క సల్లాపములకు విఘాత మొనరించెను. పిమ్మట నయ్యిరువురు బాహుయుద్ధమునకుం గడఁగి పోరుచుండగా రంభ

ఉ. "   .   .   .   .   నిలుండు సం
రంభముమాని యేనడుగు ప్రాక్తనవర్తన మొక్కటిన్ రహ
స్సంభవమైన దాని వరుసన్ వచియింపుఁడు మీఱలిత్తఱిన్"

(ఆ. 3. ప. ౨౬౯)

అని వారి నిల్పి. కళాపూర్ణుఁడను వాని విషయమై మన కేమి ప్రసంగం బెచ్చటఁగలిగె'నని యడుగఁగా ప్రథముఁడు నిరుత్తరుఁడయ్యె. ద్వితీయుఁడు సరిగా నుత్తరంబిచ్చె. అంత రంభ జుగుప్సతో 'నీ రోతవాని చెంత నిన్నాళ్ళెట్లుంటినో దైవమా!' యని వానినివ్విడనాడి కుబేరతనయుం బరిగ్రహించె. అతండును మోసగాఁడైన మణికంధరుని నల్పావశిష్టాయువుగా శపించె

స్త్రీ పురుషుల భిన్నప్రకృతు లీవర్ణనముల నెంత విశదముగఁ జూపఁబడినవి! తామవలంబించు పద్ధతుల భేదమున్నను గామమను పురుషార్థమందు స్త్రీ పురుషు లిరువురు సమానలాలసులు గదా! మఱియు రాగవిషయమైన, యీర్ష్యయందును తుల్యస్వభావులు స్త్రీ పురుషుల యీ సహజమగు నేకీభావమును గవి మఱవలేదు. చూడుఁడు:

కలభాషిణి మాయదారియని యేర్పడిన పిదప, నలకూబరాకారుఁడు ఆపెంజూచి 'నీపెరెయ్యది యెట్టిదాన?' వని యడిగె. అప్పుడు తత్ప్రతి రంభ సైరింపక:

శా. "ఇందాఁకన్ నినుఁ జేరనీక ననునట్లింతే మనోజవ్యథన్
గుందం జేయుట చాలకేమడిగెదీ గొంటున్ స్పృధాయించు, నా
కందర్పత్వరఁ గానలేననుచు నాకంజాక్షిఁ బోఁద్రొబ్బెఁదా
నెందున్ నిల్వఁగనీక పేరలుకతో నెంతేఁగడున్ దవ్వుగన్"

(ఆ. 3. ప. ౨౩౫.)

వైరితో మాటాడుచున్నాఁడే యను నీసును దొట్రుపాటును దోఁపఁగా రంభ త్వరపెట్టుచున్నది. ఆ ఘట్టముతో సమవర్తనము సమన్వయముం గాంచులీల నిప్పుడు, అడుగునది స్త్రీ. ఈర్ష్యయు నాత్రముఁ జూపువాఁడు పురుషుఁడు.

వ. "రంభయక్క పటవర్తనుంజూచి నీవెవ్వండ వెవ్విధంబున నిట్టి రూపంబు ధరియించి నన్ను వంచించితని యడుగుటయు సత్య నలకూబరుండు.

సీ. ఇంతాఁక నినుఁ జేరనీక నన్నిట్లల
యించుట చాలక యింకనిలిపి
వానినేమడిగెదవ్వఁడుగాక నీకేమి
యిది కాకదంత పరీక్షసుమ్ము
నామన్మథార్తియెన్నఁగవలదే చాలు
రారమ్మటంచు నా రంభ నపుడ
తోడ్కొని చనియెడు వేడ్కతో మోముఁ దా
మర వికసింపఁగా సురపథమునకు . .

(ఆ. 3. ప. ౨౭౧. ౨౭౨.)

దొంగ, వైరియని దెలిసియు సాంతముగా వాని చరిత్రము సావకాశముగా వినుటకు రంభగోరినఁ జూచి నలకూబరుని మనసు మొగములెంత కమలినవో!

నేనిక్కడ సమస్య విడఁదీసినట్లు వ్రాసియున్నాను. కావ్యములో నెవ్వరెవ్వరైనదియు చతుర్థాశ్వాసములోని కొన్ని భాగములం జదివినఁగాని గోచరింపదుగాన, తుదముట్టువఱకు సంశయములు దీఱవు. అద్భుత రసమన్ననో యడుగడుగునకుఁ గొంత పెరుగుచుండును. ప్రథమ రంభ యెవరు? తత్ప్రతి రంభ యెవరు? నలకూబరులెవ్వరు? పాపము, కలభాషిణిని అనిష్టుఁడెవఁడైనఁ గలఁచెనా? నిర్వికల్పచిత్త సిద్ధివికల్పముంగాంచెనా? ఇట్లని యనేక విధంబులఁ బలవరింపుచుఁ గలవరింపుచు భయభ్రాంతులతోఁ జదువుదుము. వీరల స్థితిగతు లరయువఱకు నన్యచింతయను వేరైననుండదు. చదువరులకిట్లు విస్మయము, సంభ్రమము సావధానతఁ గలిగించు కృతు లాంధ్రంబున నింకెక్కడను లేవు.

శృంగారవిశేషములు

భావనాశక్తి లేని కవులనేకులు శృంగారవర్ణనలు చేసియున్నారుగాని యవి రెండు విధముల దుష్టములు. ఒకటి, వారి శృంగారమనునది తుచ్ఛసుఖవిషయాసక్తియైన శరీరతాపముగాని మనోరాగముగాదు. రెండవది, శృంగారమును నాయికానాయకుల చిత్తప్రకృతుల ననుసరించి యనే

కరీతులనుండునని మనవారికిఁ దెలియదుగాఁబోలు! జావళీ శృంగారముఁదప్ప నింకేరీతియు వారెఱుంగరు. అందటి శృంగారము నొకరుచిగలిగినదే. నానా భంగులఁగాక, యేకరీతిగా నెల్లెడలనుండుటచే రోఁత గలుగకమానునెట్లు? అసలు వాస్తవమైన శృంగారముగాదు. మఱి దానినే యమితరాశిగా ముందుదెచ్చిపెట్టి ప్రతిదినమును ఆరగింపఁ జేయుచుండిన నెట్టి మోటుపందికైన వెగటురాదా?

కళాపూర్ణోదయమున నైదునకుఁదక్కువగాని విధముల శృంగారము వర్ణింపఁబడియున్నది. ఇందు జావళీలకుఁ జేరినది యొకటిమాత్రము అయ్యది యప్రశస్త మనఁదగిన భాగములో నుండుటచే దాని ప్రస్తావన యిటఁజేయను. తక్కినవానిలో నొకదానివలె నొకటియుండదు. అన్నియు రమణీయముల. కామము అనునది జాతి. సామాన్య ప్రబంధకవులకుఁ దెలియకున్నను దానియందుపజాతులు లెక్కకు మిాఱి యున్నవి. స్త్రీ పురుషులలో ప్రతివారును వలచు విధములువేఱు. ఆచారము రీతిఁ జేయఁబడు తిలకవస్త్రాది రచనలో సయితము తమకు సొగసులనితోఁచెడు భంగుల చిత్తమేర్పడునట్లు పచరింతురుగాదె! ఇంటిపెద్దలు, ఇరుగు పొరుగువారుఁజూచి పదిమాటలాడుటకు నాస్పదములైన బహిరంగపు వర్తనలయందే వ్యక్తి సర్వవ్యాపిగా నుండఁగా, మనసులో నుద్భవిల్లురాగములలో ప్రత్యేక భావములు చందములునుండక యచ్చుగొట్టిన రీతినందఱు నేకగతింజరిం

తురా? సంపూర్ణమగు ననువర్తనము తలపాగఁజుట్టుటలోనే లేదఁట! ఇఁక మనసును గన్నునుపోవు జాడలలోనుండునా? శృంగారము శాస్త్రప్రకారముగాఁ దీర్పఁబడు విగ్రహము గాదని యెఱుంగని మనవారి విలక్షణత నేమనవచ్చును? సామాన్యముగఁ జైతన్యములలోనే యేకక్రమము అప్రకృతము. మానవులలో నదిచెల్లునా? సాధ్యమా? ఇఁక మనుష్య భావములనెల్ల నుత్కృష్టతరమగు మోహమున కట్టిజడసంప్రదాయము శక్యమా? యోగ్యమా?

మనకవు లీసంగతి నెఱుంగక కానుమునకు నాచారములఁదీర్చి యుండుటకుఁ గారణములు, వారి మౌఢ్యము, హిందువుల జీవితముయొక్క రీతియును ఎట్లన మనలోఁ బెండ్లికి మనసునకును సంబంధము లేదు. పరిణయము వ్యవహారములలో నొకటి. చిత్తజముగాదు మఱి పితృపితామహాజము. మనసును నిరోధించి పీడించు వర్గములలో ముఖ్యములు జాతిభేదములు. తమ తమ యుపశాఖలను మీఱి హృదయము వ్యాపింపఁ గూడదఁట! దీనివలనఁ గలుగు ఫలమేమనఁగా, అమనస్కవివాహములు. అనఁగా దేహమొకచోట. చిత్త మింకొకచోట. మాట లిక్కడ. తలఁపులక్కడ. “చిత్తము శివునిమీఁద. భక్తి రంకులాఁడిమీఁద!”

అట్లగుట వధూవరసంగమము ఆచారానుసరణముగాఁ జేయఁబడు కర్మము. ప్రాయికముగ కామితమనుట కల్ల. పెండ్లింబట్టి చిత్తవికృతియను శృంగారభావమును, చట్టదిట్ట

ములప్రకారము అలంకారాదిశాస్త్ర సూత్రముల యాదేశముచొప్పునఁ, బోవు వినయ మర్యాదలుగల మంచి వస్తువని యెంచిరో! సందేహమేల? యెంచిరి. మనవారి నమ్మిక మీరెఱుఁగరా? కూఁతురా! ఫలానా పక్కీరుశాస్త్రి నీకు పురుషుఁడు. నేను నిర్ణయించినాను. నగలతోడ నీ మనస్సును మూటంగట్టి వాని యింట్లో పదిలముగానుంచి సుఖపడవలసినది. నా మాటయిది. ఇంక నీకేమి యీ పనితోఁ బెత్తనము? చెప్పినట్లుచేయుమనియేగదా తలిదండ్రుల సంభావన! పెండ్లిలో నన్ని మంత్రములుఁ దంత్రములు నుండును. ఒక్కటిదప్పు! ఏయ్యది? ఆత్మతంత్రము వివాహము సంస్కారమఁట! హృదయబహిష్కారమనఁ గూడదేమో!

ఇట్లగుట శృంగారభావములును నోరులేని కొడుకులుఁ గూఁతులుంబలె శాస్త్రోపదిష్టక్రమముల మేర మీఱక యాచారముల ననుష్ఠించి సర్వసామాన్యముగ నుండునని భ్రమించి, ఈ సామాన్య స్వరూపము నలంకారశాస్త్రములు కనిపెట్టి వెల్లడిచేసినట్లు మఱియొక భ్రాంతిం జెంది, యవి చెప్పినట్ల తెఱుచు మన కవులు వ్రాసియున్నారు. కాను మునకుఁ గారణమొక్కటిగాదు. మఱి పెక్కులు. పోవుమార్గములు, తాల్చు ఉపభావములు, చూపు చిన్నెలును ప్రతివారియందును నవీనములు. అనన్యములు. ఫలములు నట్టివే. ప్రేమచే విషముఁ బెట్టువారు లేరా? తనకుం దక్కకపోయిన నొరులనుం జెందఁగూడదని హృదయప్రియు

లను గొందఱు మృత్యువు వాతఁ ద్రోయుదురు! కొందఱు ప్రాణములనైన నర్పించి వారికి మేలుచేయఁ జూతురు. బలాత్కరింప నెంచువారు నున్నారు. పరస్పర ప్రీతిలేని కూటమి హేయమని రోయువారుం గలరు. భయము, శోకము మొదలగువానిచే వికలితస్వాంతులైయుండు స్త్రీల మూర్తులు గొందఱకు నాఁపరాని మోహాతిరేకముఁ గలిగించును! శాస్త్ర దృష్టితోఁగాక దేవుఁడిచ్చిన సొంతపుఁ గన్నులతోఁ జూచువారికి నిట్టి విశేషములు సులభముగ గోచరింపఁగలవు.

సూరన ప్రతిభావంతుఁడు. కనుక సంపూర్ణముగఁ బాండిత్యబద్ధుఁడుగాఁజాలఁడు. స్వశక్తియే గురువుగ నూతన మార్గములంద్రొక్కి యాతఁడు ప్రకటించిన యసాధారణ శృంగారములకు ముఖ్య నిదర్శనము లీ క్రిందివి. శల్యాసుర విషయము. సుగాత్రీశాలీనుల వృత్తాంతము. సరస్వతీచతుర్ముఖవిలాసము. కలభాషిణీచరిత్రము

శల్యాసురుని కథ

శల్యాసురునిఁగూర్చి చెప్పవలసిన సంగతులు కొన్నియే. మృగేంద్రవాహన తన బంధువగు మహిషాసురుం జంపినసూడు మనంబునం బాయమిఁ బగఁదీర్చునుపాయము నన్వేషించుచుండఁగా, నభినవకౌముదియను చంద్రకిరణ సంభూత యప్సరఃకన్యయెదురైనఁ జూచినమాత్రాన హృ

దయమును, ఆ హృదయముతోడ నిన్నాళ్ళుగా పట్టినపట్టును గోలుపోయినవాఁడై, నన్నేలుకొమ్మాయని యా కాంతను వేఁడుకొనఁగా, నామెయుఁ జలంబుదాల్చినదియై

క. . . నిన్ను మడియించిన వా
నిని దక్క నే వరింపను
వినుమిది నా ప్రతిన దీని విడనిఁక ననియెన్
(ఆ. ౬. ప. ౩౯.)

చ. అనుడుఁ దదుక్తిక్రూరతకు నద్దనుజుండుగడున్ ఘనంబుగాఁ
గినిసియుఁ బోవనిచ్చె నొక కీడును జేయక యవ్విలాసినిన్ .
(ప. ౪౦)

ఎంత బలవంతులైన నేమి? కామినీకటాక్ష పాశబద్ధులేమి చేయఁగలరు? మోహముయొక్క ప్రభావ మద్భుతము క్రూరులను మృదుచిత్తులఁ జేయును మృదుచిత్తులఁ గ్రూరులఁ జేయును! ఏనుఁగును బిసతంతువుతోఁ గట్టినట్లు ప్రబలవీరుల నిస్సత్త్వులంబలె బంధించును! ఈ శల్యాసురునిఁ దలఁచుకొన్న సంతాపమయ్యెడి! పాపము! నేఁడుగాకున్న నింకఁ గొన్ని యేండ్లకైనఁ దన నిర్వికల్ప హృదయసమాధిం జేసి, ప్రీతిమైఁగాకున్న దయచేనైనఁ జేపట్టదా యని కాలము వేచియుండిన నిష్కపటి! నిశ్చలమైన మోహముగలవారు కాలము నోర్చుటకు శక్తులగుదురు. ప్రబంధ స్త్రీపురుషులయొక్క తహతహలు తొట్రుపాటులును

తలుచు చాంచల్య భావులకుఁ జేరినవి. గొప్పవారు మన సులు గలసినఁ జాలునని కాయసాయుజ్యము చిరమునఁ గాని లభింపకపోయినను ఓర్పుతో నుందురు. అంగసుఖ ము నభిలషించు తుచ్ఛులకు సంభ్రమము సహజము. దమ ము మొదలగు నుదారగుణము లుండవు. ఐరోపా కవులు వర్ణించు శృంగారములో దేహసంయోగముం గూర్చిన వేగి రపాటు అంతగా నుండదు. హిందూదేశములో నాదిమ ధర్మము ఇంద్రియ నిగ్రహమఁట! ఇది యేమాత్రము స్త్రీ పురుషుల లక్షణమో కావ్యములఁ జదివినవారికి తెలియు ను! నోటిలో సదా వేదాంతములు పలుకుచుండువారి యంతదుర్మార్గులు లోకములో నుండరనుట కిదియొక తా ర్కాణము. సనాతన ధర్మగ్రస్త మీదేశము! ఐరోపావారు తలుచు హేతువాదులు. పరముంగూర్చి పెదవులచేటుగా జపించువారము మనము. ఇహమునందాసక్తులువారు. అట్లుండియు నా జనములలో నుండునంత యింద్రియ నిగ్ర హ మిక్కడ నున్నదనుటకుఁ గాదు.

ఈ శిల్యాసురుఁడు ప్రబంధనాయకులకన్న నిస్సంశ యముగ మేలైనవాఁడు. మృగేంద్రవాహనాశక్తి యిచ్చిన యమోఘమగు కత్తిందాల్చి మణికంధరుని నరయుటకై పోవు నభినవకౌముదింగాంచి, తన్నే చంపుటకు వచ్చు చున్నదో! అట్లైనం దన్నుంజంపువారు చత్తురనునమ్మహా శక్తి వరమున్నదిగదా! అట్లగుట నాపె నాశమొందునో

యని, తనపాటుమరచి, ప్రియురాలి శుభాశుభములం దలఁ పోయుచు నాసాధువు,

చ. . . . సంభ్రమింపుచున్
మతిగలఁగంగనిట్లనియె నాపయి వచ్చిన నీకునిష్టదై
వతములయానసుమ్ము! ఎరసర్ణిని! యెందుఁడలంక నేను దు
ర్మతినయి నీవు నాకుఁదెగి మ్రుగ్గదవో యని తల్లడిల్లెదన్!

సీ. అనుడునయ్యింతియో యసురేంద్ర నీవు నా
హానికి నోర్వకిట్లానలిడఁగ
నకట నీమీఁదరానంత యెఱుంగని
దాననే యేను నీ తలఁపు బడిన
నడిచెదనని తన్నుఁ గడచి చనంగఁ ద
ద్వాక్యరీతి నిజాభివాంఛితమున
కనుకూలమైన యట్లై తోఁచుటయు నతఁ
డక్కన్య వెనువెంట నంత నంత
నరిగె నెందును నిలువక యబ్జముఖియు
మిగులనెడఁబాయ కొక్కొక్క మిషముతోడ
నప్పటప్పటి కొక్కింత యాలసించి
కూడ నిచ్చుచు నెలయించికొనుచుఁ జనియె.
(కళా. ఆ. ౬. ప. ౬౨. ౬౩.)

నమ్మినవాఁడు కవుడులేని మానిసి! వానిని మోసగించుట యేమికష్టము! ఆ యప్సరసయందును దోషమెలేదు. ఇష్టములేనివాఁడు పైఁబడ గమకించిన ద్వేషముఁబూనని

స్త్రీలుందురా? ఐన నొక్కటి. వధకు నుత్సహించినను గొం చెము కనికరముఁజూపి యుండిన నాకాంతకు గౌరవము హెచ్చుఁగాని తగ్గియుండదు. నిండుమనస్సుతో ప్రేమించిన వాఁడెంత యనిష్టుడైనను, దనకింత మనోహరణశక్తి యున్నది గదా యని సంతోషమును, ఈ నిరాశకిట్లల యితఁడు బలి యగుచున్నాఁడని పశ్చాత్తాపమును ఏమాత్రముం జెందని కఠినహృదయలగు స్త్రీలుందురా? యోజింపుఁడు.

ఇట్లు దన్నలయించుచుం బోవుచుండఁ దనప్రతాపము ఆపె కెఱుకపఱుచువాఁడై యాపెను దాకకుండునట్లు శిలల ప్రయోగముఁజేసి జంతు జాలంబుల సంహరించి యిట్లనియె "నన్ను వరింపుము. లేనిచో నీవుచనెడు చోటులన్నియు నా బలముచేత నాశముచేయుదును, దాన నీకు నపకీర్తి. కాన నాపయింగూర్చి కరుణలేకయున్నను, భూతకోట్ల రక్షిం పవలయునను దయచేనైన నాకుఁ బత్నివగుము" అయ్యో! వానియార్తి యెట్టిది? తనకుఁ బరమార్థము ఆ స్త్రీ. ఆమెను నొప్పింపఁడు. ఆమెపైఁ గినియఁడు. ఇఁక లోకమంతయు హింసించి, యా హింసమాన్పుటకై యాపె యంగీకరించి నను జాలుననుచున్నాఁడు! ఆహా! కాఠిన్యము మార్దవము రెండును వానియందున్నవిగదా! మఱియు నీ కాఠిన్యము నకు మార్దవమే కారణము! మోహమాహాత్మ్య మిట్టిది. వెన్న ఱాయగును. ఱాయి వెన్నయగును!

తన్నీరీతిని వెంబడించు నాయసురను మణికంధరుని చేతఁ జంపించి, పిమ్మట నా మణికంధరుని రెండవ జన్మము వేచియుండి యతఁడు కళాపూర్ణుఁడై జనింప తన పూర్వ వృత్తంబు వివరించి గాంధర్వవిధిని వివాహమాడి యభినవ కౌముది, పట్టమహిషియై యుండెను. శల్యాసురుని తరు వాతి గతియేమాయనో తెలియదు. వానిది వ్యసనకర మును వ్యర్థమునైన శుష్కజీవితము! నిష్కళంక ప్రీతిచే విశోభితము.

సుగాత్రీశాలీనుల విచిత్రకథ

సుగాత్రీశారద పూజారియైన యొక బ్రాహ్మణుని కూఁతురు. దాని వరుఁడు శాలీనుఁడు. ఇల్లటపుటల్లుఁడు. అలంకారములు, డంబములు, అట్టహాసములును వీనికి సరి పడవు. పల్లెటూరివాఁడు పట్టణవాసుల కుర్చీలు, మేజాలు, నిలువుటద్దములను జూచి వెఱఁగు వెఱపునంది పోవుమా డ్కి, నేయలంకారములు లేకయుండు వారినేగాని, తళ తళలు, పళపళలు, ఘలఘలలు, ఘుమఘుమలు మెఱయ వచ్చెడు స్త్రీలఁదిలకింపఁడు. సర్వశృంగార సన్నాహములతో భార్య పడుకింటికి రాఁగా, ఇదేమి కొఱవిదయ్యమో, గజ్జెల పిశాచమో యని కన్నెత్తియైనఁ జూడకుండెను! ఆ భార్య కా పురుషుని తిక్క తెలియదు. శాకుంతలములోని.

మ. "నలినం బెంతయు నాచు చుట్టినను విన్నాణంబె చూపుఁ, గడుఁ
మలినం బయ్యును, మచ్చ చంద్రునకు సౌందర్యంబె కావించు, న
ల్కాలముం గట్టియు నీ లతాంగి గడుఁ జెల్వంబందియొప్పారు, మం
జులమా రూపు నలంకరింపనిది యెచ్చో నేదియుం గల్గునే?"*

అను పద్యముయొక్క స్వారస్యము నీ సుగాత్రియెఱుఁగునంతటి ప్రౌఢయై యుండినయెడ, కొందఱు రసికులకు సహజ సౌందర్యమువలె మనోహరమగు రచనయెద్దియు లేదనియు, దివ్యసుందర విగ్రహయగు తరుణికి సామాన్యపు గడుసుచీరలు, తాటాకుల కమ్మలును ధరించిననదియు మనసును నీరుగాఁజేయు ఒకవిశేషమైన చెలువమనియు నామెకుఁదెలిసియుండును వ్రేపల్లెలోని గోపికలు పట్టుచీరలు, సరిగెవస్త్రములు, నవరత్నఖచిత భూషణములును లేనివారు. నయమైన పట్టలుగట్టి, పూవులతో సలంకృతలై యే పనిపాట్లులేక యుద్యానవనములలో చివురాకు మెత్తలమీఁదఁ బొరలాడుచుండు రాచకన్నెలవలెఁగాక, వెన్నలఁదీయుట, ఆలఁగాంచుట, గృహకృత్యముల నెఱవేర్చుట మొదలగు శ్రమములచేఁ బ్రొద్దుపుచ్చుచు దేహముల నారోగ్యముగను, మనసులఁ గపటము కాఠిన్యము లేని విశుద్ధములుగను నుంచికొని యుండెడివారు. అట్లయ్యును ప్రబంధ నాయికలకన్న నెన్నియో మడుంగులు

* ఈ పద్యము, రచించినవారు మామక మిత్రులగు రా. అనంతకృష్ణశర్మగారు.

వారు ప్రీతికరలనుట భాగవతములో దశమస్కంధముఁ జదివినవారికి వేఱుగఁ జెప్పవలయునా? శాలీనుఁడు రసికశిఖామణి కాఁబోలు! తనభార్య కృత్రిమములగు తళుకు బెళుకులను వదలి గొల్లభామరీతి నున్నఁగాని దగ్గఱఁ జేర్పనని సంకల్పించికొన్నాఁడేమో!

అత్తగారు ఇంకను శ్రద్ధతో సొగసులు దిద్దితిద్ది కూఁతును రెండు మూఁడు నాళ్ళట్లయనిపెను. వృథాప్రయాస! "వట్టిరాకపోకలొన ర్చె వానిసతియు". పెండ్లికూఁతు రూరకయుండినను జెలికత్తెలూరకుందురా? జీతములకుఁ బ్రతిఫలముగా బోధనులుచేయనిచోఁ గృతఘ్నతయని యేమో! "ఆ లజ్జావతికి నేకాంతంబున నిట్టనిరి."

ఆ. "పొలఁతి! యాలిమగనిపోఁడుము లేమియుఁ
గలిగినట్టి చొప్పు గానరాదు
మీతెఱంగుచూడ మేత్తేలు దంపతు
లిరువురును వివేకు లేమిచెప్ప?"

(కళా. ఆ. ౪. ప. ౬౫.)

క. కాంతుఁడుచితజ్ఞుఁడైనను
గాంతకు సిగ్గువడఁ జెల్లుఁగాక కటకటా!
కాంతుఁడు సిబ్బితికాఁడై
కాంతయు నట్లైన నెట్లు కాపుర మింకన్. ౬౬

ఆ. నలినవదన! యెన్ని నాళ్లైనఁ జిన్ని కూఁ
తురవుగావు నీవు తొడఁగి పలికిఁ
దగినసేవఁజేయ కగునె యూరకయుండ
నాతఁడేమియు ననఁడనుచు నిట్లు. ౧౭

క. మగవాఁడు భాగ్యవంతుఁడు
మగువకు నొప్పగునె యిట్లు మానపుబిగి గ
ట్టిగఁ దాల్పఁ దనంతనయూ
డిగ మిటునటుసేయ నతని డెందము గరఁగున్. ౧౮

క. గారామునఁదోడ్తోడన
రారమ్మనఁడనుచు మగుడిరా నేటికిఁ గ
ర్వాగంబుతోడి బాగా
లీరాదోయాకు మడిచి యూరాదో! చెలీ! ౧౯

క. వెంగలివిగాక నీవో
యంగన భోగములపంట యౌవనియగు నీ
బంగారువంటి ప్రాయము
సంగతియే యకట! రిత్తశయ్యకు నొసఁగన్. ౨౦

క. యౌవనము గలిగినప్పుడ
పూవుంబోఁడులకుఁ బతుల భోగంబులుగా
కావిభవములకుఁ గొఱయే
యౌవనజాతాక్షి ప్రాయముడిగిన వెనుకన్. ౨౧

క. "అనవిని యీ పెడమాటల
నను నేటికిఁ బంపెదరు వినన్ సైపవునా
కని సిగ్గునఁ బలుకుచునాఁ
డొనరిచి చూచెను దదీయయుక్తుల తెఱఁగున్." ౭౨

ఈ సంభాషణ యతిమధురము. అశ్లీలవాక్యములు లేవు. జాతీయములు, లోకోక్తులు వీనిచే సువాసితము. చెలికత్తెలిట్లు గరువముగాఁ బలుకుట కావ్యములలో నరిది. కడపటి పద్యమత్యద్భుతము. ముగుదకన్నెయొక్క బయటి సిగ్గును, లోనియాశను సొగసుగఁ జూపుచున్నయది!

ఈ నూతన చికిత్సలు ఫలమీయక పోయెను పాపము! సుగాత్రి యేమిచేయును? రాజకుమారిగా నుండినచోఁ జందనాదులఁ బట్టించుకొని చిగురుటాకుఁ బాన్పుపై హాయిగా మూర్ఛపోయియుండును! పూజారి బిడ్డ. శాస్త్రప్రకారము శృంగారమను పథ్యము దప్పక సేవించి ప్రకటింపవలయునన్న నుద్యానవనముండవలెను. శీతలోపచారములకు సేవకురాండ్రుండవలయును. సరస్సులుండవలయును. మఱియు పచ్చకప్పురము, పునుగు, జవాది, అరఁటిబొందెలు, చందనము మొదలగు సంబారములు లేనిది శాస్త్రోక్తముగాఁ గామము నావాహనచేయనగునా! అట్టి సీటులు ధనికులకే గాని సామాన్యులకుఁ జెల్లదు. ప్రబంధములలోని మోహము మాత్రము నిక్కమైనయెడల, రాజుల యిండ్లలోనేగాని

యింకెక్కడను రతి మన్మథులు వాసము చేయరని చెప్ప వచ్చును! సుగాత్రి కీదిగఁ దీపులెవ్వియుఁబట్టలేదు "నాకును మంగళసూత్రంబీపాటి శుభస్థితి నుండుటయె పదివేలనుచు నెంచికొనియు వేఱొకలాగున నుండక యతనికి నాయురభి వృద్ధికరంబులని వివిధాలంకారంబుల నెప్పుడు నేమరకయు తాల్చుచుఁ దనతల్లి యేమియు నతని నిట్టిట్టాడకుండం బ్రార్థించుచుండె" (కళా. ఆ ర. ప. ౨౩)

భర్తకు నొక పిచ్చియైన భార్యకు నొకపిచ్చి' తన యలంకారము లాయనకు నాయురభి వృద్ధికరములనుట పిచ్చి యైనను మేలుచేయు మంత్రములలో నొకటిగాన ననింద్యము. ఈ యోర్పును, వినయమును, సుఖపరిత్యాగ బుద్ధియు, సంతుష్టియు శృంగార భావములుగావా? పతిపైఁ గల ప్రీతిని సూచింపవా? అత్తగారి కీమాత్రము శాంతము గుదరదాయె! మనమఁడు గలుగకున్నఁ దనకు మోక్షము గలుగదనియేమో! ఈ దౌర్భాగ్యపుటల్లుఁడుతోఁటలోనైనఁ గృషి చేసి ప్రయోజకుఁడు గానీయని యాతనిని బూఁదోఁటలో మాలిపనికి నియోగించెను! శాలీనుఁడు సత్త్వగుణుఁడు. చెప్పినదంతయుఁజేసి రచ్చలేక యుండమనెడు వాఁడు. మఱియు. ఇల్లటపల్లుఁడు. అట్టి యల్లురకు మర్యాదలెక్కడ యుండునా? ఒక్క భేదముఁ జెందక నిత్యముఁ దోఁటపనులఁ జేయుచుండెను. అప్పుడు సుగాత్రి.

తే. తల్లిమాటలచే నిట్లు తన విభుండు
దనువు బడలంగ బూఁదోఁట పనులుసేయఁ
జూడనోర్వక తాను నవ్వోఁటికరిగి
తోడుపడియెదనని చూచు బ్రీడనుడుగు.
(ఆ. ౪. ౭౪.)

పిమ్మటఁ గొన్నాళ్ళకు లజ్జఁ బాయఁద్రోఁచి పురుషునకు సహాయముగఁ దానును దోఁటపనులను జేయ

ఉ. " . . . .
. . . . ఎప్పటియట్ల యలంకృతాంగియై
యెంతయు నింపుతోడఁ జనియెన్ బ్రియుఁడున్న వనంబులోనికిన్.
(ప. ౯౪)

క. చని యాతఁడుదా సలిపెడు
పనులకు నీయకొనకున్న బలిమిఁ గడంగెన్
దన సొమ్ములెల్ల నొక మఱుఁ
గున నిడి పిరిసుట్టుసుట్టికొని వలువతోన్. ౯౫

సీ. తోరంపుఁజనుదోయి త్రుళ్ళింతలనిడంగఁ
దగుచోట్ల గుద్దంటఁ ద్రవ్విత్రవ్వి
వేఁగైనపిరుదు బల్వడిఁ జలింపంగను
నడినిట్టువట్టును నడిచి నడిచి
యడుసుతుంపురు చెక్కుటద్దంబులను బర్వ
మళ్ళకు మడవలు మార్చిమార్చి
నడుములేఁదీవియ నకనకల్గుడువ సం
పునఁదగు మోఁపులు మోసి మోసి

చిఱుచెమటచేర్చు వింత క్రొమ్మెఱుఁగుతోడఁ
గొమరు మేనొప్ప సారెకుఁ గొప్పువిడల
నేమిటికి నైనఁ దామున్న యేగి యేగి
యెల్లపనుల నొనర్చి నింపెసక మెసఁగ. ౯౬

ఇన్నాళ్ళుఁ గరగని యాతని మనసు ఈనవ్య మోహన మూర్తిచే జయింపఁబడెను!

చ. . . . . . ఆ నా
బడలిక మాపలే కిడుమపాట్లకుఁ జొచ్చి నలంగితంచు నె
క్కుడు తమకంబుతోడఁ దలఁగ్రుచ్చి కవుంగిటఁగూర్చె నత్తఱిన్.
(ప. ౯౯.)

పశుప్రాయమగు శృంగారమునకన్న నిదియెంత మేలు! చూచి చూడకమునుపే కామినులఁగవయ నుంకించుట లోలత్వము. నీచము! ఇక్కడ, భార్యయెడఁ గూరిమి, ఆమె తన సహాయమునకై స్వయముగా వచ్చినందుకు మెప్పు, బడలినందుకుఁ గనికరము. గొప్పబుద్ధిఁ జూపినందుల కుదారవర్తన యను గౌరవము. ఇట్లు స్నేహము మర్యాద, వీనికనుకూలములైన భావములతోఁ గలసిన శృంగారము చూపఁబడియున్నది. ఇది శ్రేష్ఠము. మానసికము. శాశ్వతము. పెఱయవి యంగరాగములు. తుచ్ఛములు. చంచలములు. మనసుతోఁ గలసినట్లు కామేచ్ఛ వర్ణించుట మనలోనంతగా లేదుగాన నీచరిత్రము నవ్యలీలా లలితంబు.

తన మనోరథము ఫలించినందుకుఁ గారణ మాపెకుఁ దెలియదయ్యె. ఎట్లు దెలియును! కార్యములనేకములు గణించి పరిశీలించినఁగాని కారణము నేర్పఱుచుట దుర్లభము. ఒక్కనాటి యనుభవముచే నిర్ధారణ చేయనశక్యము. అట్లగుట నాఁటిరాత్రి సుగాత్రి సంతోషముతో "నెప్పటికంటె మిగుల నలంకరించి" కొని కేళికాభవనమునకు రాఁగా "తోటపనులు, సేయుమూర్తి మదిన్ హత్తి పాయకునికి" శాలీనుఁడు ఈ ప్రచండవేషముఁ జూడనైనఁ జూడక యేదో ధ్యానమున మౌనియై కదలక యుండఁజూచి, భార్యశోకాశ్చర్య నిమగ్నయై వేచివేచి విసిగి,

ఉ. ఆ లలితాంగి చాలఁదడవచ్చట నమ్మెయి నుండి సాహసో
ద్వేలతనంతఁ జేరి కడుఁద్రిమ్మటచే శ్రమమొంది నారుగాఁ
బోలును బోదు నా నిదురఁ బోయెదరే యని కప్పురంపుఁదాం
బూలముదావి భుగ్గురని ముంచుకొనం జెవిదండఁ బల్కఁగన్.

క. పైకొన్న పరాకున నతఁ
డేకోర్కిని వచ్చితనియె, నింతియు నగతో
లోకము వారలు పతికడ
కేకోర్కిని వత్తురనుచు నెంతయుఁ బొలసెన్.

క. ఓ నాయక యితరమ్ములు
పోనిమ్మాపాటియైన బుద్ధిగలిగి నా
మానసములోని కోర్కులఁ
పూనికనడిగితిరి లోక పూజితనైతిన్.

మ. అకటా! యేమని దూరుదాన మిము నాథా వేఁగుజామయ్యెఁ బొం
దికగాఁబాదము లొత్తరమ్మనుటగా నీ, యొంటి యేమోఁగదా
నికటక్షోణికి నేగుదెమ్మనుటగానీ కొంత నెయ్యంపుఁ బూ
నికతోఁ గన్నులువిచ్చి చూచుటయకానీ లేవ యొక్కింతయున్.

ఉ. నేఁ డలతోటలోనపుడు నిబ్బరమైన మదీయ భాగ్యమున్
బోఁడిమియేమి పాకమునఁ బొందెనొ! మీ కృపయట్లుగాంచి పెన్
వాఁడిదనర్చు నాచనువునన్ మిము నెమ్మెయినంటెఁగాని, యే
నాఁడును బుణ్యసాధ్వికి గుణంబదిగాదని యేనెఱుంగుదన్

(కళా. ఆ. ౪. ౧౦౯–౧౧౩.)

అని యెన్ని విధంబులఁ దేర్పఁ జూచినను దేరఁడాయె!

తే. అంతఁ బోలునాఁటియట్ల యత్యాదరమునఁ
బోయి పూఁదోఁట పనులెల్లఁజేయుచుఁ బతి
మన్ననలుగాంచి యెంతెఁ దన్నతికి నట్టి
సొంపులేగాని భూషణా లింపుగామి.

(ఆ. ౪. ౧౨౩.)

ఇట్లాతని మనోవృత్తింగాంచి తగురీతి నాఁడు మొదలు వర్తించునదై యెల్ల సుఖంబులంగాంచి పరమసాధ్వీలలామ మన నాసుగాత్రి ప్రసిద్ధివడసెను!

ఏకాంత గోష్ఠివర్ణించునపుడును గవి యెంతనాణెము దోఁప వ్రాయుచున్నాఁడో చూడుఁడు! ఇది సభ్యమైన

వర్ణన. దీనింజదువ దలవంచికొను నవసరమెవ్వరికినుండదు. మనవారనేకులు శృంగారమునకు శుచిత్వమునకును బరస్పర శత్రుత్వ మాపాదించిరి. ఇది సత్యమునకు స్వభావమునకు రెండిటికిఁ దప్పిన యూహ. గొప్పవారి ప్రేమలు పరిశుభ్రములు నిర్మలములు. మృగప్రాయుల శృంగారములు వికారములు తుచ్ఛములు, *

సరస్వతీచతుర్ముఖవిలాసఘట్టము

ఒక విషయముంబట్టిచూచిన సరస్వతీ చతుర్ముఖవిలాసఘట్టము నంటిది యాంధ్రంబున నెక్కడను లేదు. ఏవిషయమన. ప్రకృతిని పాత్రముల జీవితముతోఁ గలిసినట్లు వర్ణించుట.

ప్రకృతివర్ణనావిధములు

ప్రబంధకవులు వర్ణించిన జాడ వేఱు. వృక్షములు కొండలు లతలు మొదలగు వస్తు ప్రపంచమంతయు నుత్ప్రేక్షకు సామగ్రి. అందును స్త్రీ సామ్యముగాను, శృంగారక్రీడగాను ఉత్ప్రేక్షించుటకు. వసుచరిత్రములోని యుద్యానవనముంగూర్చిన ప్రశంసలిందుకుఁ బ్రమాణములు

---

* ఈ ఘట్టమునను ఒక లోపము. వానకురియుచుండగా మగనితో సమముగ దానును క్లేశముల ననుభవింపవలెనను సుగాత్రియొక్క కోరిక వ్యర్థముగ నా చినుకుల వారు తడియలేదట. తడిసిన నొండొరుల కింకయు చల్లగానుండి యుండరా!

చ. "ఒనర హిమాంబుకుంభసములూడ్చి తెమల్చిన పత్త్రభంగముల్
సన నసియాడుచున్ మొగడ చన్నులు పల్లవపాణిఁగప్పు నూ
తనలతికాలతాంగుల నుదారగతిం జలివాపి నెయ్యపుం
బెనఁకువ నేర్ప దక్షిణసమీరణుఁడొయ్యనఁ దావులంటుచున్."

(వసు. ఆ. ౧, ప ౧౨౮.)

చ, "జనపతిదారసిల్ల నొక సంపఁగి తావులకొమ్మ రాగవ
ద్ఘన సుమనోభిరామయయి కాఁకసహింపఁగఁబోలు! గానిచో
ననుపమపంచసాయక కరాంచలచంచలచాపశింజనీ
జనితకఠోరఝుంకృతిని సైఁపకయున్నె పరాగపాండువై."

(ఆ ౧. ప ౧౫౬.)

ఈ యుత్ప్రేక్షల నుద్ధరించుటకై యెత్తబడిన సాధనములు సకృత్తుగ సహజోపమలు. బహుళముగ శ్లేష. ఏవస్తువులలోనైన స్త్రీలు లీనులు. దానికి సరిపోవునట్లు స్త్రీలలో నేవస్తువైన లీనము! ప్రబంధ ప్రపంచము స్త్రీమయము. ఆఁడు మళయాళము. చెట్లు, చేమలు, పక్షులు, సరస్సులు, నదులు, గుట్టలు, అన్నింటనుండియు నుత్ప్రేక్షయను పుటము వేసి శృంగార భస్మముఁ జేయవచ్చును! ప్రభావతి మంచి దుక్కిసాగినపొలము' అని సూరన వర్ణించియుండుట జ్ఞప్తియున్నదా? సూరన్నయందును ఈ దుర్లక్షణములున్నవ కాని, పాండిత్యమును బోఁద్రోచి భావముమీఁద దృష్టియుంచి వ్రాయుస్థలముల నీ దోషము పొంతఁబోఁడని నాయభిప్రాయము. కారణములు సమయోచితముగఁ జూపఁబడును.

దుష్టములగు నుత్ప్రేక్షలు ప్రాచీనకవులందుఁగాన రావు. పెద్దనాదులయందును అంతగానుండవు. ఈ యుక్తికవిత్వమునకు మార్గదర్శియు గురుప్రాయుఁడు నైన వాఁడు రామరాజభూషణుఁడు. అతనివలె నింకెవరును జేయలేదు. చేయంబోరును. వసుచరిత్రకు ననంతరము బయలువెడలిన కావ్యములలో నీ చిత్రములు మెండు. పదములలో శ్లేషయు, శబ్దాలంకారములును, భావములలో విపరీతోత్ప్రేక్షలును సర్వకవులు అవలంబించిన వేడుకలు.

రామరాజభూషణునకుఁ బూర్వము వెఱ్ఱివెఱ్ఱి యుత్ప్రేక్షలు దక్కువగనుంటకు తదనంతరము మితిమీరియుండుటకును గారణము స్పష్టము. శ్లేషయొక్క సహాయము లేనిది సహజోపమల సమర్థింపనగుఁగాని, పిచ్చియుత్ప్రేక్షల సమర్థింపనసాధ్యము. వసుచరిత్రకు మునుపు శ్లేష విస్తారము ప్రచారమునకు రాలేదు. తరువాతవచ్చినది. శ్లేషయు, శబ్దవైచిత్రియు, భావవైపరీత్యమును సమన్వితములు. వీని వేంద్రముచేఁ గవిత్వములోని రసమంతయు నెండిపోయినది.

ఇట్లు స్త్రీమయముగా వర్ణించుటకుఁ గారణము అది శృంగారమునకు నుపకరణమను నూహ. ఈ యూహ యాభాసము. ఎక్కడఁ జూచినను స్త్రీలు చెదలవలె మిల మిల లాడుచుండిన వారియందు మన కేమాత్రముఁ బ్రీతియుండదు. అతిచే జనించు రసము రోఁత. అపురూపముగానిది

యల్పమూల్యము. విరక్తి దట్టముగఁ బట్టునడవలయు నన్న నాఁడుమళయాళములో నొక దినమున్నఁజాలు. పదాఱువేలుంజిల్లర కాంతామణుల మందఁజేర్చినవాఁడగు టఁగాదె శ్రీకృష్ణుఁడు నిత్యబ్రహ్మచారియనఁ బ్రశస్తుఁడ య్యె! ఆయనవలె మూరీకృతరక్తులు నిర్జితేంద్రియు లొరు లుండరు! సర్వవ్యాపిగానుండు వస్తువుపై బుద్ధియంతగాఁ బోదనుటకు నా భగవంతుఁడే సాక్షి! అరుదైనకొలఁది గిరాకి హెచ్చునను బజారున్యాయమునైన ప్రబంధకారు లెఱుంగమి వారి చిత్రకవిత్వమునకన్న మించిన చిత్రము!

భారతమందలి స్వభావవర్ణనావిధానము

భారతకవులు ప్రకృతివర్ణన యెంతయు మనోహరముగఁ జేసియున్నారు. తఱుచుగ నుపమానములనైన వాడరు. వస్తువు సుందరముగానున్న దానిని నిజరూపముతో సాక్షా త్కరించినట్లు వర్ణించిన ప్రత్యక్షానందమీయదా? పోలిక లేల? ఉత్ప్రేక్షలేల? నురుగులు గ్రమ్ముచుండఁగా నలల పరంపరలచేఁ దీరముమీఁదఁ గొట్టుకాడు సముద్రము తనంతట గంభీరముగాదా! అద్దానిఁ జూచినప్పుడు మన మానందించుట యుత్ప్రేక్షతోనా? దానియందు చూపు హత్తి యిటునటుఁ దిరుగకుండుటచేనా? భారతములో నుప మానోత్ప్రేక్షలతోఁ గలసిన స్వభావ వర్ణనములున్నవి గాని, యవి స్వచ్ఛందముగ నప్రయత్నపూర్వకముగ వచ్చి నవి. సొగసుగ వనములగుండ దారిచేసికొని పాఱునదిని

స్త్రీకింబోల్చుట సర్వదేశములలోను బ్రబలిన యలంకార మగుట నైజమనవచ్చును. ఇట్లు చేయుటలోను నసాధు వగు క్రియ యొకటున్నది. ఏదన నదియందలి ప్రత్యవ యవమునకును స్త్రీయవయవమొండు సరిపోలినదనిగాని, యట్లే స్త్రీ యంగాయంగములకుఁ దోడుపోయిన భాగ ములు నది యందున్నవనిగాని చూపుట. ప్రత్యవయవ సమన్వయము చిత్రపు టూహ. రసాన్వితముకాదు. మొత్త పుటర్థముగా సహజోపమలు, ధ్వని మొదలగు వానిచేఁ గూర్పఁబడు సంబంధము మంచిది. ప్రత్యంగక్రమమునకుం బోయినఁ గుయుక్తులు దప్పవు. ఆకారము సమష్టి నే భావ ము నుప్పతిల్లఁ జేయునో, దాని నారంపి, ప్రముఖములైన సాదృశ్యములున్న వానిని సూచించి విరమించుట బాగు. దీనిచేఁ జదువరులకును లాభము. ఎట్లన. కవి చూపించిన పోఁబడింబట్టి యింకను గొన్ని సామ్యములను మనమే యే ర్పఱుచుకొనుటకు నవకాశముండుటచే బుద్ధికిఁ బనులును దానఁ జొఱవయుఁగలుగును. ప్రతిపదటీకగా బాకీ యే మాత్రము లేక యంతయు విశదపఱచిన మనమనః పరి శ్రమకు వీలుండదు. కానఁ గొంతవడికి మాంద్యము విసు గును జనించును. పూర్ణోపమలకన్న లుప్తోపమలు రసవత్తర ములు. భావానుకూల్యములు.

ప్రాచీనులలోఁ గొందఱు కవులు (అందును ముఖ్య ముగా బమ్మెరపోతనామాత్యుఁడు) ఇంకొక విధమైన యుప

భ్రంశము నాశ్రయించినట్లు తోఁచెడిని. ఏదన. వనవర్ణనము మొదలగునవి చేయునపుడు పదాడంబరమునకై నిఘంటువులలోని చెట్ల పేర్లన్నియుఁ బ్రయోగించుట. దృష్టాంతము.

ఉ. "అందుఁదమాలసాలవకుళార్జుననింబ కదంబపాటలీ
-చందననారికేళఘనసార శిరీషలవంగలుంగ మా
కందకుచందన క్రముక కాంచన బిల్వకపిత్థమల్లికా
కుంద మధూకమంజులనికుంజములందనరారి వెండియున్."

(భాగ. తృ. స్కం.)

వ. అది మఱియును మాతులుంగలవంగలుంగ చూతకేతకీ భల్లాతకామ్రాత కసరళపనసబదరీ వకుళవంజుళవటకుటజ కుందకురవక కురంటకకోవిదార ఖర్జూరనాళికేరసిందువార చంపకపిచుమందమందార జంబూ జంబీర మాధవిమధూక తాలతక్కోలతమాల హింతాల రసాల సాల ప్రియాళు బిల్వామలకక్రముక కదంబ కరవీర కదళీకపిత్థకాంచన కందరాళ శిరీష శింశపాశోకపలాశ నాగ పున్నాగ చంపక శత పత్ర మరువక మల్లికామతల్లికా ప్రముఖ నిరంతర వసంతసమయ సౌభాగ్యసంపదంకురితపల్లవితకుసుమిత ఫలితలలితవిటపవిటపివీరున్నివహాలంకృతంబును. . . . . ఇత్యాది

(భాగవతము. అ. స్కం.)

వ్యక్తివర్ణన ముత్కృష్టము

ఇట్లూరక వృక్షనామములఁ బేర్కొన్న నేమియందము? ఆ చెట్లయొక్క గుణము, ఆకారము మొదలగు విశేషముల నెఱుకపఱుచు విశేషణములఁ జేర్పకున్న నమరమునకుఁ

గవివర్ణనమునకును భేదముండునా? అరఁటిచెట్టు, అని చెప్పిన మాత్రాన వినువారికది యిట్టిదని యేర్పడదు. మనసుముందఱ ప్రతిమవలె వస్తువు గన్పట్టవలయునన్న సామాన్యగుణముఁ జేర్కొనినఁగాదు. విశేషాంశములఁ జూపవలయు. నిదర్శనము. మనుష్యుఁడు అన్నమాత్రాన మనకు నేరూపమును గోచరింపదు. విశేషణములఁ జేర్చుచుఁబోయిన ప్రతిమయుఁ దీఱుచువచ్చును. ఎట్లన. చింపిరిబట్టలవాఁడు. తలవిరియఁబోసికొని యున్నాఁడు. పంగనామాలు. ఎడమ చేతిలో గరుడస్తంబము, కుడిచేతిలో గంట. అనునప్పటికి దాసరివాఁడు ప్రత్యక్షమునకు వచ్చును. దాసరి హారిని బరిశీలించినవాఁడు ఇంకను విశేషణములఁ బూన్చిన, నేదోయొకదాసరిగాక, నిష్కృష్టమగు నొక రీతికిం జేరినవాఁడు ముందువచ్చి ఘోషించును. ఆట్లే యరంటిచెట్టుంగూర్చియు. అరఁటిచెట్టన్న మాత్రాన నేయరఁటిచెట్టో! కాండము గుండ్రముగా బలసియున్నది. సూర్యకిరణములు సోఁకి లోనదూరక యిటుదిరిగి పోవునంతస్నిగ్ధము. వెడల్పైన యాకులున్నవి. ఘనమైన యొంబముచే వంగిన తలగలది. ఈ రీతిఁ జిల్లర చిల్లరసంగతులు గలుపుచు వచ్చితిమేని యాకారము రంగులుదీఱి యేదేనొక విగ్రహముగ మనసున ప్రతిఫలించును. ఇట్లుగాక పేరుల జాపితా యెదుట నుంచిన, మనమేమి వర్తకులమా దానియెడ నాదరముంచుటకు?

సమష్టిగా వ్రాయుట నిఘంటుకారులపని. వ్యక్తి నొకదాని హృదయమున సాక్షాత్కరింపఁ జేయుట కవి యొక్క ముఖ్యోద్యమములలో నొండు. ఇది చేయంజాలని వాఁడు పండితుఁడుగావచ్చునేగాని కవిగానేరఁడు. తన మనసులో నేదే నొక యాకృతిని చక్కఁగ నేర్పఱిచి పద ములమూలముగ దానిని రసికులకు వ్యక్తపఱిచిన నదియు కవిత్వము. నదిని వర్ణించిన నన్ని నదులకుంజెందిన తీరునఁ జేయుట కళగాదు. మఱి యేదే నొక్క తెఱంగునది దోఁ పవలయు. అట్లే సరస్సులు మొదలగు ప్రకృతిమూర్తులం గూర్చియు

పాత్రముల వర్ణించునపుడును ఈ తత్త్వము నేమాత్ర ముమఱవరాదు. ప్రబంధకవులలో ననేకులు వసుచరి త్రానుకారులు. ఈ పద్ధతి నేమాత్రముఁ దెలియని వారు. వీరినాయికలు పరస్పరప్రతిబింబములు. ప్రత్యే కించిన గుణము, చర్య, రూపము, ఏదియు లేదు. నాయ కులు నట్లే.

కవులు వర్ణించిన ప్రకృతులు పాత్రములు నుత్కృష్ట ములాయని శోధించుట కొక యుపాయమున్నది. ఏదన. ఆ వర్ణనలఁ జదువుటచే చిత్రకారుఁడు విస్పష్టమును అనన్య మునైన ప్రతిమను వ్రాయఁగలఁడాయని వితర్కించుట. బమ్మెరపోతనామాత్యుని వనములు సరస్సులు నన్నియు గురిగింజలట్లు ఏకరూపములు. ఏక రూపములనుటయుఁ

దప్పు. ఏకనామము లన్న నింకను సత్యము! ఏలన నిఘంటువులలోని పేర్లన్నవిగాని, యయ్యెవ్వస్తువులకుఁ గాలాదుల ననుసరించిన చర్యలెవ్వియు నారోపింపఁ బడనందున నవి దృష్టములు గావు.

పాత్రములఁ బరిపూర్ణములుగా వర్ణించుట యెంత తప్పో వనాదులసైతము 'సర్వలక్షణసంపన్న'ములఁగా వర్ణించుట యంత తప్పు పోతనయొక్క చెట్లన్నియుఁ బుట్టి పెరుగు తా వీజగతి నొక్కటే! ఎద్దియన. నిఘంటువు! భూసారాది తారతమ్యములచేత నొకజాతికి వృద్ధికరమగు నేల యింకొకదానికి క్షయకరము. మఱియు. ఒక నేలలో పెరుగు వృక్షములు సైతము సరిగా నాయికానాయకులు వచ్చునదిచూచి యన్నియుఁ బుష్పఫలభరితములు గావు. వనములు, తోఁటలు మొదలగునవి చూచినవారందఱకు నిది తెల్లంబ. కవులకుఁగాదు. పాపము! వారేమి చూచిరి? నిఘంటువులందప్ప.

ప్రబంధకవులలో పాత్రవర్ణనమునఁ గనంబడు దోషములన్నియు ప్రకృతివర్ణనమున నున్నవి. దేనినిగాని తాము భావించినట్టియో, చూచినట్టియో వ్యక్తిఁగా వర్ణింపరు. సర్వసామాన్య గుణంబులఁ బేర్కొని యాకృతిని నిర్ణయింపఁజాలని యంత సమష్టిగా వ్రాయుదురు. ఇది ఉన్నది యున్నట్టు, కన్నది కన్నట్టుఁగాక, చదివినది చదివినట్టుగా వ్రాయుటచేఁ గలిగిన యుత్పాతము!

నన్నయ్యభట్ట ప్రకృతివర్ణనము

సేయురీతి

భారత కవులలో నీ దోషమంతగా లేదు. విశేషణములు లేని జాపితాలు మృగ్యములు. అమ్మహనీయుల రీతిఁ జూపుటకున్నె కొన్ని యుదాహరణముల నుడివెద

నిరలంకారములు

మానిని. ఏచినతనర్చితలిర్చినక్రొవ్వులు నిమ్మగురావుల జొంపములం
బూచిన మంచియశోకములన్ సురపొన్నలఁ బొన్నల గేదఁగులన్
గాచిబెడంగుగఁ బండిన యాసహకారములం గదళీతతులం
జూచుచు నీనులకింపెసఁగన్ వినుచున్ శుకకోకిల సుస్వరముల్.

కవిరాజ విరాజితము.

"చనిచని ముందట నాజ్యహవిర్గ్ధ్రుత సౌరభధూమలతాతతులం
బెనఁగిన మ్రాఁకుల కొమ్మలమీఁద నపేతలతాంతములైననుబా
యనిమధుపప్రకరంబులఁజూచి ధరానిభుఁడంత నెఱింగెఁ దపో
వనమిదియల్లదె దివ్యమునీంద్ర నివాసము దానగునంచు వెసన్."
(భా. ఆ. ప. ఆ. ౪. ప. ౨౦. ౨౧.)

లయగ్రాహి.

కమ్మనిలతాంతముల కుమ్మొనసినచ్చు మధుపమ్ముల సుగీతనినదమ్ములెసఁ
గంజా, తమ్ములలసత్కిసలయమ్ముల సుగంధిముకుళమ్ములను నానుచు
ముదమ్మొనరవాచా, లమ్ములగు కోకిల కులమ్ములరవమ్ము మధురమ్మగు
చు విన్చనిశమ్ము సుమనోభా, రమ్ములనశోకనికరమ్ములును జంప
కచయమ్ములును గింశుకవనమ్ములును నొప్పెన్.

లయగ్రాహి.

చందనతమాలతరులందు నగరుద్రుమములందుఁ గదళీవనములందు లవ
లీమా,కందతరుషండములయందుననిమీలదరవిందసరసీవనములందువన
రాజీ, సందళిత పుష్పమకరందరసముం దగులుచుందనుపు సౌరభము
నొంద జనచిత్తా, నందముగఁ బ్రోషితులడెందములలందురఁగ మంద
మలయానిల మమందగతి వీచెన్.

(భా. ఆది. ఆ. ౧, ప. ౧౩౭. ౧౩౯.)

చ. కురిసెఁ బ్రచండవృష్టి ఘన ఘోషములెల్లఁ గెలంకులన్ భయం
కరములుగాఁ గరాళ కరకాతతులొప్పఁ దటిల్లతాళివి
స్ఫురితముగాఁ బ్రపూర్ణజలపూరము తద్గిరికుంజభూరిని
ర్ఘరతటినీతటీ నికటసాలచయంబు విమూలితంబుగన్.

(భా. అర. ఆ. ౩. ప. ౨౯౪.)

క. లలితమధుస్రవ ఫలములు
విలసిత మృదుపత్రతతులు వృత్తస్కంధం
బులు నవిచలితచ్ఛాయలు
గలబదరీతతులఁ జూచి కడువిస్మితులై.

(భా. అర. ఆ. ౩. ప. ౩౦౭.)

సాలంకారములు:

మ. ప్రమదాపాదిపయః ప్రపూర్ణమిదియో పద్మాకరంబంచుఁద
త్కమలామోద సుగంధమారుతము వీఁకన్ మున్నెటింగించెన
భ్రమణంబిల్చె సరోవరంబనిలజున్ రాజీవ రాజీవస
త్సమదాళి ప్రజచక్రవాక బకహంస క్రౌంచనాదంబులన్

(భా. ఆది. ఆ. ౬ ప. ౧౪౨.)

సీ. రంగదుత్తుంగతరంగ హస్తంబుల
నాడెడు నది వోలె, నతులవేగ
వాతవిధూతమై యెఱలెడునది వోలెఁ
బర్వతకందరోపాంత తతులఁ
దొడరెడు నదివోలె భ్రమఫేనవితతుల
నగియెడునదివోలె, నాగనక్ర
మకరకులక్షుభ్యమాణమై తద్బాధ
కోపనియదివోలె, నుచ్చభీమ
నినదమగుచునున్న నీరధియొద్దకు
. . . . .

(భా. ఆర. ఆ. 3. ప, 3౭)

సీ. . . . . .
సురనదిధరణీతలంబున కరుగుదెంచి
కలహంసగతియు నిర్మలఫేనహాసంబు
నాకీర్ణమీన విలోకనములు
నాలోలపవనవాచాలితకల్లోల
రసిక మృదూక్తులు నెసఁగుచుండఁ
బ్రీతితో భగీరథుఁడను దూతచేత
నీతయై మహాముని పరిపీతరిక్త
మగు సరిత్పతిఁగూడి యా సగరజులకు
హితముగాదానినించె నాతతజలముల.

(భా. ఆర. ఆ. 3. ప. ౭3)

క. నానావర్ణశిలా విహ
గానేక మృగాభిరామమై భూనారీ
నానాభరణ విభూషిత
పీనోన్నతకుచముఁబోలె వెలిఁగెడు దానిన్.

క. లలితాచ్ఛస్ఫటిక శిలా
తలములపైఁ బాఱు విమలతర నిర్ఝరిణీ
జలపూరముల నుదారో
ల్లలదురు హారాలి నుజ్జ్వలంబగుదానిన్.
(భా. అర. ఆ. 3. ప. ౨౯౨. ౨౯3)

మిశ్రములు:

క. ఖరకిరణతాపమున నురు
తరదవదాహమున శోషితములైన వనాం
తరతరుతతి కాప్యాయన
కరమై వర్షాగమంబు గడుబెడఁగయ్యెన్.

తే. విశద శారదాంబుద పరివేష్టనమునఁ
బొలుచు గగనంబు ప్రతిబింబమో యనంగ
వికచకాశవనీ పరివేష్టనమున
నతిశయిల్లె నిర్మల కమలాకరములు.*
(ఆ. భా. అర. ఆ. ౪. ప. ౧౪౪. ౧౪౭)

నిరలంకారములనందగు పద్యములలో ధూర్జటి వ్రాసిన,

* ఇట చదువరులు ఆరణ్యపర్వమున నన్నయభట్టు ఎఱ్ఱాప్రెగ్గడలు వ్రాసిన ఘట్టమును జూడనగు.

శా. "ప్రాతఃకాలతుషార శీకరచయప్రాప్తిన్ లసన్మౌక్తిక
ప్రేతాగారములట్లు చెల్వెసఁగు తద్బిందుచ్ఛటాజాతవి
ద్యోతచ్ఛాయలఁ గొంతసేపు బహురత్నోద్దీర్ణగేహంబులై
లూతాకల్పిత తంతుసద్మములు వొల్చుం జూడఁ జిత్రంబులై."

అను పద్య మత్యద్భుతము?

ఉత్ప్రేక్ష

భాస్కరరామాయణమున సీతాపహరణ ఘట్టమున స్థావరజంగమ మయమైన ప్రపంచమంతయు నాయమకై యాక్రోశించెనని యెంత యుదాత్తరేఖగా నుత్ప్రేక్షింపఁబడినదో చూడుఁడు!

తే. ఓలి శృంగంబులెత్తిన కేలుగాఁగ
నిర్ఝరంబుల పెనుమ్రోఁత నిగిడిబెరయ
గిరులు జనకరాజాత్మజ పరిభవంబు
జగములెఱుఁగ నాక్రోశించు పగిదిఁదోఁచె.

(భాస్క. అర. ద్వితీ. ప. ౧౫౧)

సీత! పరమపావనమూర్తి! శ్రీరాముని భార్య. దౌష్ట్యమున నామెను బలాత్కరించి కొనిపోయినవాఁడు సర్వలోకాధీశుఁడగు రావణుఁడు. రాక్షసవంశ సంహారకారణమైన దీయాగడము. ఇట్టి జగత్ప్రధాన సందర్భంబులఁ బ్రకృతియు మనుష్యమాత్రులరీతిని సుఖదుఃఖాది వికారములం దాల్చిన ట్లుత్ప్రేక్షించుట సమంజసముగాని, చీమకు దోమకు వాసియైన నాయికానాయకుల పాటులంగూర్చి

లక్షించునదిగా వర్ణించుట గాంభీర్యమునకుఁ గొఱఁత. వస్తువుల కొలందులు గణింపక వర్ణించిన నగుఁబాట్లగును. ప్రబంధములలోని ముఖ్యదోషములలో నీ వివేచనవిహీనవర్ణన మొక్కటి. ఏకుగ్రామముఁగాని, యెట్టి నికృష్టరాజులం గాని, వీరకావ్యముల ధోరణిగా వర్ణింతురు. పట్టణప్రాసాదములు మిన్నుముట్టునఁట! భర్త హర్మ్యముల గవాక్షములలో చంద్రుఁడు దూఱిపోవునఁట! ఇఁక రాజుగారో యాపురికిఁ దగినవారు! పంచపాండవులు, దాశరథులు అందఱను గరఁగించి బ్రహ్మపోఁతఁబోయఁగా నవతారమెత్తిన పురుషస్వరూపులు! కానిండు! ఈ బలపరాక్రమములకుఁ దగిన శౌర్య ప్రారంభముల నొడఁగూర్చినఁగదా యాగుణములు సార్థకములగుట? అట్టికథాకల్పనాశక్తియో సున్న! మహాకవుల యూహలలోఁ గొన్ని దొంగిలించి కొన్ని విడిచి పెట్టుటలో లాభములేదు. కైకొన్న నన్నియుఁ గొనవలయు, లేదా, పూర్ణముగా వదలి తమనైజము కొలఁది వ్రాయవలయు. లేనిచో పరస్పరాసంగతిబాధచే సందర్భశుద్ధి చెడును.

ప్రబంధవర్ణనలు తావు మార్పవచ్చును. ప్రథమాశ్వాసములోనిది ద్వితీయమునకుఁ బరివర్తించినను లోపముగాఁ దోఁపదు. మఱి బొత్తిగాఁ దీసివేసినను, ఇక్కడ నేదియో యుండవలయునను సంకోచము గల్గదు. అప్రస్తుతములనుటకు నీ కారణములు చాలవా?

సరస్వతీచతుర్ముఖశృంగార సంవాదము

ప్రకృతమనుసరింతము. ప్రకృతిని గధాపాత్రములతో సమ్మేళించినట్లు వ్రాసియుండుట సరస్వతీ చతుర్ముఖ విలాసముయొక్క ముఖ్యాంతరము. రంగము సరోవరము. శారదాదేవి ప్రణయకోపమున నవ్వలి మొగంబుగాఁ బొరలినందున, నామె ముఖచంద్రమండలము ఆ కాసారములోని మణిస్తంభమునఁ బ్రతిబింబితమగుడు, బ్రహ్మయు దానినిం జూచుచున్నైన నానందింతమని కొంతసేపట్లేయుండి, యెంతకును బ్రియురాలి కోపముదీఱనందున, సమీాప వృక్షశాఖాధిష్ఠితమగు రాచిల్కతో "చెలువయుబుసుపోదు, కథయొక్కటిఁ జెప్పవుగా" యనుటయు "....నోదేవ మీరు చెప్పెదరేని విని యెదనని" యాశుకంబు విన్నవింప, వినుమని యాతండును అప్పుడు జరిగిన శృంగారలీలల నేదో కథఁ జెప్పినట్లుగా శ్లేషచేసి వివరింపఁ దొడంగెను. ఎట్లన. కాసారపురములో నొకరాజు. అతనిపేరు కళాపూర్ణుఁడు. (ముఖచంద్రుఁడు) అతఁడు స్వభావునిచే (స్వభావముచే) నొక యెఱ్ఱని మణిశిలాకను (మోవిని) విల్లును (కనుబొమలును) బాణములును (చూపులు) బడసి సరిరాజులనెల్ల జయించెను. ఈ రీతిగాఁ దాను మన్మథావేశముచే నామెంగదియుట మొదలైన రాగంపుఁ జెయ్వులెల్లఁ బ్రకటించుడు, భాషామోషయు కృత్రిమకోపంబును నిజమైనయుల్లాసంబుగా, చిట్లింపఁబడిన కనుబొమలతోను వెలివిరిసి వచ్చు

చిలుకవవ్వులతోను, ఆచిలుకంజూచి "యీ కళాపూర్ణుఁడు మఱి యెమియయ్యె నతని తలిదండ్రు లెవ్వరు, అడుగుము" అనవుడు, చిలుకయు నట్లడుగ బ్రహ్మదేవుండింకను జమత్కారముగా నేమనుచున్నాఁడు! అతనికిఁ దండ్రి సుముఖాసత్తి. తల్లి మణిస్తంభుఁడు (స్తంభశబ్దము పుంలింగము గనుక నందు ప్రతిబింబితంబనుట) అట్లనుసరికి.

సీ. . . . . .
వాణిహాసముతో గ్రక్కునఁ గ్రమ్మతి కౌఁగిలించి
యింతలోనయారా యెన్ని బిబ్బిబ్బులు
తిద్దరిల్లకుఁడంచు ధవుని వీఁపు
చఱచి యెట్టెట్టు లారాజు జనని మొగది
యును జనకుఁడాఁడు వాఁడునాయనుచు మఱియు
మిగుల నవ్వుచుఁ జెప్పుఁడామీఁదు ప్రాణ
రమణ! మఱియేమియయ్యె నారాజనుటయు.
(కళా. ఆ. ౫. ప. ౨౮)

పాలయలుక సగము విరిసినది. పిమ్మట మఱికొన్ని స్నేహక్రీడలు నడువఁగా, నిదేమి, యూరకుండరని కోపించుకొన్న సరస్వతీదేవికి హృదయప్రమోదంబుగా నీ క్రొత్త సంగతులను జేర్చి శతానందుఁడు కథ పెంచిచెప్పిన శారదాదేవియు కపట రోషంబుతో "చాలుఁ జాలు మీ కథ. ఇప్పటి మన వృత్తమంతయుఁ జెప్పుచున్నారు. ఇంకెంత దూరము చెప్పెదరోయని యూరకుంటిఁగాని తొలి

నుండి నాకుఁ దెలియదనుకొన్నారా?" యని యీ కథ యందలి ప్రస్తుత వర్తమానమును మృదుమధురవచనముల వ్యాఖ్యానముఁజేసి చూపుచున్నది. ఐదవ యాశ్వాసము లో నలువదియవదగు నీ వచన మెల్లరుఁ జదువఁ దగినది. వచనరచనలకుఁ దండ్రియట్టివాఁడు నన్నయభట్టు. అతని ప్రౌఢిమ యన్యులకు లేదు. ఒక్క చిన్నయసూరిమాత్ర ము ఇంకొక విధమైన వచనశైలిని బక్వమునకుఁదెచ్చి నన్న యతో సమానుఁడైయున్నవాఁడు. ఈ యిరువురి దానికన్నఁ దక్కువయని చెప్పఁదగినదయ్యును, సూరన్న వచనము సామాన్యముగాదు. వాణీదేవి వ్యాఖ్యానము చక్కఁ గ లొలుకునది!

రంగము కార్యము పరస్పర సదృశములుగ నుండు క్వాచిత్కఘట్టములలో నిదియొకటి. ఇక్కడను జిలుక నొకదానిఁ జేర్చినాఁడు ఈ రహస్యమును రంభతోఁ జెప్పి నందున శారదాశాపంబుచే నీచిలుక తొలుతఁ గలభా షిణియై పుట్టి, పిమ్మట జన్మాంతరమున మధురలాలసయై, భూలోకమున నిజనాథుని గళాపూర్ణుని గాథలు ప్రకటించి, నరులకు వరప్రాయంబగు శ్రుతిఫలము ననుభవించి సుఖ మును గీర్తిని గాంచినది.

సరస్వతీ చతుర్ముఖుల సంభాషణలు చర్యలు పొగడ్తకు మీఁటినవి. అతఁడు దనసతి నెన్నోవిధముల కేళీహేళన ములఁదేల్పఁగ, నీమెయు నవ్వనడంపఁజాలకున్నను కినుక

నటించుచు వలదు వలదని ప్రార్థించు పద్యములు మనలం బరవశులఁ జేయునవి! వాగ్రమణీమణి 'యీ దుండగము లింకఁ జాలింపుఁ'డని వేఁడికొనుచు.

సీ. మనమంత యేకతంబునఁ జెప్పికొనినట్టి
కథయిదెట్లోన యిక్కడను బుట్టె
నింతమాత్రముగాక యిటమీఁద నీ కథ
పృథివిపైఁ గలుగఁ జెప్పితిరి మీరు
తొలుత నెయిది బ్రహ్మవలన వచ్చిన యది
యనఁగఁ దన్మూల మెట్టిదియోయనఁగ *
వాఙ్ముఖప్రతిబింబ వర్ణనయనఁ గని
ట్టి ప్రసక్తినిది సంఘటిల్లెననఁగ

వచ్చెనగుఁబాట్లు నాకు మీవలన నాథ
నన్ను మన్నించి యింకైనను దడవక
మీర లూరకయున్న నెవ్వారునంత
వినరుగాన గుప్తంబు గావింపవచ్చు.

(ఆ. ౫. ప. ౫౮)

మ. అనుడుం బైపయిమాటగాక యిది యాహా యాత్మశృంగార శో
భన లీలారసమేరిక ప్రియము నీపల్కుల్ మనోవర్తనం
బును నేకంబగునేని నాలుకతుదన్ ముక్కంటి కొమ్మా విలా
సిని యేనమ్మెదనంచు బ్రహ్మ నగిపించెన్ మేలుమాటన్ సతిన్ ౫౯

---

* ఈ పాదమందు యతిభంగము దోఁచుచున్నది. అని అనంత కృష్ణశర్మగారు చూపిరి.

మ. ఘనయత్నంబున నన్వొడంచికొనుచుం గంజాక్షియున్ నాథయే
మనినన్ గోపమువచ్చుచున్నదిసుఁడీ యత్యంతమున్ నన్నిఁకం
చెనయన్ రాకుఁడు చాలునవ్వులనివైచెన్ గాంతు మీఁదన్ నిజ
స్తనగుచ్ఛప్రతిమల్లహల్లకదళోద్యత్కందుకంబంతటన్. ౬౦

మ. అనయంబుం జలమొప్పఁగామఱియు నాయబ్జాసనుండట్లు యా
డెను, మానుండిదియంచు వాణియును వేఁడెన్, జేరి తానొక్కచే
తన కంఠంబును గౌఁగిలించి యొకచేతన్ గడ్డముంబట్టి చె
క్కునఁ జెక్కానుచు నొక్క చన్మొనయురఃకోణంబుతో రాయఁగన్

తరల. అతఁడు నేలపెనంగెదో జలజాక్షి పల్కెటులున్న నీ
కత ప్రకాశితమాట నీమదిఁ గాంక్షితంబయవశ్యమున్
క్షితిఁ బ్రసిద్ధముగాఁగనున్న విచిత్రసత్కథ నీకస
మ్మతమె యట్లగునేని యేమహిమం బ్రసిద్ధతగల్గెడిన్. ౬౧

సీ. . . . . . .

నీకుఁ బ్రియమని వేఱ వర్ణింపనేల?
నీవిపుడు పల్కు పల్కు స్వాభావికంబు
పతుల యనురాగలీలలే పగిదినైన
వెలయుఁ గోరియు దాఁచుటింతులగుణంబు. ౬౩

«అనినవిని భారతీదేవి యా వారిజాసనుం జూచి మీరలింత చలముఁగొని సమర్థింప నాకు నోఁగాదననేల?» యని యూఱడిలినది.

కలభాషిణియొక్క మనోహర చరిత్రము

ఈ కథయందలి పాత్రములపైకి నాకుం బ్రియ తమ కలభాషిణి. నిక్కువమైన శృంగార భావములకుఁ బ్రకాశకురాలు. శాస్త్రకారులశృంగారమను దయ్య మంతగా సోఁకనిది. జన్మమున వారకాంత గుణములఁ బ్రబంధ నాయికలగు కులస్త్రీలకన్న మేలైనది! ఏకకాలంబున నిరువురియెడ మనసుదగిలినదానిఁగా వర్ణించుట కాధారముగా, కవి యీపెను గణికం జేసినఁ దప్పులేదని యిట్టి పుట్టుక నారోపించినాఁడో? పరిశీలింపుఁడు. ఎట్లును ఈపె నీచ పాత్రముగాదు. మఱి మహోదారచరిత్ర. సర్వజనస్తవనీయ. కృష్ణునికొలువునకు నప్పుడప్పుడు నారదుఁడు వచ్చుచుండ నతనితోడన వచ్చు శిష్యుఁడగు మణికంధరుని సాహిత్య పటిమకు గుణసంపదలకును మెచ్చి వానియెడ బద్ధానురాగయై యుండియు, జాతి దోషంబుచేఁ గాఁబోలు, నలకూబరుని రూపలావణ్యాది సౌభాగ్యంబులకు మెచ్చి తదాలోకనంబునం దనియక వాని విమానంబుతోఁ గొంత దవ్వరిగి యంతమగిడి యాతని తెఱంగెఱుంగంగోరి నారదుం జేరి ప్రార్థింపుడు, నమ్మునియు రంభకు వైరిణి నొక్కర్తు నిల్ప నెంచినవాఁడు గావున,

క. "సవతియన నింక నొకతెఁ
భువిలోపల వేఱ వెదకఁ బోవలయునె? యో
ధవళాక్షి! నీవకానే
చవె దైవనియుక్తిఁ గొంత ప్రాప్తిగలిగినన్.
(ఆ. ౧. ప. ౧౭౮)

అని పల్కుచున్నాఁడు. హృదయపూర్ణమైన వలపు వినయము, అధైర్యము, దైన్యము మొదలగు భావములతోఁ గలసియుండును. విట్రవీగదు అభీష్టసిద్ధి నిశ్చయమని యుదాసీనతయు గర్వముఁగాంచదు దీనికి దృష్టాంతముగఁ గలభాషిణి యిచ్చిన ప్రత్యుత్తరముఁ జూడుఁడు!

క. " . . . అంతటి ౘ ప
శ్రీవైభవతికిఁగాక సిద్ధించునె యా
దైవనియుక్తియు మాబోం
ట్లేవిధముఁ బాల్పడిన నిర్ధవివేకా!"
(ఆ. ౧. ప. ౧౭౯)

నారదుఁడు సర్వజ్ఞుఁడు. మణికంధరునికి నాపైపైఁ గోరికయుండుట నెఱింగినవాఁడు గావున, నీ నూతన రాగ జ్వాలలో నా ప్రాఁత వలపెక్కడ భస్మమగునోయని దానికిం బ్రతిక్రియ చేయుటకోయన, 'నాశిష్యుఁడు చేసిన దండకము చదువుమమ్మా! విందము' అని యాపెచేఁ జెప్పించుచున్నాఁడు. అది యట్లుండె. ఈ తరుణియు నారదుని మూలముగ వాంఛితంబు సఫలంబౌనను నుద్దేశముచే నాత

నికి శిష్యురాలుగా నేర్పడి యతనితో గానవిద్య నభ్యసించెను. నారదుండును గానశిక్షానంతరమున నిజకళాపాండిత్యముంగూర్చి కృష్ణుని కాంతలు మఱుఁగున నేమను కొనుచున్నారో వినిరమ్మని యాజ్ఞాపించిన, నలకూబరునిఁ గైవసము చేసికొను మంత్రమున కిదియ యవసరమని కలభాషిణియుఁ దన గుట్టుఁదోఁపనీక.

తే. . . . . .

నేను మీదాననగుటమీ గాన కథలు
వడిన నవ్వేళఁ గొదవలు దడవరేమొ!

(ఆ. ౨. ప. ౪౩)

సీ. నాకపేక్షితమైన నాతిరూపు ధరింప
సామర్థ్యమబ్బిన నామగువల
సఖులరూపముఁ దాల్చి సముచితంబగు వేళఁ
జని వారి హృదయంబుఁగనఁగవచ్చు
. . . . (ఆ. ౨. ప. ౪౪)

అనఁగా నారదుండును దాను రంభకిచ్చిన శాపమునకు నిది యనుకూలమని యావరమునిచ్చెను. నలకూబరదర్శనము మొద లిదివఱకుఁ గడిచిన కాలము నాలుగేండ్లు. ఇది మఱవకుఁడు!

పిమ్మట నలకూబరచింతతోఁ బరితపించుచు నొక్క నాఁడు కాలయాపనార్థము వీణియఁగొని యుద్యానవన

ములో వాయించుచుండగా మణిస్తంభుండు గానాకర్ణన వ్యాజ్యమున వచ్చుడు, నతని సహాయమున కృతార్థత నొందఁ నెంచినదై, యతఁడు నేఁబోయివచ్చెదనని పల్కినఁ దనదుఃఖము దైన్యము బయలువడునట్లుగా విన్నవించినది.

తే. . . . . .
. . . మహాత్మ నిన్ను నా పాలి భాగ్య
దేవతగ నమ్మియుంటి నా జీవితంబు
నేమిగాఁ జేసి పోయెద వెఱుఁగఁ జెపుమ!

(ఆ. 3. ప. ౫3)

క. ఈవేళన యాతనికడ
కేవిధముననైనఁ జేర్చుటింతియ తక్కం
ద్రోవ మఱి లేదు నన్నుం
గావఁగ క్షణభంగురములు గాంతలతాల్మల్.

(ఆ. 3. ప. ౫౫)

క్షణభంగురము లనుచున్నది యిన్నాళ్ళు గాచియుండియు! ఇదియు సహజము. మఱి దైన్యము హెచ్చి హెచ్చి పెఱికిపట్టువంటి సాహసము పోడము. ప్రాణకంటకమగు సంకటము. ఇంకను సిగ్గు నభిమానమును మర్యాదను బాటింపనౌనా? కావున నన్యములం దనాదరయై యేమనుచున్నది!

సీ. "ఓ సిద్ధపురుష మీ రేసరణిని గొని
చన్న నేమగుఁ దక్కు శంకగలదె
నీమహత్త్వముఁ గానని జడాత్ము లేమన్న
నేమికన్న మహాత్ములించుకయును
వేఱొక్కగతిగ భావింపర మముబోంట్ల
సంస్పర్శమాత్రంబు సమ్మతింప
నుచితంబుగాదంటి రుచితంబె మఱి నాదు
ప్రాణహానికి నోర్చు టరసిచూడఁ

బలుపలుకులేల యింక నా చెలులు గెలులు
నేగుదెంచి విఘ్నమొనర్తు రిత మెఱుఁగక
కావునం గొనిపొమ్ము శీఘ్రంబ నీదు
వెనుక నడికొని నన్ను మద్విభుని కడకు.

(ఆ. 3. ప. ౬౧)

వీఁడు కపటసిద్ధుఁడు. ఈ చెలువంపురాశిని మృగేంద్రవాహనాశక్తికి బలియీ నెంచినవాఁడు! "శుద్ధముగాఁగ నీ మనసు శోకము సర్వముఁ బుచ్చివైచెద" నని మిథ్యాప్రత్యయముఁ బలికి, యామెం బిలిచికొని పోయి, యమ్మవారి గుడియొద్ద నిలిపి పూజాద్రవ్యములు దేఁబోయెను. అప్పుడు సుముఖాసత్తి, మిక్కిలియు ముసలిది, వచ్చి సిద్ధుని చరిత్రం బెఱింగినదిగాన, ప్రియమును దయయును దోఁపఁ గలభాషిణింజూచి యిట్లనియె.

క. . . . . . .
. . . లతాంగి యెచటనుండి చేరితివకటా!
కలుషపుఁ బావురుఁ బిల్లిని
జిలుకయుఁబలె నిద్దురాత్తు సిద్ధుండనుచున్.

(ఆ. 3. ప. ౮౪)

క. ఆ కలుషాత్ముఁడు క్రమ్మఱి
రాకమునుపె తొలఁగి పోనరాదా యెటకే
నోకూన యీమనోజ్ఞత
రా కృతి యేఁ జూడఁజాల నసిపాల్గాఁగన్. ౮౫

స్త్రీసహజమగు రహస్యజ్ఞానవాంఛయు నడఁచి పెట్టుట సుముఖానర్తియొక్క వాత్సల్యఘనతను సూచించెడిని. నలకూబరుని సంగమంబుఁ గాంక్షించి వచ్చిన యాబాలకు నీ వృత్తాంతమెంత చింతావహంబుగా నుండదు! తాను ద్వారకాపురిలో ననుభవించిన వైభవమును, తుదకుఁ దనకిట్లు ప్రాపించిన పశుమరణమును దలపోసి దుఃఖితమానసయై, తదనంతరంబు డెందంబు డిందుపఱిచికొని, యా వృద్ధురాలితో గద్గదకంఠముగా,

శా. "అమ్మా! నీపలుకెల్ల నెంతయు నిజంబైయుప్డు గాన్పించె, నే
నిమ్మాయావి ప్రకార మిట్లగుట నూహింపంగలే కొక్క యు
ర్థమ్మున్ వీనికృపన్ గడింతునని యత్యంతాశ ప్రేరేపఁగా
నిమ్మాడ్కిం దెగివచ్చితిం దెరువులే దీపాటుఁ దప్పింపఁగన్."

(ఆ. 3. ప. ౮౯)

అని యెట్టకేని నిరాసవలని ధైర్యముం దాల్చినదై.

సీ. " . . . . .

మీఁదటరాఁగల మేలు కీర్తిరికిఁ
దప్పింపరామి యెంతయు ధ్రువంబు
ఇంక వాఁడువచ్చి యేమేమి సేయునో
చచ్చు టెట్లోయను విచారమునను
బెగడుచుండ నేల జగదంబయాశక్తి
సేయవలసినట్లు సేయుఁగాక!"

(ప. ౧౦౨)

అని పల్కుచుండ సిద్ధుఁడు క్రమ్మఱి యాపెం డాసి "యిఁక శక్తింబూజించి పోవుదమురా"యని పిల్వఁగా, నయ్యో పాపము! మరణము అట్లు ప్రత్యక్షభీకరముగా నుండిన నెవరిగుండియలు నీరుగావు? గడ్డిపరకనైన శరణ్యమని యాఁతగాఁగొనఁ జూడమా! అట్లగుట నీబాలభీరువు, దారుణమ్ముల నెన్నఁడుఁజూచియైన నెఱుంగనిది, ధృతి నీరయిపోగా నా వృద్ధాంగనంజూచి,

క. ఏ నొంటిఁ బోవ వెఱతున్
లోనికి నోయమ్మ! నీవునున్ రాఁగదె నా
తో" నన "నెవ్వరు నేటికి
నేనుండఁగ ననుచు సిద్ధుఁడింతిం బలికెన్.

(ఆ. 3. ప. ౧౧౬)

పలికి, దాని భయచేష్ట భావించి యింకఁ దడసిన విఘ్నంబగునని లోనికి బల్మి నీడ్చికొనిపోవుట కా కన్నెను గొప్పవట్టి యీడ్వఁగా, నప్పుడంతి

తే. " . . . . .
ప్రాణభయమునఁ గలఁగి యోయవ్వ! నీకు
బిడ్డనే కావవే నాకు నడ్డపడవె!
యనుచు నా వృద్ధనారి మాటునకు నొదిఁగె." ౧౧౭

సుముఖాసక్తియుఁ దనమెడఁ గత్తి కడ్డముచేసి యామెను గాపాడినది. మృగేంద్రవాహనయుఁ గలభాషిణి వెండ్రుకలు ధృఢముష్టింబట్టి మఱియుఁ బైకెఁ గత్తినెత్తిన యా సిద్ధుననతిదూరంబునఁ బడవైచెను. వాఁడు కత్తినిగాని కలభాషిణినిగాని విడువక యట్లే చని, మాయానలకూబరుఁడు గంభయుఁ గ్రీడించుచుండిన భూసామీప్యమున "మొత్తని క్రొత్తలిరు పాన్పుమీఁదఁబడెను."

తలిరులను దాఁకినఁగాక రాక మానునా? సిద్ధత్వ మెటఁబోయెనో! కామవికార మా దేశమయ్యెను! పాండవమహిషింగూర్చి కీచకుఁడు కంపిత మానసుఁడైన ఘట్టంబునఁ దిక్కన పాంచాలి సౌందర్యము వర్ణించిన యవాచ్య మాధురీ ధురీణంబులగు సీసపద్యములంబోనివి యొకటి రెండు ఈ సందర్భమునఁ గన్పట్టెడు. రసికులు పోల్చి పరికింతురుగాక!

సీ. "అమృతంబు దొలఁకునట్లమరంగ వెల్వెలఁ
బాఱు న్మృగేంద్ర బింబంబుతోడ
బాలకర్ణద్వయీ కూలంకషంబులై
తల్లడంబందు నేత్రములతోడఁ
గడుఁ జెమర్చినయట్టి కలికితేఁ జెక్కుల
నంటెడు విగళత్కచాళితోడ
వలిగుబ్బ పాలిండ్లు నిలువ కిట్టట్టు సం
క్షోభించుపయ్యెద కొంగుతోడ
వెఱపు నొక యొజ్జయై వింతవిలసనములఁ
గఱపఁ జూపట్టు సౌందర్య గరిమతోడ
పరభ సాకర్షణక్షోభ చకితయైన
మదను జయలక్ష్మికీర్తి నమ్మగునగనగ."

(ఆ. 3. ప. ౧౮౭)

సిద్ధుఁడు చూచినాఁడు. చూచినదే రెండవమాట లేక పరిరంభణమునకు మొదలినాఁడు! ఋషుల రసికత యీ మాత్రమేగదా! సౌమనస్యమున ఋషులకుఁ బాళయుగాండ్రకు మృగములకును భేదము శూన్యము! ఆ బాలయు నది సైరింపక రక్షణార్థము పేరెలుంగున నాక్రోశించిన, మాయానలకూబరుండు వచ్చుటయు, తరువాతిక్రమములును బూర్వమే వివరింపంబడియె. ఆ నలకూబరుని కెదురుగా రంభాకారయైె యీపె చనుదెంచుటీవిఁ దిలకింపుఁడు!

సీ. తిరముగా ముడువమి విరియఁ బాఱెడు కొప్పు
దోడ్తోడ నొకకేలఁ దుఱిమికొనుచు
వల్లెవాటుగఁ గొంత వలువ చన్గవ నిల్పి
పెఱచేత నీవి గల్పించికొనుచు
నుదుటిపై నొక్కింత చెదరిన ముంగురుల్
పాపటకును బొందు పఱచుకొనుచు
సారెకు జారెడు శ్రవణకహ్లారంబు
లందంద మూఁపున నానుకొనుచుఁ

జెమటనంటిన పానుపుఁ జివురుఁ దునుక
లెడనెడ నఖక్షతాశంకఁ దడవికొనుచు
రంభ యేతెంచె మిగుల సంరంభ మమరఁ
దొలుతఁ బ్రియుఁడేగుదెంచిన త్రోవఁబట్టి.

(ఆ. 3. ౧౫౬)

మనోరథ మొకరీతి ఫలించెనేకాని పరిపక్వమయ్యె ననుట నిర్వివాదముగాదు. అయిన నేమి? ఈపె ప్రబంధముల రాచకన్నెగాదు గావున, కొంచెముతోఁ దృప్తిఁజెందఁగల యుదారురాలు! ఆ కొంచెమునకు మాఱు బేరముగ మరణశాపము వచ్చిపడినను, 'ఎట్లును గాంక్షితంబు సిద్ధించె. ఇకఁ జావుగలిగిన నేమి? శక్తిగుడియొద్ద దేహత్యాగం బొనర్చెదఁ'నని యచటికివచ్చి, యా స్థానంబునఁ దనవలెనే శాపగ్రస్తుఁడైన మణికంధరుఁడును, దేవీకటాక్షమున ముదిమివీడి కుమారీ రూపంబున విరాజిల్లు సుముఖాసత్తియు, మణిస్తంభుఁడును గుమిఁగూడ, వారువారు చెప్పిన వృత్తాం

తములంబట్టి తన్నుంగలసిన యతఁడు కుబేరనందనుండు గామి శోకభరాలసయగుడు నాపెంజూచి మణికంధరుం డిట్లనియె.

క. “ . . . .
. . తరుణి! యట్లపురూపం
బున నున్నవాఁడ నేఁజుమ్ము”
(ఆ. ४. ప. ౧౦)

అని పలికి,

చ. “జలజదళాక్షి! యేను మునిశాప భయంబున నెందు నేరికిం
దెలివిపడంగనీక మది ధీరతఁ ద్రిప్పుదుఁగాని నీపయిం
గలదుసుమీ తలంపు మనగానకళాభ్యసనంబు వేళలన్
ఫలమిటులొందె దానికిని భాగ్యవిశేష వశంబునన్ దుదన్.” ౧౭

చ. అనుడుఁ గృతార్థనైతిఁ గుటిలాత్మకుఁ డెవ్వఁడు నన్నునట్లు వం
చనమునఁ గూడునోయను విచారమువాసెను, నీదుపొందు నా
కునభిమతంబె నీకుఁదగనన్న తలంపున నీ తలంపు నేఁ
గనమిని ద్రిప్పుదున్ హృదయకాంక్ష నినుంగనుఁగొన్న వేళలన్ ౧౮

అని చెప్పి, ఇక్కడను ‘నీకుఁదగనన్న తలంపు’ నలకూబరునియందుంబలెఁగలదు అని తనమాటల నమ్ముదురో మొగమాటములని వాపోవుదురోయను శంకంజేసి, గరువము నభిమానముఁగల కోమలమానసయగుటచే శపథంబులు ప్రమాణంబులు ననుచితంబులని భావించి

"యాసుద్దుల్ హృదయైకసాక్షికము లేమన్నన్ వృథాయిత్తఱిన్!"

అని వచించి, నలకూబరుపై మనసుపోవుటకుఁ గారణ మొండు చూపునదియై,

ఉ. . . . సముంచితతానక రూపరేఖ చూ
పేవ నొక కొంత గల్గఁగని యిచ్చఁ గుబేరతనూజుఁ గోరితిన్ ౨౦

క. శాప భయంబున నెఱయఁగ
నీపైఁ గోరిక మఱల్చి నిధిపతిసుతు నే
పాపపు వేళను జూచితి
నో పయిపాట నేను మఱి గనుంగొన గుఱిగాన్. ౨౧

క. ఆయక్షతనయుఁడని ని
న్నే యేఁ బొందితిఁ గుడన్ వనిన్ మన భాగ్య
శ్రీయేమని చెప్పఁదగుఁ బడఁ
బోయినఁ బూఁ గొన్నపనఁ బడుపోలికయయ్యెన్. ౨౨

ఉ. శ్రీయుతమైన దివ్యమణి చేతికినబ్బఁగఁ బాఱవైచి త
చ్ఛాయ యొకింతయున్కిఁ గని చాలఁగ్రహించితి గాజుపూసకై
నాయవివేక మేమనుకొనం దుదఁదన్నణియబ్బె నన్న న
త్త్యాయత తత్సమాగమ సుఖాప్తికి నోఁచమి నెంచి కుందెదన్. ౨౩

ఆ. ఇట్టి మాటలిప్పుడే నాడుకొనుటయు
ననుచితంబ వారవనిత పలుకు
లిచ్చకంబులనక యెవ్వారు నమ్మెదు
రదియుఁగాక ద్రష్టమన్యవాంఛ. ౨౪

అని లజ్జాశోకంబులడర నవనతముఖియైయున్న కలభాషిణికి సమాధానముఁ జెప్పి నిదర్శనముగా సుగాత్రీశాలీనుల చరిత్రంబు వక్కాణించి మణికంధరుం డాపెకుందును బోఁగొట్టెను. ఈ నిదర్శన మేలయనఁగా, ఒకరిపైఁ బ్రేమయుండినను వారేదేనొక శ్రోత్రరీతినుండినంగాని మతిసమ్మతింపదను శృంగార న్యాయమునకు! ఇది శృంగార విశేషములకుం జేరిన భావప్రకృతి. భార్యయందైనఁగాని, సర్వకాలముల సర్వావస్థల నేకరీతియగు మక్కువందాల్చినవారుండరు. ఏదేనొక విలాసము వహించి యొప్పారిరేని తమి తనంతట రేఁగును. మనుష్యులును బలుమూర్తులు గలవారయని యంటిమిగదా! హృదయ వికాసముం గలిగించునవి యుండుఁ గొన్నిమాత్రము. మఱి. ఒకరికొక మూర్తిపైఁ బ్రీతి. ఇంకొకరి కింకొక మూర్తిపైఁ బ్రీతి. రేఖలు, లీలలు, విలాసములును తత్తద్హృదయసాగములప్రకారము సుఖదుఃఖావహములగుట వింతగాదు.

అయిన నొక్కటి. పైఁజెప్పిన న్యాయము ఏకపురుషునందును వివిధకాలముల స్త్రీలకు రాగము మాఱుచుండుటకు హేతుభూతము. ఒకనియందలి ప్రీతి వానిమూర్తి ననుసరించి హెచ్చుట తగ్గుట తెలిసెను. కాని కలభాషిణి వృత్తము వేఱు. ఏకకాలమునందే యిరువురియెడఁ జిత్తము హత్తినట్లున్నది. ఇది భావ్యమా? అభావ్యమా? మనసు ఒకేకాలమున నిద్దఱిపై సమముగఁ బోఱునా? అనేకులపై

మోహముండుట నిజమా? ఇది కష్టతరమైన ప్రశ్న. మణికంధరుని వలచినది. నలకూబరునిని వలచినది. ఈ రీతి నిరుపురిమీఁద దుర్భరమోహముం బూనియుండిన యొక స్త్రీని చరిత్రముం జదువుటచే నెఱుంగుదును ఆపె యొవ్వరన, సుమారు నూఱు సంవత్సరములక్రింద ఫ్రాన్స్ దేశములో గణ్యయు విద్యాగంభీరయుఁ గానుండి వెలసిన 'లెస్ పినాస్' అనునామె. కాఁబట్టి యిట్టి వర్తనము అస్వాభావిక మనరాదు. అపురూపమనవచ్చును. అపురూప శృంగారముల సూచించిన సూరన్నయే 'రవిగాననిచోఁ గాంచెడు కవి'!

కలభాషిణియొక్క తదనంతరవృత్తాంత మింకను గొర వార్తము తేన శాపంబుఁ దలఁచికొని త్వరలో జీవంబు విడుచుటయ కర్తవ్యమని యెంచి సిద్ధునిఁజూచి, 'ఇంక జాగేల? నీఖడ్గము అకుంఠితోద్యోగము. రంభాశాపమును దానికి సహాయకారి. కానఁ ద్వరలోఁ గార్యంబుముగించి తత్ఫలంబగు సామ్రాజ్య సుఖంబు ననుభవింపుమా' యని ధృతిమైఁబలికిన సిద్ధుఁడు ప్రత్యుత్తరమిచ్చుచున్నాఁడు. 'నా భార్య నిన్ను ప్రేయఁగూడదని కాళికాదేవిపై యాన పెట్టి యుండుటచే మునుపే నఱుకఁబోయి యన్నిపాట్లఁబడితిని. ఇంక నామాటవలదు. ఈ కత్తిని మణికంధరునకిచ్చెదను. అతఁడు దానిని నీపైఁ బ్రయోగించి రాజ్యలక్ష్మీ మహానీ యుండగుఁగాక!" అట్లని మణికంధరుని నతి ప్రయాసమై

నీ క్రూరకర్మమునకు ననునుతుం జేసిన, కలభాషిణియు, కోరికోరి కాంచినవరుఁడు విధిప్రేరణంబునఁ దనకు యముఁడుగాఁగా కాలవైపరీత్యంబునకు చోద్యంబున, అప్రమేయశాంతియుం జెంది ధీరభావయై

వ. " . . . . . మణిస్తంభునకుఁ దదంగనకుం బ్రణామంబులు సేసి కన్నీళ్ళు గ్రుక్కికొనుచు 'నీకలంకపాటు తక్కిన భయమునకుఁగాదు సుండు, మిమ్ము నెప్పుడు గురుభావంబున నారాధింపుచుండ లేమికింగాని' యనుటయును సుముఖాసత్తియు 'నోయమ్మ మన నెమ్మనంబుల కూర్కి యింతటన పోయెనే మీఁదటనైన నీపతియు నీవుఁ గోరినట్లు మమ్ము గురుభావంబున నడుపుకొనియెద' రనినఁ గలభాషిణి పునః పునః ప్రణామంబు లాచరించి ముకుళితకరకమలయుగ మ నిట్లనియె"

(ఆ. ౪. ప. ౧౭౭)

శా. పూతంబైన మదీయపుణ్యయుగమో పుణ్యంపుటిల్లాల నీ
పాతివ్రత్యము చందముల్ వినమదిల్ భావింపఁగా నెట్టి దు
ర్నీతిప్రక్రియ వారికైనఁ గృపతో నీవిచ్చినంగల్గు నా
పాతివ్రత్యము నాకుమీఁదనయినం బ్రాపింప దీవింపవే! ౧౭౮

క. నావుడుఁ బరమ పతివ్రత
వై వెలయుము రాజ్యవైభవానుభవం బెం
తేనర్తిల్లఁగ నలరుచుఁ
బ్రోవుఁడు మముబోంట్ల నీవిభుండును నీవుల్. ౧౭౯

ఉ. అట్టిటులఁ జంచలింపకు దృఢాత్మత నుండుమటంచు నిప్పుడే
మిట్టివి నీకుఁదెల్పునవియెయ్యవి పెండ్లికిఁ బోవునట్లు గ
న్పట్టుచు నున్నదాన వతిభవ్యవికాసమునుబ్బుఁ జూడ నిన్
గట్టిగనెన్న దేవతవుగాని నరాంగనవే మృగేక్షణా! ౧౮౦

చ. అని తనుఁబల్కు నజ్జలరుహాక్షిని వీడ్కొని సిద్ధువక్రముల్
గనుఁగొని నన్ను నంపితిరె ఖడ్గమునిచ్చెదరే యటంచు నా
తని బలుకత్తిఁ బుచ్చుకొని తామణికంధరు చేతికిచ్చి యో
గ్యనియమ గంధమాల్యవతియై కలభాషిణి నిర్విశంకతోన్. ౧౮౧

శక్తికి నభిముఖయై కూర్చుండెను. స్వహస్తముతోఁ గత్తి నిచ్చుటేల? ప్రియునకు మనస్సంకోచము వాయుటకొఱకు సత్యమైన వలపునకు లక్షణమేయిది. తమకెన్ని వచ్చిననేమి? ప్రియులు సుఖంబున్నఁజాలు ఖడ్గప్రదానానంతరము అతని మనసు గట్టిపడునట్లుగా

క. "సమరంబున నెదిరించిన
సముదాహిత వీరవరులఁ జక్కడఁచుటనై
జము మీకునిట్టి యెడలన్
భ్రమయక చేమఱకునికి పటు శౌర్యమునన్." ౧౮౪

అని తెలిపి కలభాషిణీదేవి యతనిచేత నిరస్తజీవ యాయెను!!

ఈ పాత్రముంగూర్చి యింత విపులముగ వ్రాసినం దుకు క్షమాపణార్థమై కారణములఁ జూపవలయు. సూర నార్యుని వాఙ్మయ సృష్టినెల్ల నియ్యది నిస్సంశయముగ నగ్ర

గణ్యము. దీనికిం దీటగు చరిత్రమింకెయ్యదియు లేదు. శృంగార వర్ణనముం జేయుటలోను ప్రబంధముల వెఱ్ఱు లేవియు వేయలేదు. నలకూబరునికై నాలుగేండ్లకన్న నెక్కువగఁ గాచియుండెఁగదా! ఇష్టముండినఁ జెలికత్తెలతో మొఱలిడుట, ఉద్యానవనములోఁ బడిపొరలుట, చంద్రాదిదూషణము, ఇట్టి వికారచేష్టలన్నియుఁ జేసినట్లు చెప్పియుండవచ్చును. కాని, కవి యీ విషయములఁ దలంపనైన లేదని తోఁచుచున్నది. భావనాశక్తిమై వ్రాయువారలకు మనసు పాత్రములయందు లీనముగనుండుఁగావున సహజరాగములు దప్ప నితరములు దట్టవు. మఱియు, నీ శాస్త్రీయ ఘోషలకు మధురలాలసాచరిత్రములోఁ బ్రవేశమున్నది గాన నిట ననవసరములని కవి వానిని విడిచిపెట్టెనేమో! కారణము లేమేటనైనఁ బోనిండు! మనకు లభించినదన్ననో మనసువశముగాకపోవునంత రమణీయమైన కథ. కవికిఁ గృతజ్ఞతమై నమస్కారము, రసికులకు స్వాగతమును?

శోకాంతవర్ణన లనిషేధ్యములు

ఇంత మంచి సుందరమగు పాత్రమువర్ణనము శోకాంతముగాఁజెప్పుట కిష్టము లేమిచేతనో, మఱి, మనకవులకుం బట్టిన దౌర్భాగ్యమతంబు కతంబుననో, మణికంధర ఖండిత మస్తకయగు నా లలనాశిరోమణి కాళికాదేవి కరుణాప్రసాదంబున "పునస్సహిత మస్తకయు, నిజపురీవర్తినియునై తన బంధుమిత్రాదుల నలరించుచు" సుమారు రెండు సంవత్సర

ములుండి పిమ్మటఁ గాలప్రాప్తమరణ యాయెనని కరుణ రసప్రధానమగు నీ భాగముయొక్క సొంపును గవి వికలం బొనర్చి యుండుట భాషాదుర్దశగదా? రసములలో శోకము నొక్కటి. ఇదిమాత్రము నిషేధ్యమననేల? శోకప్రధాన ముగా వ్రాసినఁ గవిత్వము మొక్కపోవునా? మొత్తముమీఁద భారతమే శోకాంతమఁట! దానికి రాని తక్కువ పేరు వానికి వచ్చునా?

కల్పనాస్ఖాలిత్యములు

ఇట్టి యుద్గ్రంథమునఁ గల్పనాభంగము లుండుట చింతనీయము! కృష్ణుని భార్యలయొద్ద కలభాషిణి నారదులు గానవిద్య నేర్చికొనుటకై కడపినకాలము నాలుగేండ్లు. మణి కంధరుఁ డంతఃపురములోనికిఁ బోఁగూడదని యేమో, వానికి ప్రయాస మావంతయులేకయ "పుండరీకాక్షుని యనుగ్రహవిశేషంబున సకల రహస్యసంగతవిద్యాసంపన్న తచేత నారదకలభాషిణులయట్ల యత్యధికుండవు" భాగ్యము లభించినది! ఈ యనుగ్రహ విశేషముం బ్రయోగించి వారికిని సద్యఃకాల విద్యామహనీయత ఘటించి కలభాషిణి విరహకాలమును మట్టుచేసి యుండరాదా? కృష్ణకాంతల శిక్షయు ననావశ్యకమాయె. దానితోఁ గల్పనయు న్యూన మాయె.

తృతీయ భాగము

మొదటి ప్రకరణము

మధురలాలస ప్రభావతియొక్క యక్క

ఈ పొరఁబాటులం గూర్చిన ప్రస్తాపములు ముఖ్యములుగావు. ఏలన, షష్ఠాశ్వాసము తుదమొదలు క్షమార్హములుగాని దోషములు దట్టముగ నుండుటచేత, వీని చింత యావశ్యకము. మణికంధరుఁడు కళాపూర్ణుఁడై పుట్టి రాజ్యముఁ జేయుచుండఁగా, నతని కొలువుకూటములో శిశువగు మధురలాలస యొకనాఁడు హారముయొక్క నాయకమణి హృదయస్థమగుటఁ జేసి యా కళాపూర్ణాదిపాత్రంబుల చరిత్రంబు లత్యద్భుతంబున మందలించినది రాజుగారి కీవలికే యభినవకౌముది భార్యయాయెను. మధురలాలస తాను గళాపూర్ణుని భార్యయగుటకై యవతరించినదని తెలిపెఁగావున

> క. "ఆమధురలాలసా కథ
> లేమియు శుద్ధాంతమునకు నేగకయుండన్
> భూమిపతియడఁచె నభినవ
> కౌముది వినవేలయనుచు ఘనయత్నముతోన్."
>
> (అ. ౬. ప. ౧౯౦)

ఇది హాస్యమా? ప్రయోజకమా? ఎట్లును అభినవకౌముది కోపతాపములు లేక ద్వితీయ వివాహమునకు సమ్మతించుచున్నది గావున నీ జాగ్రత్త యేమియుఁ బనికిరాదు!

ఇఁక కవి శృంగారమునకు దిగి పాడుప్రబంధధోరణికిం జేరిన ముఱికినంతయు నింపైన సుగంధమని దట్టముగఁ బట్టించుచున్నాఁడు! మధురలాలసకు యౌవనము వచ్చినది. కవితకు వచ్చినదిముదిమి! యౌవనము వచ్చుసరికి కవికృతమైన యంగాంగ పరీక్షయు వచ్చునుగదా! ఆయమ్మ యాకాలమునఁ బెద్దతోఁటవలె నుండెనఁట!

సీ. గురుతరస్తనకేళిగిరులును గంభీర
  తరనాభి కూపమతల్లికయును
జారరోమాళి శృంగారధారాసర
  ణియు నంగుళీకిసలయచయంబు
సుకుమారబాహు వల్లికలును రమ్యోరు
  కదళికాస్తంభ ప్రకాండములును
సులలితాధర బింబఫలవిలాసము పుష్ప
  విసరపాండిమహాసవిభ్రమంబు

గలిగి పలుకులు శుకపిక కలకలముగఁ
గుంతలంబులు మధుకర కులముగాఁగ
శంబరారాతి కేళీవనంబుఁ బోలె
సుదతియపుడొప్పె నొక వింతసోయగమున.

(ఆ. ౬. ప. ౨౦౬)

ఈ సంగతి యీ మాత్రము. ఇఁక నింతలోఁ గళాపూర్ణుఁడును అభినవకౌముదీ విహారముల చేతను రాజకార్యముల చేతను మధురలాలసను మఱచినాఁడఁట! అన్ని యుద్భ

తముల శిశుప్రాయమునన చెప్పినదానిని, సమీపమున సామంతు నింటఁ బెరుగుదానిని మఱచుటయఁట! ఈ మఱపునకుఁ గారణము కళాపూర్ణునియొక్క బుద్ధిహీనతగాదు, మఱి కవియొక్క! ఈ మఱపురానిచో శాస్త్రీయమగు హొయిలున కవకాశముండదు. అలంకార క్రమములు వేయకుండినఁ గావ్యము చెడునను భ్రమచేత రాజునకుఁ భ్రమఁ బెట్టినాఁడు! ఈ చిత్త శోషరాజుదిగాదు. శాస్త్ర విధేయతంబూనిన కవిది.

ఆ మధురలాలసకో యుద్రేకము బలమైనది! ఉద్రేక లక్షణాలన్నియు మశూచి కాఁక తాకిన లేచు బొబ్బలవలె నంకురించినవి! మొగము తెల్లఁబాఱినది. ఉండు కొంచెము మతియుఁబోయినది! "ఒక్క తెఁ బిల్వఁబోయి మఱియొక్క తెఁ బేర్కొని పిల్చు" నఁట! "ఒక్కెడ కేగఁ జూచి మఱియొక్కెడ కేగు" నఁట! భోజనశాలకుఁ బోవుదమని లేచి పెరటితట్టుకు మఱచినట్లు వెళ్ళునేమో! పురుషునితో మాటలాడి యుండకపోయినను,

సీ. ఏమి కన్నులఁ గన్న హృదయేశు రూపంబు
దోఁపక యదిమున్న దోఁపకుండె
నేమి వీనుల విన్న హృదయేశు మధురోక్తి
దోపక యది మున్న దోపకుండె.

(ఆ. ౫. ప. ౨౧౪)

ఈ గారిడీతంత్రము అమానుషము' పైశాచముగా వచ్చును! ఇట్లనేక విధంబుల శేవగలును జాగ్రత్సుషుప్తులఁ గామవికారముల నాచారమురీతిఁ బ్రకటింపఁ జొచ్చినఁ జెలికత్తెలు వెఱఁగంది మామూలు విచారణలకు ప్రారంభించిరి. ఈ చెలికత్తెల విషయమై నాకొక సందేహము! యజమానురాలి యుడుకుఁ బొడఁగను వేళలఁ దమకుఁ గొంత కాఁక యెక్కదా యేమి? వీరి కష్టము నరయుకవులు లేరుగా! వారు ప్రతిక్రియఁజేయుటకై, శుద్ధముగ నుపయోగములేని చికిత్సయని ప్రబంధములవలన దెలిసియుండియు నామె నుద్యానవనమునకుం దోడ్కొనిపోయిరి.

ఇదిమొదలు కవి గతానుగతికముగా వ్రాయుచున్నాఁడేగాని, స్వబుద్ధి పొంతఁబోవునట్లు గానము. భావములు నవ్యములుగావు. రుచిరములుఁగావు. పాట ప్రాఁత. మాట రోఁత! మధురలాలసయుఁ దత్సఖులును జలక్రీడ లాడిరి. దేహమునకు శాంతమేమోగాని, యాడినతరువాత "నవీన వస్త్రాభరణ గంధమాల్యంబుల నలంకృతలైరి." సరియే కాని, ఈ భారమగువస్తు సామగ్రి నెవరు మోచికొనితెచ్చి సిద్ధముగా నిడిపోయిరో పత్తాలేదు! అప్పుడు రాజుగారు తటుక్కునవచ్చిరి. ఇఁక రాకున్న వారికీకన్నె జ్ఞప్తికి వచ్చు టెట్లు? తిక్క బలియుటెట్లు? సరి. పరస్పరదర్శనము సంప్రాప్తము.

చ. “వినుకలిచేతముఁ మిగుల వింతలుగాఁగ విరాళిఁ గొన్నయ
వ్వనజదళాక్షి యట్లు దనవల్లభురూపముఁ గన్నులారఁగాఁ
గనుఁగొని . . . . . ”
(ఆ. ౬. ప. ౨౩౯)

అనియున్నది. దీనికిఁ బూర్వమెన్నఁడును జూడకున్నఁ గళాపూర్ణుఁడని గుర్తెట్లుగలిగె? మఱియు,

“ఏమి కన్నులఁగన్న హృదయేశు రూపంబు
దోఁపక యదిమున్నె దోఁపకుండె.”

నని పూర్వమే యాపె యుపద్రవముంగూర్చి వ్రాసి యుండుటంజూడ, కన్నులఁ జూడకమున్నె హృదయమున రూపమావిర్భవింపఁగల వింతమానిసియో యీ మదాశయుపుత్రి! లేక, చిత్రఫలకమేమైన నీ వినోదముల కాధారముగా నుండునా? ఊహ్యాము. కళాపూర్ణుఁడు “ఎట్టకేల కుఁ జనియెఁదిరిగి.” ఈ ముద్దరాలును తియ్యని పచ్చిపచ్చి యోజనలకుం దొడంగుచున్నది! “ఇంకెట్లులమ్మా! తోఁట కేల పిలుచుకొని వచ్చితిమే? ఆరామములు మన్మథపక్షములు గదా!” యని చెలులెల్ల నొక చిన్నలెక్చరు వేయునప్పటికి, నంగనామణియు,

క. . . . . . అంగజతాపం
బునసుస్సురుస్సురనుచుం
గనురెప్పలు దేలవైచి కడుసొలయుటయుఁ.
(ఆ. ౬. ప. ౨౪౯)

ఇఁక శైత్యోపచార ప్రారంభము।

సీ. విరిదమ్మితావులు వెదఁజల్లు కొలనిచెం
  గటఁగమ్మ పన్నీటి కాలువలును
గడునివతాళించుక ప్రపుటవఁటుల
  యిరవులఁ బూవుఁ జప్పరముఁ బన్ని
వట్టివ్రేళ్ళను పడిగట్టి శ్రీగంధపు
  టసలున మెత్తి తదంతరమునఁ
కర్పూరవేదికఁ గావించి చల్లని
  చెంగల్వరేకుల సెజ్జఁదీర్చి

చిలుకుదేనియతోడి గొజ్జంగిపూవుఁ
దలగడయమర్చి యందు నా జెలువనునిచి।
జగతిఁగల సర్వశైత్యోపచారవిధులు
సలిపిరందును గడఁగాన కలసిరంత.

(ఆ. ౬. ప. ౨౫౧)

ఈ పద్యములోని విశేషములఁ దలఁచుకొన్న నాకు గుండియ లదరుచున్నవి। అబలలు, పూఁబోండ్లు, కోమలాంగులు అనఁబడు సఖీజనములు, గున్నయేనుఁగులవంటి యిరువదిమంది కూలివాండ్రు చేయుటకన్న నెక్కువపనిని ఇంతత్వరలో నేలాగునఁజేసి ముగించిరి। కార్య మెంతసేపు పట్టెను? అదివఱకు నంగనామణి సొలసియే యుండెనా? లేదా, శాస్త్రప్రకారము మంచిలగ్నము చూచి యీ వేళకు నామె మూర్ఛపోవునని యెఱింగి యీ క్రియ

లన్నియు ముందునాఁడే తయారుచేసి యెదురు చూచుచుండిరా? నాకుంజూడ నిట్టి పద్యములు కవులు తొలుతనే వ్రాసిపెట్టి పిమ్మట నదియే కథయైననేమి, యక్కడక్కడఁ దూర్చి పెట్టుదురేమో!

ఉ. . . . .
. . . . . పూవిసనకట్టులు గొజ్జఁగినీట మాటికిం
దొప్పఁగఁదోఁచి వీచుచుఁ జనుంగవపై, నరకాళ్ళఁ, బాణులన్
లప్పులుగాఁగఁ జందనమూఁదుచుఁ గొందలమందిరందఱున్. ౨౫౨

ఏమి సౌకుమార్యము! ఇతరులు దేహమునట్లు తోముచు గుఱ్ఱమును మాలీసుచేసినట్లు చేయుచుండఁగా సంతోషముచే సకిలింపుగుణము గలుగవలయునన్న పాళ యగాండ్ర యిండ్లలో నవతారమెత్తవలెను! లేకున్న నట్టి గడుసుఁదనము అరిది. ఆ సంగతి యట్లుండనిండు. ఈ యుపచారములు నపచారములు జరుగుచుండఁగా నందఱు 'గప్ చుప్' అని యూరకుండిరి. మాటలేదు. అవి ముగిసి నదే మౌనముద్రఁ బగులఁగొట్టి చిలుకలవలెఁ గిలారింప సాఁగిరి. "అయ్యో! అమ్మా! చెప్పకే నీ కష్టము ప్రాణసఖితో" నని యొక నంగనాచి ప్రార్థింపఁగా (ఇదివఱకును ఏమియుఁ దెలియకయా యిన్ని దోహదములు చేసియుండుట?) మధురలాలస యెట్లో మనసును నాలుకను దృఢపఱుచుకొని యేమనుచున్నది.

ఉ. ఓహరిణాక్షి నీకు నిఁక నుల్లము దాఁపఁగ నేటికిన్ జగ
న్మోహనమూర్తితోడ నిటు మున్నొకనాఁటినిశన్ విలాస స
న్నాహము మీఱ మద్విభుఁడు నాకలలోపల వచ్చి తేర్చెఁగా
మాహవకేళి నద్భుత సుఖైకమయుంబది యేమి చెప్పుదున్! ౨౬౧

కులస్త్రీలు! ఒక్క యుషాదేవి చూపిన దారిం ద్రొక్కు గొత్తెలు! ఇట్టియేద్పు నెవ్వరైన నొక రేర్చిన సంగీతముగా నుండును. అందఱుఁ గూసినఁ బెద్దరోఁత!

"ముదితా చలువలు గిలువలు
మదికి నసహ్యంబులతని మన్ననఁ దక్కన్."

అనుచున్నది. అట్లయిన మొదలే యేలవలదనరాదు! చెలికత్తెలు గసెత్తునట్లు శ్రమపడుచుండఁగా హాయిగాఁ బండుకొని వేఁడుక చూచుట న్యాయమా?

ఇట్లు వీరు రహస్యమున మాఱ్చుకొనుచుండఁగా వెన్నెల యయ్యెను! నాకు నిక్కడ నొక ధర్మసంకటము. ఈ కాంతాతిలకముల జాతియేమి? ఏమి విపరీతపుఁ బ్రశ్న యందురో! నాశంకకుఁ గారణములఁ బరీక్షింపుఁడు జలక్రీడకు నెంతయాలస్యమైనను మధ్యాహ్నము ౧ గంటకు వచ్చియుండును, ఆ వెనుక చలిదుర్భరము గావున. పుష్పాపచయాది లీలలు, అంగనామణియొక్క వికారములు, సఖీజన రాజకుమారికా ప్రశ్నోత్తర మాలికలు, ఇవి నడచు సరికి చంద్రోదయము. పున్నమనాఁడనుకొన్నను ఆరు

ఆరున్నర గంటలకుఁగదా చంద్రుఁడు పొడచూపియుండును. ఇంత సేపు ఎదిగిన కూఁతురు, భోజనాదులకురాక, యెక్కడనో ద్రిమ్మరుచున్న, హిందూజాతి తల్లులు ఆయుధపాణులై, అనగా పొరకను చేటను దాల్చి, రోయుటకు వెన్నాడక యూరకుందురా? అట్లుండ రేని వారు హిందువులా? మనువు నోటిలో మన్ను వేయుటకుఁగదా యిట్టి దురాచార వర్ణనము.

ఉ. కావునఁ జంద్రుఁ గింద్రుఁ జిలుకం గిలుకం బికముం గికంబు నన్
గావుమటంచు వేఁడకుఁడు నా బ్రదుకీరిపుజాతికిం బ్రియం
బే విసరింపమీకుబలెఁ బెంచినవారికి ముద్దుగాక పె
న్బాపురుఁ బిల్లికిన్ గలుగునా మొగమాట యొకింత చిల్కపైన్. ౨౭౧

ఇది కడమాట. బజారులో తుదబేరమందురే యట్టిది!

చూడుఁడు! వేశ్యయైన కలభాషిణి రాజకులములోఁ బుట్టినందున నెట్టియపభ్రంశములకుం బాలాయనో! మన దేశములోఁ గులస్త్రీలకన్న వారకాంతలే యుత్తమలనుటకిది యొక తార్కాణము. మన యిల్లాండ్రు ఏ కత్తెలుంగారు, వంటకత్తెలు దప్పు! విద్యయు, స్వయంవరణముఁ గలవారు గాన, గణికలు సౌమనస్యమున మిన్నలు. తక్కినవారి బ్రదుకెట్టిది? శారీరక క్రియలచే నిండినది. ప్రబంధముల లోని శృంగారము ఉత్తమమైనదిగాదు, ఈ నాయికా నాయకులు తాపోద్దీపిత దేహులుగాని బాధిత మానసులుగారు.

బాల్యవివాహవినాశిత దేశములో శంగారానుభవము లాఘవమగు టేమివింత!

సంభాషణలమూలముగ కథకు నభ్యుదయపరంపరలఁ గల్పించుట మొదలగు కవితాశక్తులన్నియు నీ ఘట్టములకు వచ్చుసరికి సూరన్నలోనుండక లేచిపోయినట్లున్నది. ప్రతిభ లేని పాడుకొంప లీ భాగములు!

అంగనామణినిబట్టిన బాధలన్నియుఁ బురుషనృపభునిఁగూడఁబట్టినవి. ఆతఁడు నర్మసచివు నొక్కని సంపాదించి గుసగుసలాడెడిని. కాఁబోవు నిల్లాలి యంగాంగముల వినువారికి నోరూరఁగ వర్ణించుట మొదలగు దుస్సహతంత్రము లెన్నియోఁ గలవు ప్రియురాలిని దుష్యంతుఁడు మఱచినట్లు కాళిదాసుఁడు వర్ణించిన రీతితోఁ గళాపూర్ణుని మఱపుకథను బోల్చిచూచిన, నీ సందర్భమున సూరన్న కవిత్వమెంత శుష్కించినదో తెలియును. పెండ్లివ్యాపారము. ఆపె చెలికత్తెలు ఈయన సచివులతో మంతనమాడి ముడిగట్టుటకు నేర్పాటులు చేయుదురు! వలపనుదానిని ఉప్పును బప్పునుంబలె నంగడిలోఁ బెట్టి విక్రయించుట యీ కర్మభూమియొక్క మహాధర్మము! కళాపూర్ణుఁడు మధురలాలసను బెండ్లియాడుటకై యభినవకౌముదమ్మగారి యనుమతిని దానే కోరుటలేదు, రాయబారులను బంపుచున్నాఁడు! భార్యాభర్తలకును మధ్యస్థమా? ఏమీ! భార్యకు పురుషుని

పడుకలో నేగదా పాలు! మనసులో లేదుగదా! అభినవ కౌముదికి సరేయనుటఁదప్ప నింకే స్వాతంత్ర్యమున్నది! వివాహము తటస్థమయినది. ఆ శుభకార్యములో "పెద్ద పూఁబోండ్లు" రాకపోకలు చేసిరఁట. ఎంత ముసలివారైనను బూఁబోండ్లే! శైలియు వ్రాలుచున్నది. పెండ్లియైనది.

అసహ్యశృంగారము

వధూవరు లేకాంతముఁ గోరుచున్నారు. చెలికత్తెలు గొంచెమున వదలరు. కవియన్ననో యీ సమయమునఁ బ్రాణముఁబోయినను వారిని వదలఁబోఁడు? ప్రథమ విఘ్నము తల్లి. అవసరముగా వెళ్ళుచుండఁగా కూఁతును నిలఁబెట్టి యామెకు బుద్ధివచ్చునట్లు ఇచ్చిన యుపన్యాసము ఒకగంట దీర్ఘము! అంగనామణికి తాల్మిలేనితమిచేఁ గలిగిన తబ్బిబ్బులఁజూచి జరగఁబోవు తమాషాలందలంచి, చెలికత్తెలు హాస్యముఁ జేయుటలో వినియోగింపఁబడిన కాలము అరగంట. అలంకార రచనాదులకుఁ బట్టిన కాలము ౨ గంటలు! ఇక్కడ కవిప్రయోగించు వైరస్యము తూనిక యగణ్యము! ఎట్లనఁగా:

ఒకటి. నిష్కారణముగ మధురలాలస "విభుఁడేఁక వచ్చుటెప్పుడో? విఘ్నము లేమయినఁ ఘటిల్లునో" యని తన కే ద్రోహముఁ జేయని యభినవకౌముదిమీఁద దోషారోపణకుం దొడఁగుచున్నది! ఈ యమ్మ దౌర్భాగ్యపు విరా

ళిని కలభాషిణియొక్క యుదారచరితంబుతో నుపమించి చూడుఁడు! పిమ్మట 'మెడికల్ కాలేజ్ ప్రొఫసర్లు' రీతిని పురుషుని శరీరభాగముల వర్ణించుచున్నది! చాలీచాలని దానికి తన పరువేర్పడునట్లు బాగుగ విడఁదీసి యాడెడు మాటవినుండు!

తే. "ఆ లలిత చరణములొత్తు కేలు గేలు
కోర్కెఁ దవ్వక్షమునఁ జేర్చు కుచము కుచము
దివుట దద్రహఃకథ విను చెవులు చెవులు
పలుకులేల తద్రతిఁగన్న బ్రదుకు బ్రదుకు."

(ఆ. ౩. ప. ౧౧౨)

పోతనామాత్యుని "కమలాక్షు నర్చించు కరములు కరములు" అను మహోత్తర పద్యమునకుఁ బట్టిన గ్రహచార మా యీ యనుగమనము!

రెండు. చెలికత్తెలు దాచ్చుటకై వచ్చుట. అంగనామణికి సిగ్గునుగూడ వచ్చుట! ఆ సిగ్గు పలాయన మామాడ్కి వారు,

మ. పొదిరైయైనాథులుదారుఁ గాపురములింపుల్ మీరగాఁ జేయుచున్
గదిపెంద్రేసి కొమాళ్ళఁ గూతులఁ దగన్ గన్నట్టి యిల్లాంద్రకున్
మదిలజ్జాదులులేవె నీకుబలె సన్మానంబుతోఁ జక్క వ .
చ్చెదో యేమేఁగలదే. . . . . .

(ఆ. ౩. ప. ౧౧౯)

ఇత్యాది వివరములఁ దెల్పుట, వినువారి చెవులు వ్రయ్యలగుట, మొదలగు దారిద్ర్యయములు గొన్ని!

మూఁడు. అంగనామణి యీరీతి నుండఁగా రాజు గవాక్షమూలమునఁ జూచి యుత్కంఠ యాఁపలేకపోవుట. దానికి గుర్తుగా నింకను గాలము వ్రయమగునట్లు, ఆపె తన్నుంగూర్చి చేసినమాడ్కి, యాపె యంగములను మిక్కిలి విమర్శతో వర్ణించి ఋణవిముక్తుఁడగుట! నీరసములైన యుపమలు ఉత్ప్రేక్షలును భార్యపై దీపింపఁజేయుట.

క. "సమదాక్షి మీనసంచా
రమునఁ దోలంకుచును ముఖసరస్సున లావ
ణ్యము వెళ్ళిపాఱఁ గ్రేవల
నమరించిన పిల్లకోలఁకులంగన వీనుల్!" ౧౨౮

పిల్లకోలఁకులఁట! అందులోనుండి కాలుద్రవమో?

చ. అనుపమముల్ రతిస్మరులయాటలు నర్మములంచుఁ గప్పిపె
ట్టిన పువుబంతులీ సతికడింది చనుంగవ తేంట్లు క్రేవలం
దునుజొరకుండఁ జేరిచిన తోరపు సంపఁగి పూవుదండలీ
వినుతభుజంబు లాతుదల వేడ్కకు నిడ్డ చిగుళ్ళు హస్తముల్. ౧౩౦

ఉ. మానవతీవతంసము సముగ్రనితంబ విజృంభణంబు జం
బూనదిసైకతస్థలము పొల్పువహింపుచుఁ జాలనొప్పెడున్
పై నునుమంచుగోలె వెలిపట్టు మడుంగు బెడంగుచూపనా
పై ననసాఁగ సాళిపరిపాటి నుపంచిత కాంచి మించఁగన్. ౧౩౨

తే. అతివ తొడలును జఘనంబు నరసిచూడఁ
గొమరు మీఱెడు జమిలి తొండముల శిరసు
తోడి వలరాచవారి యద్భుతపు హస్తి
యగ్రభాగంబు చూపఱకాత్మఁ దోఁప. ౧౩౫

చ. జలజదళాయతాక్షి మృదుచారుతర ప్రపదద్వయీ విని
ర్మలరుచి ఘుల్లుఘుల్లుమను రత్నపుటందెలమ్రోఁత జృంభణం
బుల సవకంపుఁ గచ్ఛపము పొల్పునదల్పుచు గెల్పుఁ దెల్పెడుఙ్
గలుగునె యింక దీనికి జగంబులలో నుపమాప్రసంగముల్. ౧౫౫

ఇత్యాది. ఈ పద్యములంబట్టి విచారింపఁగా నేర్పడిన విషయములివ్వి: రాజుగారి దూరదృష్టిబలము. అంగనామణి చీరయేమాయెనో! ఆపె గిర్కీలు కొట్టుచుండెఁ గాఁబోలు! లేకున్న నన్నిభాగములు గనుపడునా? ఈ యుపమ లెందునకుఁ బనికిరావనియు, రోఁతలనియు వేఱుగఁ జెప్పవలయునా? వీనికింగారకము భావనాశక్తిగాదు. మఱి సామ్యశక్తి. అందులోను కుయుక్తి. కాముకుడఁట! తాళలేనివాఁడట! ఆలోచనాశక్తిచేఁగాని తట్టనట్టి పదునెనిమిది పద్యములం గొణిగెనఁట! రసాభాసమన నిదియే గదా!

ఈ పాండిత్యమంత్రములు ముగించినపిదప చెలికత్తెలు—వీరొక తడాఖా—ఆపెకుఁ గరణీయముల బోధించి, కళాపూర్ణుని "చరణంబు విలాసిని యూరువులందుఁ జేర్పఁ జేసి బలిమి నావనజముఖిచేతఁ బట్టించి సంవాహన మొనర్పఁ జేసిరి" (ఇది శుద్ధముగ అనావశ్యకము అసహ్యమును!)

అయ్యో! మృగప్రాయశృంగారమా! ఈ చెలికత్తెలు మన్మథుని పురోహితురాండ్రు!

ఈ యెడారువంటి కవిత్వములో,

తే. వరునిచిట్టంపుఁ జేఁతలఁగరముప్రేమ
మెఱపుపోలెఁ దళుక్కన మెఱయుఁగాని
నెలఁత సిగ్గను మొగిలులో నిలువలేద
యిదియు మిక్కిలి నింపయ్యె నతనిమదికి.

(ఆ. ౭. ౧౫౪)

అను పద్యముమాత్రము సూరనయొక్క నైజప్రభావమును సూచింపఁ జాలినంత రమణీయముగానున్నది. తక్కినవి భావశూన్యములు.

ఈ యాశ్వాసములంగూర్చి విశేషముగఁ జర్చించుటకు నాకిష్టము లేదు. సామాన్య ప్రబంధముల యట్టుల యవి నిరర్థక పద్యపూరితములు. కల్పనాశక్తి యేదిక్కునఁ బోయెనో! సంభాషణచాతుర్య మెందుఁ గ్రుంకెనో! ప్రతిభ యెటుమాయమాయెనో! అలంకారాది శాస్త్రములయందలి మూఢభక్తి పటుతమము!

తుచ్ఛశృంగారములకు హేతువులు

స్త్రీవర్ణన చేయుటకు మనకవులకుఁ దెలియదుగాఁ బోలు! కారణమేమన ఇంటిలోనుండు రసములు జిహ్వాకే

గాని మనసునకు వికాసము నిచ్చునవిగావు. బాల్యవివాహము, విద్యావిహీనత యిత్యాది దురాచారహేతులగుటం జేసి యిల్లాండ్రు సరసములకుం బనికిరారు. ఇఁక సరసములకుఁ దగినవారు దానిని జీవనోపాయవృత్తిగా నాశ్రయించెదరు. వారియందు మఱుఁగు, మానము, జంకు, మర్యాద మొదలగు నుదాత్తగుణంబు లల్పంబులు. ఎట్టి హీనలయ్యుఁ గులకాంతలకన్న మేలగుటంబట్టి యేమొ వారికి 'భోగమువారు' అను పేరు గలిగె. తక్కిన యాఁడువారు భోగమునకుం దగరు. వారిం బ్రేమించుట దానధర్మము. జన్మపరిత్యాగతుల్యము!

భారతకవుల శృంగారవర్ణనము దివ్యము

పచ్చిపచ్చిగా వ్రాయుట శృంగార మెన్నఁటికిఁ గానేరదు. మహాకవుల శృంగారవర్ణనములో శృంగారము, శుచితయు సమన్వితములు. ఆంధ్రకవు లద్దానికి విరుద్ధంబగు భ్రమనేల దాల్చిరో! అట్లు చేయుటకుఁ గారణము లేదు. ఏలన. ప్రామాణికకవులగు కవిత్రయమువారు మంచిత్రోవను విభావించియుండు కతమున. భారతములో గోప్యాంగవర్ణన శృంగారమునకై యెక్కడను జేయఁబడియుండలేదని తోఁచుచున్నది. నిదర్శనముగా

నన్నయభట్టు

ఆదిపర్వములోని శృంగారపద్యముల వినుఁడు

సీ. పలుకులముద్దును గలికి క్రాల్గన్నుల
    తెలుపును నలుదచన్నుల బెడంగు
నలఘుకాంచీపదస్థలముల యొప్పును
    లలితాననేందు మండలమురుచియు
నళినీలకుటిల కుంతలముల కాంతియు
    నెలజవ్వనంబున విలసనమును
నలసభావంబును బొలుపును మెలఁపును
    గలుగునగ్గిరికను . . .

(ఆది. ఆ. 3. ప. ౨౭)

క. కనకావదాత కోమల
తనులతఁ దనుమధ్యఁ గమలదళనేత్రను యో
జనగంధి నవనినాథుఁడు
గనియెను సురకన్యవోని కన్నియ నంతన్.

(ఆది. ఆ, ౪. ప. ౧౬౯)

ఉ. దానిశరీర సౌరభము దానివిలోల విలోకనంబులున్
దాని మనోహరాకృతియు దాని శుచిస్మితకాంతివక్త్రమున్
దాని విలాసముం గడుముదంబునఁజూచి మనోజబాణ సం
తానహతాత్ముఁడై నృపతి. . . .

(ఆది. ఆ. ౪. ప. ౧౭౦)

ఉ. చారుసువర్ణహాసి నవచంపకభూషయు సిందువారము
క్తారమణీయయున్ వకుళదామనతంసయునై యపూర్వశృం
గారవిలాసలీల యొసఁగం దన ముందటనున్న మాద్రినం
భోరుహనేత్రఁజూచి కురుపుంగవుఁడంగజరాగమత్తుఁడై.

(ఆది. ఆ. ౫. ౧౪౫)

సీ. త్రిభువనలక్ష్మి యేతెంచి యేకాంతమి
ట్లిలలోన యున్నది యివ్వనమున
గగనమణిప్రభ గగనంబునందుండి
యవనీతల ప్రాప్తయయ్యె నొక్కొ
శంభుండు లావణ్య సద్గుణ సముదాయ
మింప యిమ్ముగ సంగ్రహించె నొక్కొ
దీనియంగమును బొందిన యివ్వి భూషణ
శ్రీ యేమి పుణ్యంబుఁ జేసెనొక్కొ

యమరకన్యయొక్కొ యక్షకన్యకయొక్కొ
సిద్ధకన్యయొక్కొ శ్రీసమృద్ధి
సర్వలక్షణ ప్రశస్తాంగి యిది దివ్య
కన్యయగు ననంత కాంతి స్ఫూర్తి.

(ఆది. ఆ. ౭. ప. ౭౨)

చ. నెఱిగురులున్ విలోలసితనేత్రయుగంబును నొప్పులొల్కు వా
తెఱయును దీనియాననముఁ దెల్పఁ గరంబు మనోహరంబు నా
యొఱఁగిన యంతనుండి సతినిట్టి లతాలలితాంగిఁ జూచి యే
నెఱుఁగ సురేంద్రకన్యకలు నిట్టిరె రూపవిలాస సంపదన్.

(ఆది. ఆ. ౭. ప. ౭౭)

ఇందు తొడలు, మీఁగాళ్ళు ఇట్టి గూఢార్థములు లేవు. అవిగల సందర్భము లాదిపర్వమున మృగ్యములు.

ఎఱ్ఱాప్రెగ్గడ

ఎఱ్ఱాప్రెగ్గడ వ్రాసిన యరణ్యపర్వ శేషములో ద్రౌపదీహరణఘట్టమునందు పద్యములు:

ఉ. "నీలపయోదమండలము నిశ్చలలీల వెలుంగఁ జేయుచున్
వ్రాలెడువాలు క్రొమ్మెఱుఁగు కైవడిఁ దద్వనభూమియంతయున్
లాలితదేహకాంతి పటలంబులఁ జేసి వెలుంగఁ జేయున
బ్బాల వినీలకుంతల విభాసినిఁ జూచి సవిస్మయాత్ముఁడై."

(ఆది. ఆ. ౬. ప. ౫౭౧)

ఉ. లీలయొలర్పఁగా నజలతేఁజిగురాకును బోలె నొప్పు కెం
గేలు కదంబశాఖతుదిఁ గీల్కొనఁజేసి వసంతవిభ్రమో
న్మీలితబాలవల్లిక్రియ మేలగు చూడ్కులఁ గించి పావక
జ్వాలయపోలెఁ జిత్తము నిజం బెరియింపఁ దొడంగెఁ జూచితే.

(ప. ౧౭౭)

సీ. మృగనేత్ర దారుణ మృగసమాకులమైన
యివ్వనాంతరమున నేకతంబ
యిట్లు నీయునికికి నెయ్యది మూలమి
వ్వనదేవతవొ సురేశ్వరునితోడ
నలిగి ధరిత్రికి నరుగుదెంచిన శచీ
దేవివో హరియురస్థితిఁ దొరంగి
కేలిఁ గ్రుమ్మరు పద్మగేహవో భవదీయ
జనకత్వమున సముజ్జ్వలితుఁడైన

పుణ్యుఁ డేవంశమునవాఁడు పొలఁతి నీదు
జీవితేశ్వరుఁడగు సుఖజీవితాత్ముఁ
డెవ్వఁడబల నీ నామమై యింపు మిగులు
శబ్దమెయ్యది నాకు నిజంబుఁ జెపుమ.

(ఆర. ఆ. ౬. ౧౫౧. ప)

హనుమంతుఁడు సీతాదేవిని వర్ణించుట:

సీ. కన్నీరు జడిగొని క్రమ్మఁ బ్రాకెక్కిన
    కమ్రకపోల భాగములు గలిగి
యవశమ్మై యొరఁగిన యంగవల్లిక పొంత
    నున్న భూమీరుహమ్మూఁతగాఁగ
వెడలు నిట్టూర్పుల వేఁడిమిఁ బగిలిన
    యధర పల్లవము గారాకుఁబోల
దలఁపుల సందడి దండడించినఁ దాల్మి
    కదలు శిరఃకంపగతుల బెరయ

నున్న పుణ్యమూర్తి నుత్తమసౌందర్య
నవనతాస్య నార్తయైనదాని . . .
(ఆర. ఆ. ౭. ప. ౨౮)

తిక్కన్న

విరాటపర్వములోఁ దిక్కన్న వ్రాసిన శృంగారవర్ణనము అనన్యసాధ్యమని వేఱుగఁ జెప్పవలయునా? ఔచిత్యశోభితము. చెనటియగు కీచకు నట్టివాఁడు సైతము నిజంబగు ననురాగ ప్రభావంబునం జేసి కళాపూర్ణాదుల కన్న మేలుగ సిగ్గులేనివిధమునఁగాక గఱువతనంబునఁ బలికెడు. నిక్కమైన ప్రీతియున్న నేస్త్రీనింగూర్చియైన నసహ్యకరములగు వర్ణనల మృగప్రాయులుగానివారెవ్వరైనఁ జేయుదురా? విరాటపర్వములోని యా పద్యము లన్నియు నుదాహరించెద. లేకున్నఁ బక్షపాతమను న వాదమేగాక, తిక్కన తెలిసి వ్రాసినాఁడో గ్రుడ్డియే

వ్రాసినాఁడో యనియుఁ గొందఱు శంకింపనగు. అన్నింటిని నివేదించిన నేశంకకు నవకాశముండదు.

ద్రౌపదియొక్క సైరంధ్రీవేషము.

సీ. పఱమెయిల్గప్పినఁ బాడఱి నునుఁగాంతి
    గదలిన యమృతాంశు కళయనంగఁ
బెనుమంచుమీఁదఁ బర్విన వికాసము దప్పి
    చెలువుగుందిన సరోజిని విధమున
ధూమంబుపొదివినఁ దుఱఁగలి మెఱుఁగులు
    నలఁగిమాసిన దీపకళిక పగిది
ధూళిపైఁ బొరసినఁ దొంగలించుటమాని
    లావణ్యమెడలిన లతికమాడ్కి
గంధకారికావేషంబు గతనమూర్తి
యుజ్జ్వలత్వంబు మఱుఁగడయుండఁ బాండు
తనయమహిషి . . . . . .

(విరా. ఆ. ౧. ప. ౨౯౮)

నగరులోఁ జొచ్చు లీల:

సీ. పదతలంబులకెంపు పరఁగినతలముకుం
    కుమలిప్తమైన చందము వహింప
నంగంబునునుఁగాంతి యడరిన గోడలు
    వేదులు మణిమయవిధమునొందఁ
గనుఁగవమెఱుఁగులు గదిరిన ముందర
    పుష్పోపహారంబు పొలుపుదాల్ప
వేనలికప్పుపర్వినమీఁదు నీలదు
    కూలంబు మేల్కట్టు కొమరు వడయఁ

దానుజొచ్చినకతన మత్స్యక్షితీశు
నింటనిమ్మెయిఁ గ్రొత్తయొప్పెసక మెసఁగ
నమ్మహాదేవి యున్నెడ కల్లనల్లఁ
బాండురాజతనూభవ పత్నియరిగె.

(విరా. ఆ. ౧. ౩౦౮)

కీచకుని ద్రౌపదివర్ణనము:

సీ. ఇయ్యింతి ప్రాపున . . .
కుసుమబాణుని బాణముల్గూడనైదు
గరిఁగి నేరిమివాటించి కరువుగట్టి
పోసిచేసి చైతన్య సంపుటముఁదగ ఘ
టించిరో కాక యిట్టి చేడియలుగలరె.

(ఆ. ౨. ప. ౨౭)

ద్రౌపదిస్థితి:

సీ. వెఱవక ననుఁ జూచె వీఁడనియెదఁ గలు
షించిన నొండొండ చెమటవోడమ
ననుచిత కృత్యంబు లాచరించు విధాతృ
బలిమికి నివ్వెఱపాటు దోఁప
నిచ్చట దిక్కులే రెవ్వరు నాకను
భయమున మేనఁ గంపంబు పుట్టఁ
జేయంగ నేమి యుపాయంబులేమి నా
ననమున వెల్లఁ దనంబుగదుర
నున్న పాంచాలిఁ గనుఁగొని [illegible]చ్చి

ఎఱసి

కీచకుని యుత్కంఠ:

సీ. తన్వంగి మవ్వంపుఁ దనూలత నెసఁగెడు
నునుఁగాంతి వెల్లువ మునుఁగఁ బోలుఁ
గిసలయహస్త కెంగేల నేపారు క్రొ
మ్మించనులే యెండ మిగులఁ బర్వఁ
గమలాస్య ముద్దు మొగంబు లే మెఱుఁగుల
మొత్తంబు పరిచుట్టు ముట్టికొనఁగ
ధవళాక్షి తొంగలితఱుచు ఱెప్పల చెన్ను
కప్పను చీఁకటి గవియుదేర
బెగ్గలంబంతకంతకు నగ్గలింప
నొదవు చెమటతోఁ జిత్తంబు సెదరి యొందు
మెలఁగఁ దలఁపేది యా సింహబలుఁడనంగ
పట్టి యాడెడు జంత్రంబు పగిదినుండె.

(ఆ. ౨. ప. ౩౭)

సీ. తెలిగన్నుఁ గనకాంతి పాలుపార నించుక
గనువిచ్చి చూచినఁ గాదె యబల
చెలువంపు నెమ్మోము నెలమి సొంపిను మడి
గా నల్లనవ్వినఁ గాదె యింతి
గాక్తికరుచి దలకొన మఱుమాట
కినఁగాదె యుత్పల దళాక్షి
సత దెల్లంబుగా లీలఁ
గాదె పంకరుహ వదన

యనుచుఁ జూచుఁ జేరు నమ్ముగ్ధ పలుకులు
వినఁగఁ గోరుఁ గేలు దనదుకేలఁ
గీలుకొలుపఁ దలఁచుఁ గీచకాధముఁడు ని
జానురక్తిఁ దెలుపనప్పళించు.

(ఆ. ౨. ప. ౪౫)

సీ. సుదతి నీమై చక్కఁ జూచుట కోడెదఁ
గనుచాటు వోరయునో యని తలంచి
మదిఁ బొనర్చినమాట మగువనీ పెంపునఁ
గుదిసి నా నాలుక తుదికి రాదు
పడఁతి నీ కరములు పట్టఁగ దివిరి శం
కించి ఏడంకెడుఁ గేలు సూడు
నెఱినిట్టిదని యింతి నీనెమ్మనంబెన్ని
భంగుల సరసింపఁ బట్టుపడదు
చెలువ యింక నొక్కించుక సేపు నీ వ
నాదరంబున నెప్పటి యట్లయున్న
మన్మథుఁడు సమయించిన మగుడనన్నుఁ
బడయవచ్చునె యెన్ని యుపాయములను.

(ఆ. ౨. ప. ౪)

కీచకుఁడు ద్రౌపదిని ముఖస్తోత్రము చేయుట:

సీ. నెత్తమ్మిరేకుల మెత్తఁదనముఁదెచ్చి
యచ్చునఁ బెట్టినట్లందమొంది
చక్రవాకంబుల చందంబుఁ గొనితెచ్చి
కుప్పలు సేసినట్లొప్పు మెఱసి

చందురునునుంగాంతి కందెర్చి కూర్చి బా
గునకుఁ దెచ్చినయట్లు కొమరు మిగిలి
యళికులంబులకప్పుఁ గలయంతయును దెచ్చి
నారు పోసిన భంగినవక మెక్కి
యంఘ్రితలములు కుచములు నాననంబుఁ
గచభరంబును నిట్లున్న రుచిరమూర్తి
యనుపమాన భోగములకు నాస్పదంబు
గాదె యీ త్రిప్పులేటికిఁ గమల వదన.

(ఆ. ౨. ప. ౫౨)

సుదేష్ణ కీచకునిమనసు మరల్పఁగోరి చేసిన కాంతాజనవర్ణనము.

సీ. లలితంబులగు నాట్యములు చదువంగ
నంచకైవడి నడనల్లనచ్చి
యొడమేని నెత్తావి సుడియంగఁ బయ్యెద
సగము దూలించిపై మగుడఁ దిగిచి
సోలెడు నెలదీఁగె లీలఁ గ్రాలుచు వింత
చెలువంబు దలకొనఁ జేరినిలిచి
తెలిగన్నుఁ గవకు నెచ్చెలియైనలేఁత న
వ్వోలయంగ సరసంపుఁ బలుకు పలికి
మెఱయు చెయ్యులరాగంబు మెయికొనంగ
నెడఁద సొగియించుమాటల నెలమి మిగుల
నిన్ను ననురక్తిఁ గొలుచు నన్నెలఁతలుండ
నీరసాకార సైరంధ్రిఁ గోరఁదగునె.

(ఆ. ౨. ప. ౭౮)

కీచకుని ప్రత్యుత్తరము.

సీ. గండు మీలకుఁ బుట్టి కాముబాణములతోఁ
　　గలసి యాడెడు నట్టి కన్నుఁగవయు
బిసకాండముల శిక్షఁ బెరిగి లేఁదీఁగల
　　మెచ్చకయున్నట్టి మృదుకరములుఁ
జిగురులతో సంధిసేసి యంబుజముల
　　పై నెత్తి చనునట్టి పదతలములుఁ
గలకంఠముల చేతఁ గఱచిన విద్యవీ
　　ణలకిచ్చునట్టి తిన్నని యెలుంగు
నత్తెఱంగున రేఖయు నవ్విధంబు
గరువచందంబు నమ్మెయికలికితనము
నట్టి చెన్నును సైరంధ్రియందకాక
కలవె యొరులకు నెఱుఁగక పలికితబల!

(ఆ. ౨. ప. ౭౭)

కీచకోత్కంఠ:

సీ. లీల నా ముందట నాలేమ వొలసినఁ
　　జూడ్కికిఁ జుబ్బన చూఱగాదె
కనువిచ్చి నన్ను నాతినుమధ్య సూచినఁ
　　దనువున కమృత సేచనముగాదె
చిఱునవ్వు బెరయ నచ్చెలువ నాతోడఁ బ
　　ల్కినఁ జెవులకు రసాయనముగాదె
యొలమి నన్నెలఁత నన్నెలయింపఁ దివిరిన
　　నెడఁద కానందంబు నిక్కగాదె

యా నితంబిని మక్కువ ననఁగి పెనఁగి
యింపు సొంపిరి వోని యన్నెలుకొనఁగఁ
దలఁచి పొందిన నది జన్మ ఫలముగా ద
యనుచు వలరాజు బారికి నగ్గమయ్యె.

(ఆ. ౨. ప. ౮౭)

కీచకు దర్శనంబున ద్రౌపది యవస్థ:

సీ. దైన్యంబు తలపోఁతఁ దలకొన్నఁ జెలువకా
ననమున వెల్లఁదనంబు గదిరె
భయరస వేగంబు పైకొని ముట్టినఁ
గాంతకుఁ దనులతఁ గంపమడరె
బెగడంతకంతకు మిగిలిన నింతికిఁ
బదముల నట తొట్రుపాటు బెరసెఁ
దల్లడం బొందినఁ దన్వికి నవయావం
బుల నెల్ల ఘర్మాంబుకళిక లెసఁగెఁ

దలఁకుపుట్టెఁ గొంకు కొలఁదికి మీఱె వెం
బాటుదోఁచె ముట్టుపాటు దొడరె
వెఱఁగు పాటువనికె నెఱనాడె నొవ్వనె
వ్వగలువగల నీనె దిగులు వొడిమె.

(ఆ. ౨. ప. ౧౦౭)

కీచకుఁడు దీనుఁడై ప్రార్థించుట:

సీ. కాంతి దళ్కొత్తు నీ కడగంటి చూడ్కితోఁ
బొంవఁ గానని మేను పొగులుటయును
దీపారు నీ పల్కు దెల్లంబుగా వినఁ
గానని వీనులు కందుటయును

నింపగు నీ చెయ్వు లెలమి మైఁ గొనియాడఁ
గానని కోర్కులు గలఁగుటయును
సొగయించు నీకేళిఁ దగిలి యానందంబుఁ
బొందఁ గానని మది గుందుటయును
బాయ నాదగు జన్మంబు ఫలమునొంద
భావజన్ముని పూనిక పార మెద్దు
నన్ను బంటుగా నేలుము నళినవదన
యింక నీసిగ్గుదెరయోలమేల నీకు.

(ఆ. ౨. ప. ౧౭౮)

పరిభవానంతరమున:

సీ. ఎలదీఁగఁ గప్పిన లలితపరాగంబు
క్రియ మేన మేదినీరేణువొప్పఁ
జంపకంబున నవసౌరభం బెసఁగెడు
కరణి నాసిక వేఁడిగాడ్పు నిగుడఁ
దోయజపళ్ళములఁదుది మంచుదొరఁగెడు
గతిఁ గన్నుఁ గవనశ్రుకణములురుల
నిందుబింబముమీఁది కందుచందంబునఁ
గురులు నుమ్మొగమున నెరసియుండ
సర్వజనవంద్యయైన పాంచాలి సింహ
బలునిచే నివ్విధంబున భంగపాటు
దనకువచ్చిన నెంతయు దైన్యమొంది
యవ్విరాటుని సభఁజేర నరిగి నిలిచి

(ఆ. ౨. ప. ౧౩౮).

కీచకుండు ద్రౌపదీసమక్షంబునఁ జేయు బాలిశచేష్టలు దుర్వి లాపంబులు నెంత సహజములు! చూడుఁడు:

సీ. ఎవ్వనితోనైన నెలుఁగెత్తి యొక్కింత
పనిలేని వెంగలి పలుకుఁ బలుకు
మట్టియ లొండొంటి బిట్టుదాఁకఁగ
నేల నంటంద మునిగాళ్ళ నప్పళించుఁ
గడువికారంబుగా నొడలెల్ల విఱుచుచు
మలఁగి రిత్తకురిత్త నెలఁగి నవ్వుఁ
దాళంబుగాఁ గరతలమునఁ బెలుచఁగం
బంబు వ్రేయుచు వెడపాటఁ బాడు
మలయు నంతంతఁ జేరవఁబోలయు నింతి
దన్నుఁ జూడమి కెంతయుఁ దల్లడిల్లు
నిక్కడక్కడ వడుఁ దగులినుమడింపఁ
జూచు నత్తన్విఁ జొరిఁ బొరిఁ గీచకుండు.

(ఆ. ౨. ప. ౨౫౦)

కీచకుని పశ్చాత్తాపకరమగు మహావస్థ.

సీ. వామాక్షిరుచిర లావణ్యంబు భావించుఁ
దన్వంగి రూపు చిత్తమున నిలుపుఁ
గంబుకంధర చెన్నుకైవడిఁ దలపోయు
నంగన సౌకుమార్యముఁ దలంచు
భామిని సహజ విభ్రమ మెదఁ గీలించుఁ
బడఁతి చెయ్వులు మదిఁ బట్టుకొలుపు
మానిని గరువంపు మాట పొందూహించు
దళితాబ్జముఖి తిన్నఁదనము మెచ్చు

నడరికోర్కులు చిట్టుముట్టాడ వెడఁగు
పడిన యుల్లంబు పట్టునఁ బఱుపఁ దనకు
వశముగాకున్న నెంతయు వంతనొందుఁ
జంతయొసకంబు వడిగొని చిక్కువఱుప.

(ఆ. ౨. ప. ౨౯౦)

సీ. పొడసూపినట్లయిన వడిఁబట్ట సమకట్టి
పరికించి కానక బమ్మరించు
మెలఁగినయట్లయినఁ బలికింపఁ దలఁచి ని
రూపించి లేమి నశ్రులు వహించుఁ
గదిసిన యట్లయినఁ గౌఁగిలింపఁగడంగి
యారసి బొంకైన నలఁతనొందు
నొడఁబడ్డ యట్లయిన నడరిపైకొనఁజూచి
చెన్నఁటి యగుట నిశ్చేష్టఁ బొరయు

లలిత వివిధ విహారంబులకు లతాంగి
యెలసి పొలసిన యట్లయిన నెలమిఁగలసి
యభిమతక్రీడ సలుపంగ నప్పళించి
వెదకి రిత్తబయల్గని విహ్వలించు.

(ఆ. ౨. ప. ౩౦౧)

ఉద్యానవనవిహారఫలము:

సీ. ఇంపైన ప్రియకాననిచ్చి నిల్చినమధు
వాదట నాను మత్తాళివిభునిఁ
జెట్టుపల్లవచరించి మట్టుఁ గ్రుమ్మరిమనో
రమ నియ్యకొలుపు మరాళవిభుని

ఫలరస మొండొంటి కెలమిఁ జంచులనిచ్చి
మెయిన చొక్కెడు శుకమిథునములను
గమిఁబాసి తలిరు జొంపమునకు మెయి మెయిఁ
దాఁకంగఁ జను పిక దంపతులను

జూచి చూచి యుల్లంబున నేచి కోర్కు
లడరఁ జిడిముడిపడు మ్రాను పడు వెడంగు
పడు వెనుంబడుఁ దల్లడపడుదురంత
చింత బారికి నగపడు సింహబలుఁడు.

(ఆ. ౨. ౩౦౬)

కీచకవధానంతరమున జయశీలయై పాంచాలి సుధేష్ణం జూడఁబోవునప్పుడు:

సీ. ముదమున నెలమి సొంపొందవి నెమ్మొగమునఁ
దోఁపంగవచ్చినఁ ద్రోచిత్రోచి
లలినుల్లసిల్లుచు లలితలోచన దీప్తు
లడర నుంకించిన నాఁగి యాఁగి
సంతసంబున బాలశములగు చెయ్యులు
దొడరఁ జూచినఁ జేయ కుడిగి యుడిగి
మనమున నుబ్బుమై మాట నాలుకకురాఁ
గడఁగిన నాడక కడపి కడపి

ధీరయై యిట్లు సమ్మద పూరమునకు
గరువతనమును బలితంపుఁ గట్టకట్టి
వెలఁదియొఱుఁగని యదివోలె వికృతిలేక
యల్ల నెప్పటి యట్టుల యరుగుటయును.

(ఆ. 3. ప. ౫౬)

ఉత్తరంగూర్చిన పద్యములు నిట్టివ. ఆంధ్రమున శృంగారవర్ణనము తిక్కనయంత మనోహరముగఁ జేసినవారెవరును లేరు. శుచిసౌందర్యములు నిత్యసంయోగములు. వీరకావ్యములో నించుక సందర్భ మలవఱిచికొని యింత చేసిన ప్రతిభాశాలి శృంగారకావ్యమే వ్రాసియుండిన దాని రామణీయకము హృదయమున లయించునట్టి లావణ్యము గలదిగానుండదా? ఒకవేళ నేకరసప్రధానముగుట నతియను దోషంబునఁ దానుంబడి యుండునా? చెప్పలేము. ఇట నుదాహృతములగు పద్యములఁజదివి నేత్రముల హర్షాశ్రువులు గ్రమ్మున క్లానందింపనివా రాంధ్ర మండలి నుండరు.

కళాపూర్ణోదయమునందలి మిగతకథ

కళాపూర్ణోదయములోని మీఁది వృత్తాంతముల సంగ్రహముగ విమర్శింతము ఈ భాగములఁ గల్పన లేదు. కథ లేదు. ఒక విషయమునకు నొక విషయముగా నిష్కారణముగ్మై నంటించి పుస్తకముఁ బొడుగుఁజేయుట కవి యుద్దేశమేమో! ఆ సర్వలక్షణ సంపన్నతా ప్రతిజ్ఞయొక్క దుష్ప్రకృతి యిటఁ దేటతెల్లంబు. రాణులిద్దఱకును జెలికత్తెల మాటలచేఁ బ్రేరితమైన కొట్లాట ఘటిల్లినది. నీచపాత్రములేగదా మన రాజులకు రాణులకు మంత్రులు, రాజు అభినవకౌముది కాళ్ళు పట్టుకొనుచున్నాఁడు. ఆ కృష్ణమూర్తి యీ మర్యాదకు సృష్టికర్త! ఎన్నఁడో సత్యభామ

కాళ్ళు పట్టెనో లేదో, రాజులందఱు నాయన యుపదేశ ములనెల్ల నిదియే సులభసాధ్యమని యెంచి యవలంబించి సనాతనాచారములలోఁ జేర్చిరి.

పిమ్మట రాజుగారు సవతుల యలుక దీర్చుటకై పెద్దామెను గానవిద్యావిశారదం జేయుదుననియు, చిన్నయామెకు (ఆపె కాళ్ళమీఁద బడినాఁడు లేకున్న నీమెమాత్ర మూరకుండునేమి?) నీ కాళ్ళకు అష్టదిగ్రాజుల కిరీటముల యందలి మణులందెచ్చి గజ్జెలో నగలో చేసి పెట్టెద ననియు ప్రతిజ్ఞఁ జేయఁగా అమ్మలిరువురు శాంతించి చల్లఁబడిరి. సవతుల కొట్లాటకై రాజు లేట్లాడుట మనలో ప్రాచీన ధర్మమేమో! ఐరోపావారిని నిందించునపు డీ న్యాయమును జ్ఞప్తియందుంచుకొన్న నన్యాయము పలుకకుందుము. అలంకారశాస్త్రములలో నేమి చెప్పినాఁడు? "నయవిరచన యాత్రాజి దూత్యవిభువర్ణనము" లనియా? సరియే. ఈ భాగములో నే సంగతియైన వేసిన నొక్కటే, వేయకున్న నొక్కటే, కాఁబట్టి వేయుదము' అని నిర్హేతుక జాయమాన శుక్రనీతిని బ్రసంగించుచున్నాఁడు కవి! సత్వదాత్ముండను మంత్రి యిన్నేండ్లు భూమి నేలిన ప్రభువునకు నుపదేశము చేయుట ముసలివాని కుపనయనము చేసినట్లు:

"ఇవియన్నియు నిపుడు ప్రసం
గవశంబునఁ జెప్పఁబడియె గాని." . . .

యనుచున్నాఁడు, ప్రసంగవశమా! శుద్ధాబద్ధము. అలంకార శాస్త్రవశమునకాదా? ఇంక సంధియొకటి బాకీ యుండలేదా? అది మగధరాజుతోఁ జేయుదము. ఈ మగధరాజు వృత్తాంతము నాకు దిగ్భ్రమఁ గల్గించుచున్నది. మధురలాలసావివాహసమయంబున,

"అశ్వాలోచనముల కాత్త వస్త్రముకొంగు
మాటుగా నొనరించె మగధరాజు."

గాన నితఁడు సామంతుఁడుగదా? ఇంతలో,

శా. . . . .
నీ రాష్ట్రంబున కగ్గొనర్చుటకుఁ బార్ష్ణిగ్రాహుఁ డివ్వేళలన్
సారోదారుఁడు మాగధుండిపుడు తత్సంధానసమర్థుంబగున్.
(ఆ. ౭. ప. ౨౭౦)

అని ప్రబలశత్రువైనట్లు మంత్రి చెప్పుట యెట్లు? మఱియు, స్వభావుఁడిచ్చిన విల్లునమ్ములునుండ మాగధునిమైత్రి యెందుకు? ఏటిలో వేయుటకా? ఈ దిగ్విజయముగూడ సందర్భశుద్ధిలేనిది. ఏలన. మదాశయుఁడు సకల రాజుల గెలుచునట్లు వరంబుగొన్నవాఁడగుట నతఁ డట్లుచేసి సార్వభౌముఁడై యుండఁగా, నతనిని కళాపూర్ణుఁడు గెల్చెనన్నఁ నీ యధిక ప్రసంగములన్నియు నివారితములై యుండును. అవును. "ఆజి" యని సూత్రమున్నదే! ఇంక సర్వలక్షణప్రాప్తికి దానిని మెడఁగట్టుకోవలదా? దూత్యము కొంత

సూర్యాస్తమయవర్ణనము. దీని యగత్యమేమో దేవునకే యెఱుక! అందులోని కుయుక్తులో!

తే. నింగియనియెడి ప్రత్తి చేనికిని రక్త
బలియిడిరనంగ నెఱసంజ దొలుత నమరఁ
దఱచుగా దాన విరసిన మెఱుఁగుఁ బ్రత్తి
విళ్ళనాఁ జుక్కలెంతయు నుల్లసిల్లె!.
(ఆ. ౮. ప. ౧౨)

ఆకాశము ప్రత్తిచేను! రక్తబలియిచ్చినారఁట! చుక్కలు ప్రత్తివిళ్ళు! ఇట్లు వ్రాసిన మనవారి కేమో యానందము! కష్టతరముగా నున్నఁ జాలును. మనోజ్ఞమని యెంతురు. ఆశ్చర్యమునకును నామోదమునకును మనవారిలో వ్యత్యాసమే లేదు! తరువాతఁ జంద్రోదయము. ఇంకొక వికారాలంకారము!

తే. "కాలమనుకు విందుఁడు చంద్రికాపటంబు
నేయఁబన్నిన మగ్గమొకో యనంగ
నవమయూఖాళి గొనసాఁగి మివులనొప్పె
విధుఁడమరె వాని గృహభిత్తి వివరమనఁగ."
(ఆ. ౮. ప. ౧౫)

భావప్రధానముగ వర్ణించు మయూరుఁడే సూర్యుని కిరణము లాయన 'మీసాలు'గ నుపమించినాఁడు!

ఇఁక తక్కువ కవుల మాటలేల? అపురూపమే సురూపమని మనవారి భ్రాంతి. ఎంత క్లేశపడి సంపాదింతుమో యంత సుఖమని యెన్నిక! పాతాళము వఱకుఁ ద్రవ్వి గులకఱ్ఱాయిఁ దెచ్చిన నది బుద్ధిబలమా, లేమియా?

పిమ్మట సూర్యోదయవర్ణనము. మఱికొన్ని దుష్టరూపో చనలు: సూర్యబింబము "గగనాఖ్యపనసవృక్షప్రకాండో పరిభ్రాజితంబగు పక్వఫల" మఁట! ప్రబంధముల శ్రాద్ధమునకై తేఁబడిన యెఱ్ఱగుమ్మడికాయ యనరాదా! యోజనాశక్తికిం జేరిన చమత్కారమునకును భావముల నలరించు శక్తికిని ఎంత భేదము!

కళాపూర్ణుని దిగ్విజయము నేడ్చినట్లే యున్నది చతురంగములలో నొక్కొక్క యుద్ధమున కొక్కొక్క యంగము మాత్రము పూనినట్లు వ్రాసియున్నాఁడు. ఇది యాయా యంగసంగరముల వెవ్వేఱుగ వర్ణించుటకై చేసికొన్న దబ్బర మర్యాదగాని, జయకాంక్షఁబోరు రాజులువరించునది గాదు. గౌడేశ్వరునితోఁ జేయఁబడినది యశ్వయుద్ధము. ఇందులో నింక నొక యసంభావ్యము గలదు "పిరంగులు జబురు జంగులుఁ దుపాకులు" మొదలగు నాధునికోపకరణములు వాడఁబడినవఁట! ఈ వికృతికిఁ గవి యెట్లోర్చెనో! పిమ్మట నింకొక రాజుతో గజయుద్ధము. ఈ రీతిని గటారులతోడి పోరు, మొదలగువానిని, భారతకాలమునుండి మొగలాయీల నాఁటివఱకుఁ బ్రఖ్యాతికి వచ్చిన పద్ధతుల

నన్నింటిని ఏకకథలో నేకకాలమున నడచినట్లు వర్ణించియుంట కాలౌచిత్యమునకు మారణక్రియ! ఆంధ్రదేశీయులు కటారిసాధనలో బహు నిపుణులని యెన్నఁబడినట్లు ఈ దిక్కుమాలిన భండనక్రియలవలనఁ దెలియవచ్చుచున్నది. ఇదివఱకుఁ గళాపూర్ణుఁడు పోరినది శస్త్రములతో. ఇఁకముందైన స్వభావుఁడిచ్చిన ధనుర్బాణముల నుపయోగింతమని యేమో, యున్నట్టుండి భీష్మపర్వములోని యుద్ధముంబోనిది యొండు పొందింపఁబడియున్నది. అస్త్రపరంపరలు నిగుడుచున్నవి. జయలక్ష్మి యే చాంచల్యమును లేక కథానాయకునిఁ జేరియుండుట యామె తలవ్రాఁత. బ్రహ్మచే వ్రాయఁబడినదిగాదు. మఱి యుత్తములు గాని కవులచే! కృతార్థుఁడై రాజు స్వపురికిం బోవుచున్నాఁడు.

కాలౌచిత్యము

'కాలౌచిత్యము' అను పదమును వాడితిమి. కాన కవిత్వతత్త్వమునకుం జేరిన యీ విషయము గొంత విచారింపక పోఁగాదు. కాలముచే మనుష్యుల గుణములు మాఱుచుండుట యనుభవవిదితము. ప్రబంధవిదితము గాదు. కథానాయకుఁడు సాధారణముగఁ గాలాతీతుఁడు! నిరామయ నిరంజనతలకుం జేరిన యవతార పురుషుఁడు; ప్రారంభముననే వయసు, గుణములు, కోరికలు, చర్యలు నుండునో, యవసానమునను నవియే. పెరుఁగుట లేదు. పరిణామము బొరయని లోహవిగ్రహముల యట్టి నిర్వికారుఁడు

స్త్రీలవిషయమున నొకటి రెండు సంగతులకై వయఃప్రభావమును సూచింతురు. అవెవ్వియన, సమర్తాడెననుటకును, బిడ్డఁగనెననుటకును! క్రొత్త పెండ్లికూఁతురైనను, ప్రాఁత పెండ్లమైనను, లేఁత పడుచైనను, ముదురు ముసలిదైనను వారలలో భేద మంతగా నుండదు. పసిప్రాయమున నాయిక నాయకునికై యెట్లువ్విళ్ళూరుచుండునో, వయసునను, ఆ రీతి నే యూపె వలపును రాగంపు విలసనములు నుండును. అనఁగా పుస్తకములలో నను మాట! ప్రకృతిని గాదనుట తెలిసియో తెలియకయో కట్టుకొన్న మగవారికెల్లఁ దెలియును. పాశ్చాత్త్యులు మనుష్యజీవిత పరిశీలనసమర్థులగుటను, స్వయంవిమర్శమై వ్రాయువారుగానను, కాలసృష్ట పరిణామముల నెఱ్ఱించుటలో నద్భుతచరిత్రులు! కాలౌచిత్యమన నర్థములు రెండు ప్రతిపాత్రమును గాలానుగుణ పరివర్తనములకుం బాత్రమైనట్లు వర్ణించుటయు, కథలోని వివిధసందర్భములు కాలముతోఁ జేరికఁగలవిగా నుండునట్లు గల్పించుటయు ననునవి ఇందు ప్రథమభావముమీఁద వివరించితిమి. ద్వితీయార్థమునకు సూరనార్యు వే నిదర్శనము గాఁగొని వ్యాఖ్యానం బొనర్తము. కళాపూర్ణోదయములోని సందర్భములకు కాలవిషయమునఁగల పరస్పరాసాంగత్యము పాటింపుఁడు! నారదుఁడు మణికంధరుఁడు శ్రీకృష్ణుని యాశ్రితులు. మణికంధరుఁడు కళాపూర్ణుఁడుగాఁబుట్టి దిగ్విజయముఁ జేయుసరికి ద్వారకాపురి సముద్రములో మునిఁగి

పోయియుండెను అనఁగా కళాపూర్ణుఁడు రాజ్యము చేసి నది కలిప్రారంభమునననుకొందము. ద్వాపరాంతమున నన్నను బాధకముగాదు. అప్పుడు పిరంగులుఁ దుపాకులు నెక్కడివి? రెండవది. రుక్మిణీకాంతునికిఁ దరువాత నీ రాజు వలె సద్గుణు లెవ్వరు లేరని కురుకాది దేశాధీశులు కానుకలు పెట్టినారఁట! పాండవుల మనుమఁడైన పరీక్షిత్తు సార్వభౌముఁడాయెనని జగత్ప్రసిద్ధమగు కథయుండఁగా, నీ కళాపూర్ణుని వానితోఁ బోటీకిం బెట్టుట "కొండంగని తగరు దాఁకఁ గోరుటగాదే?" ప్రపంచ ఖ్యాతములగు కథలతో విరోధించినట్టి కల్పనలు అయోగ్యములు.

సుగ్రహుండు ఎన్నెన్నో తపస్సులుచేసి యవస్థలుపడి హారము నెసినవాఁడు. పిమ్మట నాహారము ఒక బ్రాహ్మణుని యింట నెన్నియో యేండ్లుండినది తరువాత నాయెఁ గృష్ణార్పితము. ఆ వెనుకఁ గృష్ణునిచే మణికంధరునికి లభించినది. వాఁడు గానవిద్య, యాత్ర, తపస్సు, ఇత్యాదులలోఁ గడపిన వత్సరములు కనీసము ఆఱు. అట్లగుట మణికంధరునియొద్దఁ జేరినదిమొదలు మధురలాలస రెండవతూరి ధరించువఱకు జరిగిన యేండ్లు సుమారు ఇరువదినాల్గు. ఇఁక సుగ్రహుని వయస్సెంత యుండునో యూహింప నలవిగాదు. అట్టి దీర్ఘాయుష్మంతుఁడగు సుగ్రహుఁడు సత్త్వదాత్తుండను పేరంబరిగినవాఁడు మధురలాలసకు మేనమామ! సుగ్రహునింగూర్చిన యాభాసముల కింకను ముగిం

పుగానము. రూపానుభూతి యతని నెఱింగియుండకపోవుట సిద్ధము! శాపంబుచే మతిమాత్రము గోల్పోయి యాకారంబు మాఱని యతని నేకస్థలముననుండియు నామె యేల గుర్తింపకపోయె? రాణివాస మందమా? కళాపూర్ణుని యభ్యంతర మందిరములోఁ బ్రవేశింపఁగల యతఁడు మదాశయుని యంతఃపురమునఁ గాలిడ ననర్హుఁడై యుండునా? సదుత్తరములు చింత్యములు.

కళాపూర్ణుఁ డారీతిని వివిధయుద్ధంబులఁ దన కే కీడు జేయని రాజులను భార్యకై పూనిన వైరముచే నోర్చి జయశీలుఁడై పురము ప్రవేశింపఁగా, పౌరస్త్రీలు అతనిఁజూచుటకై వినోదకరములగు వేషములతో వచ్చుచున్నారు. నేఁ జెప్పనేల? సాధ్యమైనంతవఱకు మీరే కన్నుల విప్పి చూడుఁడు!

ఉ. క్షోణితలేంద్రుఁ జూడ నొక కొమ్మ నడింబఱతెంచి యుల్లస
ద్వేణిభరంబుతో మొగపు తీఁగెనలగ్నము నందమర్చి, యొ
డ్డాణము తీఁగెగానిడి, మెడన్ వలగొన్నది చాల కడ్డమై
పాణుల నుండఁగొను నాఱి బాగుగఁ గానుక వెట్టుకైవడిన్.
(ఆ. ర. ప. ౧౩౯)

ఉ. గుబ్బెత యోర్తు వచ్చె నృప కుంజరుఁ జూడ రతార్త నీవిఁ దా
గొబ్బునఁ గట్టుచున్ బయఁటికొంగది మాన్పఁగఁ బోలెఁ గాళ్ళపైఁ
బ్రబ్బికొనన్ గుచోద్ధత భరంబునకుం బయికాఁపు వోలెఁ ద
బ్బిబ్బుగఁ జేతికిన్ దొరికె పెన్నిటి వస్త్రము రోస్పృతంబుగన్. ౧౪౦

ఏమిది? ఉన్నట్టుండి రాజు సగమురాత్రిలో వచ్చెనా?

తే. ఇత్తెఱంగునఁ బౌరులకెల్ల నేత్ర
పర్వమొనరించు రూప వైభవముతోడఁ
గ్రముకకంఠోత్తర మహాపుర ప్రవేశ
మాచరించి ౧౪౩

ఇదేమి యన్యాయము! పౌరుల కెల్ల నఁట! స్త్రీలకే గదా రాజులు ముఖ్యముగ దర్శనమిచ్చుట! ఇట్టి యపచారములును శృంగారములా?

మధురలాలస పెండ్లియైనప్పుడే యంతవిరాళిఁదాల్చిన యగ్గితునుకగావున నామె వయసు ౧౫-౧౬ అనుకొందము. పెండ్లియైన యేఁడునకే దిగ్విజమని యాలోచించినను ద్వారక మునిఁగి చాలకాలమైయుండదు. కళాపూర్ణుఁడు సింహాసనమెక్కిన తరువాత మునిఁగెనా, తత్పూర్వమే మునిఁగెనా? పూర్వమైయుండిన నిరువదేండ్లక్రిందట మునిఁగిన యూరింగూర్చి కళాపూర్ణుఁడు విచారణలకు మొదలిడుట యధికాలస్య ప్రసంగము. తరువాతగా నుండిన, నెల్లరాజులను జయించినవాఁడుగదా, శ్రీకృష్ణ బలరాములను భీమార్జునులను మార్కొనెనా? మఱి, తనకుం గురువును దైవము నని కృష్ణుని సేవించివచ్చెనా? అది యట్లుండె. అభినవ కౌముదియొక్క వయసు మొదలైనవి యరయుదుము. కలభాషిణి మణికంధరునిచేఁ జచ్చి పునర్జీవితయై ద్వారకను మెలంగినది రెండేండ్లు. ఆవలకే యభినవకౌముది ప్రాయ

ముది శల్యాసురుఁడు వెన్నాడి కొన్నేండ్లు తిరిగియుండును గాన, ౧౭ సంవత్సరములన్నఁ దక్కువలెక్క. ఈమెకుఁ దగిన నాథుఁడుగా నుండవలయునని కళాపూర్ణునకు సద్యోయౌవనము విధింపఁబడియె కళాపూర్ణుఁడు పుట్టునప్పటికి నాపె వయసు ౧౮ యనుకొనుఁడు. మధురలాలసా వివాహ మప్పటికి నామెకు అధమపక్షము ३४-३५ సంవత్సరములు నిండియుండును. ఎట్లు లేదన్నను ముప్పదికిఁ దక్కువయుండదు. ఇన్నాళ్ళు సంసారముచేసిన యాపెకును, క్రొత్తపెండ్లికూఁతునకును రూప యౌవన వర్తన విభ్రమాదుల నేతారతమ్యమైన నుండునట్లు కవి వర్ణించినాఁడా విచారింపుఁడు! నాకుం జూడలేదు ౧౫, ౧౬ ఏండ్లు గొడ్రాలుగా నుండిన యామె తటుక్కని మధురలాలసకన్నఁ గొంచెము ముందుగఁ బుత్రునిఁ గనెనఁట! ఇప్పటివారిలో నిట్లు తటస్థించిన నెన్ని సందేహములు పుట్టవు! మధురలాలసకు బిడ్డ నీదలఁచి, పట్టపుదేవిని విడుచుట బాగుగాదనియు, నీ క్రియల నించుమించు వారు సరిపోలిన జతగా నేర్పడినట్లు ప్రదర్శింపవలయుననియు నెంచిచేయఁబడిన జ్యేష్ఠాంశ హేయకల్పన లివి!

విషయమున ననౌచిత్యములు

సుగ్రహుని వయసు కృతయుగము లెక్కలోఁ జేర్పవలసినదే. మన వారిలో మాటలు వేదమయములు. చేఁతలు బూతులు. వేదాంతములకును మానహీనములగు నను్ఠాన

ములకును అనవరతానవసితమైత్రి. పరమయోగీశ్వరుఁడైన శివుఁడు “దేహార్ధమునఁదాల్చు దీఁగెబోఁడి”! అక్క_ధకుండగు వ్యాసశిష్యుఁడు సూతమహామునీంద్రుఁడు, ఉపవాస వ్రతములచే డస్సి యెండిన శౌనకాదిమహర్షుల హృదయముల రసము లూరునట్లుగా, స్త్రీవర్ణనలు పోగుపోగుగా విడఁదీసినట్లు చెప్పుచున్నాఁడనుట ప్రబంధములలో ప్రసిద్ధి. విరాగియైన వనవాసికి రాజకన్యలయు భోగముసానులయు రహస్యవృత్తము లెట్లు తెలిసె? కష్టపడి యార్జించిన దూరదృష్టి దూరశ్రవణాదులకు ఫలముగా నీ సుఖముల ననుభవింపకపోయినను, విమర్శముతో సావకాశముగఁ బరీక్షించి తెలిసికొను నానందమైన ననుభవించినాఁడుపో! పచ్చిపచ్చి మాటలతో పెద్దమనుష్యులయెదుట సిగ్గులేక విపులవ్యాఖ్యానములకుం దొడంగ నాతని పరమ పవిత్రమైన నోరెట్లాడెను? పరమపావనులగు మునులు ఏ జుగుప్సయు లేక గ్రుక్కిళ్ళు మ్రింగుచు నెట్లు వినిరి? ఇట్టి రుచికరములగు కథలు చెప్పువాఁడు కావుననేగదా ఋషీశ్వరు లట్లు జపతపముల వదలి యతనిచుట్టు బెల్లమును ముట్టడించెడు చీమల వలె మూఁగియుండుట! సూతమహామునికి కళాపూర్ణోదయము నారోపింపకుండుట సూరనార్యుని ఘనతకుఁదావలము. అయిన నింకొక విధమైన యనుచితముఁ జేసియున్నాఁడు. ఇంతదనుక చవులూరెడు కామక్రీడలు వర్ణించి రతివర్ణనకు నాహుతిగా నీయఁబడిన పద్యములు సుమారు

౨౫. తటుక్కున వైష్ణవరాద్ధాంతముతో భక్తిరసముఁ గొంత దింపి గ్రంథసమాప్తి యొనర్తమని, లక్ష్మీనారాయణసంవాద మనెడు గతిమోక్షమును లేని ఘట్టమొకటి తెచ్చివేసి కొనినాఁడు. కృతిపతికిఁ గామమోక్షములు రెండును గాంక్షితములేమో! ఈ లోకమునకొకటి, ఆ లోకమునకొకటి! కానఁ దప్పేమియు లేదుగాని, కావ్యముల నీ రీతి నిహపరముల పరముగా బిగువుతో నీడ్చిన వాని నైక్యము తునుగును, అట్లగుట నియ్యవి సౌభాగ్యవిరుద్ధములు. కలయిక లేని రసములఁ గలుపఁ జూచిన నరుచి. పాలలో చక్కెర వేసిన నిర్దోషము. ఉప్పువేసిననో!

హిందూదేశీయులు మనసు మెత్తనివారు. కాయముల లంతకన్న మెత్తన! సత్త్వగుణమను సాకు పెట్టుకొని, యెన్ని దెబ్బలు పడినను "నావిగావివి. పరమాత్మకుం జేరినయవి" యని యుపహాస్యమునకుం బాత్రములగు వింతకారణముల గొణిగికొనుచు, వంచిన తలయెత్తక, వణకెడు నొడలునాపక, పాఱెడు కాలునిలుపక, పోవుచుందురు! రాజసగుణమగు తేజము ప్రధానమని మనకుం దెల్పుటకోయన, సూరన్న యా దౌర్భాగ్యపునయవిరచనలో రచించిన యీ మూఁడు పద్యముల ప్రతాపముఁ గనుండు.

క. సకలకళా నిపుణులు సే
వకులై కొలువఁగఁ బ్రతాపవంతుఁడు గొలిపిం
చుకొనుఁ గావునఁ బోలవు
సకలకళలు నొక ప్రతాప సంపదతోడన్.

చ. ఇనుఁడొకవో నొకింత యుదయించిన మాత్రన విచ్చిపోవు హె
చ్చిన పెనుఁజీఁకటుల్ నిరవశేషముగా నవియట్లు విచ్చిపో
వనయము శీతధాముని కళౌఘమ్ము జావిధినైన వీనిచే
తన కనరాదె యేరికిఁ బ్రతాప కళాగుణతారతమ్యముల్,
(ఆ. ౭. ప. ౨౮౫. ౨౮౬)

చ. ఒకఁడొకకేలవంచె నధికోన్నతిఁ బేర్చిన మేరుశైల నా
యకుఁ బెఱవేల్పులంగలుఁ జిరాశ్రయణంబున నంపలే రొకిం
చుకయును బుద్ధిలో నరసిచూడ జగంబున నుగ్రుఁడన్ ప్రసి
ద్ధికి బుధుఁడన్ బ్రసిద్ధికిని దెల్లముగా నివి సూఫలస్థితుల్.
(కళా. ఆ. ౭. ప. ౨౮౭)

ఎఱుక ప్రధానమే. దానికన్న వేయింతలు ప్రధానము పరాక్రమము!

ఉపసంహారము

భావనాశక్తిచే ననర్ఘళముగ ప్రభవిల్లు భాగములయొక్క చక్కఁదనము పాండిత్యబలంబుమై నేర్పడినవానికి రావనుట యీ విమర్శనముచే విదితంబు. సూరనార్యుఁడు రెంటి యందును ప్రగల్భుఁడు. రెంటినిం జూపింప నిశ్చయించిన వాఁడగుట నాంధ్రంబున నసదృశంబగు కావ్యంబు కళా పూర్ణోదయంబు సృజింపఁబడియె. ఇది నిర్దోషంబుగాక పోయినను అనన్య సాధారణగుణగణవిభాసితంబగుటఁ గావ్యోత్తమంబనఁ జెల్లునది. ఇందు నవరసములున్నవి. అష్టాదశ వర్ణనములున్నవి. ఏకరసంబుగాకునికి మేల. అయినను సర్వరసముల వర్ణనలఁ జేర్చి యొక కథ వ్రాయుఁ

జూచుట యసాధ్యము గాకపోయినను, సామాన్యసాధ్యం బుగాదు. భారత రామాయణము లట్టి విస్తారేతిహాసము లం దప్ప నన్యంబుల సర్వసౌభాగ్యములకు నాస్పదంబుం డదు. అపారపారావారంబుం బోని మహాచరిత్రముం గల్పించినంగాని, రససంచయంబు లెల్ల నందు యుక్తగతిని నిలువఁజాలవు. అట్లగుట నీ గ్రంథమున నసంగతప్రశంసల వేయవలసెను. అపరభాగము ప్రబంధములకుఁ జేరినది. పరిమితప్రాశస్త్యము. పూర్వభాగము అమేయప్రభావము. దానింగూర్చి యెంత నుతించినను అత్యుక్తి గలుగదు. అందలి కల్పనలు, సందర్భములు మహేంద్రజాలము లట్లు ఆశ్చర్యకరములు. శైలి ప్రావీణ్య మన్ననో వాచాతీతము! మానముగఁ గ్రోలి హృదయము పరవశముగా నానందింప వలయున కాని, మాటలఁదమి యాఱదు. పాత్రముల వచనములు మధురసుధాధారలు!

అట్లగుట శ్రీ పింగళి, సూరనార్యునియెడఁ గృతజ్ఞతయు భక్తియుఁ జూప నెంచినవారును, సహజముగఁ దమకుం గల రసతృష్ణను దృప్తినొందింపఁ దలంచువారును, నైన రసికు లెల్లరు నీ కవికులోత్తంసుని కృతులఁ బలుమాఱు పఠించి కృతార్థులగుదురు గాక!

Sadananda Nilayam Press, Choolai, Madras—1914

H. V. KRISHNA & Co.

Publishing Agents, Chintadripe